# కార్ల్ మార్క్స్ కాపిటల్

http://karlmarxcapital.blogspot.in/ http://saamaajikam.blogspot.in/

1.సరుకు యొక్క రెండు అంశాలు: ఉపయోగపు విలువా, విలువా

# కార్ల్ మార్క్స్ 'పెట్టుబడి'

## రాజకీయ అర్ధశాస్త్ర విమర్శ

## (A Critique of Political Economy)

## మొదటి సంపుటం (వాల్యూం)

## పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియ

### భాగం (పార్ట్) 1- సరుకులూ - డబ్బూ

ఇందులో మొదటి అధ్యాయం (చాప్టర్)- 'సరుకులు '

రెండోది 'మారకం '. మూడోది 'డబ్బు, లేక సరుకుల చలామణీ '

*********

### మొదటి అధ్యాయం (చాప్టర్)1- సరుకులు

ఈ 'సరుకులు ' అధ్యాయం లో 4 విభాగాలు (సెక్షన్లు) ఉన్నాయి. వాటి శీర్షికలు

1.సరుకు యొక్క రెండు అంశాలు: ఉపయోగపు విలువా, విలువా

(విలువ సారమూ, విలువ పరిమాణమూ)

2.సరుకులలో రూపొందిన శ్రమ యొక్క ద్వంద్వ స్వభావం

3.విలువ రూపం లేక మారకం విలువ

4.సరుకుల ఆరాధనా, దాని రహస్యమూ

***********

**విభాగం (సెక్షన్) 1- సరుకు యొక్క రెండు అంశాలు :**

**ఉపయోగపు విలువా - విలువా**

**(విలువ సారమూ- విలువ పరిమాణమూ)**

సరుకుకున్న రెండు పార్శ్వాలు : ఒకటి ఉపయోగపు విలువ. రెండు విలువ. ఈవిభాగంలో ఈరెంటి గురించీ ఉంటుంది. విలువ సారమేదో తెలుస్తుంది. అలాగే విలువ పరిమాణం గురించీ తెలుస్తుంది

అసలు సరుకు అంటే ఏమిటి? ఇది అందరికీ తెలిసిందే.

కొన్ని వస్తువుల ప్రయోజనాల గురించి మనిషికి మొదటినించీ తెలుసు. ఏవీ తినకపోతే, నీరు తాగకపోతే మానవజాతి కొనసాగేది కాదు. మనిషి క్రమంగా ఎన్నో వస్తువుల ప్రయోజనాల్ని తెలుసుకున్నాడు.

తనది ఇతరులకిచ్చి, ఇతరులది తాను తీసుకోవడం మొదలు పెట్టాడు. అదే మారకం. మారకాలు జరుగుతున్నాక తాను చేసిన వస్తువుని తానే ఉపయోగించుకోవచ్చు; ఇతరులకిచ్చి మరొకరకం వస్తువుని పొందనూవచ్చు. ఈరెండు వుపయోగాలూ ఉన్నాయని తెలియడం తేలికే. అరిస్టాటిల్ (క్రీ.పూ 384 - క్రీ.పూ 322) చెప్పాడు: "మనకున్న వస్తువులవల్ల రెండు ఉపయోగాలు ఉంటాయి... ఒకటి సరైనది, రెండోది సరికానిది లేక ద్వితీయ ప్రాధాన్యం గలది. ఉదాహరణకి చెప్పులు తొడుక్కోవడానికి పనికొస్తాయి, అలాగే మారకానికీ పనికొస్తాయి; రెండూ చెప్పుల ఉపయోగాలే.అవి కావాలనుకునే వాడికి అన్నానికో, డబ్బుకో

మార్చుకునే వాడు నిజానికి చెప్పుల్ని చెప్పులుగానే వాడతాడు. అయితే అది వాటి సరియైన, ప్రధానమైన ప్రయోజనం కాదు. ఎందుకంటే, చెప్పులు వస్తుమార్పిడి కోసం తయారయినవి కాదు.మనపైన అన్ని (పొసెషన్స్)వస్తువులకీ ఇదే వర్తిస్తుంది..." -క్రిటిక్.19.ఫుట్ నోట్1 (*A Contribution to the Critique of Political Economy*)

ఆడం స్మిత్ (1723-1790) మొదటిదాన్ని ఉపయోగంలో విలువ అనీ, రెండోదాన్ని మారకంలో విలువ అనీ అన్నాడు. అయితే స్మిత్ రెండోది సరికానిదని అనలేదు.

మనం ఎన్నో వస్తువులు వాడతాం. తినడానికి తిండీ, కట్టుకోడానికి బట్టలూ కావాలి. ఉండటానికి ఇల్లు కావాలి. అన్నం కూరలూ వండుకుంటాం. వీటిని ఇంట్లో మనమే చేసుకుంటాం. కొనం. అమ్మం. అవి సరుకులు కావు. కాని వీటి తయారీకి కావలసిన వస్తువుల్ని - బియ్యం,కూరగాయలు,ఉప్పు, పప్పు వగయిరా ఎన్నిటినో –కొనుక్కుంటాం. అవి సరుకులే. వంటసామాగ్రినీ కొంటాం. అవన్నీ సరుకులే. మార్కెట్లో కొనేవన్నీ సరుకులు, అమ్మేవన్నీ సరుకులు. మంచాలూ కుర్చీలూ టి.వీ లూ, సెల్ ఫోన్లు మార్కెట్ నించి తెచ్చుకుంటాం. అవన్నీ సరుకులే. అమ్మకానికి పెట్టిన వస్తువులేవైనా సరుకులే. సరుకుకి ఉపయోగపువిలువ ఉంటుంది,కనకనే కొంటారు.సరుకుకి మారకం విలువ వుంటుంది.అందుకోసమే సరుకుని అమ్ముతారు. సరుకులో ఉపయోగపువిలువా, మారకం విలువా పెనవేసుకొని ఉంటాయి.కొనేవాడు ఉపయోగపు విలువకోసం కొంటాడు. అమ్మేవాడు మారకం విలువకోసం అమ్ముతాడు. అంటే సరుక్కి ఉపయోగపువిలువా, మారకం విలువా రెండూ రెండు పార్శ్వాలు. సరుకు ద్వంద్వ స్వభావం కలది అంటే అర్థం ఇదే.

మరి, సరుకులు ఆదినించీ ఉన్నాయా? అంటే, లేవు. మానవ చరిత్రలో ఒకానొక దశలో ఏర్పడ్డాయి. సమాజంలో ఇప్పటికి మూడు ఆర్థికవిధానాలు ముగిశాయి. అవి ఆదిమ, బానిస, భూస్వామ్య వ్యవస్థలు. తర్వాత పెట్టుబడిదారీవిధానం ఆవిర్భవించి అభివృద్ధి చెందుతున్నది. మొదటి మూడు సమాజాల్లో ఉత్పత్తి జరిగింది వాడకం కోసం, మారకం కోసంకాదు. దానర్థం మారకాలు అసలే జరగలేదని కాదు. కాని ఉత్పత్తి వుద్దేశం మారకం కాదు, వాడకం. మిగులు వుత్పత్తులే మారకం అయ్యేవి.

ఆదిమసమాజంలో అయితే మారకాలు లేవు.అది అంతరించే దశలో మారకాలు మొదలయ్యాయి.

ఆదిమ సమాజంలో ఒక తెగంతా ఒకే కుటుంబంగా ఉండేది. అందరూ కలిసి వేటాడే వాళ్ళు, దుంపలూ కాయలూ సేకరించేవారు. అందరూ తినేవారు. ఏవస్తువూ ఎవ్వరి సొంతమూ కాదు. అన్నీ అందరివీ.

అమ్మడాలూ, కొనడాలూ తెలియదు. అందరూ చేసిన వస్తువుల్ని అందరూ వాడుకున్న సమాజమే ఆదిమ సమాజం.సరుకులు లేని సమాజం అది.

అలా చాలా కాలం సరుకులు తెలియకుండానే సమాజం సాగింది. క్రమంగా పశుపోషణా, వ్యవసాయమూ అభివృద్ధయ్యాయి. కొంతకాలానికి కొన్నితెగలు వ్యవసాయాన్ని ప్రధానంగా చేసుకుంటే, మరికొన్ని పశుపోషణను ఎంచుకున్నాయి. శ్రమ విభజన జరిగింది. దాంతో వ్యావసాయిక తెగలకు వ్యవసాయోత్పత్తులు మిగులుగా ఉండేవి. కాని పశుసంబంధమైన వస్తువులు తక్కువ అయ్యేవి. అలాగే పశుపోషక తెగలకు పశు ఉత్పత్తులు మిగులుగా వున్నా, వ్యవసాయోత్పత్తులు తక్కువ అయ్యేవి . ఆపరిస్థితుల్లో ఆ తెగల వస్తువులు వారివి వీరూ, వీరివి వారూ ఇచ్చి పుచ్చుకునేవారు. అంటే ఆయా వస్తువులు మారకం అయ్యేవి. అలా వ్యవసాయ శ్రమ, పశుపోషణ శ్రమల విభజన వల్ల వారి ఉత్పత్తుల్లో మిగులు వస్తువులు సరుకులయ్యాయి. ఒకరి వస్తువులు మరొకరికి మారకం అయ్యాయి. కాలక్రమంలో చేతివృత్తులు విడివడ్డాయి.వీటిలో అధికభాగం మారకమయ్యేవి. మారకం అభివృద్ధి చెందింది. మారకంకోసం తయారయ్యే వస్తువుల రకాలూ, సంఖ్యా పెరిగుతూ వచ్చాయి. శ్రమవిభజనవల్ల మారకమూ, మారకంవల్ల శ్రమవిభజనా అభివృద్ధయ్యాయి. మారకాలు బాగా పెరిగినందువల్ల, డబ్బు ఏర్పడింది. బానిస, భూస్వామ్య వ్యవస్థల్లో మారకాలు పెరుగుతూ వచ్చాయి. అప్పటికీ ఎక్కువగా మిగులు వస్తువులే మారకంలోకి వచ్చేవి. మారకంకోసమే ఉత్పత్తయ్యే సరుకులు ఏర్పడ్డాయి కాని తక్కువగా ఉండేవి. అంటే అప్పటి ఉత్పత్తిలక్ష్యం ప్రధానంగా వినియోగం, మారకం కాదు. ఇందుకు భిన్నంగా పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి మారకం కోసమే సాగుతుంది. ఇదే పెట్టుబడిదారీ విధానపు విశిష్టలక్షణం.

ఇంతకుముందు కొన్ని వస్తువులు మాత్రమే మారకంలో వుండేవి. పెట్టుబడిదారీ విధానం వేళ్ళూనుకునే కొద్దీ, ప్రతిదీ సరుకవుతుంది. సరుకు ఉత్పత్తి సార్వత్రికం అవుతుంది. మార్క్స్ కాపిటల్ లో ముందుగా పరిశీలించింది సరుకునే.

అయితే, సరుకులు లేనప్పుడు ఏవి ఉండేవో చూచి, తిరిగి సరుకు వద్దకు వద్దాం.

చరిత్రలో సరుకులు లేకుండా గడచిన కాలమే ఎంతోఎక్కువ. అంటే వస్తువుల మారకాలు లేకుండానే మానవులు దీర్ఘకాలం గడిపారు. ప్రకృతిలో దొరికిన వస్తువులతో వెళ్ళబుచ్చారు.

## మనచుట్టూ వున్న వస్తువులు ఎలా ఏర్పడతాయి?

విశ్వం పదార్థంతో నిండి ఉంటుంది. పదార్థం(matter) వస్తువుల రూపాల్లో ఉంటుంది. మన చుట్టూ ఎన్నో వస్తువులున్నాయి.

"విశ్వంలోని దృగ్విషయాలు అన్నీ, మనిషి చేతితో తయారయినవైనా లేక భౌతికశాస్త్ర సార్వత్రిక సూత్రాల వల్ల తయారయినవైనా అన్నీ పదార్థం యొక్క (రూపం)మార్పులే..." అన్న ఇటలీ ఆర్థికవేత్త లకస్టోడీ మాటల్ని కోట్ చేశాడు మార్క్స్ ఫుట్ నోట్ లో.

అన్నీ పదార్థ రూపాలే. కొండలూ, అడవులూ, పచ్చికబయళ్ళూ, మబ్బులూ, చుక్కలూ, నదులూ సముద్రాలూ, గనులూ, గ్రహాలూ, గాలీ, నీరూ మొదలైనవెన్నో వున్నాయి. ఇవన్నీ మనిషి అవతరించక ముందు నించే వున్నాయి.మనిషి శ్రమ కలవకుండా ప్రకృతి చర్యలవల్ల ఏర్పడ్డవి. ఇవి ప్రకృతి ఉత్పాదితాలు.

మరొక రకం వస్తువులున్నాయి.బట్టలూ, చెప్పులూ,కుర్చీలూ, సైకిళ్ళూ, కార్లూ,ఫాన్లూ, సెల్ ఫోన్లూ టి.వీలూ వగయిరా. ఇవి ప్రకృతి చర్యలవల్ల ఏర్పడ్డవి కావు. మనిషి శ్రమ వల్ల తయారయినవి. ఇవి మనిషి శ్రమ కలిసిన వస్తువులు. శ్రమ ఉత్పాదితాలు.

కనక వస్తువులు రెండు రకాలు.

1. మనిషి శ్రమ కలవనివి - ప్రకృతి ఉత్పాదితాలు.

2.మనిషి శ్రమ కలిసినవి - శ్రమ ఉత్పాదితాలు.

ప్రకృతి తన కదలికలద్వారా, చర్యలద్వారా పదార్థపు రూపు మారుస్తుంది.పదార్థం ఆదినుండీ ఉంది. అదికొత్తగా ఏర్పడదు. ఉన్నది నశించదు. అదెప్పుడూ ఏదో వస్తువు రూపంలో వుంతుంది. అణువూ వస్తువే, అందులో ఎంతోవేగంగా తిరుగుతున్న ఎలక్ట్రానూ వస్తువే. మేఘం వస్తువే. దాని రూపం మారి కురిసే వర్షపునీరూ వస్తువే. ప్రకృతిచర్యలవల్ల, చలనాలవల్ల పదార్థపు రూపాలు మారుతూ వుంటాయి. అంటే అనేక వస్తువులు ఏర్పడుతుంటాయి.

ఒకనాడు సూర్యుడూ లేడు, భూమీ లేదు.ఏదోనాటికి అదీ ఉండదు ఇదీ ఉండదు.అంటే పదార్థం నశిస్తుందని కాదు, మరొకరూపం పొంది, వేరొకవస్తువు ఏర్పడుతుందని. అంతే.అందువల్ల ప్రకృతి ఉత్పాదితాలు శూన్యంలో సృష్టికావు. పదార్థం కావాలి. ప్రకృతి చర్యలవల్ల పదార్థం ఏ వస్తురూపాల్లోకి మారుతుందో ఆవస్తువులు ప్రకృతి ఉత్పాదితాలు. మానవ శ్రమవల్ల ప్రకృతి ఉత్పాదితాలు ఏ వస్తురూపాల్లోకి మారతాయో ఆవస్తువులు శ్రమ ఉత్పాదితాలు.

ప్రకృతి ఉత్పాదితం లేకుండా మనిషి శ్రమ మొదలుకాదు.మట్టి లేనిదే కుండలు చేసేశ్రమ మొదలుకాదు. తేనెతుట్టె లేనిదే తేనెపిండే శ్రమ ఉండదు. ఏ శ్రమోత్పాదితానికైనా 'మూలాధారవస్తువు '(substratum)ప్రకృతి ఉత్పాదితమే.మనిషి శ్రమచేసేది అప్పటికే వున్న వస్తువు మీదే. ప్రకృతి చర్యల వల్ల మాత్రమే తయారైన వస్తువులమీదే.

మనిషి శ్రమ జరిగే వస్తువు, ప్రకృతి ఉత్పాదితం కావచ్చు.నదీ ప్రాంతాల్లో ఉన్న ఇసుక ప్రకృతి ఉత్పాదితం.దాన్ని చలగపారతో ఎత్తితే అది శ్రమ ఉత్పాదితం.దాన్ని మోసుకొస్తే మరోవిడత శ్రమ కలిసింది.సిమెంట్ కంకర్ లతో కలిపేటప్పుడు మరొక విడత కలుస్తుంది. ఒకసారి శ్రమ కలిసిందంటే అది శ్రమ ఉత్పాదితం. ఎన్నివిడతలు కలిసినా శ్రమ ఉత్పాదితమే.

***********

ప్రకృతి ఉత్పాదితం లేనిదే మనిషి శ్రమ మొదలుకాదు. వస్తువుల ఉత్పత్తిలో ప్రకృతీ పనిచేస్తుంది, మనిషీ పనిచేస్తాడు."పదార్థపు రూపాన్ని మార్చడం ద్వారా మనిషి ప్రకృతి లాగే పనిచేస్తాడు."- కాపిటల్1.50

"కోటు, బట్ట వగయిరా ఉపయోగపువిలువలు- అంటే సరుకుల శరీరాలు -పదార్థమూ, శ్రమా అనే రెండు అంశాల కలయిక. వాటికొరకు చేసిన ప్రయోజనకరశ్రమని తొలగిస్తే, పాదార్థిక మూలం (substratum) మిగులుతుంది.అది మనిషి సహకారం లేకుండా ప్రకృతి సమకూర్చినది. ప్రకృతి పనిచేసినట్లే, మనిషి పనిచెయ్యగలడు-పదార్థపు రూపాన్ని మార్చడంద్వారా.అంతేకాదు, ఈరూపాన్ని మార్చే చర్యలో మనిషి ప్రకృతిశక్తుల సహాయం ఎల్లప్పుడూ పొందుతాడు. అప్పుడు శ్రమఒక్కటే పాదార్థిక సంపదకు, శ్రమ ఉత్పత్తి చేసిన ఉపయోగపువిలువలే వనరు కాదని గమనిస్తాము. విలియం పెట్టీ అన్నట్లు' సంపదకు భూమి తల్లీ, శ్రమ తండ్రీ'." కాపిటల్ 1.50

"భూమిని మినహాయిస్తే, శ్రమ ఒక్కటే సంపదకు మూలం."- గోథా ప్రోగ్రాం విమర్శ, Selected Works single volume p315

"సకలసంపదకూ శ్రమ ఒక్కటే వనరు కాదు....శ్రమ...ఎంతవనరో...ప్రకృతికూడా అంతే వనరు." అంతేకాదు మనిషి " పదార్థపు రూపాన్ని మార్చే క్రియలో నిరంతరం ప్రకృతిశక్తుల సహకారం పొందుతాడు." వ్యవసాయంలో వాతావరణం -వాన, ఎండా, గాలీ తేమా- నుండి సహకారం లభిస్తుంది.విద్యుదుత్పత్తిలో సహజ జలపాతాలు తోడ్పడతాయి. తూర్పారకు గాలి, ధాన్యం ఆరడానికి, గడ్డి వగయిరా ఎండడానికి, ఉప్పు తయారీకి ఎండ కావాలి.

తయారీ పరిశ్రమ లో " ప్రకృతి ఏమీ చెయ్యదు, అంతా మనిషే చేస్తాడు" అన్న స్మిత్ కి రికార్డో ఇలా జవాబిచ్చాడు: "మాన్యుఫాక్చర్లో ప్రకృతి మనకొరకేమీ చెయ్యదా? యంత్రాలను కదలించడంలోనూ, జలయానంలోనూ సహకరించే వాయుశక్తీ, జలశక్తీ ఏమీ చెయ్యవా? బ్రహ్మాండమైన ఇంజన్లను పనిచేయించే వాతావరణ పీడనమూ, నీటి ఆవిరి యొక్క స్థితిస్థాపకతా ప్రకృతి బహుకృతులుకావా? లోహాలను మెత్తబరచడంలోనూ, కరగించడంలోనూ ఉష్ణం ప్రభావాన్నీ, రంగువేసే ప్రక్రియలో, పులిసే ప్రక్రియలో వాతావరణం డికాంపొజిషన్ గురించీ చెప్పకపోవడం" ఏమిటి? "మనిషికి ప్రకృతి సహకారాన్ని అందించని, అదికూడా ఊరకనే అందించని మాన్యుఫాక్చరంటూ ఏదీ లేదు." –Theories of Surplus Value.1.149

అందువల్లే "సంపదకు భూమి తల్లీ, శ్రమ తండ్రీ" అని విలియం పెట్టీ చెప్పిన విషయాన్ని మార్క్స్ తన పెట్టుబడిలో ప్రస్తావించాడు.- కాపిటల్ 1.50

సారాంశం ఏమంటే: వస్తువుల ఉత్పత్తిలో ప్రకృతీ పనిచేస్తుంది, మనిషి పనిచేస్తాడు.అయితే ప్రకృతి చేసిన వస్తువు లేనిదే మనిషి పని చెయ్యలేడు. మట్టి ఉంటేనే, కుండ చెయ్యగలడు.

దీన్నిబట్టి మనిషి ఉత్పత్తిచేసే వస్తువులు రెండు అంశాల సమ్మేళనాలు - ప్రకృతి ఇచ్చిన వస్తువూ, దాని రూపం మార్చే మనిషి శ్రమా.

ఉదాహరణకి బుట్ట తయారీకి ప్రకృతి ఇచ్చే వెదురు బొంగు, దాన్ని చీల్చి బుట్టరూపంలోకి మార్చే శ్రమా రెండూ కావాలి.బుట్ట అదే రూపంలో ప్రకృతిలో దొరకదు.దానికోసం ఒక ప్రయోజనకరమైన శ్రమ అవసరం. ఆశ్రమని తొలగిస్తే, మిగిలేది పాదార్థిక మూలాధారవస్తువు- వెదురుబొంగు. అది మానవ సహాయం లేకుండా ప్రకృతి సరఫరా చేసేది.

"పదార్థపు రూపాన్ని మార్చడం ద్వారా ప్రకృతి పనిచేస్తుంటేనే మనిషి పనిచెయ్యగలడు"-కాపిటల్.1.50

తేలింది ఏమంటే " సంపదకు ...శ్రమ ...ఎంత వనరో ప్రకృతి కూడా అంతే వనరు"-గోథా ప్రోగ్రాం విమర్శ, Selected Works single volume p315

అప్పుడు శ్రమఒక్కటే పాదార్థిక సంపదకు, శ్రమ ఉత్పత్తి చేసిన ఉపయోగపువిలువలే వనరు కాదని గమనిస్తాము.విలియం పెట్టీ అన్నట్లు' సంపదకు భూమి తల్లీ, శ్రమ తండ్రీ'." కాపిటల్ 1.50 అంతేకాదు మనిషి " పదార్థపు రూపు మార్చే చర్యలో నిరంతరం ప్రకృతిశక్తుల సహకారాన్ని పొందుతాడు."- కాపిటల్.1.50

ఒకేరకం వస్తువులు ప్రకృతి ఉత్పాదితాలు కావచ్చు, మనిషిశ్రమ కలిసినవి కావచ్చు. సహజ అడవుల్ని అనుకరిస్తూ సామాజిక అడవుల్ని పెంచుతాడు.ఇవిశ్రమ ఉత్పాదితాలు.అడవిలో పెరిగే జంతువులు ప్రకృతి ఉత్పాదితాలు.అవి వాటికవే దొరికింది తిని బతుకుతాయి.కాని కోళ్లఫారాల్లో కోళ్ళూ, డయరీ ఫారాల్లో గేదెలూ మనుషులశ్రమతో పెరుగుతాయి.సర్కస్ లో జంతువుల్ని మనుషులు పెంచి పోషిస్తారు.నాగలి లాగే ఎడ్లూ, టాంగాలీడ్చే గుర్రాలూ మనిషి వల్ల తర్ఫీదు పొందినవే.పందాల్లో పాల్గొనే కోళ్ళూ, గుర్రాలూ తర్ఫీదు పొందినవే. మనిషి శ్రమతో నిమిత్తం లేకుండా ధాన్యాలూ, కూరగాయలూ, పండ్లు పండుతుంటాయి. అవి ప్రకృతి ఉత్పాదితాలు. పొలాల్లో వ్యవసాయం చేసి పండించేవన్నీ శ్రమ ఉత్పాదితాలు.

ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డ చెరువుల్లో పిల్లలు ఈత కొడతారు. నగరాల్లో మనిషి నిర్మించిన ఈతకొలనులు ఉంటాయి.

| ప్రకృతి ఉత్పాదితాలు | శ్రమ ఉత్పాదితాలు |
|---|---|
| శీతాకాలంలో ఏర్పడే మంచుగడ్డలు | కార్ఖానాల్లో తయారుచేసే ఐస్ గడ్డలు |
| గనుల్లో ఉప్పు | మనిషి చేసే ఉప్పు |
| చెట్లు రాసుకుని పుట్టే నిప్పు/ అగ్నిపర్వతాల నిప్పు | అగ్గిపుల్ల నిప్పు/ లైటర్ నిప్పు |
| సముద్రంలో రొయ్యలు | తవ్విన చెర్లో పండించే రొయ్యలు |
| మేఘాల రాపిడికి పుట్టే విద్యుత్తు | జనరేటర్ల వల్ల పుట్టే విద్యుత్తు |
| చందమామ లాంటి ఉపగ్రహాలు | కృత్రిమ ఉపగ్రహాలు |

ప్రకృతి తయారుచెయ్యని చెయ్యలేని అనేక వస్తువుల్ని మనిషి చేశాడు.ఒక నట్టో బోల్టో ప్రకృతిలో కనబడదు. చెప్పులో, చొక్కాలో, రొట్టెలో ప్రకృతిలో దొరకవు. అలాంటివి లక్షల సంఖ్యలో మనిషి తయారు చేసుకున్నాడు. రోజురోజుకీ వీటి సంఖ్య పెరుగుతున్నది.మానవుడు ఈనాడు ప్రకృతి ఉత్పాదితాలతో పాటు తన శ్రమ ఉత్పాదితాలనూ వాడుకుంటున్నాడు.

ప్రయోజనకర వస్తువులే సంపద. అయితే, పెట్టుబడిదారీ సమాజంలో ప్రయోజనకర వస్తువులు సరుకులవుతాయి. కనక సరుకుల కూడికే ఆధునిక సమాజంలో సంపద. విడిసరుకే దాని యూనిట్.

'పెట్టుబడి' పుస్తకం ఈవాక్యంతో మొదలవుతుంది:

"పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రబలంగా అమల్లోవున్న సమాజాల్లో, సంపద అపారమైన సరుకుల కూడికగా ఉంటుంది."- ఆసంపద రకరకాల సరుకుల గుట్ట. ఆ సరుకుల గుట్ట ఎంత పెద్దదయితే సంపద అంత పెద్దది. ఆ సరుకులు ఏవైనా కావచ్చు. అయినా వాటిలో ప్రతిదీ సరుకే. కనక ఆసంపదకి 'మూలప్రమాణం' (unit) ఒక విడి సరుకే." అంటాడు.

దాని తోటి వాక్యంలో, అందువల్ల, "మన పరిశోధన సరుకువిశ్లేషణతోనే మొదలు కావాలి" అంటూ తన పరిశోధన సరుకువిశ్లేషణతో ప్రారంభిస్తాడు.

ఆయన విశ్లేషణలో సరుకు గురించి తేలిన విషయాలు:

మొదటి విషయం.

1.సరుకు మనకు బయట ఉండే వస్తువు.

ఒక సరుకు అది స్టవ్ కావచ్చు, మందు బిళ్ల కావచ్చు, ఫానో, దోమల బాటో కావచ్చు. అది ఏదైనా మనకు బయట వుండే వస్తువే. కొట్లల్లో ఎన్నో వస్తువులుంటాయి. అవన్నీ అమ్మడానికే. అరల్లో ఉంటాయి. అంటే మనకి బయట అన్నమాట.

2. ప్రతి సరుకూ ఏదో ఒక కోరికని, అవసరాన్ని తీరుస్తుంది. వంటకి స్టవ్ అవసరం.జ్వరం వస్తే మందు బిళ్ల వెయ్యాలి. గాలికోసం ఫాన్, దోమలు పీకుతుంటే బాట్ కావాలి. ఏవస్తువునైనా కొనడానికి కారణం ఏదో ఒక ప్రయోజనం ఉండడమే. ఏ కోరికనూ తీర్చలేని వస్తువుని ఎవ్వరూ కొనరు. అది సరుకు కాదు.

3. వస్తువులు తీర్చే కోర్కెలు పొట్టలో పుట్టినవైనా, మనసులో ఏర్పడినవైనా తేడా ఉండదు. ఆకలైతే రొట్టో,పండో ఏదో ఒకటి తినాలి. పిల్లవాడికి ఆడుకోడానికి నచ్చిన బొమ్మ కావాలి. ఒకటి ఆకలితీర్చేది, మరొకటి మనసుకి కలిగిన కోరిక తీర్చేది. కోర్కెలు ఎలాటివైనా, వాటి స్వభావం ఏదైనా తేడా ఉండదు.

4.ఒక వస్తువు కోర్కెల్ని ఎలా తీర్చినా ఒకటే. దప్పిక తీర్చుకోడానికి నీరుకావాలి. నీటిని తోడటానికి తాడు బొక్కెన కావాలి. నీరు తాగుతాం.బొక్కెన లేనిదే నీరు చేదలేం. నీరు తోడే పరికరం. ఇలాంటివి ఎన్నో వస్తువులు అవసరమవుతాయి. ఆ బొక్కెన తయారుచేసే వాడికి రేకు, కడ్డీ, తాపడం చీలలూ కావాలి. కొలిమి సామాను, బొగ్గులూ, సుత్తీ , శానం వగయిరా ఉండాలి. బొక్కెన ఉత్పత్తికి ఇవన్ని అవసరం.వీటిని ఉత్పత్తిసాధనాలు అంటారు. ఇవన్నీ కొనేవానికి సరుకులే. ఒక వస్తువు ప్రత్యక్షంగా జీవితావసర వస్తువుగా( బొక్కెనగా ) కోరిక తీరుస్తుందా, లేక పరోక్షంగా (బొక్కెన)ఉత్పత్తికి అవసరమైన వస్తువుగా ఉపయోగపడుతున్నదా/ కోరిక తీరుస్తుందా అనే పట్టింపు ఉండదు. అలా తీర్చినా, ఇలా తీర్చినా తేడాలేదు. తీర్చగల సత్తా వుంటే సరి.

చెప్పులు కుట్టాలంటే,తోలూ,దారమూ,జిగురూ కావాలి.ఈవస్తువులమీద పనిచేస్తాడు.ఇవి శ్రమని గ్రహిస్తాయి కనక శ్రమగ్రహీతలు/శ్రమ పదార్థాలు (subjects of labour). ఉత్త శ్రమతో చెప్పులు తయారు కావు. శ్రమగ్రహీతలతోనూ కావు. కుట్టడానికి కొన్ని పరికరాలు కావాలి. చాకూ, ఆరె, సుత్తి, ఇనప దిమ్మ వగయిరా. ఇవి శ్రమసాధనాలు. ఏవస్తువు తయారు కావాలన్నా తగిన శ్రమ పదార్థాలూ, శ్రమ సాధనాలూ, తగిన శ్రమా కావాలి. మొదటి రెండూ కలిసి ఉత్పత్తిసాధనాలు. వీటికి శ్రమ తోడైతేనే ఉత్పత్తి జరుగుతుంది. చెప్పులు మనిషి అవసరాన్ని తీరుస్తాయి. ఉత్పత్తిసాధనాలు వాటిని తయారు చెయ్యడానికి అవసరమవుతాయి. ఏ అవసరం తీర్చినా ఒకటే. అది ప్రయోజనం కలవస్తువే.

## గుణమూ-పరిమాణమూ

ప్రతివస్తువుకీ గుణం ఉంటుంది.

ఒక్కోక రకం వస్తువుకు ఒక్కొకరకం ధర్మాలుంటాయి.స్పూనూ,గిన్నే,పళ్ళెమూ స్టీల్ వే కావచ్చు. కాని వాటి ఆకారాల్లో తేడాల వల్ల ప్రయోజనాలు వేరుగా ఉంటాయి. అంటే అవి గుణాత్మకంగా భిన్నమైన వస్తువులు. అలాగే ప్లాస్టిక్ తో తయారైన నవారూ, దారమూ, బిందే గుణాత్మకంగా భిన్నమైనవి. అలాగే బియ్యమూ, బియ్యపు రవ్వా,పిండీ కూడా. ఒకే ఆకారంలో ఉన్నా,బూరా, ఫుట్ బాలూ,ఒక ఇనపగుండూ ఒకటి కావు. తయారికి వాడిన మెటీరియల్ లో తేడావల్ల వాటి గట్టితనంలో తేడాలుంటాయి. గట్టితనం ఒక భౌతిక ధర్మం. ఒకేదారంతో నేసిన తువాలూ,దుప్పటీ ఆకారాల్లో తేడాలవల్ల గుణాత్మకంగా భిన్నమైనవి. నీరూ, ఆనీటితో తయారైన ఆవిరీ, ఐసూ గుణాత్మకంగా భిన్నమైనవి.వాటి ఉష్ణోగ్రతల్లో తేడాలవల్ల. ఉష్ణోగ్రత ఒక భౌతిక ధర్మం. ఒకేవస్తువు కొయ్యదీ, ప్లాస్టిక్ దీ, ఇనపదీ గుణాత్మకంగా భిన్నమైనవి. సుత్తెలు రబ్బరువి, కొయ్యవీ, ఇనపవీ

ఉంటాయి. అవన్నీ గుణాత్మకంగా భిన్నమైనవి. అరటి పండూ, జాంపండూ రెండూ తినేవే అయినా వాటు రుచులు వేరు, రంగూ రూపమూ వేరు. కనక గుణాత్మకంగా భిన్నమైనవి.

సముద్రపు ఒడ్డున దొరికే ఇసకలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. ఎడారి ఇసక చాలా సన్నంగా ఉంటుంది.కట్టుబడికి ఉప్పులేని,గండ్ర ఇసక వాడతారు. అలాంటి ఇసక్కే ఆ ఉపయోగపు విలువ ఉంటుంది. సముద్రపు ఇసక్కీ, ఎడారి ఇసక్కీ ఆ ఉపయోగపు విలువ ఉండదు. రెండూ గుణాత్మకంగా భిన్నమైనవి.

అంటే, ఏవస్తువుకైనా దాని గుణం దానికి ఉంటుంది.

అలాగే ప్రతి వస్తువుకీ పరిమాణం ఉంటుంది.

వస్తువన్నాక-అది ఏదైనా సరే- పరిమాణం ఉండి తీరుతుంది. పరిమాణం ఎంతో చెప్పటానికి ప్రమాణాలు ఉంటాయి. అరటి పళ్ళు డజన్లలో, కాగితాలు దస్తాల్లో, రీముల్లో చెబుతాం. సిరా ఔన్సుల్లో, బట్టలు గజాల్లో మీటర్లలో చెబుతాం. బరువుని గ్రాముల్లో చెబుతాం. అయితే అన్నిచోట్లా ఒకే కొలత ప్రమాణాలు ఉండవు.ఎన్నోదేశాలు కిలోమీటర్లలో దూరాన్ని చెబుతుంటే, అమెరికాలో మైళ్ళలో చెబుతారు. బరువుని పౌన్లలో చెబుతారు. చాలాదేశాల్లో కిలోగ్రాముల్లో చెబుతారు. ఉష్ణోగ్రతని సెంటిగ్రేడ్ లలో చెబుతుంటే, అమెరికన్లు ఫారన్ హీట్లలో చెబుతారు.

ఒకే చోటయినా అన్ని కాలాలలో ఒకే ప్రమాణాలు లేవు. పూర్వం దూరాన్ని అంగలతో చెప్పేవారు. బారలూ మూరలూ వేసి పొడుగు కొలిచేవారు. ఆతర్వాత అడుగులూ గజాలూ వచ్చాయి. ప్రస్తుతం మీటర్లు అమల్లో ఉన్నాయి. బరువుని నేడు కిలోగ్రాముల్లో చెబుతున్నాం. ఒకప్పుడు సేర్లు, మణుగుల్లో చెప్పేవాళ్ళు.ఇంతెందుకు ఇంతకుముందు ధాన్యాన్ని మానికలతో కొలిచేవారు. మరి నేడు అదే ధాన్యాన్ని తూస్తున్నాం.

అందుకే మార్క్స్ అంటాడు: " ఈ కొలమానాల వైవిధ్యం కొంతవరకూ కొలవాల్సిన వస్తువుల స్వభావంలో వుండే వైవిధ్యం నుండీ, కొంతేమో అలవాటు (convention)నుండీ వస్తుంది"-కాపిటల్ 1.43

షాపులో 2 డజన్ల గడియారాలూ, 6 టి.వీ లూ, 3 ఫ్రిజ్ లూ ఉన్నాయంటాం. వీటి పరిమాణాన్ని కొలిచో తూచో చెప్పం. నాలుగు పావురాళ్ళు ఎగురుతున్నాయి అంటాం.అయితే వాటి మాంసాన్ని తూచి, కిలోల్లో చెబుతాం.

ప్రతిదానికీ ఒక కొలతే ఉండాలని లేదు. నూనె లాంటి కొన్ని ద్రవపదార్థాల్ని కొలిచి లీటర్లలోనూ, తూచీ కిలోల్లో నూ చెప్పే అలవాటుంది. మార్కెట్లో కాలీ ఫ్లవర్ ని తూచీ ఇస్తారు. ఒక్కోటి ఇంత అనీ అమ్ముతారు.ఆపిల్ పళ్ళని డజన్ల లెక్కనా కొంటాం, కిలోల లెక్కనా కొంటాం.

అంటే కొలత ప్రమాణాలూ, పద్ధతులూ ప్రాంతాల్ని బట్టీ, కాలాన్ని బట్టీ మారుతూ ఉంటాయి.

********

ఒకవస్తువు ప్రయోజనమే దాన్ని ఉపయోగపు విలువగా చేస్తుంది. ఒక వస్తువుకి దాని ప్రయోజనం ఎలా ఏర్పడుతుంది? ఒక వస్తువు ప్రయోజనం గాలిలో ఏర్పడేది కాదు. తన ధర్మాలవల్ల మనిషి కోర్కెల్ని తీరుస్తుంది. ధర్మాలు వేరయితే ప్రయోజనాలు వేరుగా వుంటాయి.పెన్సిల్ ప్రయోజనం వేరు, సైకిల్ ప్రయోజనం వేరు. కారణం వాటి ధర్మాలు భిన్నమైనవి గావడమే.

ప్రయోజనకరమైన ప్రతివస్తువూ ఎన్నో ధర్మాల సమ్మేళనం. అందువల్ల అది ఎన్నోవిధాలుగా ఉపయోగపడవచ్చు. నీరు దప్పిక తీరడానికీ, వంటకీ, ఐస్ తయారీకీ, మురికి కడగడానికీ, వ్యవసాయానికీ,ఆవిరి యంత్రం నడిపేందుకు, నిప్పుని ఆర్పడానికి ఉపయోగపడుతుంది. ఇంజన్లు చల్లబరచడానికీ, విద్యుదుత్పత్తికీ, గుంపుల్ని చెదరగొట్టడానికీ పనికొస్తుంది.ఇంకా ఎన్నో ప్రయోజనాలు. ఆవిరి ఇంజన్ కనుక్కోకముందు నీటిని అందుకు వాడలేదు. అయితే నీటికి ఆ ఉపయోగపు విలువ ఎప్పుడూ ఉంది.అద్దాలు లేక ముందు మనుషులు తమ ముఖాల్ని నీటిలో చూచుకునేవారు.ఇప్పుడెవరూ చూచుకోరు. అయినా దానికా ప్రయోజనం ఇప్పుడూ ఉంది. ఎప్పటికీ ఉంటుంది. తాజ్ మహల్ చూడబోయినవారు దాని ప్రతిబింబాన్ని ఇప్పటికీ నీటిలో చూడడం ఒక పనిగా పెట్టుకుంటారు.ప్రకృతి అందాలు సరస్సుల్లో చూచి ఆనందిస్తారు.

కర్రలు రాపాడితే ఎప్పుడయినా నిప్పు పుడుతుంది. ఒకప్పుడు అలా చేశారు.ఇప్పుడెవ్వరూ ఆపని చెయ్యరు. చెకుముకి రాయితో నిప్పు చేసేవారు.అగ్గిపుల్లలొచ్చాక, లైటర్లొచ్చాక ఆరాయితో ఎవ్వరూ నిప్పు చెయ్యడం లేదు. అయితే దానికా ప్రయోజనం ఇప్పుడూ ఉంది. కారణం దాని ధర్మాలు అవే.

రాగి గురించి క్రీ.పూ.4000 సంవత్సరాలనాడే తెలుసు. నాగలి కర్రూ, గొడ్డళ్ళూ రాగితో చేసేవారు. రాగిరేకుల్ని ఇంటి కప్పుకి వాడారు. ఇప్పుడెవరు అలా వాడడంలేదు- రాగికా ప్రయోజనం చెక్కుచెదరుండా అలానే ఉన్నా. విద్యుత్ కనుగొన్నాక రాగితీగని మంచి వాహకంగా వాడుతున్నారు. మోటార్ కాయిల్స్ రాగివే. టెలిఫోన్ తీగలూ రాగివే.

అయస్కాంతం ఇనుముని ఆకర్షిస్తుంది. ఫ్రిజ్ తలుపులకి పెడతారు.స్టీరియో స్పీకర్లలో, ఇయర్ ఫోన్లలో,దిక్సూచి లో వాడతారు.

ఒక వస్తువుకి దానిధర్మాలవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి - మనకు తెలిసినా తెలియకపోయినా. మనకి తెలియకపోతే, అందుకు దాన్ని మనం ఉపయోగించం. తెలిశాకనే ఆవస్తువు ఉపయోగపు విలువ అవుతుంది. ఒక్కొక్క నూతన ఆవిష్కరణతో రాగికుండే ఒక్కొక్క ప్రయోజనం బయటపడింది. ముందు ముందు ఇంకాకొన్ని అవసరాలకు దాన్ని ఉపయోగించవచ్చు. అందుకే మార్క్స్ అంటాడు:

“వస్తువుల వివిధ ఉపయోగాల్ని కనుక్కోవడం చరిత్ర పని.”- మనిషి ఆలోచనలూ, అవసరాలూ పెరిగేకొద్దీ, కొత్తకొత్త అవిష్కరణలు వచ్చేకొద్దీ, చరిత్ర నడిచే క్రమంలో వస్తువుల వివిధ ప్రయోజనాలు తెలుస్తాయి.అందుబాటులోకి వస్తాయి.

"ఒక వస్తువు ప్రయోజనం ఆవస్తువునుండి విడిగా వుండజాలదు." కొయ్యడం అనే ప్రయోజనం బ్లేడుకో, చాకుకో ఉంటుంది. వాటితో సంబంధం లేకుండా ఉండదు.ఏవస్తువు ప్రయోజనాన్నైనా ఆవస్తువునించి విడదీయలేం."

“ఉపయోగించడం వల్లనో లేక వినియోగించడం వల్లనో మాత్రమే ఉపయోగపు విలువ యధార్ధమవుతుంది."-కాపిటల్.1.44

"ఉపయోగపు విలువలు సమస్తసంపద యొక్క సారాంశం అయివుంటాయి-ఆసంపదయొక్క సామాజిక రూపం ఏదయినా సరే."-కాపిటల్.1.44

"ఉపయోగపు విలువ సరుకుయొక్క భౌతిక పార్శ్వం"-గ్రుండ్రిస్-881

ప్రయోజనానికి సంబంధించిన ఒక ముఖ్య విషయం: ఒక వస్తువు ఉత్పత్తికి పట్టిన శ్రమ పరిమాణానికీ, దాని ప్రయోజనానికీ సంబంధం ఉండదు. అంటే, ఒకవస్తువు తయారీకి పట్టే కాలాన్ని బట్టి దాని ప్రయోజనం ఉండదు. ఎక్కువ బడితే దాని ప్రయోజనం పెరగదు. తక్కువ బడితే దాని ప్రయోజనం తగ్గదు.రెండుసందర్భాలలోను అంతే ఉంటుంది. అంటే తయారీకి ఎక్కువ సమయం పట్టినా తక్కువ సమయం పట్టినా దాని ప్రయోజనం ఏమాత్రం మారదు.ఇంటి పక్కనే వున్న చెర్లో నీళ్ళు 10 బుంగలు తెచ్చి తొట్టి నింపడానికి 30 నిముషాలు పడుతుంది. ఆ చెరువు ఎండితే కిలోమీటర్ దూరంలో వున్న ఏటి నీటిని తెచ్చి అదే తొట్టిని నింపడానికి 3 గంటలు పట్టవచ్చు. తగినంత వర్షం పడితే తేకుండానే నిండుతుంది. మూడు

సందర్భాలలోనూ పట్టిన శ్రమ కాలాల్లో తేడా వుంది. అయినా 3 సందర్భాలలోనూ నీటి ప్రయోజనం మాత్రం ఒకటే.

" ఏదయినా కొత్త పరికరం కనిపెట్టినందువల్ల, రొట్టె తయారీకి పట్టే శ్రమలో 95 శాతం తగ్గినా రొట్టె ప్రయోజనంలో మార్పు రాదు"-క్రిటిక్.36 అంటాడు.

ఎలెక్ట్రాలసిస్ వచ్చాక అల్యుమినియం ని శుద్ధిచెయ్యటానికి పట్టే కాలం అనూహ్యంగా తగ్గిపోయింది. అయితే దాని ఉపయోగపు విలువలో అణుమాత్రమయినా మార్పు రాలేదు.

వేరొకచోట గోధుమలు " అలాగే మంచులాగా ఆకాశం నుండి కురిసినా వాటి ఉపయోగపు విలువని ఏమాత్రం కోల్పోవు"- కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మార్క్స్ అండ్ ఎంగెల్స్. 29 వ సంపుటం. పేజీ 252 (సాఫ్ట్ కాపీ)

అంతే ముఖ్యమైన మరొక విషయం:

ఒక వస్తువు ఏ సామాజిక సంబంధాలలో ఉత్పత్తయింది? అనే విషయం దాని ప్రయోజనానికి అనవసరం. ఈ సంబంధాలు ఆదిమ, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజాల్లో భిన్నమైనవిగా వుంటాయి. అయితే ఉపయోగపు విలువకు ఈతేడాలతో సంబంధం ఉండదు. మార్క్స్ మాటల్లో:

"గోధుమల్ని రుచిచూచి వాటిని పండించింది రష్యన్ భూదాసుడో,ఫ్రెంచ్ రైతో, ఇంగ్లిష్ పెట్టుబడిదారుడో చెప్పడం సాధ్యం కాదు."-క్రిటిక్.32

మరొకచోట: గోధుమల్ని పండించింది బానిసైనా, భూదాసుడైనా, స్వేచ్ఛాశ్రామికుడైనా ఒకే ఉపయోగపు విలువను కలిగి వుంటాయి.- కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మార్క్స్ అండ్ ఎంగెల్స్. 29 వ సంపుటం. పేజీ 252 (సాఫ్ట్ కాపీ)

దీన్ని బట్టి " ఉపయోగపువిలువ అత్యంత భిన్నమైన ఉత్పత్తి విధానలకూ ఉమ్మడి అంశం"- కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మార్క్స్ అండ్ ఎంగెల్స్. 29 వ సంపుటం. పేజీ 252 (సాఫ్ట్ కాపీ)

ఉపయోగపు విలువలు లేక ప్రయోజనకరవస్తువులు ఈవ్యవస్థలో మారకం విలువకు వాహకాలుగా కూడా ఉంటాయి.అంటే వస్తువులు పెట్టుబడిదారీ విధానంలో ఉపయోగపు విలువలే కాదు, మారకం విలువలు కూడా.

అందుకే సరుకనేది "ఉపయోగపు విలువా, మారకం విలువా - ఈరెండిటి సమ్మేళనం" అంటాడు.

సరుకు పెట్టుబడిదారీ విధానం యొక్క 'ఆర్థిక కణం ' .తన చివరి ఆర్థిక రచనలో ఇలా అంటాడు:సరుకును "ఒకపక్క దాని సహజ రూపంలో అదొక ప్రయోజనకర వస్తువు, ఉపయోగపు విలువగానూ, మరొకపక్క, మారకపు విలువకు వాహకంగానూ నేను గమనించాను"

ఉపయోగపు విలువను గురించి సరిపడా చర్చించాడు. ఇక మారకం విలువని విశ్లేషిస్తాడు.ఎలాగో చూద్దాం.

మొదటి అధ్యాయం మొదటి విభాగం సరుకులు. చివరి పేరాలో ఉపయోగపు విలువ గురించి చెబుతాడు.- కాపిటల్ 1.48

"ఒక వస్తువు విలువ లేకుండానే, ఉపయోగపు విలువగా ఉండగలదు. దాని ప్రయోజనం శ్రమ వల్ల ఏర్పడకపోతే పరిస్థితి అదే. గాలీ,దున్నని పొలమూ, సహజ పచ్చికబయళ్ళూ, నాటని అడవులూ మొదలైనవి ఈకోవకి చెందుతాయి."

ఇవన్నీ ఉపయోగపు విలువలే. కాని అవి మారకంలోకి రావు. వాటికి విలువ వుండదు. అయినా అవి ఉపయోగపు విలువలు.

"ఒక వస్తువు ప్రయోజనకరమైనదీ, శ్రమ ఉత్పాదితమూ అయివుండి కూడా, సరుకు కాకుండా ఉండగలదు.తనసొంతశ్రమతో తయారైన ఉత్పాదితంతో తన కోర్కెను తీర్చుకునే మనిషి ఉపయోగపువిలువల్ని ఉత్పత్తిచేస్తాడు, సరుకుల్ని కాదు."

ఉదాహరణకి ఒక నేతగాడు కుటుంబ సభ్యుల వాడకానికి నేసే బట్టలు సరుకులు కావు. ఉపయోగపు విలువలు మాత్రమే.కారణం అవి మారకంలోకి రావు.

ప్రతి సరుకూ శ్రమ ఉత్పాదితమే, కాని ప్రతిశ్రమ ఉత్పాదితమూ సరుకు కాదు. మారకం ద్వారా ఇతరుల వాడకం బదిలీ అయ్యే శ్రమ ఉత్పాదితాలే సరుకులు.

"సరుకుల్ని ఉత్పత్తిచెయ్యడానికి, అతను ఉపయోగపువిలువల్ని తయారు చెయ్యడమే కాదు, ఆ ఉపయోగపు విలువల్ని ఇతరులకొరకు, అంటే,సామాజిక ఉపయోగపు విలువల్ని తయారుచెయ్యాలి.(ఇతరులకోసం చేస్తేనే చాలదు. మధ్య యుగాల రైతు, భూస్వామి కోసం అద్దె/కౌలు(quit rent) ధాన్యాన్నీ, మతాధికారికొసం 'టితీ'ధాన్యాన్ని పండించాడు.అయితే ఇతరులకోసం పండించినంత మాత్రాన అదీ ఇదీ సరుకులు కావు..సరుకు అవాలంటే మరొకరికి - ఎవరికైతే అది ఉపయోగపు విలువగా ఉంటుందో వారికి - మారక మాధ్యమం ద్వారా బదిలీ కావాలి)*"

*బ్రాకెట్లో ఉన్నది నాల్గవ జర్మన్ ప్రతికి ఎంగెల్స్ చేర్చిన నోట్:" బ్రాకెట్లో ఉన్న దాన్ని నేను చేర్చాను. కారణం ఇది లేకపోవడంవల్ల ఒక అపార్థం తరచూ కలిగింది. ఉత్పత్తిదారుడు కాకుండా ఇతరులు ఎవరైనా వినియోగించే ప్రతి ఉత్పాదితాన్నీ మార్క్స్ సరుకుగా భావించాడని."

ఒక వడ్రంగి కొయ్యతో మూడు గాళ్ళ బండి తయారుచేసి నడక తొందరగా రావడానికి తన బిడ్డకిస్తే అది సరుకు కాదు. ఉత్త ఉపయోగపు విలువ. అదే బండిని మరొకరికి ఉచితంగా ఇస్తే, అప్పుడూ అది సరుకు కాదు. దానికి బదులుగా మరొక వస్తువు తీసుకొని ఇస్తేనే -అంటే మారకం చేసుకుంటేనే - అది సరుకు అవుతుంది.


అంటే మారకం లేకుండా బదలాయించినవేవీ సరుకులు కాదు. మారకం కోసం ఉత్పత్తయినవే సరుకులవుతాయి.

పైన చెప్పినట్లు మధ్య యుగాల రైతు భూస్వామి కోసం అద్దె/కౌలు ధాన్యాన్ని పండించి ఇచ్చాడు. మతాధికారికోసం 'టితీ'ధాన్యాన్ని పండించాడు. వాటిని తన శ్రమతో పండించింది తనకోసం కాదు, ఇతరులకోసం. అయినా అవి సరుకులు కావు." కారణం అవి మారకం లోకి రావు.

(టితీ అంటే పదోవంతు అని అర్థం. ఆకాలంలో రైతు పండించిన ధాన్యంలో పదోవంతు చర్చికి పోతుంది. దానికి బదులు రైతుకి వచ్చే వస్తువేదీ ఉండదు. కనక ఆ ధాన్యం సరుకు కాదు)

"చివరగా, ప్రయోజనం లేని ఏ వస్తువూ విలువ కాజాలదు. ఆవస్తువు నిరుపయోగమయిందయితే, దానిలో ఇమిడివున్న శ్రమ కూడా అంతే నిరుపయోగమయింది; ఆశ్రమ శ్రమకింద లెక్కకు రాదు. కనుక విలువను సృజించదు." కాపిటల్.1.48

ఇతరుల వాడకం కొరకు మారకంద్వారా బదిలీ అయ్యే శ్రమ ఉత్పాదితవస్తువులు మాత్రమే సరుకులు. ప్రకృతి ఉత్పాదిత వస్తువులూ, సొంతవాడకానికి తయారుచేసుకున్న వస్తువులూ, ఇతరుల వాడకం కోసమే అయినా ఊరకే/ ఉచితంగా అంటే, మారకం లేకుండా ఇతరులకు బదిలీ అయ్యే వస్తువులూ సరుకులు కావు. సరుకులైన వస్తువులు కొన్ని. సరుకులు కాని వస్తువులు కొన్ని.




ఇప్పటికి, ఏవి సరుకులో, ఏవి కావో - అంటే ఏవి కేవలం ఉపయోగపువిలువలో - చూచాం. సరుకుల ఉపయోగపు విలువ గురించిన విషయాలు తెలుసుకున్నాం. ఇక సరుకు మారకం విలువ గురించి తెలుసుకోవాలి.

## 2.మారకం విలువా- విలువా

"మన పరిశోధన సరుకు విశ్లేషణతోనే మొదలుకావాలి" అంటూ మార్క్స్ సరుకుని నిశితంగా పరిశీలిస్తాడు. సరుకు ఉపయోగపువిలువా మారకం విలువా- ఈరెంటి సమ్మేళనం. కనక ముందుగా ఉపయోగపువిలువని గురించి వివరంగా చెబుతాడు. ఆతర్వాత మారకపు విలువని విశ్లేషిస్తాడు.తద్వారా మారకపు విలువ నించి విలువకు చేరుకుంటాడు. ఎలాగో చూద్దాం.

**************

బూర్జువా సమాజంలో సరుకు అనేది ఆర్ధిక కణరూపం. సరుకు విశ్లేషణ ద్వారా తన అర్ధశాస్త్రానికి సంబంధించినముఖ్యమైన అన్ని భావాభివర్గాల్ని(categories) క్రమంగా అభివృద్ధి చేస్తాడు. మొదటగా సరుకు ఒక ప్రయోజనకర వస్తువు. ఉపయోగపువిలువ. మనం వాడుకునే వస్తువులన్నీ ఉపయోగపువిలువలే. కాని అన్నివస్తువులు సరుకులు కావు. అమ్మేవీ , కొనేవీ మాత్రమే సరుకులు. అయితే, అమ్మడాలు కొనడాలు లేని కాలమే చరిత్రలో ఎంతో దీర్ఘమయినది. ఆకాలమంతా వస్తువులకు మారకపు విలువ(విలువరూపం)లేదు.సరుకులు తెలియవు. సరుకులు చరిత్రలో ఒకానొక కాలంలో ఏర్పడ్డాయి. ఉపయోగపు విలువలు సరుకులు లేనప్పుడు కూడా ఉన్నాయి.కనక ఉపయోగపువిలువ సరుకురూపాన్ని వివరించడానికి ఎంతమాత్రమూ సరిపోదు. దీన్నిబట్టి సరుకుకి ఉపయోగపు విలువతో పాటు అదనంగా మరొకలక్షణం- సరుకురూపాన్ని వివరించగల విశిష్ట లక్షణం- ఉండాలి. ఆలక్షణాన్నిమార్క్స్ మారకం విలువ లేక విలువరూపం అంటాడు .అంటే సరుకుకి ఉపయోగపువిలువ రూపంతో పాటు విలువ రూపం కూడా ఉంటుంది. అలా మార్క్స్ మారకం విలువ లేక విలువ రూపం అనే భావాభివర్గానికి చేరతాడు.

### విలువ రూపం

"ఈరూపాలు రెండూ ఉన్నమేరకే అవి సరుకులుగా వ్యక్తమవుతాయి"-కాపిటల్1.54. అంటే సరుకు ద్వంద్వ రూపి. ఉపయోగపువిలువ రూపం అంటే సరుకు భౌతికరూపమే ,శరీర రూపమే.ఏవస్తువుకైనా భౌతిక రూపం ఉంటుంది.అది కేవలం ఉపయోగపువిలువే అయినా, సరుకయినా. అయితే, సరుకైన వస్తువుకి మాత్రం, భౌతిక రూపానికి తోడు విలువరూపం కూడా ఉంటుంది. కేవలం ఉపయోగపు విలువే అయిన వస్తువుకి ఈ విలువరూపం ఉండదు.

### విలువరూపం అన్నా మారకం విలువ అన్నా ఒకటే.

"సరుకు ఉపయోగపు విలువా...విలువా కూడా. అది ఈ ద్విముఖ వస్తువుగా ఎప్పుడు వ్యక్తం చేసుకుంటుందంటే, దానివిలువ స్వతంత్రరూపం తీసుకున్నప్పుడు. "విడిగా వున్నప్పుడు ఆరూపం తీసుకోదు. మరొకరకం సరుకుతో విలువ లేక మారక సంబంధంలో పెట్టినప్పుడు మాత్రమే ఈరూపం తీసుకుంటుంది."- కాపిటల్1.66

ఒక బస్తా సిమెంటు విడిగా ఉంటే దానికి విలువరూపం ఉండదు.దాని విలువ స్వతంత్ర రూపం తీసుకోదు. దాన్ని 10 ఇనప చువ్వలతో మారక సంబంధంలో పెట్టగానే, దాని విలువ స్వతంత్ర రూపం తీసుకుంటుంది.అప్పుడు సిమెంట్ బస్తా ద్విముఖవస్తువుగా, సరుకుగా వ్యక్తమవుతుంది.

అంటే, సరుకుకి సహజ, భౌతిక రూపంతో పాటు విలువ రూపం కూడా ఉంటుంది.

పెట్టుబడి తొలి చాప్టర్లో ఆయన వివరించదల్చుకున్నది దీన్నే. ఆయన మాటల్లోనే:" సరుకు యొక్క విలువరూపాన్ని, లేక శ్రమ ఉత్పాదితం యొక్క సరుకు రూపాన్ని."-ఎంగెల్స్ కి మార్క్స్ ఉత్తరం 27, జూన్ 1867

## విలువ రూపం విశ్లేషణ

1)"మొదట మారకం విలువ పరిమాణాత్మక సంబంధంగా, ఒకరకం సరుకులు మరొక రకం సరుకులతో మారే నిష్పత్తిగా, బయటపడుతుంది."- కాపిటల్1.44 మారకపు విలువ కేవలం పరిమాణాత్మక నిష్పత్తే అని ఎవరు అన్నారో ఫుట్ నోట్ లో చెబుతాడు:"ఒక వస్తువుకీ, మరొకవస్తువుకీ మధ్య ఒక వస్తువు ఫలానింత పరిమాణానికీ, మరొకవస్తువు ఫలానింత పరిమాణానికీ మారక నిష్పత్తే విలువ "-లె ట్రాస్నె. కాపిటల్1(పెంగ్విన్).127.

ఈనిష్పత్తినే లె ట్రాస్నె విలువ అన్నాడు.

20 గజాలబట్ట ఒక కోటుతో మారితే, మారక నిష్పత్తి 20:1

20 గజాలబట్ట = 1 కోటు అనే సమీకరణ దీన్ని తెలుపుతుంది. బట్టా కోటూ ఏపరిమాణాల్లో సమానమవుతాయో తెలుపుతుంది. అంటే, మారకం విలువ పరిమాణాత్మక సంబంధంగా మొదట కనిపిస్తుంది.

ఒక సోఫా 5 కుర్చీలతో మారితే మారకనిష్పత్తి 1:5

1 సోఫా=5 కుర్చీలు అనే సమీకరణ దీన్ని తెలుపుతుంది. సోఫా, కుర్చీలు ఏపరిమాణాల్లో సమానమవుతాయో తెలుపుతుంది. ఒకరకం సరుకులు మరొక రకం సరుకులతో మారే నిష్పత్తిగా, బయటపడుతుంది.

అయితే, మారకమయ్యే పాళ్ళు స్థిరంగా ఉండవు. స్థలాన్ని బట్టీ, కాలాన్ని బట్టీ మారుతుంటాయి.

ఒకప్పుడు ఒక అరేబియా తెగ, ఒక పౌను ఇముముకి 10 పౌన్ల బంగారం ఇచ్చినట్లు, ఒక పౌను వెండికి 2 పౌన్ల బంగారం ఇచ్చినట్లు స్ట్రాబో చెప్పాడు"-క్రిటిక్ 156.

అప్పట్లో పౌను ఇముము = 10 పౌన్ల బంగారం

పౌను వెండి = 2 పౌన్ల బంగారం

ఇండియాలో వైదిక కాలంలో సరికి సరి మారేవి-రుగ్వేదార్యులు

పౌను వెండి = పౌను బంగారం

1865 ప్రాంతంలో బంగారం,వెండి మారిన నిష్పత్తి 15:1; 1890 లో 22:1;ఇవ్వాళ 70:1 ఉంటుంది.

2011లో గ్రాము బంగారం కావాలంటే 38 గ్రాముల వెండి ఇవ్వాలి. 2017 అక్టోబర్లో 75 గ్రాములు వెండి ఇస్తేగాని ఒక గ్రాము బంగారం రాదు. అంటే, బంగారం విలువతో పోలిస్తే వెండి విలువ దాదాపు సగానికి పడిపోయింది.

అల్యూమినియమైతే మరి ఆశ్చర్యం కలిగిస్తుంది.మూడో నెపోలియన్ కాలంలో (1848-1870) అల్యూమినియం వెండి బంగారాలకన్నా విలువయింది. ఎంత విలువైందంటే: "ఆయన (నెపోలియన్)అత్యంత గౌరవనీయులైన అతిథులకు అల్యూమినియం స్పూన్లూ, ఫోర్కులూ ఇచ్చి, అంతకన్నా తక్కువ ముఖ్యులైనవారికి వెండివీ బంగారానివీ ఇచ్చేవాడు"-World book of encyclopaedia vol1.p340

మూడవ నెపోలియన్ రాజులకు ఇచ్చిన విందులో, పరివారానికి బంగారం వెండి పళ్ళాల్లో పెట్టి, రాజులకి అల్యుమినియం పళ్ళెంలో పెట్టివాడు. అంటే అల్యూమినియం అప్పట్లో అంత విలువైనది.

మరి ఈనాడో ఒక కిలో వెండికి 320 కిలోల అల్యుమినియం వస్తుంది. కిలోబంగారానికైతే చెప్పేదేముంది. 22,000 కిలోలకు పైగా వస్తుంది.

1850 లలో పౌను అల్యూమినియం 550 డాలర్లుండేది. 50 ఏళ్ళతర్వాత 25 సెంట్లకు పడిపోయింది.

మామూలుగా కిలో పొటాటోలకి 4కిలోల టొమాటోలొస్తాయి. అదే ఎండాకాలంలో ఒక్కొక్కప్పుడు కిలో టోమాటోలకు 4 కిలోల పొటాటోలొస్తాయి.ఇది అందరికీ అనుభవమే.

## వైరుధ్యం

సరుకులు మారకం విలువకు నిలయాలు. అంటే, సరుకులో అంతర్గతంగా మారకం విలువ ఉన్నదని అర్థం..

మారకం విలువ రెండు సరుకుల సంబంధంగా బయటపడుతుంది. కనక మారకం విలువని ఒకే సరుకుకి ఆపాదించడం కుదరదు. మరొక అర్థంలో కూడా ఇది సాపేక్షం. మారక పరిస్థితుల్ని బట్టి – స్థల కాలాలను బట్టి-మారే పాళ్ళుఎప్పటికప్పుడు,ఎక్కడికక్కడ మారుతుంటాయి. ఈ వాస్తవం అందరికి తెలిసిందే. అంటే, సరుకులో అంతర్గతంగా మారకం విలువ ఉండదని.

మారకం విలువని సరుకులో లంగరై ఉన్నదిగా, ఉపయోగపు విలువతో పాటు సరుకులోవున్న రెండవ ధర్మంగా మొదట ప్రవేశ పెట్టడం మన అవగాహనకు సరిపోయేదే. అంటే సరుకులో అంతర్గతంగా మారకం విలువ ఉన్నదని ఒకచోట , లేదని మరొకచోట లేదనీ చెప్పడం తార్కిక వైరుధ్యం కదా!

ఇక్కడ వైరుధ్యం ఏమిటంటే : మారకం విలువ ఒకవైపు సరుకుల్లో అంతర్గమైనదని పిస్తుంది, మరొకవైపు సాపేక్షమూ, యాదృచ్ఛికమూ అయినట్లు అనిపిస్తుంది.ఇవి రెండు అభిప్రాయాలూ ఒకదానికొకటి పొసగవు.అది తార్కిక వైరుధ్యం. మారకం విలువ అంతర్గతం అని ఎందుకు అనిపిస్తుందంటే, మారకం విలువ ఆసరుకుల్లో ఉన్నదాని వ్యక్తీకరణ గనుక. అది సాపేక్షం ఎందుకంటే, ఆ వ్యక్తీకరణ భిన్న సరుకుల మధ్య సంబంధం రూపాన్ని తీసుకుంటుంది కనక.

## అది వైరుధ్యం కాదు

కాని జాగ్రత్తగా పరిశీలించి మార్క్స్ ఈ అభిప్రాయాన్ని తిరస్కరిస్తాడు.ఎందుకంటే ఏ సరుకు మారకం విలువనైనా నిర్దిష్ట పరిమాణాల్లో ఇతర అన్నిసరుకుల రీత్యా వ్యక్తం చెయ్యవచ్చు . కనక అవన్నీ ఒకదాని చోటులో మరొకటి చేరగలవు. అంటే, అవన్నీఒకదానికొకటి సమానం అని.

ఒక రకం సరుకు అన్ని ఇతర సరుకులతో మారకం అవుతాయి. అయితే పరిమాణాలు వేరువేరుగా ఉంటాయి.నిష్పత్తులు తేడాగా ఉంటాయి.

10 కిలోల గోధుమలు = 6 లీటర్ల పాలు

=30 పెట్టెల గుండుసూదులు

= 7 సబ్బులు

=6 కిలోల చక్కెర ఇలా

10 కిలోల గోధుమలకు అన్ని ఇతర సరుకులతో మారకం కుదురుతుంది- భిన్న పరిమాణాల్లో.అంటే 10 కిలోల గోధుమల మారకం విలువ చెక్కుచెదరకుండా (ఏమార్పూలేకుండా)ఉంది -అది 6 లీటర్ల పాలలో వ్యక్తమయినా 30 పెట్టెల గుండు సూదుల్లో వ్యక్తమయినా, 7 సబ్బుల్లో వ్యక్తమయినా, 6 కిలోల చక్కెరలో వ్యక్తమయినా అది మారదు. చూడగానే మారకంవిలువ ఇలాటి పరిమాణాత్మక నిష్పత్తిగా కనిపిస్తుంది.

మారకపు విలువ ఒక సరుకుకి చెందినది కాదు. అది రెండు సరుకుల సంబంధం.

మారకపువిలువ సాపేక్షమైనదిగా కనిపిస్తుంది.

కనక మారకం విలువ ఏదో యాదృచ్ఛికమైనదైనట్లూ,సాపేక్షమైనదైనట్లూ అగపడుతుంది.

అందువల్ల సరుకులో అంతర్గతంగా ఉండే మారకం విలువ స్వయం వైరుధ్యం అనిపిస్తుంది.

ఒకేసరుకున్నప్పుడు మారకం విలువ బయటపడదు.

సరుకు మారకంవిలువకి, ఆసరుకు ఉపయోగపు విలువ వాహకం అని చెప్పినప్పటికీ, మారకం విలువ ఒకేసరుకున్నప్పుడు బయటపడదు. అది రెండు సరుకుల సంబంధం.

"రెండన్నా లేకుంటే, మారకం విలువ ఉనికిలో ఉండదు"-నోట్స్ ఆన్ వాగ్నర్- మార్క్స్ ఎంగెల్స్ కలెక్టెడ్ వర్క్స్ 24పేజీ533.

ఒకేసరుకు ఉన్నప్పుడుమారక నిష్పత్తికి అవకాశం ఉండదు.

ఒక రజాయీ విలువ 1500 రూపాయలు అని ముద్ర వుండవచ్చు. ఇక్కడ రజాయీ ఒక సరుకయితే డబ్బు రెండో సరుకు. అది అటుపోనిదే ఇది ఇటు రాదు. కనక ఒక రజాయీ = 15 స్టీలు డబ్బాలు అన్నప్పుడు ఎలాగయితే రెండు రకాల సరుకులు ఉన్నాయో, రజాయీ = 1500 రూపాయిలు అన్నప్పుడు కూడా రెండు సరుకులు ఉన్నట్లే. రజాయీ విలువ డబ్బాల్లో తెలిసినట్లే, ఇక్కడ డబ్బులో తెలుస్తున్నది. అంతే, అంతకు

మించి మరేమీ లేదు. అంటే, ఒక సరుకు విలువ మరొకసరుకులో (ద్వారా) తెలుస్తుంది.సాపేక్షంగా అన్న మాట.

మారకం విలువ తొలిచూపుకి మరొక విధంగా కూడా సాపేక్షం. మారకమయ్యే పాళ్ళు మారక పరిస్థితుల్ని బట్టి పోతుంటాయి. స్థలాన్ని బట్టీ, కాలాన్ని బట్టీ భిన్నమైన నిష్పత్తుల్లో మారకం అవుతుంటాయి. ఇది అందరికీ తెలిసినదే. మారకం విలువ సరుకుల ఉపయోగపు విలువకు జంటగా సరుకులో లంగరై ఉన్న రెండో లక్షణమనీ తెలిసిన విషయమే. ఆవిధంగా మొదట మారకం విలువని పరిచయం చేశాడు. "ఉపయోగపువిలువలు మారకం విలువయొక్క భౌతిక నిలయాలు కూడా" అన్న మాటల్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి. అసలు ఈసెక్షన్ శీర్షిక 'సరుకు యొక్క రెండు అంశాలు: ఉపయోగపువిలువా మారకం విలువా '. అంటే ఇవిరెండూ సరుకుకుండే రెండులక్షణాలుగా చెప్పాడు.మారకం విలువ సరుకులో అంతర్గతంగా ఉన్నదయితే, ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ పరిస్థితుల్ని బట్టి మారే, నిలకడలేని సరుకులమధ్య సంబంధంగా వ్యక్తం కాకూడదు. కాని వాస్తవంలో పరిస్తితుల్ని బట్టి మారే సంబంధంగా వ్యక్తం అవుతున్నది.

"అందువల్ల మారకం విలువ ఏదో యాదృచ్ఛికమైనదీ, కేవలం సాపేక్షమైనదీ అయినట్లు, తత్ఫలితంగా సరుకుల్లో అంతర్గంతంగా ఉండే విలువ(intrinsic value) అనేది... స్వయం వైరుధ్యం/ అయినట్లు గా అగుపిస్తుంది"- కాపిటల్ 1.44.

అక్కడే,( పైన చుక్కలు పెట్టినచోట) అంతర్గతంగా వుండే విలువ అంటే ఏమిటో చెబుతాడు:intrinsic value"అంటే సరుకుల లోపలేవుండి, ఆసరుకులనుండి విడదీయరాని సంబంధంలో వుండే మారకం విలువ."

విషయాన్ని మరింతదగ్గరగా పరిశీలిద్దాం అంటాడు. పరస్పరవిరుద్ధమైన దాన్ని తార్కిక inference కి ఆధారం చేసుకోకూడదు. లోతుగా పరిశీలన చెయ్యాలి. ఇలాంటి ఆటంకాలు వచ్చినప్పుడల్లా మార్క్స్ లోతుగా పరిశీలించాలి అంటాడు.

ఇది వైరుధ్యం అనిపిస్తుంది. పైకలా కంపించినా,సూక్ష్మ పరిశీలనలో అసలు విషయం వేరుగా ఉంటుంది. జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ అభిప్రాయాన్ని తిరస్కరించవలసి వస్తుంది. మారకం విలువ యాదృచ్ఛికంకాదనీ ఒకలెక్కప్రకారం ఉంటుందనీ తేలుతుంది. రెండుసరుకుల పోలికలో వచ్చేది కాదనీ, అందులో బయటపడుతుందనీ తేలుతుంది. ఆమారక నిష్పత్తిని నిర్ణయించే అంశం అందులోనూ ఇందులోనూ అంతర్గతంగా ఉందని తెలుస్తుంది".-

లోతు పరిశీలనలో అందరికీ అనుభవం లోవున్న రెండు వాస్తవాలని చెబుతాడు. మొదటి వాస్తవం:ఒక క్వార్టర్ గోధుమ ఒక పౌను ఇనుముతోనే కాదు ఇతర సరుకులతోకూడా భిన్నపరిమాణాలలో మారుతుంది. అంటే, గోధుమలకి ఒకటికాదు, ఎన్నో మారకం విలువలు ఉన్నాయి.ఆసరుకులలో ప్రతిదీ ఒక పావుటన్ను గోధుమల మారకం విలువకి ప్రతినిధిగా ఉన్నది. మారకంవిలువలుగా అవి ఒకదాని స్థానాన్ని మరొకటి ఆక్రమించగలవు. దానర్థం అవి ఒకదానితో మరొకటి సమానం అని.

1 కిలో కాఫీ పొడి = 3 కిలోల నూనె

= 10 కిలోల బియ్యం

= 1 రీము తెల్లకాగితాలు

=20 బాల్ పెన్నులు

ఇక్కడ కాఫిపోడికి ఉన్నది ఒక మారకం విలువ కాదు. నాలుగు. ఇంకా ఎన్నైనా ఉండ వచ్చు అంటే, నిష్పత్తులేపైనా కావచ్చు గాని, ఒకసరుక్కి అనేక మారకం విలువలు ఉంటాయి. అవన్నీ కాఫీపోడి మారకం విలువకి ప్రతినిధులుగా ఉంటాయి . దీన్నిబట్టి ఒకదానికొకటి సమానమై తీరాలి.

దీన్నించి తన సిద్ధాంతానికి అతి ముఖ్యమైన రెండు నిర్ధారణలు రాబడతాడు:

1) మొదటి విషయం, ఒక సరుకు యొక్క చెల్లుబాటయ్యే మారకం విలువలు 'ఏదో' సమానమైన దాన్ని వ్యక్తం చేస్తాయి.

2) రెండో విషయం, మారకం విలువ అనేది దానిలోనే వుండి, దానినుండి వేరైనదిగా గమనించదగ్గ 'దాని' వ్యక్తీకరణ పద్ధతి, దృగ్గోచర రూపం.

ఒక ప్రత్యేకసరుకు మారకం విలువలు ఏదో సమానమైన దాన్ని వ్యక్తం చేస్తాయి. రెండు, మారకం విలువ అనేది దానినించి వేరైనదానిగా గమనించడానికి వీలున్న సారానికి కనబడే రూపం , వ్యక్తీకరించే పద్ధతే తప్ప మరేమీ కాదు.

దీన్నిబట్టి తేలిందేమంటే ఏ రెండు సరుకుల మారకనిష్పత్తి అయినా స్థిరంగా ఉండదు. ఒకప్పుడున్నట్లు మరొకప్పుడు ఉండదు. ఒకచోట ఉన్నట్లు మరొకచోట ఉండదు. ఆవిధంగా మారకం విలువ ఏదో యాదృచ్ఛికమైనదిగానూ, కేవలం సాపేక్షమైనదిగాను (రెండు సరుకుల పోలికలో వచ్చేదిగానూ) కన్పిస్తుంది. కాండి

లాక్ అన్నట్లు అది "మనకోర్కేలతో సరుకుల యొక్క సంబంధంగా మాత్రమే ఉండేదిగా " కనిపిస్తుంది. అలా అయితే, ఆనిష్పత్తిని నిర్ణయించే అంశం ఆసరుకుల్లో ఉండ కూడదు. బార్బన్ అన్నట్లు "దేనికి అంతర్గత విలువ ఉండదు " అనాల్సివస్తుంది. అంటే, సరుకులో విడదీయరాని లంకెలో ఉండే మారకంవిలువ స్వయం వైరుధ్యం అనిపిస్తుంది . పైకి అలా కన్పించినా ,పరిశీలిస్తే విషయం వేరుగా ఉంటుంది. పై అభిప్రాయాన్ని తిరస్కరించాల్సి వస్తుంది మారకం విలువ యాదృచ్చికమైనది కాదనీ, ఒక లెక్కప్రకారం ఉంటుందనీ తేలుతుంది.రెండు సరుకుల పోలికలో వచ్చేది కాదనీ , పోలికలోబయటపడేదనీ తెలుస్తుంది. ఆమారక నిష్పత్తిని నిర్ణయించే అంశం నిష్పత్తిని నిర్ణయించే అంశం అందులోనూ ఇందులోనూ (పోల్చిన రెండు సరుకుల్లోనూ )ఉందని తేలుతుంది. ఇందుకు మార్క్స్ చేసిన వాదన.

ఈమారక నిష్పత్తులు తరచుగా మారుతూ ఉండడం వల్ల,మారకం విలువ అమ్మేవాని, కొనేవాని ఇష్టాయిష్టాల(కాపిటల్1rice) పైన ఆధారపడి ఉన్నట్లు అనిపిస్తుంది. ఫలితంగా, సరుకుల్లో అంతర్గతంగా ఇమిడి వున్న మారకం విలువ అసాధ్యం అనీ, అది వైరుధ్యం అనీ అనిపిస్తుంది.కాని శ్రద్ధగా పరిశీలిస్తే, ఈవాదన ఒప్పుకోదగింది కాదని తేలుతుంది.వైరుధ్యమేమీ లేదని తన తర్కంతో తెలుస్తాడు:

ఒకసరుకు మారకం విలువని మిగిలిన అన్నిసరుకుల భిన్న పరిమాణాల్లో చెప్పవచ్చు.కనక మిగిలిన సరుకులు కూడా ఆయాపరిమాణాల్లో ఒకదానికొకటి సమానం.ఒకదానిస్థానంలో మరొకదాన్ని పెట్టవచ్చు.

దీన్నించి రెండు నిర్ధారణలు రాబడతాడు:

ఒకటి-అమలయ్యే (valid)ఒకప్రత్యేక (given) సరుకు మారకం విలువలు 'ఏదో' సమానమైనదానిని వ్యక్తం చేస్తాయి.

రెండు- మారకం విలువ దానిలోనే వున్న, దానినుండి వేరుగా గమనించి దగిన 'దాని' వ్యక్తీకరణ పద్ధతి,దృగ్విషయ రూపం మాత్రమే.అలా దాని లోనే ఉండి, దానినుండి వేరుగా గమనించ దగ్గదాన్ని విలువ అంటాడు. ఆవిధంగా మారకపువిలువ వెనక ఉన్న విలువని పట్టుకుంటాడు. విలువ అనేది మరొక భావాభివర్గం.

దీన్నిబట్టి, మారకం విలువ వేరు, విలువ వేరు.

విలువ మారకపువిలువ ఒకటి కాదు.

" శ్రమ వుత్పాదితం ఏ సామాజిక రూపంలో కనబడుతుందో ఆరూపంలో దాన్ని విశ్లేషించాను. ఒకవైపున అది తన సహజరూపంలో ఉపయోగకరమయిన వస్తువు. మరోవైపు, మారకపు విలువకు bearer.ఈదృష్ట్యా, దానికదే మారకపు విలువ. మారకపువిలువ గురించిన తదుపరి విశ్లేషణలో మారకపు విలువ కేవలం 'అగపడే రూపం' , సరుకులోవున్న విలువని తెలిపే స్వతంత్ర మార్గం అని తేలింది.అప్పుడు నేను విలువవిశ్లేషణకు బయలుదేరాను.అందువల్ల నేను కాపిటల్ రెండోముద్రణ 36 పజీలో(ఇది 'ప్రోగ్రెస్ పబ్లిషర్స్ కాపిటల్.1 లో 66వ పేజీలో ఉంటుంది.) బాహాటంగా ప్రకటించాను: ఈచాప్టర్ మొదట్లో వాడుక మాటల్లో( common parlance) సరుకు ఒక వుపయోగపు విలువా లేక ప్రయోజనకర వస్తువూ, ఒక మారకంవిలువా అన్నప్పుడు, నిక్కచ్చిగా చెప్పాల్సొస్తే మేము తప్పు. సరుకు ఒక వుపయోగపు విలువా లేక ప్రయోజనకర వస్తువూ, ఒక విలువా.దాని విలువ దాని సొంత రూపానికి భిన్నంగా స్వతంత్రమయిన అగపడే రూపాన్ని - మారకపు విలువ రూపాన్ని పొందుతుందో -అప్పుడది ద్వంద వస్తువుగా తన్నుతాను బయటపెట్టుకుంటుందీ వగయిరా"- మార్జినల్ నోట్స్ ఆన్ వాగ్నర్- మార్క్స్ ఎంగెల్స్ కలెక్టెడ్ వర్క్స్ 24 వ సంపుటం, పేజీ 544-545

"సరుకు ఒకవైపు వుపయోగపు విలువ, మరొకవైపు విలువ- మారకపువిలువ కాదు. ఎందుకంటే కనబడేరూపం దాని సొంత సారం కాదు గనక "-మార్జినల్ నోట్స్ ఆన్ వాగ్నర్స్ ... - మార్క్స్ ఎంగెల్స్ కలెక్టెడ్ వర్క్స్ 24 వ సంపుటం పేజీ 545

"నాదృష్టిలో, సరుకు విలువ దాని వుపయోగపు విలువాకాదు, మారకపు విలువా కాదు." మార్జినల్ నోట్స్ ఆన్ వాగ్న ర్స్.... మార్క్స్ ఎంగెల్స్ కలెక్టెడ్ వర్క్స్ 24పేజీ **545**

"మారకం విలువ దానినుండి విడిగా గమనించదగ్గ సారం యొక్క వ్యక్తీకరణ పద్ధతి,అగపడే రూపం మినహా మరేమీకాదు"- కాపిటల్1 (పెంగ్విన్) .127

దేని ఆధారంగా సరుకులు వేర్వేరు పరిమాణాల్లో సమం చేయబడతాయో అదే విలువ.

ఆవిధంగా విలువనీ, మారకం విలువనీ భిన్నమైనవిగా స్పష్టపరుస్తాడు.

ఇవి మార్క్స్ విలువ సిద్ధాంతానికి అత్యంత ప్రధానమైనవి. విలువ పాయింట్ ఆఫ్ డిపార్చర్. స్టేట్ మెంట్ ఆఫ్ ఎగ్జిస్టెన్స్ థీరం. అంతకు ముందు ఆర్థిక వేత్తలకు విలువకూ విలువరూపానికీ తేడా తెలియదు. ఈతేడాని గ్రహించి మార్క్స్ ముందుకు పోతాడు.

రెండు సరుకులు ఎప్పుడు మారకం అవుతాయి? ఉపయోగపు విలువలు భిన్నమైనవైనప్పుడు. టార్చ్ లైట్ టార్చ్ లైట్ తో మారకం కాదు.బియ్యం బియ్యంతో మారవు.మరే ఇతర వస్తువులతోనయినా మారతాయి.అంటే మారకంలో ప్రవేశించే వస్తువులు భిన్నమైనవై ఉండాలన్నమాట. ఇది మొదటివిషయం.మారకం అయ్యే రెండు వస్తువులూ సమానం కావడం తప్పనిసరి. ఆరిస్టాటిల్ అన్నట్లు: "సమానత్వం లేనిదే మారకం జరగదు.ఒకే ప్రమాణంతో కొలవబడనిదే సమానత్వం సాధ్యం కాదు."

రెండుసరుకులు సమానమైనవని తేల్చాలంటే, వాటిని రెంటినీ ఒకే ప్రమాణంతో కొలవడం కుదరాలి.వాటి మారకపు విలువల్లో వ్యక్తమయ్యేది అదే.అలా కొలవడం కుదురుతుందని. మార్క్స్ మాటల్లో: "ఒకే యూనిట్ వ్యక్తీకరణలుగా మాత్రమే అవి ఒకే రకం అయినవి.అందుచేత ఒకే ప్రమాణంతో కొలవబడానికి వీలైనవై వుంటాయి." - కాపిటల్1.56

సరుకులన్నిటిలోనూ ఉండి ఒకే ప్రమాణంతో కొలవడానికి వీలయిన ఆసారం ఏమిటో తేల్చాలి. “సరుకులు మారకం అయినప్పుడల్లా, సరుకుల మారకం విలువలో బయటపడే ఆ ఉమ్మడిసారమే వాటి విలువ"-మార్జినల్ నోట్స్ .మారకంలో బయట పడుతుంది అంటే మారకానికి ముందే సరుకులో విలువ ఉండాలి. ఉంటేనే గదా బయటబడేది?

“ముందుముందు మన పరిశోధన సరుకుల విలువ వ్యక్తమయ్యే ఏకైకరూపంగా మారకపువిలువను తెస్తుంది. ప్రస్తుతానికి విలువస్వభావాన్ని దానికి(విలువరూపానికి-నాది) స్వతంత్రంగా, అంటే,దాని రూపంతో సంబంధం లేకుండా పరిశీలించాల్సి ఉంది"- నోట్స్ ఆన్ వాగ్నర్- మార్క్స్ ఎంగెల్స్ కలెక్టెడ్ వర్క్స్ 24 వ సంపుటం పేజీ 534

ఒకలీటర్ తేనే=2 కిలోల బియ్యం అనేదొక మారకసంబంధం. ఈ రెండు సరుకులు సమానమని అర్థం.

అలా ఏ రెండు సరుకులయినా సమానం కావాలంటే, అ రెండు సరుకుల్లో ఏదో ‘ఉమ్మడి అంశం’ ఉండితీరాలి. సరుకుల్లో అంతర్గతంగావుండి, వాటి మారకాన్ని పాలించే ‘ఉమ్మడి అంశం’ ఏకైక సారం ఉంది.

ఆఉమ్మడి అంశాన్నే మార్క్స్ విలువ అన్నాడు.

ఆ విధంగా తన విశ్లేషణలో మారకంవిలువ వెనక దాగివున్న విలువని పట్టుకున్నాడు. ఇక విలువ సారం గురించీ, విలువ పరిమాణం గురించీ చెబుతాడు.

# విలువ సారమూ - విలువ పరిమాణమూ

ఇప్పటికి తెలిసిన విషయాలు:

మార్క్స్ కాపిటల్ లో పరిశీలించింది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని. ఇందులో సంపద సరుకుల కూడికగా ఉంటుంది. కనుక సంపదకి 'మూలప్రమాణం' (unit) ఒక విడి సరుకే. సరుకు అనేదే 'ఆర్థిక కణరూపం'.

సరుకు విశ్లేషణలో తేలిన విషయాలు.

"సరుకు ఉపయోగపు విలువా...విలువా కూడా" కాపిటల్1.66

సరుకుకి ఉపయోగపు విలువ వుంటుంది. అది లేనిదే సరుకు కాలేదు.

ఒక వస్తువు ఉత్పత్తికి పట్టిన శ్రమ పరిమాణానికీ, దాని ప్రయోజనానికీ సంబంధం ఉండదు.

అలాగే, అది ఉత్పత్తయిన వ్యవస్థకీ, దాని ప్రయోజనానికీ సంబంధం ఉండదు.

ఉపయోగపువిలువ అత్యంత భిన్నమైన ఉత్పత్తి విధానలకూ ఉమ్మడి అంశం.

ప్రయోజనకరవస్తువులు పెట్టుబడిదారీ వ్యవస్థలో మారకం విలువకు వాహకాలుగా కూడా ఉంటాయి

అంటే సరుకైన వస్తువుకి ఉపయోగపువిలువ రూపంతో పాటు విలువ రూపం కూడా ఉంటుంది.

విలువరూపం అన్నా మారకం విలువ అన్నా ఒకటే.

**అయితే, విలువా మారకపువిలువా ఒకటి కాదు.** మారకం విలువ వేరు, విలువ వేరు. విలువ అనేది 'సారం', మారకం విలువ దాని 'రూపం'

**అందుకే మార్క్స్ స్పష్టంగా తేల్చి చెప్పాడు: "సరుకు ఒకవైపు వుపయోగపు విలువ, మరొకవైపు విలువ- మారకపువిలువ కాదు. ఎందుకంటే కనబడేరూపం దాని సొంత సారం కాదు గనక "-**మార్జినల్ నోట్స్ ఆన్ వాగ్నర్స్ ... - మార్క్స్ ఎంగెల్స్ కలెక్టెడ్ వర్క్స్ 24 వ సంపుటం పేజీ 545

ఆవిధంగా, మారకం విలువ అనేది విలువ (యొక్క) రూపం. ఆరూపం వెనక దాగివున్న విలువని పట్టుకున్నాడు. ఇక విలువ సారం గురించీ, విలువ పరిమాణం గురించీ చెబుతాడు.

***********

విలువ సారం అయిన అంశం ఏమిటి?

ఆ అంశం సరుకు ఉపయోగపువిలువా? కాదు.

ప్రయోజనం లేని ఏ వస్తువూ మారకం కాదు. కనక సరుకు కాజాలదు. నిజమే. అలాగని, సరుకు విలువసారం సరుకు ప్రయోజనం ఎంత మాత్రమూ కాదు. ఆ సారం అన్నీ సరుకుల్లో ఉండే అంశం అయివుండాలి. ఒకేరకమైనదై తీరాలి.అలాంటి అంశం మాత్రమే విలువ సారం కాగలుగుతుంది.

ఉపయోగపు విలువ అలాంటిదా? కాదు. అన్నిసరుకుల ఉపయోగపు విలువలు ఒకటికాదు.

ఏ వస్తువు ప్రయోజనం దానిదే.పలుగు ప్రయోజనం పలుగుదే, పార ప్రయోజనం పారదే. బల్లకట్టు కావలసిన చోట ఓడతో పనిజరగదు. కనుక ఉపయోగపు విలువ విలువ సారం కాజాలదు.

ఇక పరిశీలన నించి ఉపయోగపు విలువని తప్పించి మిగిలిన దానిలో విలువ సారాన్ని వెదకాలి.అదే మార్క్స్ చేస్తాడు.

సరుకుల మారకం ఉపయోగపువిలువల్ని పూర్తిగా పక్కనబెట్టే, (ఏమాత్రం లెక్కలోకి తీసుకోని) చర్య.- కాపిటల్11.45

ఒక మారక చర్యని చూస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది.

1 కిలో రొయ్యలు= 1 బెల్లు

రొయ్యల ప్రయోజనం వేరు, బెల్లు ప్రయోజనం వేరు. కనకనే మారకం అవుతాయి.

విలువసారం ఉపయోగపు విలువ కాదు.

ఒకేరకం ఉపయోగపు విలువలు మారకం కావు.

రొయ్యలు రొయ్యలతో మారవు.బెల్టులు బెల్టులతో మారకం కావు. ఏదైనాయిచ్చి అలాంటి దాన్నే తిరిగి తీసుకంటే ఆలావాదేవీకి అర్థం ఉండదు.రొయ్యలిచ్చి బెల్టులు తీసుకోవచ్చు.ఆ మారక చర్య అది అర్థవంత మైనదే. దేని ప్రయోజనం దానిదే గనక.

ఎన్నిరొయ్యలకి ఎన్ని బెల్టులు వస్తాయి? కిలో రొయ్యలకి 1 బెల్టు అనుకుందాం. ఈ మారక నిష్పత్తి దేన్నిబట్టి నిర్ణయమవుతుంది? ఉపయోగపువిలువను బట్టా?

అలా అయినట్లయితే, ఎక్కువ ఉపయోగపు విలువ ఉన్న సరుకుకి ఎక్కువ విలువా, తక్కువ ఉపయోగపు విలువ ఉన్న సరుకుకి తక్కువ విలువా ఉండాలి. అయితే వాస్తవం అలాలేదు.

ఎంతో ఉపయోగపు విలువ వుండి విలువలేని వస్తువులు ఉన్నాయి. ఒకవేళ ఉన్నా అతికొద్ది విలువ మాత్రమే ఉన్న వస్తువులు చాలా ఉన్నాయి. ఇందుకు భిన్నంగా ఉపయోగపువిలువ లేని, ఉన్న అతికొద్ది ఉపయోగపువిలువ మాత్రమే వుండి, ఎంతో విలువ వున్న వస్తువులు కూడా ఉన్నాయి.

ఒకరోజు ఆహారం లేకపోతే మనిషి నీరసపడతాడు.చాలా ఉపయోగం గలది. స్మార్ట్ ఫోను అంతటి ప్రయోజనం ఉన్నది కాదు. అయినా దానికి బదులు కొన్ని నెలలకి సరిపడే ఆహారం వస్తుంది. ఏ సరుక్కి ఇంకో సరుకు ఎంత వస్తుందో దాన్ని నిర్ణయించేది ఉపయోగపు విలువ కాదు.

కనక ఉపయోగపు విలువ విలువ సారం కాదు. సరుకుల మారకం ఉపయోగపువిలువల్ని పూర్తిగా పక్కనబెట్టే, (ఎమాత్రం లెక్కలోకి తీసుకోని) చర్య.- కాపిటల్11.45

******

అది అదీ ఇదీ కానిమూడోది

రెండుసరుకుల మారకం ఏనిష్పత్తిలో జరిగినా దాన్ని ఒక సమీకరణ వ్యక్తం చేస్తుంది.

ఉదాహరణకి, 1కిలో గోధుమలు = 2 కిలోల ఇనుం

ఈసమీకరణ మనకి ఏమి చెబుతుంది? అని ప్రశ్నిస్తాడు. తానే సమాధానం చెబుతాడు.

రెండు భిన్న వస్తువుల్లో -1కిలో గోధుమల్లోనూ 2 కిలోల ఇనుం లోనూ- ఒకే సారం ఉన్నదని. ఆసారం ఒకే పరిమాణంలో ఉన్నదని.

ఈ రెండు వస్తువుల్లో ఏదో అంశం (సారం) ఉంది.అది గోధుమా కాదు, ఇనుమూకాదు.మరొకటి. అందులోనూ ఉంది ఇందులోనూ ఉంది. కాని అదీ ఇదీ కానిమూడోది.ఈ రెండు వస్తువులూ ఆమూడో ఉమ్మడి అంశానికి

సమానమై ఉండాలి.ఆ ఉమ్మడి అంశం గోధుమాకాదు, ఇనుమూ కాదు. ఆరెంటిలో అదీ, ఇదీ ,మారకపు విలువ అయినమేరకు ఆమూడో ఉమ్మడి అంశానికి దించడానికి కుదరాలి.

ఈ ఆలోచనని మార్క్స్ ఇలా రూపొందిస్తాడు.

" రెంటిలో ప్రతి ఒకటీ మూడోదానికి మార్చబడాలి" ఈరెండు వస్తువుల్లో ఒకే సారం వున్నది. అది వేర్వేరు వస్తువుల్లో వేర్వేరు పరిమాణాల్లో ఉంటుంది. అన్ని సరుకుల్లోనూ అంతే. కనక అన్ని సరుకులూ భిన్న పరిమాణాల్లో ఒకే సారాన్ని, ఒకే పరిమాణంలో కలిగి ఉంటాయి. కనక సమపరచవచ్చు.

10 కిలోల గోధుమలు = 6 లీటర్ల పాలు

=30 పెట్టెల గుండుసూదులు

= 7 సబ్బులు

=6 కిలోల చక్కెర

ఆసారం 10 కిలోల గోధుమల్లో ఎంత ఉందో 6 లీటర్ల పాలలో అంతే వుంది, 30పెట్టల గుండుసూదుల్లోనూ, 7 సబ్బుల్లోనూ, 6 కిలోల చక్కెరలోనూ అంతే ఉంది అని అర్థం. ఒకేసారం, ఒకే పరిమాణంలో ఉన్నందువల్ల ఇవి 5 వస్తువులూ ఆసారం రీత్యా సమానం.

ఏసరుకుసైనా మూడోదైన ఉమ్మడి సారానికి మార్చవచ్చు. సరుకుల మారకం విలువలు ఈసారం ద్వారా వ్యక్తం అవుతాయి.ఇదే సారం అన్ని సరుకుల్లో ఉంటుంది. పరిమాణాల్లో తేడాలు - ఎక్కువ తక్కువలు – ఉంటాయి.

మారక సంబంధాల్లో ఈసారం ఒక్కటే లెక్కకొస్తుంది. దాని పరిమాణమే సరుకులు మారే పాళ్ళని నిర్ణయిస్తుంది. మరే ఇతర అంశమూ లెక్కకి రాదు. కనక ఈసారం ఏదో కనిపెట్టడం తప్పనిసరి.

శ్రమ ఎన్నో రకాలుగా ఉంటుంది. దేనికదే.మరి ఇన్నింటిలో ఏశ్రమని కొలమానంగా తీసుకోవాలి? దేనిపైఖరి దానిదే కాబట్టి అన్నిటిలో ఉమ్మడిగా ఉన్నదేదో తేల్చాలి.అన్నిటిలోనూ పైఖరులను వదలివేస్తే,శరీరావయవాల కదలికలు అన్నిట్లోనూ ఉంటాయి.ఇదే అన్ని శ్రమల్లోనూ ఉమ్మడిగా ఉండే అంశం.

పంచదార పలుకుల్లాగా.ఒకే సారం తో ఏర్పడిన గుళికల్లాంటివి. మారకం విలువ మొదట ఒక పరిమాణాత్మక సంబంధంగా కనిపిస్తుంది. అంటే, ఉపయోగపువిలువలు ఏనిష్పత్తిలో మారతాయో ఆనిష్పత్తిగా. ఈ సంబంధంలో అవి సమానమైన పరిమాణాలు. మారకం కాగలవి. Propertius రాసిన ఒక స్మృతిగీతాల పుస్తకం 8 ఔన్సుల నశ్యంతో మారకం కావచ్చు, అవి రెండూ భౌతికంగా పోలికలేని ఉపయోగపు విలువలు అయినప్పటికీ. మారకం విలువగా చూస్తే ఒకటి ఎంతో రెండోదీ అంతే, రెండూ తగిన పరిమాణాల్లో ఉంటే.

ఉదాహరణకి పోస్ట్ కార్డూ, ఉత్తరం రాసే బాల్ పెన్నూ పోలిక లేనివి.కాని 10 కార్డులకి ఒక బాల్ పెన్ వస్తుంది.5 కార్డులకి రాదు.మారకానికి తగిన **నిష్పత్తిలో** పరిమాణాలు ఉండాలి.మారకానికి సరిపడే పరిమాణంలో వస్తువులు వుంటే చాలు, ఒకవస్తువు మరొకవస్తువు వంటిదే. ఒక రాజభవనం మారకం విలువని నిర్దిష్ట సంఖ్యలో ఉన్న (5కోట్ల)బూట్ పాలిష్ డబ్బాలలో వ్యక్తపరచవచ్చు.ఒక బంగారం వడ్డాణం విలువని 200 బస్తాల బియ్యంలో వ్యక్తంచెయ్యవచ్చు.

అందువల్ల, ఉపయోగపువిలువలుగా వాటి సహజ రూపంతోనూ, అవి ఉపయోగపు విలువలుగా అవి తీర్చే అవసరాలతోనూ నిమిత్తం లేకుండా ఆ సరుకులు నిర్దిష్ట పరిమాణాల్లో సమానమయినవి. మారకంలో ఒకదాని చోటుని వేరొకటి తీసుకోగలవు. మారక ప్రక్రియలో సమానమైనవిగా పరిగణించబడగలవు. భిన్నమైనవిగా కనబడినప్పటికీ,ఉమ్మడి విభాజకం కలిగి ఉంటాయి.

ఉపయోగపువిలువలు మనుగడ సాధనాలుగా నేరుగా ఉపయోగపడతాయి. మరొకపక్క, ఈసాధనాలు సమాజిక చర్య యొక్క ఉత్పాదితాలు, వ్యయమయిన మానవశ్రమ ఫలితాలు,పాదార్థీకృత శ్రమ.వస్తువులలో చేరిన సామాజికశ్రమగా చూస్తే, అన్ని సరుకులూ ఒకే సారం యొక్క స్పటికాలు. ఈసారం, అంటే,మారకం విలువలో రూపొందిన శ్రమ యొక్క విశిష్ట స్వభావాన్ని ఇప్పుడు పరిశీలించాలి.

ఒక ఔన్స్ బంగారం, ఒక టన్ను ఇనుం,పావు గోధుమ,20 గజాల సిల్కు గుడ్డ- ఇవి ఒకేపరిమాణంగల మారకం విలువలు అనుకుందాం.మారకపువిలువలుగా - వేటిలో అయితే ఉపయోగపువిలువల మధ్య ఉండే గుణాత్మక భేదాలు వదలివేయబడతాయో ఆమారకపు విలువలుగా- అవి ఒకే పరిమాణంలో ఉన్న ఒకే రకం శ్రమకు ప్రతినిధులు.

వాటిలో ఒకేరీతిలో పాదార్థీకృతమైన శ్రమ ఒకేరకమైన సాదా శ్రమ అయితీరాలి.అది(అటువంటిశ్రమ) ఏవస్తువులో రూపొందినా -అది బంగారమైనా,ఇనుమైనా,గోధుమలైనా, సిల్కయినా. ఆక్సిజన్ తుప్పు ఇనుంలో ఉన్నా,వాతావరణంలో ఉన్నా,ద్రాక్ష రసంలో ఉన్నా, మనిషి రక్తంలో ఉన్న ఆక్సిజన్ ఒకటే అయినట్లు.

అయితే బంగారం తియ్యడం, ఇనుం వెలికి తియ్యడం, గోధుమలు పండించడం, సిల్క్ బట్ట నెయ్యడం- వేర్వేరు పనులు-గుణాత్మకంగా భిన్నమైనవి. వాస్తవానికి, ఏదయితే వస్తుగతంగా చూచినప్పుడు ఈ ఉపయోగపువిలువల భిన్నత్వంగా కనబడుతుందో,అదే డైనమికల్లీ చూస్తే వాటిని చేసిన చర్యల వైవిధ్యంగా కనబడుతుంది. మారకం విలువని ఉత్పత్తిచేసే శ్రమకి ఆవస్తువుల తయారీలో వాడే మెటీరియల్ తో నిమిత్తం ల్లేనట్లే,అది ఏప్రత్యేక రూపంలో ఉన్న శ్రమ అనేదానితో నిమిత్తం ఉండదు.పైగా భిన్న ఉపయోగపువిలువలు భిన్న వ్యక్తుల శ్రమ ఉత్పాదితాలు. అందువల్ల వ్యక్తులపరగా భిన్న రకాల శ్రమ ఫలితాలు.అయినా, మారకం విలువలుగా ఏకరీతి (homogeneous)శ్రమకి ప్రతినిధులుగా ఉంటాయి.. అంటే,అది శ్రామికుల వైయక్తిక లక్షణాలు వదలివేసిన శ్రమ.ఆవిధంగా మారకం విలువని సృజించే శ్రమ సాధారణ అనిర్దిష్టశ్రమ (abstract general labour).-critique-20

ఉపయోగపువిలువని పరిశీలననించి తప్పించాలి. అంటే, వాటి భౌతికధర్మాల్నీ, పదార్థాన్నీ వదలివేయాలి. ఇవిపోగా సరుకు 'ఏంగా' మిగులుతుంది? ఒక మంచం రెండు రగ్గులతో మారిందనుకుందాం.ఉపయోగపు విలువల్ని తప్పిస్తే, ఆరెండు వస్తువుల తయారీకి వాడిన కొయ్యనీ, ఉన్నినీ వదిలేసినట్లే. వాటి వేర్వేరు భౌతిక ధర్మాలను పక్కకు నేట్టినట్లే.

మరి మిగిలింది ఏమిటి? మంచాన్ని చేసిన శ్రమా, రగ్గుని చేసిన శ్రమా. అంటే ఆరెంటిలోనూ శ్రమ ఉన్నది.

శ్రమకు ప్రతినిధులుగా, అవి శ్రమ ఉత్పాదితాలుగా మాత్రమే మిగులుతాయి. " శ్రమ ఉత్పాదితం అనేది ఒక వస్తువులో రూపొందిన శ్రమే. పదార్థం రూపంలోకి మారిన శ్రమే. శ్రమ వస్తుత్వం చెందడమే" -collected works vol 3.p 276 . కనక శ్రమే ఆఉమ్మడిసారం. అన్ని సరుకుల్లో ఉన్న అంశం.

శ్రమే విలువ సారం అనే విషయం మార్క్స్ కి ముందున్న ఆర్థికవేత్తలకు –పెట్టీ, స్మిత్, రికార్డోలకు- తెలుసు. వారదే చెప్పారు.

నీరు,వజ్రం-రెంటిని పోల్చాడు స్మిత్. నీటి కంటే ఉపయోగకరమైనది ఏదీ లేదు. అయినా అరుదుగా తప్ప అది దేన్నీ కొనలేదు. దానికి మారకంలో ఎప్పుడో తప్ప ఏదీ రాదు. మరోకవైపు, వజ్రం. దీనికి పెద్ద ఉపయోగపు విలువ లేదు. కాని దానికి మారకంలో భారీగా వస్తువులు లభిస్తాయి. దీన్ని వాటర్ డైమండ్ పారడాక్స్ అంటారు. ఈవిరుద్ధమైన పరిస్థితిని గమనించి శ్రమే విలువ సారం అన్నాడు స్మిత్ : "అన్నీ సరుకుల మారకపు విలువలకు నిజమైన కొలత శ్రమే"

శ్రమ విలువ సారం అన్న విషయం కనుగొన్నది సాంప్రదాయ అర్థ శాస్త్రజ్ఞులే. మార్క్స్ కాదు. మరి మార్క్స్ చేసింది ఏమిటి?

ఇక్కడ ఒక ఆటంకం ఉంది. ఏమంటే, భిన్న సరుకుల్లో రూపొందిన శ్రమల రూపాలు ఒకటి కావు. కుండలు చేసే శ్రమా ,గంపలల్లె శ్రమా ,గుడ్డలు కుట్టేశ్రమా ఒకేరకమైనవి కావు దేనికదే. భిన్నమైనవి. కనుక సరిపోల్చరానివి.

సమస్య ఏమంటే: ఎన్నో రకాల శ్రమలున్నాయి.

ఏరకం శ్రమ విలువని ఏర్పరుస్తుంది?

అప్పటికున్న అర్థశాస్త్రం లో " విలువని సృష్టించే ప్రత్యేక రకం శ్రమ గురించి సరైన పరిశోధన లోపించినట్లు" మార్క్స్ గ్రహించాడు.

శ్రమ అనే మాటలో చాలా భిన్న రూపాలు దాగి ఉన్నాయి అని మనకు తెలుసు. అలాంటప్పుడు, కచ్చితంగా ఏరకం శ్రమ విలువ సారంగా ఉంటుంది?

బట్టలు ఇస్త్రీచేసే శ్రమ వేరు. గులాబీ దండలు గట్టే శ్రమ వేరు.తాడు పేనేశ్రమా,దారం వడికే శ్రమా ఒకటికావు.కాని ఏదైనా శ్రమే.శరీర చలనాలే. అయితే అవయవాలు కదిలే పైఖరులలో తేడాలున్నాయి.

అయితే, భిన్న సరుకుల్లో రూపొందిన శ్రమలేమో ఒకేరకం అయినవి కావు.ఒకేరమైనవి కానివాటిని ఒకే ప్రమాణంతో కొలవలేం. అలాకొలవనిదే సమానత్వం తేల్చడం సాధ్యం కాదు. సమానత్వంలేనిదే మారకం కుదరదు.

ఇన్ని రకాల శ్రమల్లో ఏ తేడా లేని ఆ ఉమ్మడి అంశం ఏమిటి?

ఆ అంశం శ్రమే కాని వేరొకటి కాకూడదు.

కనుక విలువసారంగా ఉన్న ఆ అంశం - అన్ని రకాల శ్రమల్లో ఒకే రకమైనది ఉండాలి. పైగా, అది శ్రమే అయి ఉండాలి. స్మిత్ గానీ రికార్డోగానీ అలాంటి దాని జోలికి పోలేదు. దాని కోసమే మార్క్స్ దేవులాట.

దీన్ని పట్టుకోవడానికి తన విశ్లేషణని మరికొంత లోతుకి తీసుకుపోతాడు. “ఉపయోగపువిలువని ఉపేక్షించటమంటే దాన్ని ఉపయోగపువిలువగా చేసిన దాని పదార్థాన్నీ, ఆకారాన్నీ కూడా అదేసమయంలో ఉపేక్షించినట్లే ”- కాపిటల్1 1. 45

ఉపయోగపు విలువకి సంబంధించిన అన్ని అంశాలనీ పరిశిలననించి తప్పించినట్లే. ఉదాహరణకి, కుండ ప్రయోజనం మట్టి వల్లా, దాని ఆకారం వల్లా చేకూరుతుంది. అదే మట్టిని మరో ఆకారంలో మలిస్తే ముంతో, మూకుడో తయారవుతుంది. కనక మట్టీ, ఆకారం (రూపం) లేకుండా కుండా ఉండదు, కుండ ప్రయోజనమూ ఉండదు. దీన్ని బట్టి తేలిందేమంటే:

అసలాకుండని కుండగా చూడం.అది ఒక పాదార్థిక వస్తువు అనే విషయం మన దృష్టిలో ఉండదు. అసలు సంగతి ఇక్కడే ఉంది. ఎప్పుడైతే కుండని కుండగా చూడమో, దానిలోని శ్రమని కుమ్మరిశ్రమగా చూడం. అలాగే మంచంలోని శ్రమని వడ్రంగి శ్రమగా చూడం.

“శ్రమ ఉత్పాదితం యొక్క ప్రయోజనకర స్వభావం అదృశ్యం కావడమంటే వాటిలో ఇమిడివున్న శ్రమ రకాల ప్రయోజనకర స్వభావం కూడా అదృశ్యం అవుతుంది.”-పెంగ్విన్.128 దాంతో శ్రమ యొక్క భిన్న నిర్దిష్ట రూపాలు అదృశ్యం అయినట్లే. అవి ఇక ఏమాత్రమూ భిన్నమైనవిగా ఉండవు.అన్ని ఒకే రకం శ్రమగా , అనిర్దిష్ట మానవ శ్రమగా మదింపు అయినట్లే.

ఇతర ఆర్థిక వేత్తలు పట్టుకోనిదీ, మార్క్స్ తన విశ్లేషణ ద్వారా కనిపెట్టింది దీన్నే, అనిర్దిష్ట శ్రమనే. “శ్రామికుల వైయక్తిక లక్షణాలు వదలివేసిన శ్రమ.ఆవిధంగా మారకం విలువని సృజించే శ్రమ సాధారణ అనిర్దిష్ట శ్రమ (abstract general labour)-క్రిటిక్ 20

ఇదే మార్క్స్ తనపరి శోధనలో తేల్చి చెప్పిన విషయం.

ఇప్పుడిక ప్రశ్న:ఈమొత్తాల్ని కొలిచేదెలా?

చలనాన్ని కాలంతో కొలిచినట్లే శ్రమని శ్రమకాలంతో కొలవడమే. శ్రమకాలం మామూలు కాలాన్ని కొలిచే యూనిట్ల రీత్యానే(గంటలు, రోజులు,వారాలూ...) కొలవబడుతుంది. అది శ్రమ యొక్క పరిమాణాత్మక అంశం.ఒకేమొత్తం శ్రమకాలం ఇమిడి వుండే భిన్నమైన ఉపయోగపువిలువలు సమానకాలు (ఈక్వివలెంట్స్) మారకం విలువలుగా చూస్తే, అన్ని సరుకులూ నిర్దిష్ట మొత్తాల శ్రమకాలం మాత్రమే.- క్రిటిక్ 30

ఒక బ్రష్ తయారికి 2 గంటలు పట్టి, కొడవలి తయారీకి 4 గంటలు పడితే 2 బ్రష్ లు ఒక కొడవలికి విలువరీత్యా సమానం.

ఇక్కడ మరొక చిక్కు. ఏమంటే అన్నిరకాల శ్రమలు ఒకే కాలంలో ఒకే విలువని ఏర్పరుస్తాయా?

ఒక గంట గుంట తీసే శ్రమా, మెదడు ఆపరేషన్ చేసే డాక్టర్ శ్రమా ఒకే విలువని ఏర్పరుస్తాయా?

గుంట తవ్వే శ్రమకి పెద్దగా శిక్షణ పనిలేదు. కాని డాక్టర్ కావడానికి కొన్ని సంవత్సరాల శిక్షణ అవసరం. చిన్నప్పటి నించే ఎవరైనా గుంటలు తవ్వగలరు. కాని మెదడు ఆపరేషన్ చేసే వైద్యుడికి కనీసం 30 సంవత్సరాల వయసు దాటుతుంది. పైగా ప్రతివైద్యుడూ చెయ్యలేడు. అందుకు మరికొంత ప్రత్యేక శిక్షణ అవసరం. అతనిది నిపుణ శ్రమ. గుంట తీసే శ్రమ సాదా శ్రమ.

## నిపుణ శ్రమ

నిపుణ శ్రమ పరిమాణం సాదాశ్రమపరిమాణానికి ఎన్నోకొన్ని రెట్లుంటుంది.ఉదాహరణకి ఒక గంట కోటుకుట్టే శ్రమ, 3 గంటలు మట్టిమోసే శ్రమకు సమానం కావచ్చు. నెక్లెస్ లో వజ్రాలు పొదిగే శ్రమ కోటుకుట్టే శ్రమకి 5 రెట్లుండవచ్చు. గుండె ఆపరేషన్ చేసే శ్రమ వజ్రాలు పొదిగే శ్రమకి 10 రెట్లుండచ్చు. ఒకగంట సాదాశ్రమ మరిన్ని గంటల సాదాశ్రమకు సమానమవుతుంది.

ఇది సాదాశ్రమ. సగటు వ్యక్తి చెయ్యగల, శిక్షణ పొందగల శ్రమ. ఇసాడా శ్రమ కాలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి మారుతుంటుంది. అయితే ఏ ప్రత్యేక సమాజంలో అయినా స్థిరంగా ఉన్నట్లు కన్పిస్తుంది. గణాంకాల ప్రకారం బూర్జువా సమాజంలో జరిగే శ్రమలో ఎక్కువభాగం సాదా శ్రమే. ఒక వ్యక్తి 6 గంటలు ఇనుం ఉత్పత్తిచేసి, మరో 6 గంటలు బట్ట ఉత్పత్తి చేస్తాడు. మరోకవ్యక్తి కూడా అలాగే పనిచేస్తాడు.అలాకాక ,ఒకరు 12గంటలు ఇనుం ఉత్పత్తిచేసి , మరొకరు 12 గంటలు బట్టని ఉత్పత్తిచేసినా ఒకే శ్రమ కాలాన్ని భిన్న రీతుల్లో వర్తింప చేయ్యడమే.- క్రిటిక్.31

ఒక వ్యవసాయ శ్రామికుడి శ్రమశక్తి సాదాశ్రమ కింద తీసుకుందాం.కుట్టుశ్రమ మరింత అభివృద్ధి చెందిన శ్రమ శక్తిగా అనుకుందాం. వ్యవసాయశ్రామికుడు రోజులో సృజించిన విలువ దర్జీ సృజించే విలువ ఎక్కువ.

ఇక్కడ ఒక సందేహానికి ఆస్కారం ఉంది. పనివాడు ఎంత సోమరి అయితే, ఎంత తక్కువ నిపుణుడు అయితే అంత ఎక్కువ శ్రమ పడుతుంది.అందువల్ల ఆసరుక్కి అంత ఎక్కువ విలువ ఉంటుందా అన్నదే ఆసందేహం.

ఒకేరకం బుట్ట అల్లడానికి ఒకడికి 2 గంటలు పడితే, ఒక సోమరికి 4 గంటలు పట్టిందనీ, సరిగా పనిరానివానికి 6 గంటలు పట్టిందనీ అనుకుందాం. అప్పుడు మొదటివాని బుట్టకు రెండవ వాని బుట్ట రెట్టింపు విలువ ఉంటుందా? మూడవ వాని బుట్ట 3 రెట్ల విలువ కలిగి ఉంటుందా?

ఉండదు.

## సామాజికంగా అవసరమైన శ్రమ

విలువసారాన్ని రూపొందించే శ్రమ సమాన మానవశ్రమ, ఒకే రకమైన మానవశ్రమ శక్తి వ్యయం.సమాజపు మొత్తం శ్రమ శక్తి అన్నీ సరుకుల విలువల్లో ద్యోతకమవుతుంది. అది అసంఖ్యాక వ్యష్టి యూనిట్లతో ఏర్పడ్డా, ఏ తేడా లేని శ్రమ శక్తి రాశిగా లేక్కకొస్తుంది. ఈ యూనిట్లలో ప్రతిది మిగతా వాటి లాటిదే ........

సరుకు విలువ పరిమాణాన్ని నిర్ణయించేది ఆసరుకు ఉత్పత్తికి వాస్తవంగా పట్టిన శ్రమ కాలం కాదు. దాని ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన శ్రమకాలం. అంటే, " అమల్లో వున్న ఉత్పత్తి పరిస్థితుల్లో, ఆకాలంలో ప్రబలంగా వున్నా నైపుణ్య స్థాయితో, తీవ్రతతో ఒక వస్తువును ఉత్పత్తి చెయ్యడానికి అవసరమైన శ్రమ కాలమే సామాజికంగా అవసరమైన శ్రమ కాలం."-కాపిటల్1 .47

ఇంగ్లండ్ లో మరమగ్గాలు (పవర్-లూమ్స్) వచ్చాక, కొంత దారాన్ని బట్ట నెయ్యడానికి అంతకు ముందు పట్టే శ్రమ కాలం సగానికి తగ్గింది. అయితే, చేతి మగ్గాలమీద నేసే వాళ్ళకి మాత్రం అంతకు ముందెంత కాలం పట్టిందో, అంటే పట్టింది. అందువల్ల, వాళ్ళు గంట నేసిన బట్ట అరగంట సామాజిక శ్రమకి మాత్రమే ప్రతినిధిగా వుంది. ఫలితంగా దాని విలువ సగానికి పడిపోయింది. దీన్నిబట్టి చూస్తే, ఏ వస్తువు విలువ

పరిమాణాన్నయినా నిర్ణయించేది సామాజికంగా అవసరమైన శ్రమ మొత్తమే.దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలమే.ఈ విషయాన్ని ఒక అజ్ఞాత రచయిత చెప్పినట్లు మార్క్స్ ఫుట్ నోట్ లో చెప్పాడు.- కాపిటల్1 .47

తేలిందేమంటే, ఏ సరుకు విలువ పరిమాణాన్నయినా నిర్ణయించేది ఆవస్తువులో రూపొందిన సామాజికంగా అవసరమైన శ్రమ కాలమే. ఈ సందర్భంలో ఒకే రకం సరుకుల్లో ప్రతిదానినీ (ప్రతి విడి సరుకునీ) ఆ తరగతి(ఆరకం అన్ని సరుకుల ) సగటు మాదిరిగా/ నమూనా గా పరిగణించ వలసి వుంటుంది.

అందువల్ల ఏ సరుకుల్లో అయితే సమాన మొత్తాల శ్రమ రూపొంది వుంటుందో, ఆ సరుకుల విలువలు సమానం. మరో మాటల్లో,ఒకే కాలంలో ఉత్పత్తయ్యే సరుకుల విలువలు సమానం.

ఈ విషయం 'వేతనం-ధర –లాభం' అనే ప్రసంగ వ్యాసంలో వివరంగా ఉంటుంది:

" ఇంగ్లండ్ లో మరమగ్గం చేతి మగ్గంతో పోటీ పడినప్పుడు, ఒక నిర్ణీత మొత్తపు దారాన్ని ఒక గజం గుడ్డగా నేయ్యడానికి అంతకు ముందు పట్టిన శ్రమ కాలంలో సగం మాత్రమే అవసరమయింది. ఇంతకు ముందు రోజుకు తొమ్మిది పది గంటలు మాత్రమే పనిచేస్తూ వుండిన చేనేతకార్మికుడు పాపమిప్పుడు పదిహేడు పద్దెనిమిది గంటలు పనిచెయ్యాల్సి వచ్చింది. అయినాకూడా అతని 20 గంటల శ్రమ యొక్క ఉత్పాదితం యిప్పుడు, కేవలం 10సామాజిక శ్రమ గంటలను, లేక ఒక నిర్దిష్ట పరిమాణపు దారాన్ని జౌళి వస్తువులుగా మార్చడానికి సామాజికంగా అవసరమైన 10 గంటల శ్రమకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నది. అందుచేత అతనిప్పుడు 20 గంటల్లో చేసిన ఉత్పాదితానికి అంతకు ముందు 10 గంటల్లో చేసిన ఉత్పాదితానికి వున్నా విలువకన్నా ఎక్కువ వుండదు."- మార్క్స్ ఎంగెల్స్ సంకలిత రచనలు 2 .41

"ఒక సరుకు ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమకాలానికి కి మరొక సరుక్కి అవసరమయ్యే శ్రమకాలం ఎలాగో, ఒక సరుకు విలువ మరొక సరుకు విలువకి అలాగు." – కాపిటల్1 .47

"విలువలుగా, అన్ని సరుకులూ నిర్దిష్ట మొత్తాల్లో గడ్డకట్టిన శ్రమ కాలాలు మాత్రమే"- అంటాడు.

సరుకు విలువ పరిమాణం ఆ సరుకు ఉత్పత్తికి పట్టిన సామాజికంగా అవసరమయ్యే శ్రమ కాలమే – అని తేలింది. దీన్నిబట్టి , ఒకసరుకు ఉత్పత్తికి పట్టే సామాజికంగా అవసరమయ్యే శ్రమకాలం స్థిరంగా మారకుండా ఉంటే, దాని విలువ పరిమాణం కూడా స్థిరంగా వుంటుంది. నిజమే. కాని అది (ఒకసరుకు ఉత్పత్తికి పట్టే సామాజికంగా అవసరమయ్యే శ్రమకాలం) మారకుండా, స్థిరంగా వుండేది కాదు. ఉత్పత్తి పరిస్థితుల్లో మార్పు వచ్చినా, సగటు శ్రమ నైపుణ్యంలో, తీవ్రతలో మార్పులొచ్చినా అవసర శ్రమ కాలం మారుతుంది. ఈ అంశాల్లో ఏందులో మార్పొచ్చినా శ్రమ ఉత్పాదకత మారుతుంది.

"శ్రమ ఉత్పాదకత కాలానికి ఆ కాలంలో ఉత్పత్తయిన వస్తువుల పరిమాణానికి సంబంధం ద్వారా వ్యక్తం అవుతుంది."-పెంగ్విన్

ఒక విషయాన్ని గుర్తుచేసుకోవాలి: ఒకే కాల వ్యవధిలో జరిగిన అదే శ్రమ ఎప్పుడూ ఒకే విలువ మొత్తాన్ని సృజిస్తుంది. కాని ఒకే మొత్తంలో ఉపయోగపువిలువలను సృజించాలని లేదు. ఉత్పత్తయ్యే వస్తువుల పరిమాణం పెరగావచ్చు, తరగా వచ్చు. పరిమాణం పెరిగితే, ఉత్పాదకత పెరిగినట్లు. పరిమాణం తగ్గితే, ఉత్పాదకత తగ్గినట్లు. ఉత్పాదకతలో వచ్చే మార్పులు కొన్ని పరిస్థితుల ను బట్టి వుంటాయి.

ఉదాహరణకి, మామూలు తోపుడుతో ఒకడు గంటలో 2 దర్వాజాల కమ్ముల్ని తోపుడేస్తాడు
అదే గంటలో మరతోపుడుతో అయితే 10 దర్వాజా కమ్ముల్ని తోపుడు పడతాడు.
రెండో సందర్భంలో ఉత్పాదకత పెరిగింది. కాని మొదటి సందర్భంలో 2 కమ్ముల్లో ఎంత శ్రమకాలం ఉందో, రెండో సందర్భంలోని 10 కమ్ముల్లో అంటే శ్రమ కాలం ఉంది.
ఉత్పాదకత పెరిగితే ఎక్కువ ఉపయోగపు విలువలు వస్తాయి. కాని ఎక్కువ విలువ రాదు. అంతే విలువ వస్తుంది. అంటే, అప్పుడు రెండు కమ్ములు సాపు చేయడం వల్ల వాటికి ఎంత విలువ కలిసిందో, ఇప్పుడు పది కమ్ములకీ అంటే విలువ కలుస్తుంది. "ఉత్పాదకతలో మార్పులు విలువకు ప్రతినిదిగావున్న శ్రమ మీద ఏ మాత్రం ప్రభావం చూపదు."-కాపిటల్ (పెంగ్విన్)1 .138
కారణం, గంటలో ఒకే శ్రమ సృజించే విలువ పరిమాణం స్థిరమైనది. "దానికి ఉత్పాదకత హెచ్చు తగ్గులకూ సంబంధం ఉండదు." పై ఉదాహరణలో ఉత్పాదకత 5 రెట్లయింది. కాని మనిషి చేసిన శ్రమ గంటే. తేడా లేదు. కనుక అంతే విలువ ఏర్పడుతుంది.
"ఒకే శ్రమ ఒకే కాలవ్యవధిలో భిన్న పరిమాణాల్లో ఉపయోగపువిలువల్ని ఉత్పత్తి చేస్తుంది. ఉత్పాదకతపెరిగితే ఎక్కువ పరిమాణంలో, తగ్గితే తక్కువ పరిమాణంలో." కాని అంతే విలువని ఏర్పరుస్తుంది.
శ్రమ ఉత్పాదకత కు దోహదపడే కొన్ని పరిస్థితులు:
1.పనివాళ్ళ సగటు నైపుణ్య స్థాయి.
2.సైన్స్ అభివృద్ధీ , దాని సాంకేతిక అన్వయింపూ
3. ఉత్పత్తి ప్రక్రియ నిర్వహణ
4.ఉత్పత్తి సాధనాల విస్తృతీ, సామర్ధ్యమూ
5.ప్రకృతి పరిసరాల్లో ఉండే పరిస్థితులు. కాపిటల్ (పెంగ్విన్)1 . 131
ఉదాహరణకి, అనుకూల వాతావరణంలో 8 బుషెల్స్ గోధుమల్లో వ్యక్తమయిన శ్రమ,అననుకూల వాతావరణంలో4 బుషెల్స్లో వ్యక్తం కావచ్చు.ఒకే పరిమాణమున్న శ్రమ మంచిగనుల్లో మామూలు గనుల్లో కంటేఎక్కువ లోహాల్ని తీస్తుంది.వజ్రాలు భూమ్మీద అరుదుగా దొరుకుతాయి. అందువల్ల వాటిని పట్టుకోడానికి సగటున ఎంతో కాలం పడుతుంది.ఫలితంగా, అవి కొద్ది స్పేస్ లోఎంతో శ్రమకి ప్రాతినిధ్యం వహిస్తాయి-కాపిటల్ 1.47
"శ్రమ యొక్క ఉత్పాదక శక్తులు ఎంతగా ఎక్కువైతే ఒక నిర్దిష్ట శ్రమ కాలంలో ఉత్పదితం అంత ఎక్కువగా తయారవుతుంది. శ్రమ యొక్క ఉత్పాదక శక్తులు తగ్గినకొద్దీ, అదే కాలంలో తయారయ్యే ఉత్పాదితం తగ్గుతుంది. ఉదాహరణకు, జనాభా పెరుగుదల కారణంగా తక్కువ సారవంతమైన భూములు సాగుచేయ్యడం అవసరమైనట్లయితే, అదే మొత్తపు పంట అధికతర శ్రమను వినియోగిమ్సినప్పుడు మాత్రమే లభ్యమవుతుంది. తత్పర్యవసానంగా వ్యావసాయిక పంటల విలువ పెరుగుతుంది. మరోవంక, ఒకనేత కార్మికుడు ఒక పనిదినంలో పూర్వం రాత్నంతో వడక గలిగిన పత్తికి, ఆధునిక ఉత్పత్తి సాధనాలతో యిప్పుడు కొన్ని వేల రెట్లు ఎక్కువ పత్తిని అదే ఒక్క పనిదినంలో నూలుగా మార్చగలుగుతున్నాడంటే, దీన్నిబట్టి ఒక్క

విషయం స్పష్టపడుతున్నది: ప్రతి ఒక్క పౌను పత్తీ ఇప్పుడు ఇంతకుముందు కన్నా అనేక వేల రెట్లు తక్కువ వడికే శ్రమను గ్రహిస్తోందన్న మాట, మరి తత్పర్యవసానంగా ప్రతి ఒక్కపౌను పత్తికి జోడింపబడుతున్న విలువ యింతకు ముందు కన్నా అనేక వేల రెట్లు తగ్గుతున్నదన్నమాట. నులు విలువ తదనుగుణంగా పడిపోతుంది. " మార్క్స్ ఎంగెల్స్ సంకలిత రచనలు 2 .42

కాపిటల్ నించి మరికొన్ని ఉదాహరణలు:

"1793 లో విట్నీ కాటన్ జిన్ కనుక్కున్నాడు. అంతకు ముందు ఒక పనివాడు రోజుకి ఒక పౌను పట్టి నించి విత్తనాలు వేరుచెయ్యగలిగే వాడు. జిన్ తో ఒక రోజుకి 100 పౌన్ల పత్తిని శుభ్రపరచ గలిగాడు." కాపిటల్ 1.369

"450 మూల్ కదుర్లతో పని చెయ్యడానికి ఇద్దరే పనివాళ్ళు సరిపోతారు. 366 పౌన్ల దూదిని దారంగా మార్చడానికి 150 పనిగంటలు పడుతుంది. అదే రాట్నంతో అయితే ఒక పనివాడికి 27000 గంటలు కావలసి వస్తుంది." కాపిటల్ 1.369

శ్రమ విభజనవల్ల పెరిగిన ఉత్పాదకత గమనించి స్మిత్ ముగ్ధుడయ్యాడు:

" సుత్తి వాడే కమ్మరి అంతకుముందు చీలలు చెయ్యకపోయినా రోజుకి 200 లేక 300 చీలలు చేస్తాడు. చీలలు చేసే అలవాటున్నా అదే అతని ఏకైక వృత్తి కాని కమ్మరి మహా అయితే రోజుకి 800 లేక 1000 చేస్తాడు. అయితే నేను 20 ఏళ్ల లోపు పిల్లల్ని చాలా మందిని చూచాను. కష్టపడితే, ఒక్కొక్కరూ రోజుకి 2300 చీలలకు పైగా చెయ్యగలరు."

స్మిత్ దే బాగా తెలిసిన పిన్నుల ఉదాహరణ:

" ఒక పనివాడు రోజంతా కష్టపడితే బహుశా ఒక పిన్ను చేస్తాడేమో! 20 పిన్నులు ఎలాగూ చెయ్య లేడు. ఇప్పుడు ఈ పనిసాగే విధానం ....ఒక మనిషి తీగ తీస్తాడు. మరొకడు ఆతీగని సాపు చేస్తాడు. మూడోవాడు తెగ్గోడతాడు. ఇంకొకడు మొన తేలుస్తాడు. అయిదో వాడు తలపైన నునుపు చేస్తాడు. తల తయారీలో రెండు,మూడు చర్యలు వుంటాయి. పిన్నుల్ని తెల్లగా చెయ్యడం వేరొక చర్య. వాటిని పేపర్లో పెట్టడం మరోకరిపని. ఈ విధంగా పిన్నుల తయారీ 18 చర్యలుగా విడి పోయింది. ....

నేనొక చిన్న పిన్నుల ఫాక్టరీ చూచాను. అక్కడ 10 మంది పనివాళ్ళున్నారు. కొందరు రెండు,మూడు చర్యలు చేసేవారు...వాళ్ళు రోజుకి 48000 పిన్నుల చేస్తారు.అంటే, ఒక్కొక్కరూ 4800 పిన్నులు చేసినట్లు లెక్క." –Wealth of Nations.7

విభిన్న చర్యల విభజన, కలయికల వల్ల 20 పిన్నులు చెయ్యలేని వాళ్ళు 4800 పిన్నులు చేస్తున్నారంటే, ఉత్పాదకత 240 రెట్లకంటే ఎక్కువే పెరిగింది.

ఎవరైనా బొగ్గుని వజ్రాలుగా మార్చగలిగితే, వాటి విలువ ఇటుక విలువ కంటే దిగువకి పడిపోతుంది.

సాధారణంగా:శ్రమ ఉత్పాదకశక్తి పెరిగితే, ఒకవస్తువు తయారీకి పట్టే శ్రమ తగ్గి,దాని విలువ తగ్గుతుంది.అందుకు భిన్నంగా శ్రమ ఉత్పాదకశక్తి తగ్గితే,ఒకవస్తువు తయారీకి పట్టే శ్రమ పెరిగి, ఆవస్తువు విలువ పెరుగుతుంది.

ఒకసరుకు విలువ పరిమాణం ఆసరుకులో ఇమిడివున్న శ్రమ మొత్తానికి అనులోమంగానూ, ఆశ్రమ ఉత్పాదకశక్తికి విలోమంగానూ మారుతుంది- కాపిటల్ 1.48 అంటే శ్రమ ఎంత పెరిగితే విలువ అంత పెరుగుతుంది. ఉత్పాదకత ఎంత పెరిగితే సరుకు విలువ అంత తగ్గుతుంది.

ఇప్పటికి సరుకుల రెండు అంశాలైన ఉపయోగపు విలువ,విలువ ల గురించీ, విలువ సారం, విలువ పరిమాణం గురించీ చెప్పాడు. అంటే, సరుకు ద్వంద్వ స్వభావాన్ని వివరించాడు. ఇక సరుకుల్లో రూపొందిన శ్రమ యొక్క ద్వంద్వ స్వభావాన్ని విశదీకరిస్తాడు.

# విభాగం 2

# సరుకుల్లో రూపొందిన శ్రమ ద్వంద్వ స్వభావం

సరుకుకి ద్వంద్వ స్వభావం ఉంటుంది - అది ఉపయోగపు విలువా, విలువా కూడా. అలాగే సరుకుని తయారుచేసిన శ్రమ కూడా ద్వంద్వ స్వభావం కలదే – అది ఒకవైపు నిర్దిష్టశ్రమా, మరొకవైపు అనిర్దిష్టశ్రమా. ఉపయోగపువిలువలో వ్యక్తమయినప్పుడు అది నిర్దిష్టశ్రమ. విలువలో వ్యక్తమయినప్పుడు అనిర్దిష్టశ్రమ.

శ్రమ ప్రక్రియ సరుకుకున్న రెండు అంశాల్నీ ఏకకాలంలో ఏర్పరుస్తుంది .అది ఒకపక్క సరుకు ఉపయోగపు విలువని ఏర్పరుస్తుంది. మరొకపక్క విలువని ఏర్పరుస్తుంది.ఉపయోగపు విలువల్ని ఏర్పరిచే టప్పుడు శ్రమ కుండే లక్షణాలు వేరు. విలువలో వ్యక్తమయ్యేటప్పుడు శ్రమ కుండే లక్షణాలు వేరు. సరుకుల్లో ఇమిడివున్న శ్రమ ద్వంద్వ స్వభావం అంటే ఇదే.

"శ్రమ విలువలో వ్యక్తం కాగానే, ఉపయోగపు విలువల్ని ఉత్పత్తిచేసే శ్రమని వేరుపరిచే అన్ని లక్షణాలూ అదృశ్యం అవుతాయి"- అంటాడు ఫ్రెంచి కూర్పులో.

దీన్ని గురించి "మొదట చెప్పిందీ, విమర్శనాత్మకంగా పరిశీలించిందీ నేనే"-అని చెప్పుకున్నాడు-కాపిటల్ 1..49 "ఈ పాయింట్ రాజకీయ అర్థశాస్త్రం అర్థం చేసుకోవడానికి ఇరుసు" అని దాని ప్రాధాన్యతని వెల్లడించాడు. అంత కీలక మైనది "కనక వివరాల్లోకి వెళ్ళాలి." అంటాడు. అంటే, లోతుగా పరిశీలించాలి అని.

*********

### ఉపయోగపు విలువను ఏర్పరచే శ్రమ- నిర్దిష్టశ్రమ

రెండు సరుకుల్ని తీసుకుందాం- ఒకకోటు, 10 గజాల బట్ట.

కోటు ఒక ప్రత్యేకమైన కోరికను తీరుస్తుంది. దాని తయారీకి ప్రత్యేక తరహా ఉత్పాదకచర్య అవసరం.ఈచర్యని దాని లక్ష్యమూ , చేసే పద్ధతీ, కావలసిన వస్తువులూ , వాడేసాధనాలూ, దాని ఫలితమూ నిర్ణయిస్తాయి . లక్ష్యం కోటు తయారు చెయ్యడం.కావలసిన వస్తువులు బట్ట, గుండీలు, దారం వగయిరా, చేసేది కుట్టుపని. సాధనాలు కుట్టుమిషన్, కత్తెర, సూది. శ్రమ పదార్థాలమీద, శ్రమ సాధనాలతో కుట్టుపనిచేస్తే కోటు

తయారవుతుంది. అది ఒక ఉపయోగపు విలువ. దాన్ని తయారుచేసే కుట్టుపని ఒక (ప్రత్యేక) రకమైన శ్రమ, ప్రయోజనకర శ్రమ, నిర్దిష్టశ్రమ.

అలాగే దారంతో మగ్గం మీద నేతపనిచేస్తే బట్ట అవుతుంది. నేతపని మరొక రకమైన (ప్రత్యేక) శ్రమ. వేరొక ప్రయోజనకర శ్రమ, నిర్దిష్టశ్రమ. అలాగే ఒక నాగలి చెక్కే శ్రమా,గరిస చేసే శ్రమా,బాణం కట్టే శ్రమా వేర్వేరు రకాల శ్రమలు.ఈ సందర్భంలో శ్రమ ప్రయోజనకర ప్రభావాన్ని మాత్రమే పరిగణిస్తాము.

కోటూ, బట్టా వేర్వేరు ఉపయోగపు విలువలు. గుణాత్మకంగా భిన్నమైనవి. వాటిని తయారు చేసిన శ్రమ రూపాలు కూడా భిన్నమైనవే. ఒకటి కుట్టు శ్రమ, రెండోది నేత శ్రమ. ఏ వస్తువు తయారీ కయినా దానికి సంబంధించిన ప్రత్యేక శ్రమ ఉంటుంది. అంటే, ఎన్ని రకాల ఉపయోగపు విలువలుంటే వాటిని చెయ్యడానికి శ్రమ అన్ని రూపాల్లో ఉండాలి.

భిన్న రూపాల శ్రమ ఉత్పాదితాలు కాకపోతే అవి ఒకదానితో మరొకటి మారకానికి తలపడజాలవు. కోట్లు కోట్లతో మారవు. ఒక ఉపయోగపు విలువ అదే రకం ఉపయోగపు విలువతో మారకం కాదు.

కనుక, సరుకుల ఉత్పత్తికి శ్రమ విభజన తప్పనిసరి.

వ్యవసాయం – పశుపోషణ ముందుగా విడి వడ్డాయి. తర్వాత చేతి వృత్తులు. వాటిలో తిరిగి వడ్రంగం, కమ్మరం, కుండలు చెయ్యడం, గుడ్డలు నెయ్యడం, బట్టలు కుట్టడం, గంపలల్లడం లాంటి ఎన్నో రకాల శ్రమలు దేనికది విడిపోయాయి. విభిన్న (heterogeneous) ప్రయోజనకర శ్రమలు జాతులుగా, ఉపజాతులుగా, శ్రేణులుగా, తరగతులుగా వర్గీకరించబడి ఉంటాయి. అదే సామాజిక శ్రమ విభజన.

ఆపరిస్తితుల్లోసమాజంలోని వ్యక్తులు తమకు కావలసిన వస్తువుల్లో కొన్ని తామే చేసుకున్నా, చాలా వస్తువులు ఇతరులు తయారుచేసినవే అయి ఉంటాయి. పోతే, ఎవరుచేసినవి వారివే. కనక ఒకరు చేసినవి మరొకరికిచ్చి వారుచేసినవి తీసుకోని వాడుకోవడమే మార్గం. అదే మారకం. మారకం అయ్యే ఆ శ్రమ ఉత్పాదితాలే సరుకులు. తమకు కావలసిన వస్తువులన్నీ ఎవరికివారే తయారుచేసుకో గలిగితే, మారకంతో పనివుండదు. కనక అవి శ్రమ ఉత్పాదితాలు అయినంత మాత్రాన సరుకులు కాలేవు.

ఎందుకంటే,ఒకరి ఉత్పాదితం మరొకరి ఉత్పాదితంతో మారకం అయితేనే అది సరుకు.అది తనకు ఉపయోగపు విలువ అయితే, దాన్ని మారకం చేసుకోడు. మారకం చేసుకున్నాడంటేనే, అది తనకు అవసరం లేనట్లు. మరొకరి వస్తువు తీసుకోని దాన్నిస్తాడు. తనేదాన్ని కూడా తయారుచేసుకుంటే మారకం పనిలేదు. కానీ దాన్ని అతను తయారు చెయ్యడం లేదు. ఇద్దరు వేర్వేరు రకాల శ్రమ చేస్తున్నారు. అందుకు కారణం శ్రమ విభజన. అదే లేకపోతే మారకం ఉండదు. సరుకుల ఉత్పత్తికి నేపధ్యం ఉండదు. సరుకుల ఉత్పత్తి ఉండదు. కనుకనే సరుకుల ఉత్పత్తికి శ్రమ విభజన అవసరమైన షరతు.

అయితే, శ్రమ విభజన ఉన్నదంటేనే , సరుకుల ఉత్పత్తి ఉన్నట్లా?

అంటే, శ్రమ విభజన ఉన్న ప్రతి సందర్భంలోనూ ఉత్పాదితాలు సరుకులవుతాయా?

కొన్ని సందర్భాలలో సరుకులు, మరికొన్ని సందర్భాల్లో సరుకులు కావు. శ్రమ విభజన ఉండి, సరుకులు లేని సమాజాలు చరిత్రలో ఉన్నాయి. ఉదాహరణకి,

"ప్రాచీన భారతసమాజంలో, సరుకుల ఉత్పత్తి లేకుండానే, సామాజిక శ్రమ విభజన ఉంది."- కాపిటల్11.49

అనాటి సమాజంలో సభ్యులు తలా ఒక పనిచేసినా, తయారైన వస్తువులన్నీ అందరివీ . ఏఒక్క వ్యక్తి కోసం చేసినవి కావు. ఏ ఒక్కటీ ఏ ఒక్కరిదీ కాదు.ప్రతి ఒక్కటీ ప్రతి ఒక్కడిదీ. అందువల్ల ఒక వస్తువుని వాడుకోవాలంటే, మరొక వస్తువు ఇవ్వాల్సిన పని లేదు. మారకం అవసరం లేదు. కనక అటువంటి సమాజంలో శ్రమ విభజన ఉంటుంది కాని సరుకుల ఉత్పత్తి ఉండదు.

ఇంకా దగ్గరైన ఉదాహరణ: ప్రతి ఫాక్టరీ లోనూ శ్రమ విభజన ఒక పద్ధతి ప్రకారం ఉంటుంది. అయితే ఈ విభజన పనివాళ్ళు వాళ్ళ ఉత్పాదితాల్ని ఒకరితో ఒకరు మారకం వేసుకున్నందువల్ల ఏర్పడింది కాదు.

చొక్కాలు కుట్టే ఫాక్టరీ చూద్దాం. అక్కడ బట్టని ఒకరు కత్తిరిస్తారు. కాలర్ ఒకరు. చేతులు మరొకరు. బాడి మరొకరు. కాజాలు తీసేది మరొకరు, గుండీలు కుట్టేది వేరొకరు. ఒక్కక్క భాగాన్ని ఒక్కొక్కరు చేస్తారు. అన్నిటినీ కలిపి కుట్టేవారు ఇంకొకరు. ఒకరినించి ఒకరికి మారతాయి. అయితే అది మారకం కాదు. వారి శ్రమ కలిసినవే కాని వారివి కావు. వేరేవారివి. కనక వాటిని వారు మారకం చేసుకోలేరు. అవి వారికి సరుకులు కావు.

ఇలాగే మిగిలిన ప్రయోజనకర శ్రమలు కూడా.దేనికి దానికి పనివాడు వుంటాడు. స్మిత్ గుండు సూదుల ఉదాహరణ ఉండనే ఉంది. "పిన్నుల తయారీ 18 చర్యలుగా విడి పోయింది" అని చెప్పాడు.ఒకచర్య చెయ్యగానే, వాటిని మరోక చర్యచేసే పనివాడికి ఇస్తాడు. మరొక చర్య చెయ్యడం కోసం.అంటే. ఇతను అతనికిస్తాడే కాని, అతను ఇతనికి ఏమీ ఇవ్వడు. మారకం లేదు కనక అది సరుకు కాదు.

అందుకే అంటాడు: సరుకుల ఉత్పత్తికి శ్రమవిభజన అవసరం.కాని దానిననుసరించి..... శ్రమ విభజనకి సరుకుల ఉత్పత్తి అవసరం- అనేది రాదు. -కాపిటల్ 1.49

దీన్ని బట్టి సరుకుల ఉత్పత్తికి శ్రమ విభజన ఒక్కటే సరిపోదు.

సరుకుల ఉత్పత్తికి శ్రమ విభజన అవసరం.అది లేనిదే మారకానికి ఆధారం ఏర్పడదు. అయితే అదున్నంత మాత్రాన మారకాలు జరగాలని లేదు.

ఉదాహరణకి ఒక ఉమ్మడి కుటుంబంలో ఇల్లు చిమ్మడం వంట పనులు, పొలం పనులు, పాలు పిండడం ,బట్టలు ఉతకడం సభ్యులే చేస్తారు. తలా ఒకటి చేస్తారు. వాటిని ఆసభ్యులే వాడుకుంటారు . వారిమధ్య మారకం ఉండదు.అవి సరుకులు కావు. ఇతరుల వాడకం కొరకు మారకంద్వారా బదిలీ అయ్యే శ్రమ ఉత్పాదితవస్తువులు మాత్రమే సరుకులు.

ఉమ్మడి కుటుంబంలో శ్రమ విభజన ఉంటుంది. కాని ఉత్పాదితాలు సరుకులు కావు.

వారిపోలంలో పండిన ధాన్యాన్ని ఎవరికన్నా యిచ్చి, కుండలో, బుట్టలో తీసుకుంటే అవి సరుకులు. ఇలా మారకం జరగాలంటే ఆయావస్తువులు వారిపై ఉండాలి. అప్పుడే మారకంలో అవి సరుకులవుతాయి.
శ్రమ ఉత్పాదితాలు ప్రైవేటు వ్యక్తులపై ఉండాలి. అంటే వాటిని మారకంలో పెట్టే హక్కు ఉండాలి. ఈ పరిస్థితి లేనప్పుడు శ్రమ విభజన ఉన్నా సరుకుల ఉత్పత్తి లేనట్లే.
సరుకుల ఉత్పత్తికి

1.శ్రమ విభజన ఉండాలి.
2. ఉత్పాదితాలు ప్రైవేట్ వ్యక్తులకి చెందినవై ఉండాలి.అప్పుడే అవి మారకంలోకి రాగలుగుతాయి.
మార్క్స్ స్పష్టంగా చెబుతాడు:" "ప్రైవేట్ వ్యక్తులకోసం, దేనికది స్వతంత్రంగా నిర్వహించబడే భిన్న రకాల శ్రమ ఫలితంగా తయారయ్యే ఉత్పాదితాలు మాత్రమే ఒకదానికొకటి సరుకులు కాగలవు."-కాపిటల్ 1.49

************

ఇంతదాకా మార్క్స్ సరుకుని ఉపయోగపు విలువగా చూచాడు .ఇక మారకం విలువ గురించి పరిశీలిస్తాడు.
మన ఉదాహరణలో రెండు సరుకులు - ఒకకోటు, 10 గజాల బట్ట.
కోటు విలువ బట్ట విలువకి రెట్టింపు అనుకుందాం. ఇది కేవలం విలువ పరిమాణంలో తేడా మాత్రమే. కోటు విలువ 10 గజాల బట్టకి రెండు రెట్లుంటే, 20 గజాల బట్ట ఒక కోటు విలువకి సమానం కావాలి. మారకం విలువలుగా అవి రెండూ ఒకే సారం ఉన్న వస్తువులు. ఏక రీతి (identical /homogeneous) శ్రమకు వస్తురూపాలు. అయితే, కుట్టుపనీ, నేతపనీ గుణాత్మకంగా వేరు వేరు రకాల శ్రమలు. వాటివాటి ప్రత్యే కతల్ని వదలివేస్తే, ఉత్పత్తి చర్య మానవ శ్రమ శక్తి వ్యయం మాత్రమే. కుట్టుపనీ, నేతపనీ భిన్న శ్రమలే అయినప్పటికీ రెంటి లోనూ మనిషి మెదడూ, నరాలూ, కండరాలూ వ్యయమవుతాయి. అంటే, మానవశ్రమశక్తి ఖర్చవుతుందన్న మాట. ఆరెండూ శ్రమ శ క్తి ఖర్చయ్యే రెండు వేర్వేరు పైఖరులు.అంతే.
ఒకేవ్యక్తి కుట్టుపనీ, నేత పనీ ఒకప్పుడదీ , మరొకప్పుడిదీ చేసిన సమాజాలు ఉన్నాయి. ఆపరిస్తితుల్లో ఈ రెండు రకాల శ్రమలూ ఒకేవ్యక్తి యొక్క శ్రమకి రెండు రూపాలే ,కాని ఇద్దరు వ్యక్తులు చేసే ప్రత్యేకమైన, స్థిరమైన (special and fixed) చర్యలు కావు- ఎలాగంటే, ఒక దర్జీ ఒక రోజు కుట్టే కోటూ, మరొక రోజు కుట్టే లాగూ ఒకే వ్యక్తిచేసే శ్రమ లోని తేడాని మాత్రమే చూపినట్లు.
అదీగాక, పెట్టుబడి దారీ సమాజంలో మానవ శ్రమలో కొంత భాగం, గిరాకిలో వచ్చే మార్పులకి అనుగుణంగా,ఒకసారి కుట్టు శ్రమ రూపంలోనూ,మరోసారి నేత శ్రమలోనూ సరఫరా అవుతుంది.ఇది ఘర్షణతోనే జరిగినా, జరిగి తీరుతుంది.ఇది తెలిసిన విషయమే.
ఒకవ్యక్తి బేల్దారు/సుతారి పని చేస్తాడనుకుందాం. ఆపనికి డిమాండ్ తగ్గితే మరొక పనిలోకి మారతాడు. ఒకే పని ప్రతిరోజూ దొరకకపోతే దొరికిన పని చేస్తాడు. రోజంతా ఒకే పని లేకపోతే రెండుమూడు పనులు చేస్తాడు. ఉదయం ఒకరి పెరట్లో గుంట తీసి మొక్క నాటతాడు. అక్కడనించి మరొకచోట చెట్టు కొడతాడు. వేరేచోట ఇసక

జల్లెడ పడతాడు. ఇంకొకచోట ఇంకోపని చేస్తాడు. ఒకపనినించి మరోకపనికి మారడంలో చోటు మారుతుంది, పనిముట్లు మారతాయి. ఇన్ని రకాల పనులు చెయ్యడం లో ఇబ్బంది ఉంటుంది. ఇబ్బంది పడ్డా ఘర్షణ ఉన్నా,చెయ్యక తప్పని పరిస్థితి. కనక ఇది జరుగుతుంది.అమెరికాలో ఉద్యోగాలు పోయినప్పుడు, కొందరు రోజు అయిదారు పేర్వేరు పనులు చేసినట్లు తెలుస్తుంది.

ఇక ప్రయోజనకర శ్రమ యొక్క ప్రత్యేక రూపాన్ని వదలిపేస్తే, శ్రమ మానవ శ్రమ శక్తి వ్యయం తప్ప మరేమీ కాదు.

కుట్టడం, నెయ్యడం గుణాత్మకంగా భిన్నమైన ఉత్పాదక చర్యలే అయినప్పటికీ, అదయినా ఇదయినా మానవ మెదడు,నరాలు, కండరాలూ ఉత్పత్తిలో ఖర్చవడమే. ఈ అర్థంలో అదీ మానవ శ్రమే, ఇదీ మానవ శ్రమే. అయితే, అవి మానవ శ్రమ శక్తి ఖర్చయ్యే పేర్వేరు పైఖరులు.

అయితే ఈ మార్పులు అన్నింటిలోను శ్రమ శక్తి అలాగే ఉంటుంది. అది బహు పైఖరుల్లో ఖర్చు కావాలంటే, అది ఒకస్థాయికి అభివృద్ధి అయి ఉండాలి.అయితే, సరుకు విలువ మనిషి అనిర్దిష్ట శ్రమలో ప్రాతినిధ్యం వహిస్తుంది. అది సాదా శ్రమ శక్తి వ్యయం. అంటే ప్రత్యేకమైన అభివృద్ధితో నిమిత్తం లేకుండా ప్రతి సాధారణ వ్యక్తి లోనూ సగటున ఉండే శ్రమ శక్తి. సాదా, సగటు శ్రమ స్వభావం పేర్వేరు దేశాల్లో, పేర్వేరు కాలాల్లో తేడాగా ఉండేది వాస్తవమే.కాని ఒక ప్రత్యేక సమాజంలో,ఒక కాలంలో ఇంచుమించు ఒకే స్థాయిలో ఉంటుంది.

### నిపుణ శ్రమ

నైపుణ్యం గల శ్రమ ఎక్కువ సాదాశ్రమ కింద లేక్కకొస్తుంది. ఈ సర్దుబాటు ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. ఒక సరుకు గొప్ప నైపుణ్యం గల శ్రమ వల్ల తయారై ఉండవచ్చు. దాని విలువ సాదాశ్రమతో తయారైన వస్తువు విలువకు కొన్నిరెట్లుగా లెక్కకొస్తుంది. దీన్ని లెక్కించే పద్ధతులు సమాజంలో అలవాటు వల్ల స్థిరపడుతుంటాయి.అయితే మార్క్స్ తేలికగా ఉండడానికి ప్రతి శ్రమనీ సాదా శ్రమగా భావిస్తాడు.''దీంతో మనకి సర్దుబాటు చేసే ఇబ్బంది తొలిగి పోతుంది'' అంటాడు.ఇక శ్రమ లెక్క కొచ్చేది కేవలం శ్రమ శక్తి వ్యయంగా మాత్రమే.

కోటునీ, బట్టనీ విలువలుగా చూస్తున్నప్పుడు, వాటి ఉపయోగపు విలువల్ని తప్పిస్తాం.వాటిని ఉత్పత్తిచేసిన శ్రమ ప్రయోజనకర రూపాల్ని-కుట్టుపని ,నేతపని- కూడా పక్కనబెడతాం.ఇక విలువలుగా కోటూ బట్టా ఏ తేడా లేని శ్రమ కి వస్తు రూపాలు మాత్రమే.

### విలువ పరిమాణం

కోటూ, బట్టా కేవలం విలువలే కాదు. నిర్దిష్ట పరిమాణం వున్న విలువలు. మన ఉదాహరణలో కోటు విలువ 10 గజాల బట్ట విలువకి రెట్టింపు. ఎందువల్ల వాటి విలువల్లో ఈ తేడా ఏర్పడింది? కోటులో ఉన్న శ్రమలో సగం మాత్రమే బట్టలో ఉన్నందువల్ల.

సరుకును ఉపయోగపు విలువగా చూచినప్పుడు శ్రమ గుణాత్మకమైనదిగా పరిగణనలోకి వస్తుంది. మారకం విలువగా చూచినప్పుడు పరిమాణాత్మకమైనదిగా పరిగణించబడుతుంది. అందువల్ల రెండో సందర్భంలో (మారకం విలువగా చూచినప్పుడు) శ్రమను సాదా శ్రమలోకి మార్చాలి.మొదటి సందర్భంలో వచ్చే ప్రశ్న: ఎలాంటి శ్రమ?ఏమి శ్రమ? కుట్టు శ్రమ, నేత శ్రమ వగయిరా.

రెండో సందర్భంలో ఎంత మొత్తం శ్రమ?ఎంతకాలంపాటు చేసిన శ్రమ?

సరుకు విలువ పరిమాణం ఆసరుకులో వున్న శ్రమ పరిమాణాన్ని సూచిస్తుంది.కనుక అన్ని సరుకులూ ఏవో పాళ్ళలో సమానమై తీరాలి.

### ఉత్పాదకత

(ఉత్పాదకత గురించి , 'విలువ సారమూ విలువ పరిమాణమూ' అనే క్రితం పోస్ట్ లో కూడా ఉంది.)

కోటు ఉత్పత్తికి అవసరమైన ప్రయోజనకర శ్రమల ఉత్పాదక శక్తి మారకుండా అలాగే వుంటే, తయారయ్యే కోట్ల మొత్తం విలువ వాటి సంఖ్యతో పాటే పెరుగుతుంది. ఒక కోటు ఒక రోజు శ్రమని సూచిస్తే, రెండు కోట్లు రెండు రోజుల శ్రమని సూచిస్తాయి. అలా ఎన్నైనా, ఏవైనా లెక్క ఇలాగే.

కోటు ఉత్పత్తికి పట్టే శ్రమ కాలం మారింది అనుకుందాం. అంటే, మునుపటికంటే పెరిగి రెట్టింపో , తగ్గి సగమో అయింది అనుకుందాం. మొదటిసందర్భంలో ఒక కోటు విలువ వెనకటి రెండు కోట్ల విలువంత అవుతుంది.రెండో సందర్భంలో వెనకటి రెండు కోట్ల విలువ వెనకటి ఒక కోటు విలువ అవుతుంది. అయితే, రెండు సందర్భాలలోనూ కోటు అంతకుముందు ఎలా ఉపయోగపడిందో ఇప్పుడూ అలాగే ఉపయోగ పడుతుంది.ఎందుకంటే, కోటులో వున్నా ప్రయోజకర శ్రమ గుణం మారలేదు. కాని శ్రమ పరిమాణంలో మార్పువున్నది. కనక విలువ పరిమాణంలో మార్పు వస్తుంది.

" 1852 లో అల్యూమినియం ఒక పౌను 545 డాలర్లు. 1859 లో డెవిలీ అల్యుమినియాన్ని విడదీసే విధానాన్ని లోపరహితం చేసాడు.దాని ఫలితంగా పౌను వెల 17 డాలర్లయింది. 1886 లో చార్లెస్ మార్టిన్ హాల్ ...ఎలెక్ట్రాలిసిస్ ద్వారా విడదిసాడు. ఇనాడు (1961 లో) అదే ప్రక్రియని మెరుగుపరచి విడదీస్తే పౌను 20 సెంట్ల కన్న తక్కువకి వస్తున్నది."- Chemistry in Action .482 డబ్బులో దాని విలువ అంతగా తగ్గింది. డాలర్ విలువ స్థిరంగా వుండి అనుకుంటే, ఉత్పాదకత 2,725 రెట్లు అయినట్లు.

రేడియోలలో వాల్వులు ఉండేవి. అప్పుడు రేడియో కి బదులుగా ఇనప బీరువా వచ్చేది.వాల్వుల స్థానంలో ట్రాన్సిస్టర్లు, ఆ తర్వాత ఐ.సీ లు వచ్చాయి. సాంకేతిక స్థాయి పెరిగింది. ఇప్పుడు ఒకపూట భోజనం మానుకుంటే చాలు బుల్లి రేడియో ఇంటికి వస్తుంది.

బాగా తెలిసిన ఉదాహరణ- సెల్ ఫోన్. 20 ఏళ్ల క్రితం అక్కడక్కడ మాత్రమే కన్పించేది. సాంకేతికతలో మార్పులొచ్చి ఉత్పాదకత పెరిగి విలువ పడిపోయింది.కనకనే సెల్ లేని చేతులు ఎక్కువగా కనిపించడం లేదు.

ఉపయోగపు విలువల పరిమాణం పెరుగుదలే, వస్తుసంపద పెరుగుదల. ఒకకోటు ఒకరు వేసుకుంటే, రెండు కోట్లు ఇద్దరు తొడుక్కుంటారు. అయితే, వస్తుసంపద పెరిగినా, విలువ పరిమాణం తగ్గి పోవచ్చు. ఈవిరుద్ధమైన ఎదురుగమనం శ్రమ యొక్క ద్వంద్వ స్వభావం నుండి ఏర్పడుతుంది.

ఉత్పాదక శక్తి అనేది కేవలం ఏదో ఒక ప్రయోజనకర, నిర్దిష్ట రూపంగల శ్రమకు సంబంధించింది. ఉత్పాదకతలో వచ్చే మార్పులు మారకపు విలువని సూచించే శ్రమ మీద ప్రభావం చూపవు. ఉత్పాదకత పెరిగితే ఎక్కువ వస్తువులు తయారవుతాయి. తగ్గితే, తక్కువ తయారవుతాయి. ప్రయోజనకర శ్రమ అనేది ఎక్కువో తక్కువో ఉత్పాదితాలకు వనరుగా వుంటుంది.

మరొకవైపు, ఈ ఉత్పాదకతలో మార్పు విలువకు ప్రతినిధి అయిన అనిర్దిష్ట శ్రమ మీద ఎటువంటి ప్రభావమూ చూపదు. ఉత్పాదక శక్తి ఎంతగా మారినా, అదే శ్రమ సమాన కాలాల్లో ఎల్లప్పుడూ సమాన మొత్తాల విలువల్ని ఏర్పరుస్తుంది. కాని సమాన కాలాల్లో విభిన్న పరిమాణాల్లో ఉపయోగపు విలువల్ని ఉత్పత్తి చెయ్యవచ్చు. ఉత్పాదకశక్తి పెరిగితే, ఎక్కువ మొత్తంలోనూ తగ్గితే తక్కువ మొత్తంలోనూ ఉపయోగపు విలువల్ని ఇస్తుంది. ఒకే కాలంలో ఎక్కువ వస్తువులు తయారయితే, ఒక్కొక వస్తువు విలువ తగ్గుతుంది. అలాకాక తక్కువ వస్తువులు తయారయితే, ఒక్కొక్క వస్తువు విలువ పెరుగుతుంది.తయారయ్యే ఉపయోగపు విలువల పరిమాణం పెరగడం అంటే తయారయ్యే వస్తువుల పరిమాణం పెరగడమే .

ఒక దర్వాజా తలుపులు తయారుచెయ్యడానికి మామూలు పరికరాలతో పనిచేస్తే ఇద్దరికీ ఒకరోజు పట్టిందనుకుందాం. యంత్రాలు ఉపయోగిస్తే, ఆ ఇద్దరే అయిదు చేస్తారనీ అనుకుందాం. వస్తువులు పెరిగాయి .కాని చేరే విలువ అదే. అయిదింటికి ఇంతకుముందు ఒకదానిలో ఎంతవిలువ చేరిందో ఇప్పుడు అయిదింటికీ అంతే చేరుతుంది. ఫలితంగా, ఒక్కొక్క వస్తువు విలువ అయిదవవంతుకి తగ్గుతుంది. అయినా అయిదింటి మొత్తం విలువ మొదటి పద్ధతిలో తయారైన ఒకదాని విలువతో సమానంగానే ఉంటుంది.

ఒకే కాలంలో భిన్న పరిమాణాల్లో వస్తువులు తయారు కావచ్చు. అయినా విలువ పరిమాణం అన్ని సందర్భాలలోనూ ఒకటే. ఏమాత్రం తేడా ఉండదు.

ఉత్పాదకకలో మార్పు రెండో వైపు జరిగితే, అంటే ఉత్పాదకత తగ్గితే, ఉత్పత్తయిన ఉపయోగపు విలువలు తగ్గి, వాటి విలువ పెరుగుతుంది.

శ్రమ అంటే శ్రమ శక్తి వ్యయమే. ఒకే రకమైన అనిర్దిష్ట మానవ శ్రమ. ఈ పాత్రలో అది సరుకుల విలువల్ని రూపొందిస్తుంది. మరొకపక్క, శ్రమ అనేది ఏదో ప్రత్యేక మైన రూపం కలిగి , నిర్దిష్టమైన లక్ష్యంతో చేసే శ్రమ శక్తి వ్యయం. ఈ పాత్రలో నిర్దిష్ట ప్రయోజనకర శ్రమ. ఉపయోగపు విలువల్ని సృజిస్తుంది.

ఒకడు పీట చేస్తున్నాడు. పక్కనే మరొకడు తాడు పేనుతున్నాడు. వేరొకడు చెప్పులు కుడుతున్నాడు. ఇవి వేర్వేరు పనులు. వారు తయారు చేసేవి భిన్నమైన వస్తువులు. వాడే ముడి పదార్థాలు వేరు. పనిముట్లు వేరు.అవయవాల కదలికలు వేరు. ఒక్కో రకం శ్రమవల్ల ఒక్కో రకం వస్తువు తయారవుతున్నది. పద్ధతులు

పేరైనా, శ్రమశక్తిని వ్యయం చేస్తున్నారు.అయితే ముగ్గురూ శ్రమ చేస్తున్నారు. ఒక అంశం (నిర్దిష్ట శ్రమ)ద్వారా ఉపయోగపు విలువనీ, మరొక అంశం (అనిర్దిష్ట శ్రమ) ద్వారా విలువని ఏర్పరుస్తున్నారు.

"శ్రమ మారకం విలువని ఉత్పత్తిచేసేది కుట్టు శ్రమగా కాదు, అనిర్దిష్ట సార్వత్రిక శ్రమగా... " క్రిటిక్ .36

నిర్దిష్ట శ్రమ ఉపయోగపు విలువనీ , అనిర్దిష్ట శ్రమ మారకం విలువనీ ఏర్పరుస్తాయని క్రిటిక్ (1859)లో కాపిటల్ లో కంటే ఎనిమిదేళ్ళ ముందు చెప్పాడు.

సరుకులో ఉండే శ్రమ ఒక్కటే. రెండు కావు.సరుకు విరుద్ధాంశాలు సరుకుపైనట్లే, శ్రమ విరుద్ధాంశాలు శ్రమవే.ఒకే శ్రమ రెండు అంశాలు. అవి పరస్పర విరుద్ధాలు.

"ఒకే శ్రమ ఇక్కడ దానికదే విరుద్ధంగా ఉంటుంది." అని ఫ్రెంచ్ ఎడిషన్లో స్పష్టంగా ఉంటుంది.

తొలి జర్మన్ ఎడిషన్లో ఈ వైరుధ్యాన్ని గురించి: "...సరుకులో భిన్న రకాల శ్రమలు ఉంటాయి అనేది వాస్తవం కాదు. అయినప్పటికీ, ఒకే శ్రమ భిన్నమైన, పరస్పర వ్యతిరేకమైన నిర్ణాయకతల్ని(Determinations)కలిగి ఉంటుంది" – అంటాడు.

ఆవిధంగా సరుకులోని విరుద్ధాంశాలను ఉత్పత్తిచేసే శ్రమ లోని విరుద్ధాంశాలను విడగొట్టి చూపాడు. ఒకదానిలోని విరుద్ధాంశాలను విడగొట్టి చూడటమే గతితర్కం అన్నాడు లెనిన్.

కాపిటల్ అచ్చవుతుండగా 1867 ఆగస్ట్ 24 న ఎంగెల్స్ కి దీని గురించి ఉత్తరంలో రాశాడు: నా పుస్తకంలో మంచి పాయింట్లు 1) శ్రమ యొక్క ద్వంద్వ స్వభావం, అది ఉపయోగపు విలువలో వ్యక్తమయిందా లేక మారకపు విలువలో వ్యక్తమయిందా అనే దాన్ని బట్టి.(వాస్తవాల్ని అర్థంచేసుకోవటం అంతా దీనిమీద అధారపడివుంటుంది).వాస్తవాల అవగాహన దీని మీద ఆధారపడిఉంటుంది . 2) అదనపు విలువని దాని ప్రత్యేక రూపాలైన లాభంగా , వడ్డీగా అద్దెగా కాకుండా స్వతంత్రంగా చూడడం –Selected Correspondence (progress publishers)-180

అంటే దీనికి అదనపువిలువకి ఇచ్చినంత ప్రాధాన్యతని ఇచ్చాడు.

మార్క్సుకి ముందున్న ఆర్థికవేత్తలు దీన్ని గమనించ లేదు.

సరుకు ఉపయోగపు విలువా, మారకం విలువా ఉన్న వస్తువు అని వాళ్లకు తెలుసు.పెట్టీ నుంచీ రికార్డో వరకూ సమాన కాలాల్లో తయారయిన వాటి విలువలు సమానం అని తెలుసు.కాని రకరకాల శ్రమలు ఎలాసమానమవుతాయి? అనే ప్రశ్న వాళ్ళు వేసుకోలేదు. కాని ఉపయోగపు విలువని ఏర్పరచే టప్పుడు,విలువని ఏర్పరచే టప్పుడు శ్రమ స్వభావం ఒకటే కాదు, వేరు వేరు అని వారికి తెలియదు.ఇవి సింపుల్ అయినవే అయినా తన ముందటి అర్థశాస్త్రజ్ఞులకు తట్టలేదు అంటాడు మార్క్స్.

"అర్థికవేత్తలు అందరూ ఒక సింపుల్ పాయింట్ ని మిస్ అయ్యారు. అదేమిటంటే, సరుకుకి ద్వంద్వ స్వభావం -ఉపయోగపు విలువా మారకం విలువా- ఉన్నప్పుడు, ఆసరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రమ కూడా ద్వంద్వ స్వభావం కలిగి ఉండాలి". 'కేవలం దానికదిగా శ్రమ (labour as such) విశ్లేషణ' అడుగడుగునా

వివరించరాని సమస్యలు తెచ్చిపెడుతుంది. స్మిత్, రికార్డో లకు ఆపరిస్తితే ఎదురయింది.కనుక శ్రమాశ్రయ విలువసిద్ధాంతం వివరణ అసమగ్రంగా వుండిపోయింది.

మార్క్స్ శ్రమలోని రెండు విరుద్ధాంశాల్ని విడగొట్టి, నిర్దిష్ట శ్రమ వుపయోగపు విలువనీ, అనిర్దిష్టశ్రమ విలువనీ కలిగిస్తాయని తేల్చాడు.నిర్దిష్ట శ్రమ, అనిర్దిష్ట శ్రమ అనే కాటగరీల్ని ప్రవేశ పెట్టింది మార్క్స్.

సరుకులోని విరుద్ధాంశాల్ని శ్రమలోని విరుద్ధాంశాలు వుత్పత్తిచేస్తాయని తేల్చి శ్రమాశ్రయ విలువ సిద్ధాంతాన్ని సమగ్రం చేశాడు.లోపరహితం గావించాడు.

అందుకే మార్క్స్ ఎంగెల్స్ కి 1868 జనవరి 8 న రాసిన లేఖలో అన్నట్లు శ్రమ ద్వంద్వ స్వభావమే "విమర్శ నాత్మక అవగాహన కి పూర్తికీలకం(the whole secret of the critical conception)" . -Selected Correspondence (progress publishers)-186.

ఇప్పటికి సరుకు అంశాలైన ఉపయోగపు విలువ గురించీ, విలువ గురించీ చెప్పాడు. వాటిని ఏర్పరచిన శ్రమ అంశాలైన నిర్దిష్టశ్రమ గురించీ అనిర్దిష్ట శ్రమ గురించీ వివరించాడు.

ఇక విలువ రూపాన్ని ఎత్తుకుంటాడు. వచ్చే పోస్ట్ లో

## 5.విలువ రూపం లేక మారకం విలువ

"ప్రేమవల్ల పిచ్చెక్కిన వాళ్ళ కంటే, డబ్బు స్వభావం గురించిన ఆలోచన వల్ల పెర్రివాళ్లయిన వాళ్ళే ఎక్కువమంది" అని విలియం గ్లాడ్ స్టన్(1809-1898) బ్రిటిష్ పార్లమెంట్ లో అన్నాడు – మార్క్స్ 'ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' .64

డబ్బు అనేదేమిటి? డబ్బిస్తే ఏ వస్తువయినా ఎందుకు వస్తున్నది? మిగిలిన ఏ వస్తువుకూ ఆశక్తి ఎందుకు లేదు? ఈ ప్రశ్నల పట్ల ఆసక్తి చూపిన వారు ఎందరో ఉన్నారు.

ఒక ఇల్లు = 5 మంచాలు అనేదానికీ

ఒక ఇల్లు = ఫలానింత డబ్బు అనేదానికీ తేడావుండదు అన్నాడు అరిస్టోటిల్.

ఒక సరుకు మరొక సరుకుతో మారినా, డబ్బుతో మారినా ఒకటే. మొదటిది ఆదిమరూపం రెండోది పూర్తిగా అభివృద్ధి చెందిన రూపం. డబ్బు రూపం అనేది సరళరూపం యొక్క అభివృద్ధి చెందిన రూపమే అని అరిస్టోటిల్ చెప్పాడు.

అయినా గాని మానవ మేధ 2 వేల ఏళ్లకు పైగా ప్రయత్నించినా దాని మూలాన్ని పసిగట్టలేక పోయింది.- తొలి జర్మన్ కూర్పుకి ముందుమాట. కాపిటల్ 1.19

డబ్బు విశ్లేషణలో ముఖ్యమయిన ఇబ్బంది సరుకే డబ్బు పుట్టుకకి మూలం అని తెలుసుకోవడంలో వుంది. దీన్ని అధిగమించారు. ఇక మిగిలింది: డబ్బుకి ప్రత్యేకమైన రూపాన్ని స్పష్టంగా గ్రహించడమే సమస్య.- క్రిటిక్.64

17 వ శతాబ్దం చివరి దశాబ్దాలలో డబ్బుకూడా ఒక సరుకే అని తేటతెల్లమయింది. అయితే విశ్లేషణలో ఇది శిశు దశ మాత్రమే. ఇబ్బంది డబ్బు కూడా ఒక సరుకే అని తెలుసు కోవడంలో లేదు. ఒక సరుకు ఎలా, ఎందుకు,దేనిద్వారా డబ్బయిందో కనిపెట్టడంలో ఇబ్బందంతా వుంది.- కాపిటల్ 1.95

' ఈ విషయం పుస్తకానికే నిర్ణయాత్మకమైనది.ఇంతదాకా ఆర్థికవేత్తలు ఎంతో సింపుల్ అయిన పాయింట్ ని మిస్ అయ్యారు.ఆ పాయింట్ ఏమంటే, 20 గజాల బట్ట = 1 కోటు అనేది 20 గజాల బట్ట =2 పౌన్లు అనేదానికి అభివృద్ధి చెందని ప్రాతిపదిక మాత్రమే......sel cor .177

విలువని మారకం విలువలోకి మార్చే విలువరూపాన్ని సాంప్రదాయ అర్థశాస్త్రం కనుక్కోలేక పోయింది - కాపిటల్ 1. 85 బూర్జువా ఆర్థికవేత్తలు కనుక్కునే ప్రయత్నం చెయ్యనే లేదు. అందుకు పూనుకున్నాడు మార్క్స్:

" ఇక్కడ మనకొక పని పడింది. డబ్బు రూపం పుట్టుకని ఆరా తీసే పని. సరుకుల విలువ సంబంధంలో ఇమిడి వున్న విలువ వ్యక్తీకరణ ని అగపడీ అగపడని సింపుల్ అవుట్ లైన్ నించీ జిగేల్మనే డబ్బురూపందాకా ఆరా తీసే పని. ఈ పని చెయ్యడం ద్వారా,అదేసమయంలో డబ్బు మనముందుంచిన చిక్కు సమస్యని (riddle) ని పరిష్కరించిన వాళ్ళమవుతాం"-కాపిటల్ 1. 54

డబ్బిస్తే ఏ వస్తువయినా ఎందుకు వస్తున్నది? మిగిలిన ఏ వస్తువుకూ ఆశక్తి ఎందుకు లేదు? అనేదే ఆసమస్య.

సరుకు యొక్క డబ్బు రూపం ప్రాథమిక విలువ రూపం యొక్క అభివృద్ధి చెందిన రూపమే.

ఒక సరుకు విలువని ఏదో ఒకే ఒక్క సరుకులో చెప్పడమే ప్రాథమిక విలువ రూపం..

1 కొడవలి =1 ఈతచాప

1 గరిస=2 బాణాలు

మొదటి దాంట్లో కొడవలి విలువ ఈతచాప లో వ్యక్తమయితే, రెండో దాంట్లో గరిస విలువ బాణాల్లో వ్యక్తమయింది.

ఈ మారక సంబంధంలో అటొక సరుకు ఇటొక సరుకు మాత్రమే ఉన్నాయి. ఇంతకన్నా సరళం అయిన విలువ సంబంధం ఉండదు. కనక ఇదే సరళ విలువ రూపం. ఇదే ప్రాథమిక మైనది.

డబ్బులో చెప్పేటప్పుడు అలాచేప్పం. దేనికదిగా చెబుతాం.

కొడవలి =రూ.200, ఈతచాప = రూ.200, గరిస =రూ. 500, బాణం = రూ.250.

ఇది విలువ డబ్బు రూపం.

20 గజాల బట్ట = 1 కోటు అనేది కూడా సరళ విలువ రూపమే.ఇదొక సమీకరణం.

కనుక మొత్తం విలువ రూపం యొక్క ఆంతర్యం/ రహస్యం ఈ సరళ విలువ రూపం లోనే ఉండి తీరాలి. కనుక ఇబ్బంది అంతా దీని విశ్లేషణ లోనే ఉంటుంది. కనుకనే మార్క్స్ దీని వివరణకి 14 పేజీలిచ్చాడు.

మిగిలిన 3 రూపాలనీ 8 పేజీల్లోనే ముగించాడు. సరళ విలువ రూపంతో మొదలై డబ్బు రూపానికి అభివృద్ధి చెందింది.

1.ప్రాథమిక విలువ రూపం లేక యాదృచ్ఛిక విలువ రూపం

2.సంపూర్ణ విస్తృత విలువ రూపం లేక సంపూర్ణ విలువ రూపం

3.సాధారణ విలువ రూపం

4.డబ్బు రూపం.

## ప్రాథమిక విలువ రూపం లేక యాదృచ్ఛిక విలువ రూపం

ఒక సరుకు విలువని ఏదో ఒకే ఒక్క సరుకులో చెప్పడమే ప్రాథమిక విలువ రూపం..

20 గజాల బట్ట = 1 కోటు అనేది కూడా సరళ విలువ రూపమే. ఇదొక సమీకరణం.

### ఒక సమీకరణం ఏం చెబుతుంది?

రెండు వస్తువులు సమానం అని చెబుతుంది. రెంటికీ మధ్య = ఉంటుంది.= కి ఎడమవైపుని Left Hand Side(LHS) అనీ, = కి కుడివైపుని Right Hand Side (RHS )అనీ అంటారు.= కి ఎడమవైపున్నది కుడివైపున్నదానికి సమానం అని తెలుపుతుంది.

పై సమీకరణంలో = కి ఎడమవైపున 20 గజాల బట్ట ఉంది. కుడివైపు 1 కోటు ఉంది. 20 గజాల బట్ట 1 కోటు తో సమానం అని చెబుతుంది.ఇక్కడ పోలిక విలువలో. కనక ఇది విలువ సమీకరణం.

ఈ విలువ సమీకరణంలో ఇరువైపులా ఉన్నవి విలువ రూపాలే. అయితే ఒకటి విలువయొక్క సాపేక్ష రూపం రెండోది విలువ యొక్క సమానక రూపం.

మార్క్స్ తన విలువ సమీకరణం ఎడవైపున్నదాన్ని రెలెటివ్ పోల్(సాపేక్ష ధ్రువం) అనీ కుడివైపుదాన్ని ఈక్వివలెంట్ పోల్ (సమానక ధ్రువం) అనీ అంటాడు. రెండు ధ్రువాల్లో రెండు వస్తువులు ఉంటాయి.

సాపేక్షధ్రువంలో ఉన్న సరుకు తనవిలువను తెలియజేస్తుంది.

సమానక ధ్రువంలో వున్న సరుకు ఆవిలువకు ప్రతినిధిగా వుంటుంది.

పై ఉదాహరణలో బట్ట సాపేక్షధ్రువంలో వుంది. కోటు సమానక ధ్రువంలో ఉంది. రెండూ విలువ రూపాలే. బట్ట సాపేక్ష రూపంలో వుంటే, కోటు సమానకం రూపంలో వుంది.

సాపేక్షంగా అంటే, మరొకదానితో పోల్చగా అని . 20గజాల బట్ట విలువ కోటు విలువంత అని పోలికలో సాపేక్షంగా చెప్పినట్లవుతుంది..

ఈ సరళ విలువ వ్యక్తీకరణలో రెండు రకాల సరుకులున్నాయి - బట్టా, కోటూ.

బట్ట తన విలువని తెలుపుకుంటుంది – కోటు శరీరంలో. తన విలువని మరొక సరుకులో వ్యక్తం చేసుకునే సరుకు సాపేక్ష విలువ రూపం లో ఉంటుంది.

దీనికి భిన్నంగా రెండో సరుకు కోటు, బట్ట విలువ వ్యక్తమయ్యే వస్తువుగా ఉంటుంది. ఇది బట్టకి సమానకంగా ఉంటుంది, అంటే సమానక రూపం లో ఉంటుంది.

మన ఉదాహరణ (20 గజాల బట్ట = 1 కోటు) లో బట్ట సాపేక్ష విలువ రూపంలో ఉంటే, కోటు సమానకం రూపంలో వుందన్నమాట.

లోతుగా విశ్లేషించకపోయినా విలువ వ్యక్తీకరణలో ఈ క్రింది విషయాలు ఇప్పటికే స్పష్టం:

ఈ రెండు రూపాలూ - సాపేక్ష విలువ రూపమూ, సమానక రూపమూ- దేనికదిగా విడివిడిగా ఉండవు.

ఒకదానితో ఒకటి బంధంలో వున్నవి. విడదీయ వీలు కానివి. రెండూభిన్నమైనవే కాని ఒకే వ్యక్తీకరణకు చెందినవి. రెండూ విలువ సంబంధంలో ముడిబడి వుంటేనే విలువ వ్యక్తీకరణ సాధ్యమవుతుంది. ఇది స్పష్టమే.

మరొకవైపు, ఇవి రెండూపరస్పర విరుద్ధమైన, ఒకదాన్నొకటి బహిష్కరించుకునే భిన్న ధ్రువాలు.

విలువ సమీకరణంలో రెండు ధ్రువాలూ రెండు వేర్వేరు సరుకులకు కేటాయించ బడతాయి.

ఆ ధ్రువంలో ఒక రకం సరుకు ఉంటే, ఈ ధ్రువంలో వేరే రకం సరుకు ఉండాలి. ఎందుకంటే, బట్ట విలువ బట్టలో వ్యక్తం కాదు. 20 గజాల బట్ట = 20 గజాల బట్ట అనేది విలువ వ్యక్తీకరణ కాదు.పునరుక్తి మాత్రమే. అది కొత్తగా చెప్పేదేమీ లేదు. బట్ట విలువ వేరొకరకం సరుకులో - అంటే సాపేక్షంగా- వ్యక్తం చెయ్యడం మాత్రమే కుదురుతుంది.

బట్ట సాపేక్ష విలువ రూపంలో వుంటే, సమానకం రూపంలో మరొక సరుకు వుండి తీరాలి. ఇక్కడ కోటు ఆ సమానకం. కోటు, బట్ట విలువని తెలుపుతుంది. అది బట్టవిలువకు సమానమైనది, ఆవిధంగా కోటు బట్టకు సమానకం రూపంలో ఉంటుంది. అదే సమయంలో కోటు సాపేక్ష రూపం లో ఉండజాలదు.

అలా ఉన్నట్లు అనిపించే సందర్భాన్ని మార్క్స్ మనముందు పెడతాడు:

బట్ట ఉత్పత్తిదారుడూ(A ) కోటు ఉత్పత్తిదారుడూ(B ) బేరం మొదలుబెడతారు.

బట్టతనికీ A కోటతనికీ B బేరం తెగే ముందు వాళ్ళ మాటలు:

A: 20 గజాలబట్ట రెండు కోట్లతో సమానం. 20 గజాలబట్ట= రెండు కోట్లు

B: 1 కోటు 22 గజాల బట్టకు సమానం. 1 కోటు= 22 గజాల బట్ట

కొంతసేపు బేరం ఆడాక, చివరకి కొలిక్కి వస్తారు.అప్పుడు

A: 20 గజాలబట్ట=1 కోటు. 20 గజాలబట్ట 1 కోటుకి సమానం అంటాడు

B: 1 కోటు=20 గజాలబట్ట. 1 కోటు 20 గజాల బట్టకి సమానం అంటాడు.

ఈ సందర్భంలో బట్టా కోటూ రెండూ ఏక కాలంలో సాపేక్ష విలువ రూపంలోనూ,సమానకం రూపంలోనూ ఉన్నాయి. జాగ్రత్తగా పరిశీలిస్తే ఇది ఇద్దరు వేరే వేరే వ్యక్తులకు, రెండు వేర్వేరు విలువ వ్యక్తీకరణలకు ఏకకాలంలో జరిగింది. A కి తన బట్ట సాపేక్ష విలువ రూపంలో వుంటుంది. అవతలవాని సరుకు కోటు సమానకం రూపంలో వుంటుంది.

B వైపు నుంచి చూస్తే, అటుదిటుగా, ఇటుదటుగా వుంటుంది. అంటే, కోటు సాపేక్ష విలువ రూపంలో వుంటుంది, బట్ట సమానకం రూపంలో వుంటుంది.

ఆవిధంగా ఈ సందర్భంలో కూడా ఒకే విలువ వ్యక్తీకరణలో ఒకే కాలంలో, ఒకే సరుకు ఒకేవ్యక్తి వైపునించి ఈ రెండు రూపాలనూ పొంద జాలదు.

సాపేక్షవిలువా, సమానకమూ అనేవి కేవలం విలువల రూపాలు మాత్రమే.

ఒకసరుకు ఏరూపం లో ఉన్నది? అనేది విలువ సమీకరణంలో ఆసరుకు ఉన్న స్థానాన్ని బట్టి ఉంటుంది.

1)20 గజాల బట్ట = 1 కోటు అనే దాంట్లో బట్ట సాపేక్ష రూపంలో ఉంది. కోటు( విలువేమో) సమానకంగా ఉంది.

2)1 కోటు = 20 గజాల బట్ట అనే దాంట్లో కోటు సాపేక్ష రూపంలో ఉంటే, బట్ట సమానకంగా ఉంది.

సారానికి సంబంధించి రెంటికీ తేడా లేదు. కాని రూపం విషయానికొస్తే భిన్నమైనవి. అంతేకాదు పరస్పరం విరుద్ధమయినవి కూడా.

మొదటిదాంట్లో బట్టవిలువ సాపేక్షంగా వ్యక్తమయింది. కనక బట్ట సాపేక్ష రూపంలో ఉంది. కోటు విలువేమో సమానకంగా వ్యక్తమయింది.కనుక కోటు సమానకం రూపంలో వుంది.

ఇప్పుడు 20 గజాల బట్ట = 1 కోటు అనేదాన్ని తిరగ దిప్పవచ్చు. 1 కోటు = 20 గజాల బట్ట అనేది వస్తుంది, – ఇదీ సరైన సమికరణే.

అయితే అలా తిప్పితే సరుకుల స్థానాలు మారతాయి.

కోటు సాపేక్ష రూపంలో ఉంటుంది. బట్ట సమానకం అవుతుంది.

అందువల్ల ఒకే విలువ వ్యక్తీకరణలో ఒకేకాలంలో ఒకే సరుకు రెండు రూపాల్లోనూ ఉండ జాలదు. ఏదో ఒకరూపంలో మాత్రమే ఉండగలదు.ఆరెండు రూపాలూ ఒకదాన్నొకటి బహిష్కరించు (exclude) కుంటాయి. దక్షిణ ధ్రువం, ఉత్తర ధ్రువం మాదిరిగా. ఒకే విలువ సంబంధంలో ఒకే సరుకు సాపేక్షధ్రువంలోనూ, సమానక ధ్రువంలోనూ ఉండ జాలదు.

ముందుగా సాపేక్ష రూపాన్నీ, తర్వాత సమానక రూపాన్నీ విడివిడిగా పరిశీలిస్తాడు.అప్పుడు సరళ విలువ రూపాన్ని మొత్తంగా పరిశీలిస్తాడు.

సాపేక్ష విలువ రూపం యొక్క గుణాత్మక సారం (qualitative content of the relative value-form )

భౌతిక రూపంగా, బట్ట కోటు నుండి భిన్నమైనది విలువలుగా బట్టా కోటూ ఒకలాంటివే.అదీ విలువే, ఇదీ విలువే. కనుక బట్ట కోటుతో విలువ సంబంధంలోకి రాగలదు. ఇక్కడ సమానత్వసంబంధం విలువ సంబంధం. తన విలువని తెలిపే సరుకు యొక్క విలువ వ్యక్తీకరణ. ఉపయోగపు విలువగా, అంటే సరుకు శరీరంగా, బట్ట కోటు వంటిది కాదు. కోటుకి భిన్నమైనది. విలువగా ముందుకొచ్చినప్పుడు ఒక సంబంధంలో వ్యక్తమవుతుంది. ఈ సంబంధంలో మరొక రకం సరుకు కోటు, బట్టకు సమం అవుతుంది, అంటే బట్టలో నూ కోటులోనూ ఒకే సారం ఉన్నట్లు లెక్కకొస్తుంది.

అయితే తనవిలువని చెప్పుకునేది బట్ట. అది తనకి భిన్నమైన మరొక సరుకుతో సంబంధంలోకి వస్తుంది. ఈ సంబంధం సమానం అని తేల్చే సంబంధం. సమానత్వ సంబంధం

20 గజాల బట్ట = 1 కోటు అనే సమీకరణానికి మూలం: బట్ట=కోటు .

మామూలు మాటల్లో చెబితే, కోటు సారంలో బట్ట లాంటిదే. కనుక ఒకదాన్ని మరొకదానితో పరిమాణాత్మకంగా సమపరచవచ్చు.

గజం బట్టలో వున్న సారానికి 20 రెట్ల సారం కోటులో వుంది.సమపరిస్తే, 20 గజాల బట్ట= ఒకకోటు.

ఉపయోగపు విలువలుగా అయితే ఏసరుక్కి ఆ సరుకే , దేనికదే. భిన్నమైనవి.అయితే విలువలుగా సరుకులన్నీ ఒకటే. ఎందుకంటే విలువలుగా సరుకులు పేరుకున్న శ్రమే. శ్రమ పేరుడే అన్నామంటే వాటిని అనిర్దిష్టతకి, విలువకి దించినట్లే - మన విశ్లేషణ ద్వారా.అయితే ఈ విలువకి వాటి శరీర రూపాన్ని తప్ప మరొక రూపాన్ని ఆపాదించం.

అయితే సరుక్కీ ,మరొక సరుక్కీ విలువ సంబంధంలో ఇందుకు భిన్నంగా వుంటుంది. బట్ట తానొక విలువనంటూ ముందుకొస్తుంది, తన శరీరాన్ని వదలి పెట్టి మరీ దూసుకొస్తుంది. ఇదంతా విలువ సంబంధంలోఉన్నప్పుడే సాధ్యం. దేనికది విడిగా వున్నప్పుడు సాధ్యమవదు. అప్పుడు శరీరరూపం తప్ప మరోకరూపం అవి తీసుకోలేవు.ఇది స్పష్టం.

మనం కోటును బట్టకు సమానకం చేశాం. తద్వారా కోటు లో రూపొందిన శ్రమనీ, బట్టలో రూపొందిన శ్రమని సమానం చేశాం అన్నమాట. కోటుని చేసింది దర్జీ శ్రమ. బట్టను చేసింది నేత శ్రమ. ఈ రెండూ గుణాత్మకంగా భిన్నమైనవి.

మరి వాటిని ఎలా సమానం చెయ్యగలం? విలువని ఏర్పరచే మేరకు రెంటినీ అనిర్దిష్ట శ్రమకు దింపడం ద్వారా మాత్రమే అలా చెయ్యగలం. అనిర్దిష్ట శ్రమే విలువ సారం.

ఇంతవరకే తెలిస్తే సరిపోదు. తెలుసుకోవాల్సిన మరొక విషయం మిగిలే వుంది. ఏమంటే,

## శ్రమ దానికదే విలువ కాదు.

బట్ట విలువని ఏర్పరచిన శ్రమా, కోటుని ఏర్పరచిన శ్రమా ఒకేరకమైన అనిర్దిష్ట మానవ శ్రమ అని తెలుసుకున్నాం. ప్రతిసరుకులోనూ ఒకేసారం ఉన్నప్పుడు, ఆసరుకులు ఏవో పరిమాణాల్లో సమానం అవుతాయి అనీ తెలుకున్నాం.

ఇంతవరకే తెలిస్తే సరిపోదు. బట్ట విలువ ఏర్పరచిన శ్రమ స్వభావం వ్యక్తీకరణ ఒక్కటే సరిపోదు.

తెలుసుకోవాల్సింది మరొకటుంది:

అనిర్దిష్ట శ్రమ దానికదిగా విలువ కాదు. విలువంటే, ఏదైనా వస్తువులో చేరిన /రూపొందిన అనిర్దిష్ట శ్రమ.బట్టలోనూ కోటులోనూ చేరివున్న శ్రమ విలువ అవుతుంది.

బట్టని చేసిన శ్రమ కోటు చెయ్యడానికి ఉపయోగించవచ్చు.మరేదైనా తయారు చేయడానికి వాడవచ్చు.అయితే అది ఒక ఉత్పాదితంలో చేరిఉండాలి. అప్పుడే ఆ శ్రమ విలువ అవుతుంది.ఎందుకంటే శ్రమని శ్రమగా వుంచడం కుదరదు. శ్రమ దానికదిగా విలువ కాదు. ఎందుకు కాదో చెప్పాడు.

శ్రమ అంటే చలనంలో శ్రమ శక్తి, సజీవ శ్రమ విలువని ఏర్పరుస్తుంది. కాని దానికదే విలువ కాదు. శ్రమ పేరుకున్న స్థితిలో మాత్రమే విలువ అవుతుంది. అంటే ఎదో ఒక సరుకులో రూపొంది నప్పుడు మాత్రమే శ్రమ విలువ అవుతుంది. మానవ శ్రమ పేరుడుగా బట్ట ఒక విలువ. ఆవిలువని వ్యక్తం చెయ్యాలంటే, విలువకి వస్తుగత మనుగడ ఉన్నట్లు ఆ విలువ వ్యక్తం కావాలి. అంటే, ఆబట్టనుండి పాదార్ధికంగా భిన్నమైనదిగా వ్యక్తం కావాలి. అయినాగాని బట్టకీ, అన్ని ఇతర సరుకులకీ ఉమ్మడి అయినదిగా వ్యక్తం కావాలి. సమస్య పరిష్కారం అయింది.- కాపిటల్ 1.57 -58

విలువ సమీకరణంలొ సమానకం స్థానంలో ఉన్నప్పుడు కోటు బట్టకు గుణాత్మకంగా సమానమైనదిగా ఉంటుంది.అది విలువ కనక బట్ట వంటిదే. కోటులో విలువని తప్ప మరి దేన్నీ చూడం. దాని శరీరం విలువకి ప్రాతినిధ్యం వహిస్తుంది. అయినా, కోటు శరీరం దానికదిగా కేవలం ఒక ఉపయోగపు విలువ మాత్రమే. తానొక విలువని అని చెప్పదు. మొదట్లో మనం పట్టుకున్న బట్ట లాగే. "బట్టతో విలువ సంబంధంలో పెట్టగానే,సంబంధంలో లేనప్పటి కంటే కోటు మరింత అర్ధవంతం అవుతుందని తెలుస్తుంది." ఎక్కువ విషయం చెబుతుంది.ఉపయోగపువిలువనే కాదు, విలువని కూడా అని. ఒకవ్యక్తి మఫ్టీలో ఉన్నప్పటికంటే యూనిఫాం లో ఉన్నప్పుడు ఎక్కువగా లెక్కకొస్తాడు , అలాగే.

కోటు ఉత్పత్తిలో మానవ శ్రమశక్తి కుట్టు రూపంలో ఖర్చయింది. అది కోటులో నిల్వ అయింది. కోటు ఈ అంశంలో విలువ నిక్షేపం (depository of value). అయినా, ఆకోటు చీలికలయినా అది విలువ అనే విషయాన్ని బయటపడనీయదు. బట్టతో విలువ సంబంధంలో మాత్రం కోటు కేవలం ఈ అంశ తోనే ఉంటుంది. కనుక రూపొందిన విలువగా , విలువ అయిన శరీరంగా లెక్కకొ స్తుంది.

"A అనేవాడు B దృష్టిలో ప్రభువు. 'ప్రభువు' B దృష్టిలో A శరీర రూపాన్ని పొందితే తప్పA అనేవాడు B కి ప్రభువు కాలేడు. అంతేకాక, కొత్త ప్రభువు వచ్చినప్పుడల్లా ప్రభుత రూపురేఖలూ, జుట్టూ వగయిరా అన్ని మారతాయి."

కనుక బట్టకి కోటు సమానకంగా వున్న విలువ సమీకరణంలో కోటు విలువ రూపంగా వ్యవహరిస్తుంది. బట్ట సరుకు విలువ కోటు సరుకు శరీర రూపంలో వ్యక్తం చెయ్యబడుతుంది.అంటే ఒక సరుకు విలువ మరొక సరుకు ఉపయోగపు విలువలో. ఉపయోగపు విలువగా బట్ట కోటు లాంటిది కాదు. కోటుకి భిన్నమైనది. అయితే విలువగా బట్ట కోటు వంటిదే. ఆవిధంగా బట్ట తన శరీర రూపానికి భిన్నమైన విలువ రూపాన్నిపొందుతుంది .బట్ట ఒక విలువ అనే వాస్తవం (విషయం) కోటుతో దాని సమానత్వం ద్వారా వెల్లడవుతుంది-" ఒక క్రైస్తవుని గొర్రె స్వభావం దేవుని గొర్రెతో అతని పోలికలో వెల్లడయినట్లు" -కాపిటల్ 1.58

తొలి జర్మన్ కూర్పుకి చేర్చిన అనుబంధంలో ఇలాఉంది : కోటు ఒక వస్తువు రూపంలో దాని ఉత్పత్తికి ఖర్చయిన మానవ శ్రమ శక్తి వ్యక్తీకరణ. ఆ మేరకు అది అనిర్దిష్ట మానవ శ్రమ యొక్క జెల్లీ(jelly). ఆవిధంగా కోటు అనేది విలువ. అలాగే బట్ట కూడా, అదే మానవ శ్రమ జెల్లీ గా అదీ విలువే. బట్టలోను కోటు లోనూ ఉమ్మడిగా మానవశ్రమ వుంది. ఈ సంబంధంలో ఒక వస్తువుగా కోటు, బట్టలోనూ, తనలోనూ ఉమ్మడిగా

వున్న మానవ శ్రమకు ప్రతినిధిగా వుంటుంది. ఈ సంబంధంలో కోటు ' విలువ ఆకారంగా' మాత్రమే లెక్కకొస్తుంది. అందువల్ల, ఈ సంబంధంలో బట్ట విలువ యొక్క రూపంగా, అంటే బట్ట విలువ ఏ రూపంలో కనపడుతుందో ఆ ఇంద్రియాగోచర రూపంగా కోటు లెక్కకొస్తుంది. ఆవిధంగా విలువ సంబంధం వల్ల ఒక సరుకు విలువ మరోకసరుకు ఉపయోగపు విలువలో వ్యక్తమవుతుంది.అంటే, దానికి భిన్నమైన మరొక సరుకు శరీరం ద్వారా అన్నమాట.

**విలువ సంబంధంలో ఉన్న సాపేక్ష విలువ రూపం యొక్క పరిమాణాత్మక నిర్దిష్టత ( Quantitative definiteness).**

విలువగా 20 గజాలబట్ట శ్రమ జెల్లీ. అంత మాత్రమే కాదు. ఆబట్టలో కొంత నిశ్చిత పరిమాణం లో శ్రమ వస్తూత్వం (objectified) చెందింది. అంతే పరిమాణం లో కోటు లో కూడా. రెంటిలోనూ ఉన్న శ్రమ గుణాత్మకంగా ఒకటే, పరిమాణాత్మకంగానూ ఒకటే. కనుకనే సమానం అవుతాయి. 20 గజాల బట్ట = 1 కోటు అవుతుంది గాని 20 గజాల బట్ట = డజన్ కోట్లు కావు.

ఏరెండు సరుకుల విలువ సంబందానికైనా ఇది వర్తిస్తుంది.

ఉదాహరణకి 10 కిలోల టొమాటోలు, 3 దస్తాల కాగితాలు. నిశ్చిత పరిమాణంలో ఉన్న సరుకు ఏదైనా దానిలో ఒక నిశ్చిత పరిమాణంలో మానవ శ్రమ ఇమిడి ఉంటుంది.అందువల్ల :

" విలువ రూపం విలువనే కాక విలువ పరిమాణాన్ని కూడా వ్యక్తం చెయ్యాలి." కాగితాల్లోను, టొమాటోల్లోనూ విలువ ఉన్నది.కనుక విలువలుగా చూస్తే, అవి గుణాత్మకంగా ఒకటే.

టొమాటోలు = కాగితాలు

గుణాత్మకంగా సమానమైనవే. కాని అదొక్కటే చాలదు.పరిమాణాత్మక సమానత్వం ఉండాలి.

విలువ వున్నట్లు చెప్పడమే కాదు, ఎంత పరిమాణంలో ఉందో కూడా చెప్పాలి.

10 కిలోల టొమాటోల్లో ఎంత విలువ సారం ఉందో, 3 దస్తాల కాగితాల్లో అంటే ఉంటేనే ఆపరిమాణాల్లో రెండూ సమానమవుతాయి.వేరే నిష్పత్తిలో కావు.పై పరిస్థితుల్లో, అంటే

5 కిలోల టొమాటోలు= 3 దస్తాల కాగితాలు అనేది కుదరదు. రెంటిలోనూ ఒకే సారం ఉన్నది కాని పరిమాణంలో తేడా ఉంది. 5 కిలోల టొమాటోల్లో 3 దస్తాల కాగితాల్లో ఉన్న సారంలో సగమే ఉంది. కనుక సమానం కావు.

20 గజాల బట్టలో విలువ సారం ఎంత ఉందో సరిగ్గా అంతే ఒక కోటు లో ఉంది. దీనర్థం ఆపరిమాణాల్లో ఉన్న ఆ రెండు సరుకుల ఉత్పత్తికి ఒకేమొత్తం శ్రమ కాలం ఖర్చయిందని.

**ఒక సరుకు విలువని ఆసరుకు యొక్క సాపేక్ష విలువ అని ఎప్పుడు అంటాం?**

ఒక సరుకు విలువకి వేరొక సరుకు ప్రాతినిధ్యం వహించి వుంటే ఆ సరుకు విలువ సాపేక్షవిలువ అనబడుతుంది. ఉదాహరణకు, 5 కిలోల టొమాటోలు= 3 దస్తాల కాగితాలు అనప్పుడు టొమాటోల విలువకు కాగితాలు ప్రాతినిధ్యం వహించాయి. కనుక టొమాటోల విలువ వాటి సాపేక్ష విలువ అవుతుంది.

" ఒకసరుకు విలువ స్థిరంగా వుంటూ ,దాని సాపేక్ష విలువ మారవచ్చు. భిన్నంగా దాని విలువ మారినా, సాపేక్ష విలువ స్థిరంగా వుండవచ్చు"

ఉత్పాదకతలో వచ్చే మార్పుల వల్ల సరుకులకు పట్టే శ్రమ కాలంలో మార్పులొస్తాయి.వాటిప్రభావం సాపేక్ష విలువ మీద ఎలావుంటుంది?

## ఉత్పాదకతలో వచ్చే మార్పుల ప్రభావం

అయితే, నేతపని ఉత్పాదకతలోనో కుట్టుపని ఉత్పాదకతలోనో మార్పులు రావచ్చు. ఆయా మార్పులకి తగినట్లు 20 గజాల బట్ట ఉత్పత్తికీ 1 కోటు ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమ కాలం మారుతూ ఉంటుంది.ఆ మార్పుల ప్రభావం విలువ పరిమాణం యొక్క సాపేక్ష వ్యక్తీకరణ మీద ఎలావుంటుంది?

ఇక్కడ మార్క్స్ అన్నీ అవకాశాలనూ చర్చించాడు:

1)మొదటిది.కోటు విలువ స్థిరంగా వుండగా, బట్ట విలువ మారుతున్న సందర్భం.

A )పత్తి పండే నేల నిస్సారమవుతున్నందు వల్ల – బట్ట ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమకాలం రెట్టింపు అయిందనుకుందాం. అప్పుడు ఆబట్ట విలువ కూడా అంతకు ముందుకంటే రెండింతలవుతుంది.

20 గజాల బట్ట = 1 కోటు అనే సమీకరణంకి బదులు ఇప్పుడు

20 గజాల బట్ట = 2 కోట్లు అనేదొస్తుంది.

B) దానికి భిన్నంగా, అభివృద్ధి చెందిన మగ్గాలు వచ్చినందువల్ల బట్ట ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమ కాలం సగానికి తగ్గితే, బట్ట విలువ కూడా సగమవుతుంది.

దీనికి అనుగుణంగా సమీకరణం మారి

20 గజాల బట్ట = ½ కోటు అనేదొస్తుంది.

ఈ మార్పు కూడా పరస్పర వ్యతిరేక కారణాల వల్ల వచ్చిందనేది స్పష్టమే.

2)బట్ట విలువ స్థిరంగా ఉండగా,కోటు విలువ మారుతున్న సందర్భం.

A) ఊలు దిగుబడి తగ్గి, కోటు ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమ కాలం రెట్టింపైతే

20 గజాల బట్ట = 1 కోటు అనే దానికి మారుగా

20 గజాల బట్ట = ½ కోటు అనేదొస్తుంది.

ఇందుకు భిన్నంగా కోటు విలువ సగానికి తగ్గితే

20 గజాల బట్ట = 2 కోట్లు అనేదొస్తుంది.

దీన్ని బట్టి: సరుకు A విలువ స్థిరంగా వుంటే, సరుకు B లో వ్యక్తమయ్యే సాపేక్ష విలువ B విలువ పెరిగితే తగ్గుతుంది. తగ్గితే పెరుగుతుంది. సరుకు B విలువ పెరిగినా తరిగినా విలోమంగా మారుతుంది.

1,2 లో ఇచ్చిన వివిధ సందర్భాల్నీ చూస్తే, సాపేక్ష విలువల్లో వచ్చే మార్పు పరస్పర వ్యతిరేక కారణాల వల్ల ఏర్పడవచ్చు. ఎలాగంటే:

20 గజాల బట్ట = 1 కోటు అనేది, 20 గజాల బట్ట = 2 కోట్లు కావడానికి రెండు కారణాలు ఉండవచ్చు. ఒకటి, కోటు విలువ అలాగే ఉండగా, బట్ట విలువ రెండింతలు కావడం. రెండు, బట్టవిలువ అలాగే ఉండగా, కోటు విలువ సగం కావడం. సాపేక్ష విలువలో వచ్చిన ఈ మార్పు, పరస్పరం వ్యతిరేకమైన కారణాల మూలంగా వచ్చిందనేది స్పష్టమే.

అలాగే కోటు విలువ అలాగే ఉండగా, బట్ట విలువ సగానికి తగ్గినా, బట్టవిలువ అలాగే ఉండి , కోటు విలువ రెట్టింపయినా 20 గజాల బట్ట = ½ కోటు అవుతుంది.

ఈ మార్పు కూడా పరస్పర వ్యతిరేక కారణాల వల్ల వచ్చిందనేది స్పష్టమే.

3) బట్ట, కోటు వీటి ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమ కాలాలు రెండూ ఒకే దిశలో, ఒకే నిష్పత్తిలో మారుతున్న సందర్భంలో, వాటి వాటి విలువల్లో మార్పులోస్తాయి. కాని, 20 గజాల బట్ట = 1 కోటు అనేది మారదు. అలానే ఉంటుంది. రెంటి విలువ్వాలు ఏక కాలంలో రెట్టింపయినా, సగమయినా ఆ సమీకరణం మారాడు. ఇది స్వయం స్పష్టం.

వాటి విలువల్లో వచ్చే మార్పు తెలియాలంటే, విలువ స్థిరంగా వున్నా మూడో సరుకుతో పోల్చాలి. బట్టని, కోటుని మాత్రమే పోల్చి చూస్తే అటువంటి మార్పు తెలియనే తెలియదు. తెలుసుకునే ఆస్కారమే ఉండదు.

ఇక్కడ మూడో వస్తువుగా 2 కుర్చీలు తీసుకుందాం.

20 గజాల బట్ట = 1 కోటు = 2 కుర్చీలు

బట్టవిలువా కోటు విలువా రెండూ రెట్టింపయితే,

20 గజాల బట్ట = 1 కోటు = 4 కుర్చీలు అనేదొస్తుంది.

రెంటి విలువా సగానికి పడిపోతే,

20 గజాల బట్ట = 1 కోటు = 1 కుర్చీ అవుతుంది.

రెండు సందర్భాలలోనూ 20 గజాల బట్ట = 1 కోటు అనేది మారదు. బట్టవిలువ సాపేక్షంగా కుర్చీలో వ్యక్తమయినప్పుడు, బట్టవిలువలో వచ్చిన మార్పు బయట పడుతుంది. కాని కోటు లో వ్యక్తమయినప్పుడు బయటపడదు.

4) బట్ట ఉత్పత్తికీ, కోటు ఉత్పత్తికీ అవసరమయ్యే శ్రమ కాలాలు ఒకే దిశలో మారుతున్నా,అసమాన స్థాయిలో ఈ మార్పు జరగవచ్చు. ఉదాహరణకి,బట్ట ఉత్పత్తికి పట్టే శ్రమ కాలం రెండు రెట్లయి, కోటు ఉత్పత్తికి పట్టే కాలం 1 ½ రెట్లు కావచ్చు.ఇంకా వేర్వేరు కాలాలు పట్టవచ్చు. ఒక సరుకు సాపేక్ష విలువలో సాధ్యమయ్యే తేడాల ప్రభావాన్ని 1,2,3 సందర్భాల్ని బట్టి తేలిగ్గా రాబట్టవచ్చు.

విలువ పరిమాణంలో వాస్తవ మార్పులు, వాటి సాపేక్ష వ్యక్తీకరణలో – సాపేక్ష విలువ పరిమాణంలో – స్పష్టంగా గానీ, సంపూర్ణంగా గానీ ప్రతిబింబించవు. ఒక సరుకు విలువ అలాగే వున్నా, దాని సాపేక్ష విలువ మారవచ్చు. దాని విలువ మారుతున్నా, సాపేక్ష విలువ అలాగే వుండనూ వచ్చు. విలువ పరిమాణాల్లోనూ, ఈ పరిమాణాల సాపేక్ష వ్యక్తీకరణ లోనూ ఒకేసారి వచ్చే వ్యత్యాసాలు అనుగుణంగా ఉండాలి అనేదేమీ లేదు.

### సాపేక్ష విలువ రూపం మొత్తంగా

సాపేక్ష విలువ వ్యక్తీకరణ ద్వారా సరుకు విలువ దాని సొంత ఉపయోగపు విలువకి భిన్నమైన రూపాన్ని పొందుతుంది.

ఈ సరుకు ఉపయోగపు రూపం (use form) ఉదాహరణకి బట్ట. అయితే అది కోటుతో సమానత్వ సంబంధంలో విలువ రూపం పొందుతుంది. ఈ సమానత్వ సంబంధం ద్వారా, దానికి(sensibly different ) భిన్నమైన మరొక సరుకు శరీరం విలువగా దాని మనుగడకు, విలువగా దాని స్వభావానికి అద్దం అవుతుంది/పడుతుంది.ఆవిధంగా అది తన ప్రాకృతిక రూపానికి భిన్నమైన స్వతంత్రమైన విలువ రూపాన్ని పొందుతుంది. రెండు,నిర్దిష్ట పరిమాణం గల విలువగా అది ఏ నిష్పత్తిలో మరొక సరుక్కి సమం అవుతుందో కొలవబడుతుంది.

### విలువ యొక్క సమానక రూపం

మన ఉదాహరణలో కోటు సమానక రూపం లో ఉంది. బట్ట తనవిలువని కోటు ఉపయోగపు విలువలో (శరీర రూపంలో) తెలుపుతుంది. అదే సమయంలో కోటు మీద ఒక ప్రత్యేకమైన విలువ రూపాన్ని ముద్రిస్తుంది. ఆ విలువ రూపమే సమానక రూపం.

1 కళ్ళజోడు = 1 స్కూల్ బాగ్

కళ్ళజోడు తనవిలువని స్కూల్ బాగ్ లో తెలుపుతుంది. బాగ్ ని సమానకం చేస్తుంది.అంటే దాని మీద సమానక రూపం ముద్ర వేస్తుంది.

ఈ విలువ సమీకరణంలో కళ్ళజోడు సాపేక్షవిలువ రూపంలో ఉంది. బాగ్ సమానకం రూపంలో ఉంది. కళ్ళజోడు తన విలువని స్కూల్ బాగ్ లో తెలుపుకుంటుంది.

### *నేరుగా మారగలిగే రూపం*

ఒక సరుకు విలువను కలిగివున్నట్లు ఎలా బయటపడుతుంది? మరోకసరుకు దానితో నేరుగా మారకం కాగలుగుతుంది అని చెప్పడం ద్వారా. అందువల్ల ఒక సరుకు సమానకం రూపంలో వున్నది అన్నామంటే, అది ఇతర సరుకులతో మారకం కాగలదు అంటున్నామన్నమాట.

ఒక సరుకు విలువగా అగపడే రూపంలో ఉంటేనే అది మరోకసరుకుతో మారగలుగుతుంది.అంటే దాని భౌతిక రూపం విలువ రూపంగా లేక్కకోస్తేనే. ఈ ధర్మం కోటుకి వుంటుంది-బట్టకు కోటుతో విలువ సంబంధంలో. అలా కాకపొతే, కోటు అనే వస్తువులో బట్ట విలువ వ్యక్తం కాదు.ఆకారణంగా కోటు సమానక రూపంలో వుంది అంటే అర్ధం ఇదే.విలువ సమీకరణంలో అది వున్న స్థానం వల్ల , దాని ప్రాకృతిక రూపం మరొక సరుకు విలువ రూపంగా లెక్కకొస్తుంది. మరొక సరుకుతో తక్షణం మారగలగే రూపాన్ని పొందుతుంది. అందువల్ల, వేరొక సరుక్కి విలువగా అగపడాలంటే, ఆసరుకు దాని ప్రాకృతిక రూపానికి భిన్న మైన రూపాన్ని తీసుకోవాల్సిన అవసరం లేదు.- Appendix to the 1st German edition of Capital, volume 1

## సమానక రూపంలో(విలువ) పరిమాణాత్మక నిర్ధారణ వుండదు

కోటు రూపంలో వున్న వస్తువు బట్టతో నేరుగా మారుతుంది. లేక బంగారం రూపంలో వున్న వస్తువు ఏదయినా అన్ని ఇతర సరుకులతో మారగలదు – ఈ వస్తువు సమానక రూపం ఏ మాత్రం పరిమాణాత్మక నిర్ధారణ కలిగి వుండదు. కలిగి వుంటుంది అనే పొరపాటు అభిప్రాయమూ వుంది. ఇందుకు కారణాలు:

1. బట్ట విలువని వ్యక్తీకరించే కోటు కూడా పరిమాణాత్మకంగా నిర్దిష్టమమైనదే. 1 కోటు ,12 కోటులు కావు లాగా.ఒకటి అనేది కోటు నిర్దిష్ట పరిమాణమే. కనుక సమానక రూపంలో పరిమాణాత్మక నిర్ధారణ వుంటుంది అనిపిస్తుంది.

ఒక కోటు 12 కోటులు కాదు. ఎందువల్ల? 20 గజాల బట్ట తన సాపేక్ష విలువ వ్యక్తీకరణలో కేవలం విలువగానే కాకుండా,అదేసమయంలో నిర్దిష్ట పరిమాణంగల విలువగా కూడా కొలవబడుతుంది. 1 కోటు, (12 కోటులు కాదు),20 గజాలబట్టలో ఎంత శ్రమ వుందో అంటే శ్రమను కలిగి వుంది కనుకనే 20 గజాల బట్టకు సమానం. ఈ విషయానికీ, బట్టతో నేరుగా మారే కోటు వంటి సరుకు ప్రత్యేకధర్మానికి ఏమీ సంబంధంలేదు.

2.నిర్దిష్ట విలువ పరిమాణంగా బట్ట 20 గజాలు 1 కోటులో వ్యక్తమయితే, అప్పుడు విపర్యయంగా(conversely) ఒక కోటు విలువ పరిమాణాన్ని కూడా 20 గజాల బట్టలో చెప్పవచ్చు.

అయితే పరోక్షంగా మాత్రమే, ఈసమీకరణని తిరగదిప్పడం ద్వారా మాత్రమే. కోటు సమానకం పాత్రలో ఉన్నంతవరకు ఇది కుదరదు. సాపేక్ష విలువ రూపంలో ఉన్నప్పుడే ఇది సాధ్యం.

3. ఇదే ఫార్ములాని- 20 గజాల బట్ట = 1 కోటు,లేక 20 గజాల బట్ట 1 కోటంత –అనేదాన్ని ఇలాకూడా చెప్పవచ్చు:

20 గజాల బట్ట 1 కోటు సమానకాలు (equivalents), సమాన పరిమాణంలో వున్న విలువలు.

ఇక్కడ మనం ఏసరుకు విలువనీ, రెండో సరుకు ఉపయోగపు విలువలో వ్యక్తం చెయ్యడం లేదు.కనుక దేన్నీ సమానకం స్థానంలో వుంచడం లేదు. ఇక్కడ సమానక అంటే 'పరిమాణంలో సమానమైన వస్తువు' అని అర్థం.

"కోటు బట్టకు సమానకంగా ఉంటే, కోటులు బట్టతో నేరుగా మారకంకాగల లాక్షణిక ధర్మాన్ని పొందుతాయి. అంతమాత్రాన అవి ఏ నిష్పత్తిలో మారతాయో చెప్పినట్లు అవదు." కాపిటల్1 .....

మారక నిష్పత్తి రెండు వస్తువుల ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్నిబట్టి నిర్ణయం అవుతుంది.

"బట్ట విలువ పరిమాణం ఇవ్వబడింది కనుక ఈ నిష్పత్తి కోటు విలువ పరిమాణాన్ని బట్టి ఉంటుంది. కోటు సమానకంగానూ, బట్ట సాపేక్ష విలువగానూ వ్యక్తమైనా, ఇందుకు భిన్నంగా బట్ట సమానకంగానూ, కోటు సాపేక్ష విలువగానూ వ్యక్తమైనా , కోటు విలువ పరిమాణం ఎప్పటిలాగే దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలం చేత నిర్ణయ మవుతుంది.అందువల్ల కోటు విలువ పరిమాణం కోటు విలువ రూపం నుండి స్వతంత్రంగా వుంటుంది." –కాపిటల్1.....

ఈ మారక సంబంధాన్ని కోటుల విలువా,బట్ట విలువా రెండూ నిర్ణయించినప్పటికీ, కోటు సమానకం రూపంలో తేగల పరిమాణాలు కోటు విలువకు ఒక వ్యక్తీకరణ కావు.

"విలువ వ్యక్తీకరణలో కోటులు సమానకం స్థానంలో ఉంటే, వాటి విలువల పరిమాణం వ్యక్తంకావు.అంతకన్నా అవి ఒకానొక వస్తువు యొక్క నిర్దిష్ట మొత్తాలుగా లెక్కకొస్తాయి ."-కాపిటల్1 ...

ఈ సమీకరణలో కోటు విలువ పరిమాణం వ్యక్తం కాదు.

సమానక రూపం కోటుల పరిమాణాన్ని చెబుతుంది: 20 గజాల బట్ట 2 కోట్లో 5 కోట్లో కాదు, ఒక్క కోటే. కోటు విలువ సగానికి పడిపోతే 20 గజాల బట్ట 2 కోటులు. దీన్ని బట్టి, కోటుల పరిమాణం ఆకోటు ల విలువ పరిమాణం యొక్క వ్యక్తీకరణ కాదా? కాదు.ఎందుకంటే,

1." ఈ సంబంధంలో కోటు లు ఒక వస్తువు యొక్క పరిమాణాలుగా లెక్కకొస్తాయి, కానివిలువ పరిమాణాలుగా కాదు.

40 గజాల బట్ట విలువ- ఏమిటి?2 కోటు లు. ఇక్కడ కోటు లు సమానకం పాత్ర పోషిస్తున్నాయి. అంటే బట్టకు సంబంధించి ఉపయోగపువిలువ అయిన కోటు విలువ మూర్తి గా లెక్కకొస్తుంది. కనుక కొంత నిర్దిష్ట పరిమాణంలో ఉన్న బట్ట విలువ వ్యక్తీకరణకు ఇన్ని కోటులు అని సంఖ్య చాలు."- కాపిటల్1 ..

2. " రెండు కోటులు 40 గజాల బట్ట విలువ పరిమాణాన్ని చెప్ప గలవు .కానీ తనసొంత విలువ పరిమాణాన్ని,(అంటే) కోటుల విలువ పరిమాణాన్నిఎప్పటికీ చెప్పలేవు."- కాపిటల్ 1.......

(ఈ విషయం ధర ప్రమాణం, విలువ కొలతల గురించి మార్క్స్ చర్చించే చోట మళ్ళీ వస్తుంది).

## సమానక రూపానికున్న ప్రత్యేకతలు

ఇక సమానక రూపానికి 3 ప్రత్యేకతలున్నాయి.

1. సరుకు భౌతికరూపం విలువరూపం అవుతుంది

2.నిర్దిష్ట శ్రమ, దానికి విరుద్ధమైన అనిర్దిష్ట శ్రమ రూపం అవుతుంది

3. ప్రైవేట్ శ్రమ సామాజిక శ్రమలో వ్యక్తం అవుతుంది.

### *1. ఉపయోగపు విలువ,దానికి విరుద్ధమైన విలువ అగపడే రూపం అవుతుంది.*

***ఈ ప్రత్యేకత మౌలికమయినది కాదు. కాకపోయినా 3 ప్రత్యేకతల లోనూ స్పష్టమైనది.***

***సరుకు భౌతికరూపం విలువరూపం అవుతుంది.***

"అయితే గమనించాల్సిన విషయం, ఈ తిరగబడడం అనేది B సరుకుకి (కోటో, ధాన్యమో, ఇనుమో మరొకటో)మాత్రమే సంభవిస్తుంది- మరేదో సరుకు A (బట్ట మొదలైనవి)దానితో విలువ సంబంధంలోకి వచ్చినప్పుడు మాత్రమే. అప్పుడైనా, ఈ సంబంధం పరిమితుల్లో మాత్రమే."

విడిగా చూస్తే కోటు ఒక ప్రయోజనకర వస్తువు,ఒక ఉపయోగపు విలువ. బట్టేలాగే అలాగే. ఏసరుకూ తనకు తానే సమానకంగా వుండజాలదు.అందువల్ల, తన భౌతిక రూపాన్ని తనసొంత విలువ వ్యక్తీకరణగా

చెయ్యలేదు. ఆకారణంగా అది మరొక సరుకును సమానకంగా సంబంధంలోకి తెచ్చి తీరాలి. అంటే,మరొక సరుకు శరీరాన్ని తనసొంత విలువ రూపంగా ఆమోదించి తీరాలి.

బట్ట విలువ కోటులో వ్యక్తం కావడమూ, ఒక చక్కెర గడ్డ (sugar loaf )తనబరువుని ఇనప బరువు రాళ్ళలో వ్యక్తం చెయ్యడమూ ఒకేలాంటివి అంటాడు.(19 వ శతాబ్దం చివరిదశ దాకా చక్కెర పలుకులుగా ఉండేది కాదు.ఎత్తైన గడ్డలుగా దొరికేది ఒక్కొక్క గడ్డ 3 కిలోలనించి 15 కిలోల దాకా ఉండేది. దాన్ని పలుకులుచేసే ప్రత్యేక పరికరాలు వంటిళ్లలో ఉండేవి.)

చక్కెర గడ్డ ఒక శరీరం, దానికీ బరువు వుంటుంది.దాన్ని చూచో, తాకో దాని బరువెంతో చెప్పలేం.అందుకోసం కొన్నివేర్వేరు ఇనుప ముక్కలు తీసుకుంటాం. వాటి బరువు ముందుగానే నిర్ణయమై వుంటుంది.(కిలో, అరకిలో, 100 గ్రాములు ఇలా) చక్కెర గడ్డ భౌతిక రూపం ఎలా బరువు అగపడే రూపం కాదో, ఇనుం భౌతిక రూపం కూడా బరువు అగపడే రూపం కాదు.(చక్కెర గడ్డలో బరువు కనబడదు కదా , అలాగే ఇనుము లో నూ కనబడదు.) అయినా, చక్కెర గడ్డ బరువు వ్యక్తం చెయ్యడానికి, దాన్ని ఇనుముతో బరువు సంబంధంలో పెడతాం.ఈ సంబంధంలో ఇనుము బరువుకు తప్ప మరి దేనికీ ప్రాతినిధ్యం వహించని వస్తువు.అందువల్ల ఇనుం పరిమాణాలు చక్కెర బరువుని కొలిచేవిగా వుంటాయి.పంచదార శరీరానికి సంబంధించి అవి కేవలం బరువు అగపడే రూపాలు మాత్రమే. చక్కెరో,మరొకటో శరీరం బరువు కనుక్కునే సంబంధంలో ప్రవేశించి నప్పుడు మాత్రమే ఇనుం ఈ పాత్రను పోషిస్తుంది.వాటికి బరువు లేకపోతే ఈ సంబంధంలోకి రాలేవు.ఒకటి మరొకదాని బరువు వ్యక్తం చేసేదిగా వుండలేదు. రెంటిని తక్కెడ సిబ్బెల్లో వేస్తే, బరువులుగా రెండూ ఒకలాంటివే. కనుక ఎదో నిష్పత్తిలో ఒకే బరువు తూగుతాయి. ఇక్కడ ఇనుం కేవలం బరువుకి ప్రతినిధిగా ఉన్నట్లే, మన విలువ వ్యక్తీకరణలో కోటు కేవలం విలువకి ప్రతినిధిగా వుంటుంది.

పోలిక ఇంత వరకే. చక్కెరగడ్డ బరువు వ్యక్తీకరణలో ఇనుం ఒక స్వాభావిక ధర్మానికి- రెండు వస్తువులకూ ఉమ్మడిగా ఉన్న ధర్మానికి – అంటే వాటి బరువుకి- ప్రతినిధిగా వుంది; కాని బట్ట విలువ వ్యక్తీకరణలో, కోటు స్వాభావిక ధర్మం కాని ధర్మానికి, రెంటికి వున్న ధర్మానికి, కేవలం సామాజికమైన ధర్మానికి, అంటే వాటి విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

బరువు శరీర ధర్మం.భౌతిక ధర్మం. విలువ సామాజిక ధర్మం.విలువ సామాజిక మైనది అని సమానక రూపం చెప్పదు. సాపేక్ష రూపం అలాగని తెలియజేస్తుంది.

"ఒక సరుకు సాపేక్ష విలువ రూపం, ఆసరుకు విలువను వ్యక్తం చేస్తుంది - ఆసరుకు పదార్థం నుండీ, ధర్మాలనుండీ పూర్తిగా భిన్నమైనదిగా ఉదాహరణకి, కోటు వంటిది అయినట్లుగా; అలా వ్యక్తం చేస్తుంది కనుక ఈ వ్యక్తీకరణే తన వెనక ఎదో సామాజిక సంబంధం దాగి వున్నట్లు సూచిస్తుంది. సాపేక్ష విలువ రూపానికి సంబంధించిన విషయం ఇదీ."-కాపిటల్1

విలువ సాపేక్ష రూపం తానొక సామాజిక సంబంధం యొక్క వ్యక్తీకరణ అయినట్లు అదే సూచిస్తుంది. ఎలాగంటే, అది బట్టని మరొక సరుకుతో కోటుతో సంబంధంలో పెడుతుంది. సమానక రూపం

అలాకాదు.బట్టను కొనగలిగే కోటు యొక్క ప్రాకృతిక ధర్మం అయినట్లు కనబడుతుంది. ఇప్పుడు ఎవరైనా కాదని ఇలా వాదించవచ్చు: బట్టతో మారగలగడం కోటుకి ప్రాకృతిక ధర్మం గా కనబడదు ఎందుకంటే, కోటుకి ఈ ధర్మం బట్టతో సంబంధంలో పెట్టినప్పుడు మాత్రమే వుంటుంది.

సమానక రూపానికొచ్చేసరికి,సంగతంతా తారుమారుగా వుంటుంది.

## సమానక రూపం మార్మికత

సమానక రూపం యొక్క సారం ఏమంటే:

కోటు తన భౌతిక రూపంతో, కోటురూపంతోనే బట్ట విలువని వ్యక్తం చేస్తుంది. కనుక ప్రకృతే కోటుకి విలువ రూపాన్నిచ్చింది- అనిపిస్తుంది. అయితే బట్టకు సమానకంగా కోటు విలువ సంబంధంలో ఉన్నంతసేపే, ఇది సరైనదిగా వుంటుంది. ఆసంబంధం బయట వుండదు. దానికీ ఆవల కోటు భౌతిక ధర్మాలలో విలువ వుండదు.

ఏమైనా ఒక వస్తువు ధర్మాలు ఇతరవస్తువులతో దాని సంబంధాల ఫలితంగా ఏర్పడేవి కావు. అలాంటి సంబంధాలలో ఆధార్మాలు తమ్ముతాము వ్యక్తం చేసుకుంటాయి. కనుక సమానక రూపం , నేరుగా మారకంకాగల దాని ధర్మం – బరువుగా ఉండడం అనే ధర్మం లాగానే – కోటుకు ప్రకృతే ఇచ్చిందనిపిస్తుంది. ఇందువల్లే సమానక రూపానికి గూఢత్వం. ఇదే సమానక రూపంలో ఉన్న మార్మికత.

దీన్ని ఎలా వివరించాలి?

నేరుగా మారకం కాగల సమాకం ధర్మం బరువు లాంటి ప్రాకృతిక ధర్మం కాదు. అది పొద్దాకులూ దానికి ఉండేది కాదు. ఆ ప్రత్యేక విలువ సంబంధంలో మాత్రమే దానికి ఆధర్మం ఉంటుంది.

ఇలా వివరించాల్సి వుండగా, ఈ మార్మిక స్వభావాన్ని బూర్జువా ఆర్థికవేత్తలు గమనించలేదు. ఈ (సమానక)రూపం సంపూర్ణంగా అభివృద్ధి చెంది డబ్బు రూపంలో ఎదురుపడే దాకా వాళ్ళు ఈ స్వభావాన్ని గమనించనే లేదు.

ఒక వస్తువు ధర్మాలు ఇతరసరుకులతో దాని సంబంధాలవల్ల ఏర్పడవు. అలాంటి సంబంధాల్లో వ్యక్తమవుతాయి. కనుక కోటు తన సమానకం రూపంవల్ల నేరుగా మారకంకాగల ధర్మం ప్రకృతే కలిగించినట్లు అనిపిస్తుంది. బరువుగా వుండడం, మనల్ని వెచ్చగా వుంచడం లాంటి భౌతిక ధర్మం లాగా అనిపిస్తుంది.ఇదే, ఈ సమానక రూపం యొక్క మార్మిక స్వభావం, బూర్జువా రాజకీయ ఆర్థికవేత్త దృష్టి నించి తప్పించుకున్నది. ఎప్పటిదాకా వాళ్ళు కనుక్కోలేదంటే, ఈ రూపం పూర్తిగా అభివృద్ధి చెంది డబ్బు రూపంలో ఎదురుపడే దాకా. అంటే సమానక రూపం యొక్క మార్మికత అతనికి తట్టనేలేదు- డబ్బు ఏర్పడే దాకా. అప్పుడు ఏం చేశాడు ? అప్పుడతను బంగారం వెండి యొక్క మార్మిక స్వభావాన్ని వివరించేందుకుకు పూనుకున్నాడు .ఒకటి కాకపోతే మరొకటి, ఎన్నో సమానకాలు ఉన్నట్లు చెప్పి సరిపెట్టారు. చరిత్రలో కాలాన్నిబట్టి వాటికన్నా తక్కువ మిరుమిట్లు గొలిపే వస్తువుల్ని ప్రత్యామ్నాలను ఏకరువు పెట్టాడు. ఏది

ఎప్పుడు సమానకంగా ఉన్నదో, ఆవస్తువుల పట్టికను/జాబితాను తయారు చేశాడు. వాటన్నిటికీ స్వతస్సిద్ధంగా నేరుగా మారగల ధర్మం ఉన్నట్లుగా నిర్ధారించి పొరబడ్డాడు.

మారక సంబంధంలో బయటపడే దాన్ని సమానకం యొక్క భౌతిక ధర్మంగా భావించాడు.

ఆవిధంగా వెండి బంగారాల నిగూఢ లక్షణాన్ని వివరించడానికి ప్రయత్నించాడు. అయితే 20 గజాల బట్ట = 1 కోటు లాంటి సరళ విలువ వ్యక్తీకరణ ఇప్పటికే సమానకం రూపం సమస్యని (riddle) పరిష్కారం కోసం మనముందు పెట్టినట్లు అతను ఎరగడు. కాపిటల్ 1 .63

## *2. అనిర్దిష్ట శ్రమ నిర్దిష్ట శ్రమలో వ్యక్తం అవుతుంది.*

"సమానకంగా ఉండే సరుకు శరీరం ఎప్పుడూ అనిర్దిష్ట శ్రమ పాదార్థీకరణగా(materialisation) లెక్కకొస్తుంది, అదే సమయంలో అది ఒక ప్రత్యేక, ప్రయోజనకర నిర్దిష్ట శ్రమ ఉత్పాదితం కూడా ."-కాపిటల్1.64

అందువల్ల, నిర్దిష్ట శ్రమ అనిర్దిష్ట శ్రమని వ్యక్తం చేసే మాధ్యమం (medium)అవుతుంది.

మనఉదాహరణలో కోటు ఒకవైపు అనిర్దిష్ట మానవ శ్రమ మూర్తి(embodiment) తప్ప మరేమీ కాదు. మరొకవైపు, కోటులో వాస్తవంగా ఇమిడివున్న కుట్టుశ్రమ, ఆఅనిర్దిష్ట మానవ శ్రమ ఏరూపంలో సిద్ధిస్తుందో ఆరూపంగా మాత్రమే లెక్కకొస్తుంది.

"బట్ట విలువ వ్యక్తీకరణలో, కుట్టు శ్రమ ప్రయోజనం బట్టలు కుట్టడంలో లేదు; తక్షణమే విలువగా గుర్తించదగిన వస్తువును చెయ్యడంలో ఉంది." అందువల్ల శ్రమ పేరుడుగా (congelation) ఉండడంలో ఆప్రయోజనం ఉంది. -బట్ట విలువలో సిద్ధించిన శ్రమకి ఏమాత్రం భిన్నం కాని శ్రమ పేరుడుగా (congelation) ఉండడంలో ఆప్రయోజనం ఉంది. అలా విలువకి అద్దం గా పనిచెయ్యాలంటే, కుట్టు శ్రమ సాధారణ మానవ శ్రమ అయిన తన అనిర్దిష్ట లక్షణాన్ని ప్రతిబింబించి తీరాలి. కుట్టుపనిలో, నేత పనిలో లాగానే మానవ శ్రమ శక్తి వ్యయమవుతుంది. కాబట్టి రెండూ మానవ శ్రమ అనే సాధారణ ధర్మాన్ని కలిగి ఉన్నాయి. అందువల్ల, విలువ ఉత్పత్తి వంటి కొన్ని సందర్భాలలో రెంటినీ ఈ ఒక్క అంశం లోనే పరిగణించాలి. ఇందులో నిగూఢమయింది ఏదీ లేదు. ఏ మాయా మర్మం లేదు, కాని విలువ వ్యక్తీకరణలో విషయం తలకిందులుగా వుంటుంది. ఉదాహరణకి, నేత విలువని ఏర్పరుస్తుంది అనే వాస్తవం -నేత అయినందువల్ల కాదు,మానవ శ్రమ అయి ఉండడం వల్ల అనే వాస్తవం-ఎలా వ్యక్తం కావాలి?- నేత శ్రమని, మరొక నిర్దిష్ట శ్రమ అయిన కుట్టు శ్రమకి - మరొకవైపు ఉంచడం ద్వారా. కోటు తన శరీర రూపంలో విలువ యొక్క ప్రత్యక్ష వ్యక్తీకరణ అయినట్లు గానే, ఇప్పుడు నిర్దిష్ట శ్రమ అయిన కుట్టు శ్రమ కూడా సాధారణ మానవ శ్రమ మూర్తిగా కనబడుతుంది.

"బట్ట విలువ వ్యక్తీకరణలో, కోటు విలువ శరీరంగా లెక్కకొస్తుంది. అందువల్ల కోటు శరీరరూపం విలువ శరీరంగా లెక్కకొస్తుంది. అంటే, ఏ వ్యత్యాసం లేని మానవ శ్రమమూర్తిగా" అన్న మాట. అయితే కోటుని చేసింది, కోటుకి ఆరూపాన్ని ఇచ్చిందీ అనిర్దిష్ట మానవ శ్రమ కానేకాదు, ప్రయోజనకర, నిర్దిష్ట తరహా శ్రమ-కుట్టు శ్రమ. సరళ విలువ రూపంలో ఒక సరుకు విలువ, మరొకరకం సరుకులో, అదీ ఒకే ఒక్క రకం సరుకులో

వ్యక్తమవాలి. ఆ మరొక సరుకు ఏది అనేది పూర్తిగా అప్రస్తుతం.బట్ట విలువ కోటులోనే కాదు, గోధుమల్లో, ఇనుంలో మరెందులోనైనా వ్యక్తం చెయ్యవచ్చు.ప్రతి సందర్భంలోనూ సమానకం బట్టకు సంబంధించి విలువ శరీరంగా, ఆకారణంగా మానవ శ్రమమూర్తిగా, లెక్కకొస్తుంది. అలాగే ప్రతి సందర్భంలోనూ సమానకం యొక్క శరీర రూపం (అది కోటో, ఇనుమో, గోదుమో ఏదయినా కావచ్చు)అనిర్దిష్ట మానవ శ్రమ మూర్తి కాదు, ఒక నిర్దిష్ట, ప్రయోజనకర శ్రమ మూర్తి,ఆకారం.ఆ శ్రమ కుట్టు పనో,పొలం పనో,గనితవ్వే పనో మరేదైనా కావచ్చు. అందువల్ల, సమానకం శరీరాన్ని(కోటుని ) ఉత్పత్తి చేసిన నిర్దిష్ట శ్రమ, విలువ వ్యక్తీకరణలో సిద్ధింపు రూపంగా(form of realisation) , అగపడే రూపంగా(form of appearance), అంటే, అనిర్దిష్ట మానవ శ్రమ రూపంగా లెక్కకు రావాలి." ఉదాహరణకు కోటు, విలువ శరీరంగా,అందువల్ల మానవ శ్రమ ఆకృతిగా మాత్రమే లెక్కకొస్తుంది.

సమానకం అయిన కోటులో కుట్టు శ్రమ దాగి ఉంది. బట్ట విలువ వ్యక్తీకరణ లోపల 'ఆశ్రమ' మానవ శ్రమ కూడా అనే లక్షణాన్ని కలిగి ఉండదు. తద్భిన్నంగా మానవ శ్రమ కావడం దాని సారంగా లెక్కకొస్తుంది. కుట్టుశ్రమ అయివుండడం, ఆసారం అగపడే రూపంగా లెక్కకొస్తుంది.

ఇలా తారుమారు గావడం అనివార్యం. ఎందుకంటే, శ్రమ వుత్పాదితంలో ప్రాతినిధ్యం వహించే శ్రమ, ఏ తారతమ్యమూ లేని మానవ శ్రమ అయిన మేరకు మాత్రమే, విలువని ఏర్పరుస్తుంది. ఆ ఉత్పాదితం విలువలో వస్తూత్వం చెందిన శ్రమ, మరొక ఉత్పాదితం విలువలో వస్తూత్వం చెందిన శ్రమకి ఏవిధంగానూ వ్యత్యాసమైనది కాదు.

అందువల్ల సమానకం రెండో ప్రత్యేకత: నిర్దిష్ట శ్రమ,దానికి విరుద్ధమైన అనిర్దిష్ట శ్రమ తననుతాను వ్యక్తం చేసుకునే రూపం అవుతుంది.

### *3. ప్రైవేట్ శ్రమ సామాజిక శ్రమలో వ్యక్తం అవుతుంది.*

విలువ సంబంధం వ్యక్తులు తమసరుకుల విలువలు వ్యక్తం చెయ్యడానికి ఉపయోగించే సామాజిక సంబంధం. కుట్టు శ్రమ తేడాలేని మానవ శ్రమతో మమేకం(identical) అవుతుంది. అది మరే ఇతర శ్రమవంటిదే అవుతుంది. బట్టలో రూపొందిన శ్రమ వంటిదే అవుతుంది. ఫలితంగా, ఆశ్రమ ప్రైవేట్ వ్యక్తుల శ్రమ.అయినాగాని అదే సమయంలో ఆశ్రమ స్వభావంలో సామాజికమైనదిగా వ్యవహరిస్తుంది.ఇతర సరుకులతో నేరుగా మారగల సరుకులో ఫలించడానికి ఇదే కారణం. దీంతో ఇ సమానక రూపానికి మూడో ప్రత్యేకత ఉన్నట్లవుతుంది. అదేమంటే, ప్రైవేటు వ్యక్తుల శ్రమ, దానికి విరుద్ధమైన సామాజిక శ్రమ రూపం పొందుతుంది.

ఒకరితో ఒకరు సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉత్పత్తిచేసే ప్రైవేటు వ్యక్తుల శ్రమ ఉతాదితాలు అయితేనే అవి సరుకులు అవుతాయి. ఒకరి ఉత్పాదితాలతో మరొకరు అవసరాలు తీర్చు కుంటారు. ప్రైవేట్ వ్యక్తుల పరస్పర సంబంధం వాళ్ళ వాళ్ళ ఉత్పాదితాల మారకం ద్వారా సిద్ధిస్తుంది. కనుక ప్రైవేట్ శ్రమ ఉత్పాదితం

– విలువ రూపం కలిగి వున్న మేరకు,అందువల్ల ఇతర ఉత్పాదితాలతో మారకం కాగల రూపం కలిగివున్న మేరకు- సామాజిక రూపం కలిగి వుంటుంది. దానికీ సామాజిక రూపం ఎప్పుడు ఉంటుందంటే, దాని శరీర రూపం అదే సమయంలో మరొక సరుకుతో మారకం కాగల రూపం అయినప్పుడు, మరొక సరుక్కి విలువ రూపంగా లేక్కకొచ్చినప్పుడు. ఏమైనా, ఆ సరుకు విలువ సంబంధంలో సమానకంగా ఉన్నప్పుడు మాత్రమే ఇలా జరుగుతుంది. మరొక సరుకుతొ మారగల రూపాన్ని కలిగి ఉన్న మేరకు , మరొక సరుక్కి విలువ శరీరంగా లెక్కకొచ్చి, సమానమైన మేరకు, సమానకం సామాజిక రూపం పొందుతుంది. అందువల్ల, దానిలోని శ్రమ సామాజిక రూపంలో – అంటే,మరొక సరుకులో ఉన్న బ శ్రమతో సమానమైన రూపంలో – లెక్కకొస్తుంది.సరుకులు ఉత్పత్తి చేసే అన్ని శ్రమల లాగే అది ప్రైవేట్ శ్రమ అయినాగాని, అది సామాజిక రుపంలొౌన్న శ్రమ. ఎందుకంటే, ఇందువల్లే అది ఇతరసరుకులతో మారకం కాగల ఉత్పాదితంలో ప్రాతినిధ్యం వహించ బడుతుంది.

## సరళ విలువ రూపం మొత్తంగా

సరళ విలువ రూపాన్నిరెండు ధృవాలుగా విడగొట్టి, సాపేక్ష సమానక రూపాల్ని విడివిడిగా గుణాత్మకం గాను, పరిమాణా త్మకం గానూ పరిశీలించిన తర్వాత ,ఇప్పుడు తిరిగి రెంటినీ కలిపి మొత్తం మీద తన విశ్లేషణలో తేలిన విషయాల్ని చెబుతాడు.

<u>మారకం విలువనేది సరుకు విలువ స్వతంత్రంగా అగపడే రూపం</u>

"ఒకసరుకు ప్రాధమిక విలువ రూపం మరొక రకం సరుకుతో దాని విలువ సంబంధాన్ని లేక మారక సంబంధాన్ని వ్యక్తీకరించే సమీకరణలో ఇమిడి ఉంటుంది."-కాపిటల్ 1.66 విలువ గుణాత్మకంగానూ , పరిమాణాత్మకంగానూ వ్యక్తంకావాలి

1.B సరుకుతో (కోటుతో )నేరుగా మారగలగడం వల్ల A సరుకు (బట్ట) విలువ గుణాత్మకంగా వ్యక్తమవుతుంది.

2. ఫలానిన్ని కోటు లు . ఫలానిన్నిగజాల బట్టతో మారకం కగలగడం వల్ల బట్ట విలువ పరిమాణా త్మకంగా వ్యక్తమవుతుంది.

విలువ వ్యక్తీకరణలో రెండు ధ్రువాలుంటాయి,1. సాపేక్ష విలువ రూపం, 2.సమానక రూపం

"సమానకంగా వున్న సరుకు విలువ ఆకారంగా, తక్షణం మారకం కాగల శరీరంగా -<u>మారకం విలువగా-లెక్కకొస్తుంది.</u>

ఈ సందర్భంలో మొదటి కూర్పులో సమానకం గురించి ఇలా అంటాడు:" సమానకంగా వ్యవహరించే సరుకు, మరొక సరుక్కి విలువ మూర్తిగా, నేరుగా మారగల వస్తువుగా, మారకం విలువగా లెక్కకొస్తుంది."

"అందువల్ల మారకం విలువనేది సరుకు విలువ స్వతంత్రంగా అగపడే రూపం" అనుబంధం

స్వతంత్రంగా అంటే: దాని ఉపయోగపువిలువ నుండి స్వతంత్రంగా అని.

విలువా, మారకం విలువా  ఒకటి కాదు

అని ఇక్కడ స్పష్టంగా చెబుతాడు:

"ఈ చాప్టర్ మొదట్లో వాడుక సరళిలో సరుకు ఉపయోగపు విలువా, మారకం విలువా అని అన్నాం.కచ్చితంగా అయితే అది తప్పు. సరుకు ఉపయోగపు విలువా,.......విలువా. ఒక సరుకు విలువ ప్రత్యేక వ్యక్తీకరణ రూపం-ఇది దాని భౌతిక రూపానికి భిన్నంగా వుంటుంది- పొందీ పొందగానే ద్వంద్వ వస్తువుగా కనబడుతుంది. "

ఈ వ్యక్తీకరణ రూపమే మారకం విలువ.

ఒక సరుకు ఒంటరిగా విడిగా వున్నప్పుడు దానికి ఈ రూపం ఉండదు. అయితే మరొక రకం సరుకుతో విలువ సంబంధంలో పెట్టినప్పుడుమాత్రమే  ఈ రూపం వస్తుంది.ఈ విషయం తెలిస్తే చాలు, మనం చెప్పే పద్ధతివల్ల ప్రమాదం ఏమీ ఉండదు.అదొక క్లుప్త రూపంగా ఉపకరిస్తుంది."

Marginal Notes on Wagnar లో సూటిగా చెప్పాడు : " నాకు సరుకు విలువ అనేది దాని ఉపయోగపు విలువాకాదు, మారకం విలువా కాదు." అంటాడు.

అదే రచనలో మరొకచోట:" సరుకు ఒకవైపు ఉపయోగపు విలువ, మరొకవైపు విలువ,మారకపు విలువ కాదు.ఎందుకంటే,వ్యక్తీకరణ రూపం దాని సొంత సారం కాజాలదు."

విలువకీ  మారకం విలువకీ వున్నా తేడా ఏమిటో స్పష్ట పరిచాడు. రాడ్ బెర్టస్ గురించి చెబుతూ  ఆయన " మారకం విలువని విశ్లేషించివుంటే  ఈ వ్యక్తీకరణ రూపం  వెనకవున్న  విలువని పట్టుకుని వుండే వాడు.

మారకం విలువ సరుకులోపల ఉండదు, విలువ సరుకు  లోపలే ఉన్నప్పటికీ.-

మానవ శ్రమ కోటులో పేరుకొని (accumulated) వుంది.-మార్క్స్ . Human labour is therefore accumulated in it.-కాపిటల్1 .58

మారకం విలువనేది  సరుకు విలువ స్వతంత్రంగా అగపడే  రూపం.

తేలిన మరొక విషయం :

" విలువ రూపం (అంటే,ఒక సరుకు విలువ వ్యక్తీకరణ) సరుకు విలువ స్వభావం నుండే జనిస్తుంది"

విలువా విలువ పరిమాణమూ మారకం విలువ గా వాటి వ్యక్తీ కరణలో జనిస్తాయని విశ్లేషణ తెలుపలేదు. అయితే ఈ రెండో అభిప్రాయం  మర్కెంట లిష్టులకీ, వారి సిద్ధాంతాన్ని పునరిద్ధరించిన ఫెరియర్ , గనీల్ లాంటి వారికి ప్రబలంగా వుంది.

విశ్లేషణలో తేలిన మరొక విషయం:

" ఈ సంబంధంలోపల  A (బట్ట) ఉపయోగపు విలువగా మాత్రమే లెక్కకొస్తుంది. ప్రతి సరుకులోను అంతర్గతంగా ఉపయోగపు విలువ, వలువల మధ్య ఉండే వ్యతిరేకతా,లేక తేడా, రెండు సరుకులు ఒకదానితో ఒకటి సంబంధంలో పెట్టడం  బహిరంగంగా స్పష్టపడుతుంది. ఏ సరుకు విలువ వ్యక్తమవాలో ఆసరుకు కేవలం ఉపయోగపు విలువగా మాత్రమే లెక్కకొస్తుంది. ఆవిలువ ఏ సరుకులో వ్యక్తం అవుతుందో, ఆసరుకు కేవలం మారకపు విలువగా వ్యవహరిస్తుంది. అందువల్ల ఒక సరుకు ప్రాధమిక విలువ రూపం  అనేది ఏ రూపంలో

అయితే సరుకులో ఇమిడివున్న తేడా – ఉపయోగపువిలువకూ మధ్య తేడా –బయట పడుతుందో ఆప్రాధమిక రూపం.

సరళ విలువరూపం అనేది చారిత్రకంగా శ్రమ ఉత్పాదితం సరుకుగా కనబడే ఆదిమ రూపం

అన్ని సమాజాల్లోనూ శ్రమ ఉత్పాదితం ఒక ప్రయోజనకర వస్తువు; అయితే ఒక ప్రత్యేక చారిత్రిక దశలో మాత్రమే శ్రమ ఉత్పాదితం సరుకు అవుతుంది. చారిత్రక అభివృద్ధిక్రమంలో ఒకానొక కాలంలో మాత్రమే ఒక ప్రయోజనకర వస్తువు ఉత్పత్తిలో వ్యయమైన శ్రమ విలువకి ప్రతినిధి అవుతుంది, శ్రమ ఉత్పాదితం సరుకుగా మారుతుంది. ఒక ప్రయోజనకర వస్తువు ఉత్పత్తికి వ్యయించిన శ్రమ ఆ వస్తువు యొక్క ఒక వస్తుగత లక్షణంగా ate దాని విలువగా ఏ దశలో వ్యక్తమవుతుందో ఆదశలో అన్నమాట. దీని నించి వచ్చేదేమంటే :

***సరళ విలువరూపం అనేది చారిత్రకంగా శ్రమ ఉత్పాదితం సరుకుగా కనబడే ఆదిమ రూపం కూడా.***

దీని నించి తదుపరి నిర్ధారణ వస్తుంది :సరళ విలువ రూపం అదేసమయంలో శ్రమ ఉత్పాదితం యొక్క సరళ సరుకు రూపం అంతేకాదు, సరుకు రూపపు అభివృద్ధి విలువ రూపపు అభివృద్ధితో పాటు సాగుతుంది.

"ఇంతదాకా, ఆర్థికవేత్తలు ఎంతో సింపుల్ అయిన పాయింట్ ని గమనించ లేదు: 20 గజాల బట్ట = 1 కోటు అనేది 20 గజాల బట్ట =2 పౌన్లు అనేదానికి అభివృద్ధి చెందని రూపం అనేదే అది. ఈ రూపమే డబ్బు రూపపు రహస్యాన్ని , దానిలో పిండ రూపంలో ఉత్పాదితం యొక్క అన్ని బూర్జువా రూపాల్ని ఇముడ్చుకొని వుంది "- Sel cor p.177 letter to Engels

**సరళ విలువ రూపం సరిపోదు. అందులోని లోపాలు**

కోటుతో బట్ట విలువ సంబంధంలో బట్ట భౌతిక రూపం ఉపయోగపు విలువగానూ, కోటు భౌతికరూపం విలువరూ పంగాను(లేక మారకం విలువ ఆకారంగానూ) లెక్కకొస్తాయి. ఒక సరుకులో అంతర్గతంగా ఉపయోగపు విలువకీ విలువకీ వున్న వైరుధ్యం ఆవిధంగా బహిర్గత వ్యతిరేకత ద్వారా ప్రాతినిధ్యం పొందుతుంది. అంటే రెండు సరుకుల సంబంధంలో ఒక సరుకు ఉపయోగపు విలువగా, మరొకటి మారకం విలువగా ధ్రువాల లాగా అవుతాయి.

సరుకు గా బట్ట ఒక ఉపయోగపు విలువా, మారకం విలువా అని నేను అన్నానంటే, అది విశ్లేషణలో వచ్చిన సరుకు స్వభావం గురించి నా జడ్జ్ మెంట్. ఇందుకు వ్యతిరేకంగా, 20 గజాల బట్ట = 1 కోటు అనే వ్యక్తీ కరణ లో బట్ట తానొక

1.ఉపయోగపు విలువ (బట్ట)

2. దానికి భిన్నంగా, మారకం విలువ (కోటుకి సమానమైన ఒక వస్తువు)

3.అది (బట్ట) ఈ రెంటి ఐక్యత, ఆవిధంగా అది సరుకు.

అని చెబుతుంది.-అనుబంధం

సరుకు సరళ విలువ రూపం అందులో వున్న విరుద్ధాంశాలయిన ఉపయోగపు విలువ , విలువలు అగపడే సరళ రూపం.

ఈ సరళ రూపాన్ని మార్క్స్ కడకంటా విశ్లేషించాడు. డబ్బు రూపం దాకా అభివృద్ధి చెందే క్రమంలో ఉన్న మధ్యంతర విలువ రూపాల్ని చూపాడు.

ఇది పిండ రూపం.క్రిమి రూపం. ధర రూపం తీసుకోవడానికి వరస మార్పులు జరగాల్సి ఉంది.

ఈ వ్యక్తీకరణ రూపంలో A విలువని దాని సొంత ఉపయోగపు విలువనుండి కేవలం భిన్నమైనదిగా చూడడానికి మాత్రమే ఉపకరిస్తుంది.అందువల్ల ఇది A ని మరొక సరుకుతో సంబంధంలో పెట్టడం కన్నా ఇంకేమీ చెయ్యదు. అది A కి అన్ని ఇతరసరుకులతో ఉండే గుణాత్మక ఎకత్వాన్నీ, పరిమాణాత్మక నిష్పత్తినీ ప్రదర్శించదు.

ఒకే సరుకు బట్టకు సమానకంగా ఒకే సరుకు కోటు వుంటుంది.

ఒక సరుక్కి ఎన్నో సమానకాలు ఉండవచ్చు

అయితే ఈ ప్రాధమిక రూపం దానంతటదే ఆటోమాటిక్ గా విస్తృత విలువ రూపం లోకి పరివర్తన చెందుతుంది. ప్రాదమిక రూపంలో ఒక సరుకు విలువ మరొక సరుకు రీత్యా మాత్రమే వ్యక్తం అవుతుంది. ఈ మరొక సరుకు ఏదయినా కావచ్చు-కోటో , ఇనుమో, గోదుమో మరొక సరుకో.

20 గజాల బట్ట = 5 కిలోల టీ పొడి

=50 కిలోల ఇనుం

= 1 సెల్ ఫోన్

= 2 జీన్స్ పాంట్లు

ఆవిధంగా ఏ సరుకుకైనా ఎన్నో ప్రాధమిక విలువ వ్యక్తీ కరణలుంటాయి. అలాంటి వ్యక్తీ కరణలు ఎన్ని ఉండే అవకాశం ఉంటుందంటే, ఆసరుకు కాక ఎన్ని సరుకులు ఉంటాయో అన్ని.ఒక సరుకువిలువ యొక్క విడి వ్యక్తీకరణ ఆవిధంగా అనంతగా విస్తరించగల వరుసలోకి మారగలదు.ఆ విలువ యొక్క భిన్న ప్రాధమిక విలువల వరుస గా మారగలదు.

అలాంటి పరిస్థితుల్లో 20 గజాల బట్టకు ఎన్నో ప్రాధమిక వ్యక్తీకరణలుంటాయి.ఆసరుకు(బట్ట) కాక ఎన్ని సరుకులు ఉంటాయో అన్ని.

మొత్తం 500 సరుకులు ఉంటే, 499 ప్రాధమిక విలువ రూపాలుంటాయి.సరుకులు ఎక్కువయ్యే కొద్దీ, ప్రాధమిక విలువ రూపాలు కూడా పెరుగుతాయి.దీన్నిబట్టి , ఒక సరుకు విలువను తెలిపే సమానకాల సంఖ్య పెరిగే వరుస కాగలదు. అంటే విస్తరించ గలదు.

## విలువరూపం-2

సీతాకోకచిలుక క్రిమి రూపంతో మొదలై దశలవారీగా రూపొందుతుంది. అలాగే డబ్బుకూడా. ప్రాధమిక రూపంతో మొదలై దశలవారీగా డబ్బురూపం పొంది జిగేల్ మంటుంది.పోయే కొద్దీ, ఉపయోగపువిలువ నించి విలువ వేరుపడడం అంతకంతకూ స్పష్టమవుతుంది.ఈ మార్పు అంతర్గత వైరుధ్యాల వల్ల అనివార్యంగా జరిగేదే గాని యాదృచ్చికంగా ఏర్పడింది కాదు అనేది మార్క్స్ గతితార్కిక తర్కం (dialectical logic)

## I.ప్రాధమిక విలువ రూపం

ప్రాధమిక రూపంలో ఒక సరుకు విలువ మరొక సరుకు ద్వారా మాత్రమే వ్యక్తం అవుతుంది. ఈ మరొక సరుకు ఏదయినా కావచ్చు- కోటో , ఇనుమో, గోధుమో మరొక సరుకో.

సమీకరణలో అటొకటి ఇటొకటి మాత్రమే ఉంటాయి- సాపేక్ష రూపంలో ఒకటీ, సమానక రూపంలో మరొకటీ.

ప్రాధమిక రూపం ఆచరణలో యాదృచ్చికంగా,ఎప్పుడో ఒకప్పుడు(అప్పుడప్పుడు/అరుదుగా)జరిగే మారకాలు శ్రమ ఉత్పత్తుల్ని సరుకులుగా మార్చేతొలి దశలో సంభవిస్తాయి.

ప్రత్యేక శ్రమ ఉత్పాదితాలు అప్పుడప్పుడు, యాదృచ్చికంగా మారకం అయినప్పుడు ప్రాధమిక రూపం ఏర్పడింది. మొదట్లో మారకాలు తెగల మధ్య జరిగేవి.అదీ రెండు తెగలు ఒకే చోటకి వచ్చినప్పుడు; ఒకరి దగ్గర వున్న వస్తువులు మరోకరిదగ్గర లేనప్పుడు; సొంతదార్లదగ్గర అవి మిగులుగా వున్నప్పుడు; ఇరువురూ ఒకరి సరుకులు మరొకరు కావాలనుకున్నప్పుడు. ఆరెండు సరుకులూ నిర్దిష్ట పరిమాణాల్లో మారగలగడం కేవలం యాదృచ్చిక ఘటన కావచ్చు. ఇలాంటి ఘటనలు అన్ని సరుకులకూ జరిగే అవకాశాలున్నాయి.

| | | |
|---|---|---|
| 20 గజాల బట్ట | = | 1 కోటు |
| 1 బాన | = | 2 చాటలు |
| 2 జతల చెప్పులు | = | 1 నిచ్చెన |

వగయిరా మారక సంబంధాలు ఏర్పడవచ్చు. అయితే ఒకసారి జరిగాయని ప్రతిసారీ జరగాలని లేదు. ఆయ్యవస్తువులు వున్నవాళ్ళకు ఒకరివి ఒకరు మార్చుకోవాల్సిన అవసరం లేనప్పుడు మారకమే జరగదు. మారకం జరిగినా అదే పరిమాణంలో జరుగుతుందనీ లేదు.

ఉదాహరణకి, బానలు చేసే మనిషి ఒకబాన ఇచ్చి 2 చాటలు తీసుకున్నాడనుకుందాం. మరొకసారి చాటల మనిషి బానలకి చాటలు ఇవ్వడానికి సిద్ధమైనా, బానల మనిషికి చాటలు అవసరంలేకపోతే మారకం జరగదు. మరొకరితో మారకం జరిగినా ఒక బానకి 2 చాటలు కాకపోవచ్చు. ౩ కావచ్చు. 2 బానలకి ౩ చాటలు కావచ్చు. నిష్పత్తి మారవచ్చు. అందుకే ప్రాధమిక రూపం యాదృచ్చిక రూపం.

ఇక్కడ బట్ట విలువ ఒక్క కోటులో మాత్రమే తెలుస్తున్నది. ఇతర సరుకులలో తెలియదు.
అయితే మారకాలు పెరిగేకొద్దీ, ఇతరసరుకుల్లో కూడా బట్టవిలువ తెలుస్తుంది.

| | | |
|---|---|---|
| 20 గజాల బట్ట | = | 10 టానలు |
| 20 గజాల బట్ట | = | 20 డాటలు |
| 20 గజాల బట్ట | = | 3 నిచ్చెనలు |
| 20 గజాల బట్ట | = | 6 జతల చెప్పులు |

బట్టకి ఇక్కడ 4 విలువ వ్యక్తీకరణలున్నాయి. ఇంకా కొన్ని ఉండవచ్చు. కొన్నేమిటి, ఎన్నైనా ఉండవచ్చు. ఆవిధంగా ఏ సరుకుకైనా ఎన్నో, ఎన్నెన్నో ప్రాధమిక విలువ వ్యక్తీకరణలుంటాయి. అలాంటి వ్యక్తీకరణలు ఎన్ని ఉండే అవకాశం ఉంటుందంటే, ఆ సరుకు కాక ఎన్ని సరుకులు ఉంటాయో అన్ని. అందువల్ల, ఒక సరుకు విలువ వ్యక్తీకరణ అనంతగా విస్తరించగల వరుసలోకి, భిన్న ప్రాధమిక విలువల వరుసలోకి మార గలదు. అలాంటి పరిస్థితుల్లో 20 గజాల బట్టకు ఎన్నో ప్రాధమిక వ్యక్తీకరణలుంటాయి.ఆసరుకు(బట్ట) కాక ఎన్ని సరుకులు ఉంటాయో అన్ని.
సాపేక్ష విలువ స్థానంలో ఒక సరుకే ఉంటుంది.సమానకం స్థానంలో అనేకం ఉంటాయి.
మొత్తం 500 సరుకులు ఉంటే, 499 ప్రాధమిక విలువ రూపాలుంటాయి.సరుకులు ఎక్కువయ్యే కొద్దీ, ప్రాధమిక విలువ రూపాలు కూడా పెరుగుతాయి.దీన్నిబట్టి , ఒక సరుకు విలువను తెలిపే సమానకాల సంఖ్య పెరిగే వరుస కాగలదు. అంటే విస్తరించ గలదు. ఆ రూపమే

## II. సంపూర్ణ విలువ రూపం/ విస్తృత విలువ రూపం

ఇలా ఉంటుంది :

20 గజాల బట్ట=1 కోటు

=10 పౌన్ల టీ

=40 పౌన్ల కాఫీ


=పావు గోధుమల

= 2 ఔన్సుల బంగారం

=1 టన్ను ఇనుం ఇలా

బట్ట విలువ చాలా సరుకుల్లో వ్యక్తం అయింది.

**అలాగే 1 కోటు విలువ ఈ రూపంలో ఇలా ఉంటుంది:**




కోటు విలువ చాలా సరుకుల్లో వ్యక్తం అవుతుంది.

**విస్తృత రూపం ఒక ప్రత్యేక శ్రమ ఉత్పాదితం (ఉదాహరణకి పశువు) ఇతర అన్ని సరుకులతో, అరుదుగా కాక, అలవాటుగా మారేటప్పుడు మొదట ఉనికిలోకి వస్తుంది. ఈ రూపం ఉపయోగపు విలువ నించి విలువని మరింత స్పష్టంగా వేరుచేస్తుంది.**

## *§1 .విస్తృత సాపేక్ష విలువ రూపం*

*.ఇప్పుడు బట్ట విలువ అన్ని ఇతర సరుకుల్లోనూ వ్యక్తమవుతుంది. ప్రతి ఇతర సరుకూ బట్ట విలువకు అద్దం పడుతుంది/అవుతుంది. ఆవిధంగా ఇప్పుడు మాత్రమే ఈ విలువ తేడాలేని మానవ శ్రమ జెల్లీ గా కనబడుతుంది. ఆశ్రమ కుట్టయినా, దున్నకం అయినా, గని తవ్వకం అయినా మరే దైనా ఒకటే అని అర్ధమవుతుంది. కోటులో,గోదుమల్లో, ఇనుంలో, బంగారంలో మరెందులో వస్తుత్వం చెందినా ఒకటే. కనుక దాని (విస్తృత )విలువ రూపం వల్ల బట్ట ఇప్పుడు ఒక్క కోటుతోనే కాకుండా లోకం లోని అన్ని సరుకులతోటి సామాజిక సంబంధంలో నిలబడుతుంది. సరుకుగా అది ప్రపంచ పౌరుడు.*

**20 గజాల బట్ట=1 కోటు అనే మొదటి రూపంలో(ప్రాధమిక విలువ రూపంలో) ఈ రెండు సరుకులూ నిర్దిష్ట పరిమాణాల్లో మారతాయి అనేది కేవలం యాదృచ్చిక ఘటన అయినా కావచ్చు.**

**"రెండో దాంట్లో (విస్తృత విలువ రూపంలో ) , ఇందుకు భిన్నంగా ఈ యాదృచ్చికతని నిర్ణయించే నేపధ్యాన్ని తక్షణమే గమనిస్తాం." బట్ట విలువ పరిమాణంలో మార్పురాదు-అది కోటులో వ్యక్తమయినా మరొకదానిలో వ్యక్తమయినా, అవి వేరు వేరు యజమానులకు చెందినవైనా. ఇద్దరు సరుకు సొంతదార్ల మధ్య యాదృచ్చిక సంబంధం అంతర్ధానం అవుతుంది. ఒక విషయం స్పష్టం అవుతుంది: "సరుకుల విలువల్ని నియంత్రించేది (regulate) సరుకుల మారకంకాదు, అందుకు భిన్నంగా సరుకుల విలువల పరిమాణాలే అవిమారే నిష్పత్తుల్ని నియంత్రిస్తాయి."**

## §2. ప్రత్యేక సమానక రూపం.

కోటూ, టీ ,గోధుమలూ, ఇనుమూ వంటి ప్రతిసరుకూ బట్ట విలువ వ్యక్తీకరణలో సమానకంగా వ్యవహరి స్తుంది. కనుక విలువ కలిగివున్న భౌతిక వస్తువుగా , రూపుదాల్చిన విలువగా లెక్కకొస్తుంది. ఈ సరుకుల్లో ప్రతిదాని శరీర రూపమూ ఇప్పుడు ఎన్నో ఇతర సమానకాలతో పాటు ఒక ప్రత్యేక సమానకం. అలాగే ఆయా సరుకులలో ఇమిడి వున్న ప్రయోజనకర నిర్దిష్ట శ్రమలు ఏ తేడా లేని మానవ శ్రమ అగపడే ప్రత్యేక రూపాలుగా లెక్కకొస్తాయి.

మన ఉదాహరణలో బట్టకి సమానకాలుగా టీ,కాఫీ, గోధుమలు,బంగారం ,ఇనుం ఉన్నాయి. వీటిలో ప్రతిదీ ఒక ప్రత్యేక సమానకం.

### §3. విస్తృత విలువ రూపంలో లోపాలు

ఈ రూపంలో 3 లోపాల్ని ప్రస్తావిస్తాడు.

**A) సంపూర్ణత/ సమగ్రత లేకపోవడం ఒక లోపం.**బట్ట విలువ యొక్క సాపేక్ష వ్యక్తీకరణ అసంపూర్ణం. కారణం బట్టవిలువకి ప్రతినిధిగా వుండే సరుకుల వరుస ఎన్నటికీ ముగియదు. అది ఒక గొలుసు. ఆగొలుసులో ప్రతి సరుకూ ఒక లింకు. కొత్త సరుకు వస్తే అది మరొక లింకవుతుంది. వచ్చిన ప్రతికొత్త సరుకూ బట్ట విలువని తనలో వ్యక్తీకరిస్తూ వుంటుంది.గొలుసు పొడుగవుతూ పోతుంది.

ఒకప్పుడు లేని కర్రు, కొడవలి వంటి ఇనప వ్యవసాయ పరికరాలు ఇనుం కనుక్కున్నాకనే వచ్చాయి. గడ్డ పారలూ కత్తులూ ఎన్నో వచ్చాయి. ఇప్పటికీ వస్తూనే వున్నాయి.

బట్ట విలువ అలా వచ్చిన ప్రతిదానిలో కూడా వ్యక్తం కావాలి, ఇలా:

20 గజాల బట్ట=10 కర్రులు

=8 కొడవళ్ళు


= 3 గడ్డ పారలు

=5 కత్తులు


ఇక ఈ వరస పెరిగేదే కాని ముగిసేదికాదు. బట్ట విలువ రూపం పూర్తిగా వ్యక్తం కాదు.కొరవ ఉంటూనే ఉంటుంది. కనుక బట్ట విలువ సాపేక్ష వ్యక్తీకరణ ఎన్నటికీ అసంపూర్ణమే,అసమగ్రమే.

**B) సరళత్వం లేకపోవడం మరొక లోపం..**

ఒకసరుకు విలువ వ్యక్తీకరణ ఎన్నో సరుకుల్లో వ్యక్తం అవుతుంది. ప్రతి సరుకు విలువా మిగిలిన అన్ని సరుకుల విలువల్లో తెలుస్తుంది.ఉదాహరణకి కోటు విలువ




**అలాగే 50 కిలోల ఇనుం విలువ :**




**ఏసరుకు విలువైనా ఇలాగే అంతులేని వరస అవుతుంది.ఒక్కొక సరుకు విలువ అనేక సరుకుల్లో వ్యక్తం కావడం వల్ల సరళత లోపిస్తుంది.**

**విస్తృత విలువ రూపం విభిన్నమైన, ఒకదానికొకటి సంబంధం లేని స్వతంత్రమైన విలువ వ్యక్తీకరణలతో ఉండే రంగు రంగుల మొజాయిక్ అంటాడు.అంటే, ఒకే సరుకు యొక్క సమానకం ప్రతి చోటా, ప్రతికాలంలో ఒకటే కాదు అని.**

## C.ఏకరూపత లేకపోవడం. ఒకేరకంగా ఉండక పోవడం.

**బట్ట విలువ కోటు విలువకు గుణాత్మకంగా సమానం. అవి రెండూ అనిర్దిష్ట శ్రమ పేరుడు లే. కాగా, బట్ట విలువ సాపేక్ష రూపం మిగిలిన ప్రతి సరుకు విలువరూపం నుండీ భిన్నమైనదే. “ ప్రతి సరుకు సాపేక్షవిలువ విస్తరించిన రూపంలో వ్యక్తమయితే, దాన్ననుసరించి ప్రతి సరుకు సాపేక్ష విలువ రూపం అనంతమైన విలువ వ్యక్తీకరణల వరస అవుతుంది. ఆరూపం ప్రతి ఇతర సరుకుయొక్క సాపేక్ష విలువ రూపానికీ భిన్నమైనదిగా ఉంటుంది.” భిన్న మైన అంటే, గుణాత్మకంగా భిన్నమైన అని.**

ప్రతి విడి సరుకు శరీర రూపం ఎన్నో ఇతర సమానక రూపాల్లో ఒక ప్రత్యేక సమానక రూపం.కనుక, (అప్పటికి) ఉనికిలో వున్న సమానక రూపాలు పరిమిత సమానక రూపాలు మాత్రమే. వాటిలో ప్రతిదీ ఇతరవాటిలో దేన్నో మినహాయిస్తుంది. చేస్తుంది.-మార్క్స్

అలాగే,ప్రతి ప్రత్యేక సరుకు సమానకంలో ఉన్న నిర్దిష్ట, ప్రయోజనకర శ్రమ మానవ శ్రమ అగపడే ఒక ప్రత్యేక రూపమే. సమగ్ర మానవ శ్రమ రూపం కాదు.
కోటు లో కుట్టు రూపంలో,ఇనుం లో గని శ్రమ రూపంలో, గోధుమల్లో వ్యవసాయ శ్రమ రూపంలో మానవ శ్రమ అగపడుతుంది. కాని సమగ్ర రూపంలో మానవ శ్రమ అగపడదు.

కోటులో ఉన్న శ్రమ మానవ శ్రమ అగపడే సమగ్ర రూపం కాదు. అది కోటులని ఉత్పత్తిచేసే మానవ శ్రమ రకం మాత్రమే.
ప్రతి సరుకు సాపేక్ష విలువ ఈ విస్తృత రూపంలో వ్యక్తమయితే, ప్రతి సరుకు సాపేక్ష విలువ రూపమూ ముగింపులేని విలువ వ్యక్తీకరణల పరంపరగా ఉంటుంది- ప్రతి ఇతర సరుకు యొక్క సాపేక్ష విలువ రూపానికీ భిన్నంగా ఉంటుంది.

విస్తారిత సాపేక్ష విలువ రూపంలోని ఈ కొరవలు దానికి అనుగుణమైన సమానక రూపంలో ప్రతిఫలిస్తాయి. విస్తృత సాపేక్ష విలువ రూపంలో లోపాలు చెప్పాక, సమానక రూపంలోని లోపాలను చెబుతాడు.ఎన్నో సమానకాలు ఉంటాయి. వీటిని ప్రత్యేక సమానకాలు అంటాడు మార్క్స్.
ఇక్కడ ప్రతి విడి సరుకు భౌతిక రూపమూ అనేక ఇతర ప్రత్యేక సమానక రూపాల పక్కన ఒక ప్రత్యేక సమానక రూపం. కనుక మొత్తంమీద సమానక రూపాలు విడివిడిగా/దేనికదిగా(fragmentary) వుంటాయి. ప్రతిదీ మిగిలిన వాటిని మినహాయించుకుంటుంది .
అదే విధంగా ప్రతి సరుకు సమానకంలో ఉన్న నిర్దిష్ట ప్రయోజనకర శ్రమ, మానవ శ్రమ అగపడే ప్రత్యేక రూపమే గాని, మానవశ్రమ అగపడే పరిపూర్ణ రూపం కాదు.ఈ పరిపూర్ణ రూపం అగపడే పూర్తి రూపాన్ని ఆ ప్రత్యేక రూపాలు అగపడడాన్నిపూర్తిస్థాయిలో కలిగి ఉంటుంది. కాని ఆవిధంగా అగపడే ఏకీకృత రూపాన్ని కలిగి వుండదు.
అదే విధంగా ప్రతి సరుకు సమానకంలో ఉన్న నిర్దిష్ట ప్రయోజనకర శ్రమ, ఒక ప్రత్యేక రకం శ్రమగా కనిపిస్తుంది. అందువల్ల సాధారణ మానవ శ్రమకి పూర్తి (exhaustive) ప్రతినిధిగా ప్రదర్శిటం కాదు. సాధారణ మానవ శ్రమ అనేక, ప్రత్యేక,నిర్దిష్ట రూపాల మొత్తానికి సరిపడే వ్యక్తీకరణ పొందుతుంది. అయితే ఆసందర్భంలో, అంతులేని వరుసలో దాని వ్యక్తీకరణ ఎప్పటికి అసంపూర్ణమే, ఏకత్వం లేనిదే.

విస్తారిత సాపేక్ష విలువ రూపంలోని ఈ కొరవలు, దానికి అనుగుణమైన సమానక రూపంలో ప్రతిఫలిస్తాయి. అలాగే,ప్రతి ప్రత్యేక సరుకు సమానకంలో ఉన్న నిర్దిష్ట, ప్రయోజనకర శ్రమ మానవ శ్రమ అగపడే ఒక ప్రత్యేక రూపమే. సమగ్ర మానవ శ్రమ రూపం కాదు.

కోటు లో కుట్టు రూపంలో,ఇనుం లో గని శ్రమ రూపంలో, గోధుమల్లో వ్యవసాయ శ్రమ రూపంలో మానవ శ్రమ అగపడుతుంది.కాని సమగ్ర రూపంలో మానవ శ్రమ అగపడదు.

ఏదేమైనా, విస్తారిత సాపేక్ష విలువ రూపం ప్రాధమిక వ్యక్తీకరణల మొత్తం తప్ప మరేమీ కాదు.

20 గజాల బట్ట=1 కోటు

20 గజాల బట్ట =10 పౌన్ల టీ

20 గజాల బట్ట =40 పౌన్ల కాఫీ

20 గజాల బట్ట =పావు గోధుమలు

ఒక్కొక్కదాన్ని విడివిడిగా చూస్తే, ఇవన్నీ ప్రాధమిక వ్యక్తీకరణలు.

వీటిని ఇలా రాయవచ్చు:

20 గజాల బట్ట=1 కోటు

=10 పౌన్ల టీ

=40 పౌన్ల కాఫీ

=పావు గోధుమలు

ఇలా కలిపి చూస్తే విస్తృత విలువ వ్యక్తీకరణ.

వీటిలో ప్రతిదానికీ అనుగుణమైన తిరగ బడిన సమీకరణ ఉంటుంది:

1 కోటు=20 గజాల బట్ట

10 పౌన్ల టీ =20 గజాల బట్ట

40 పౌన్ల కాఫీ =20 గజాల బట్ట

పావు గోధుమలు =20 గజాల బట్ట

ఒక వ్యక్తి తన బట్టని అనేక ఇతర సరుకులతో మారకం చేసుకుంటే, దాని విలువని ఆ ఇతర సరుకుల వరస లో వ్యక్తం చేస్తాడు.దీన్ని అనుసరించి, ఆ బట్టతో మారకం వేసిన యితర సరుకుల సొంతదార్లు వాళ్ళ సరుకుల విలువని ఒకే సరుకు లో వ్యక్తం చేస్తారు- అది బట్ట. మనం అలా ఆవరసని తిరగ దిప్పామంటే ఇదుగో ఈ సాధారణ విలువ రూపం ఏర్పడుతుంది.

### III) .సాధారణ విలువ రూపం

20 గజాల బట్ట
10 పౌన్లు టీ
40 పౌన్లు కాఫీ
1 పావు గోధుమలు
2 ఔన్సులు బంగారం
1 టన్ను ఇనుం

=1 కోటు

## §1. మారిన సాపేక్ష విలువ ఆకృతి(shape).

సాపేక్ష విలువ రూపం ఆకారం ఇప్పుడు పూర్తిగా మారిపోతుంది. అన్ని సరుకులు తమతమ విలువని
(1)ఒకే ఒక్క సరుకులో వ్యక్తపరుచు కుంటాయి
(2) ఐక్యంగా /కలిసికట్టుగా అంటే, ఒకే ఇతర సరుకులో
వ్యక్తపరుచు కుంటాయి.
ఈ విలువ రూపం ప్రాధమిక మైనదీ,అన్నిటికీ ఒకటే అయినదీ, అందువల్ల సాధారణ రూపం.
"వాటి విలువరూపం ప్రాధమిక మైనదీ , ఉమ్మడి అయినదీ అంటే, సాధారణం అయినది." –appendix
ప్రాధమిక రూపం కంటే విస్తృత విలువ రూపం ఒక సరుకు విలువని దాని ఉపయోగపు విలువ నించి మరింతగా వేరు పరుస్తుంది – కారణం కోటు విలువ కోటు భౌతిక రూపానికి భిన్నంగా, అన్ని ఆకృతుల్లో నూ చూపించబడింది. అది బట్టకూ,ఇనుముకూ, తేయాకుకీ,ఒకటేమిటి మిగిలిన అన్ని ఇతర సరుకులకూ సమం చేయబడ్డది. అయితే తనకు తాను తప్ప. అంటే కోటు కోటుకి తప్ప. ఎందుకంటే కోటు=కోటు అనేది విలువ వ్యక్తికరణేకాదు అని ముందే చూశాం. వేరొక వైపు,అన్నిటికీ ఉమ్మడియైన విలువయొక్క ఏ సాధారణ వ్యక్తీకరణ అయినా మినహాయించ బడింది.
ఎందుకంటే,ప్రతిసరుకు విలువ సమీకరణంలోనూ, అన్ని ఇతర సరుకులూ ఇప్పుడు సమానకాలుగా మాత్రమే కనబడతాయి. అయితే A విలువ ప్రతి ఇతర వస్తువుతోనూ సమానం చేయబడుతుంది, కాబట్టి అన్నిటికీ ఉమ్మడిదైన సాధారణ విలువ వ్యక్తీకరణ ఉండదు.

విలువ వ్యక్తీకరణ కోసం వేరుపరచిన ఏకైక సరుకు బట్ట. దానికి సమానమైనవిగా వాటి విలువలకి ప్రతినిధులుగా వుంటాయి. ఇప్పుడు ప్రతి సరుకు విలువా, బట్టతో సమపరచడం ద్వారా ,తన సొంత ఉపయోగపు విలువ నించి వేరుపడడమే కాకుండా, అన్ని ఇతర ఉపయోగపువిలువల నించి భిన్నమవుతుంది. అందువల్ల ప్రతి సరుకు విలువా అన్ని సరుకులకూ ఉమ్మడి అయినదిగా వ్యక్తమవుతుంది. ఈ రూపంలో సరుకులు మొట్టమొదటిసారి విలువలుగా సంబంధంలోకి వస్తాయి, మారకం విలువలుగా అగపడతాయి.

ఇంతకుముందు రెండు రూపాలూ ఒక్కో సరుకు విలువని మరొక్క రకం సరుకులోనో లేక అలాంటి సరుకుల వరసలోనో వ్యక్తం చేస్తుంది. ఈ రెండు సందర్భాలలోనూ ప్రతిసరుకు ప్రత్యేక కర్తవ్యం(special business) ఏమంటే, తన విలువకి వ్యక్తీకరణ కనుక్కోవడమే, ఈపనిని అది ఇతర (సరుకుల) సహాయం లేకుండానే చేస్తుంది. ఈ ఇతర సరుకులు మొదటిదానికి సంబంధించి సమానకాల passive పాత్ర పోషిస్తాయి.

విలువ సాధారణ రూపం అన్ని సరుకుల సంయుక్త చర్య ఫలితంగా ఏర్పడుతుంది. దానినుండి మాత్రమే ఏర్పడుతుంది. ఒకసరుకు తన విలువ యొక్క సాధారణ రూపం ఎలా పొందుతుంది?అన్ని సరుకులూ, దానితోపాటు, వాటివిలువల్ని ఒకే సమానకంలో వ్యక్తం చెయ్యడం ద్వారా. ప్రతి కొత్త సరుకూ ఇలాగే చేసితీరాలి. సరుకులు విలువలుగా వుండడం సామాజికం. కనుక ఈ సామాజిక మనుగడ వాటి సామాజిక సంబంధాల మొత్తం ద్వారా మాత్రమే వ్యక్తం కాగలవు. తత్ఫలితంగా వాటి విలువ రూపం సమాజం ఆమోదించిన రూపమై ఉండాలి.

సాధారణ రూపం డబ్బురూపానికి బాట వేస్తుంది. అన్ని సరుకుల విలువలూ ఒకే సరుకు రీత్యా వ్యక్తమవుతాయి. సరుకులు మారకపు విలువలుగా తొలిసారి కనబడతాయి.

ఇప్పుడు బట్ట అన్ని ఇతర రకాల సరుకులకూ ఉమ్మడి,సాధారణ విలువ ఆకృతిగా లెక్కకొస్తుంది."కనుక ఈ విలువ రూపంలో అది సామాజిక సాధారణ రూపం పొందుతుంది."

"ఈ సాధారణ స్వభావం ద్వారానే విలువ రూపం విలువ భావనకి సరిపోతుంది (correspond)". విలువ రూపం సరుకులు ఒకదానికొకటి ఏ తారతమ్యమూ లేని, ఏకరీతి మానవ శ్రమ యొక్క జెల్లీ గా కనబడే రూపంగా ఉండి తీరాలి.

ఇది ఇప్పుడు సాధ్యమయింది. ఎందుకంటే, అవన్నీ ఇప్పుడు ఏకరూప శ్రమ(same) వ్యక్తీకరణలు. ఆవిధంగా అవన్నీవిలువలుగా గుణాత్మకంగా సమానమైనవి.అంతేకాదు,విలువలుగా వాటి పరిమాణాలు పోల్చవచ్చు. వాటి విలువల పరిమాణాల్ని ఒకే దాంట్లో,బట్టలో వ్యక్తపరచడం ద్వారా, ఆ పరిమాణాల్ని ఒకదానితో మరొకదాన్నిసరి పోల్చవచ్చు.

ఉదాహరణకి 10 పౌన్ల టీ =20 గజాల బట్ట ,

=40 పౌన్ల కాఫీ

=20 గజాల బట్ట.

కాబట్టి 10 పౌన్ల టీ =40 పౌన్ల కాఫీ

ఒక పౌను టీ లో ఉన్న విలువ సారంలో, శ్రమలో నాలుగో వంతు మాత్రమే ఒక పౌను కాఫీలో ఉంటుంది. విలువ సాధారణ రూపం అన్నిసరుకుల్నీ ఇముడ్చుకుంటుంది. సమానకం పాత్ర పోషించేందుకు మిగిలిన సరుకుల నుండి తప్పించిన సరుకుని-ఇక్కడ బట్ట-సార్వత్రిక సమానకంగా చేస్తుంది. –కాపిటల్ 1 .72
ఇప్పుడు బట్ట శరీర రూపం అన్ని సరుకులూ ఉమ్మడిగా పొందే రూపం. కాబట్టి బట్ట అన్నిసరుకులతోనూ నేరుగా మారగలిగేది అవుతుంది. బట్ట ప్రతీ తరహా మానవ శ్రమా అగపడే ఆకారం అవుతుంది. ఒక ప్రత్యేక వస్తువుని, బట్టను తయారుచేసే కొందరు ప్రైవేటు వ్యక్తుల నేతశ్రమ తత్ఫలితంగా సామాజిక స్వభావాన్ని, (అంటే)అన్ని ఇతర రకాల శ్రమలతో సమానం అనే లక్షణాన్ని సంతరించుకుంటుంది. సాధారణ విలువ రూపం శ్రమ ఉత్పాదితాలన్నీ ఏ తేడా లేని మానవ శ్రమ పేరుడు లు మాత్రమే అని చెబుతుంది.

## §2.మారిన సమానకం రూపం ఆకృతి.

ప్రత్యేక సమానక రూపం సాధారణ విలువ రూపంలో ఇంకొంత అభివృద్ధయింది. సమానకం రూపంలో ఉన్న సరుకు ఇప్పుడు సాధారణ సమానకం అయింది. అన్ని ఇతర సరుకుల విలువ రూపంగా లెక్కకురావడం ద్వారా,బట్ట భౌతికరూపం అన్ని సరుకులతో మారగల రూపం.అందువల్ల, బట్ట భౌతిక రూపం అదే సమయంలో దాని సాధారణ సామానక రూపం.
ఇతర సరుకులు అత్యంత భిన్న రకాల శ్రమల ఉత్పాదితాలు అయినప్పటికీ, ఆసరుకులన్నిటికి బట్ట వాటిలో ఉన్న శ్రమలకు అగపడే రూపంగా ఉంటుంది. ఒకే రకమైన, ఏ తేడా లేని శ్రమ మూర్తిగా లెక్కకొస్తుంది. నిర్దిష్ట శ్రమ అయిన నేత అనిర్దిష్టశ్రమగా, అంటే మానవ శ్రమ శక్తి వ్యయంగా లెక్కకొస్తుంది.
కచ్చితంగా ఇందువల్లే, బట్టలో వున్న ప్రైవేట్ శ్రమ సాధారణ సామాజిక రూపంలో ఉన్న శ్రమగా, అన్ని ఇతర శ్రమలతో సమానమైన రూపంలో ఉన్న శ్రమగా లెక్కకొస్తుంది.

## §3. సాపేక్షవిలువ రూపం,సమానక రూపాల పరస్పరాధారిత అభివృద్ధి

సాపేక్ష విలువ రూపం అభివృద్ధి స్థాయికి అనుగుణంగా సమానకరూపం అభివృద్ధి స్థాయి ఉంటుంది. అయితే సమానకరూపం అభివృద్ధి కేవలం సాపేక్ష విలువ రూపం అభివృద్ధియొక్క వ్యక్తీకరణ, ఫలితం మాత్రమే. అని జాగ్రత్తగా గుర్తుబెట్టుకోవాలి. చొరవ సాపేక్ష విలువ రూపం వైపునించి వుంటుంది.
సరళ సాపేక్ష విలువ రూపం ఒక సరుకు విలువని మరొక సరుకు, ఒకే ఒక సరుకు లో తెలుపుతుంది- ఆసరుకు ఏదయినా అవచ్చు. ఆవిధంగా సరుకు తన భౌతిక రూపానికి భిన్నమైన విలువ రూపాన్ని పొందుతుంది. దాని సమానకం కూడా ఏకైక సమానకం రూపాన్ని పొందుతుంది.
ఒక సరుకు విస్తృత సాపేక్ష విలువ రూపం ఆసరుకు విలువని మిగిలిన అన్ని సరుకుల్లో చెబుతుంది. అందువల్ల, సమానక రూపం అనేక ప్రత్యేక సమానకాల రూపం లేక ప్రత్యేక సమానక రూపం తీసుకుంటుంది.

అంతిమంగా,సమస్త సరుకులూ దానికి ఏకీకృత, సాధారణ,సాపేక్ష విలువ రూపం ఇచ్చుకుంటాయి-తన నించి ఒకే ఒక రకం సరుకుని, ఇతర రకాల సరుకులన్నిటి విలువని వ్యక్తపరిచే సరుకుని, వేరు పరచడం ద్వారా. అలా చెయ్యడంద్వారా,వేరుచేసిన సరుకు సాధారణ సమానకం అవుతుంది.లేక సమానక రూపం సాధారణ సమానక రూపం అవుతుంది.

## §4. సాపేక్ష విలువ రూపం సమానక రూపాల ధ్రువత్వ అభివృద్ధి.

విలువ రూపం అభివృద్ధితో పాటే, ఈ రెండురూపాల మధ్య ఉన్న ధ్రువ వ్యతిరేకత (Polar Antagonism) వృద్ధవుతుంది. xA =yB అన్నదాంట్లో, వ్యతిరేకత వున్నది, కాని ద్రవ స్థితిలో(చలించే ) వున్నది. ఈ సమీకరణాన్ని yB = xA గా తిరగ దిప్పవచ్చు.

xA = yB = zC=మొదలయినవ్ వాటిలో ఒక్కొకసారి ఒకే ఒక్క సరుకు మాత్రమే తన సాపేక్ష విలువను విస్తరించగలదు. ఈ సమీకరణ ని సాధారణ విలువ రూపంలోకి రాకుండా తిరగ తిప్ప లేం. తిరగ తిప్పామా, అది ఇక విస్తృతరూపం కాకుండా పోతుంది. సాధారణ రూపం అవుతుంది.

సాధారణ సాపేక్ష విలువ రూపంలో, A కి ఉన్న అన్ని సరుకులతో నేరుగా మారగల స్వభావానికీ , నేరుగా మార లేని మిగిలిన అన్ని సరుకుల స్వభావానికీ ధ్రువ వ్యతిరేకత వున్నది.

సార్వత్రిక సమానకం ఏ సరుకయినా కావచ్చు. ఏదైనా ఒక ప్రత్యేక సరుకు సార్వత్రిక సమానకంగా సమాజ గుర్తింపు పొందినప్పుడు, ఆసరుకే డబ్బు. అంతిమంగా ఈ ఆమోదం బంగారానికి లభించింది.

సాపేక్ష విలువ రూపం సమానక రూపాల ధ్రువత్వ వ్యతిరేకత, లేక విడదీయ రాని పరస్పర అంతస్సంబంధమూ అదే సమయంలో వాటి నిరంతరాయ మినహాయింపు (exclusion)- ఈ క్రింది విషయాల్ని చెబుతాయి:

1.మరొక సరుకు వ్యతిరేక రూపంలో లేనిదే, ఏ సరుకూ ఒక రూపంలో ఉండజాలదు.

2.ఒక సరుకు ఒక రూపంలో ఉంటే, అదే సమీకరణలో / విలువ వ్యక్తీకరణ లో అదే సమయంలో మరొక రూపంలో ఉండజాలదు.

విలువ రూపం అబివృద్ధికి అనుగుణంగా విలువ వ్యక్తీకరణలోని ఈ ధ్రువ విరుద్ధత అభివృద్ధి చెందుతుంది, దృఢ పడుతుంది.

మొదటి రూపంలో అవి ఒకదాన్నొకటి మినహాయించుకుంటాయి. సమీకరణాన్ని ముందునించి చదువుతామా వెనకనించా అనే దాన్ని బట్టి, అంచులలో ఉన్న బట్టా కోటూ లాంటి సరుకు ఇప్పుడు సాపేక్ష రూపంలోఉంటే , మరొకసారి సమానక రూపంలో ఉంటుంది.

20 గజాల బట్ట=1 కోటు – ఇక్కడ బట్ట సాపేక్ష రూపంలోనూ , కోటు సమానకం రూపంలోనూ ఉన్నాయి.

ఇ సమీకరణాన్ని వెనకనించి చూస్తే 1 కోటు=20 గజాల బట్ట అవుతుంది. ఇక్కడ సరుకుల స్థానాలు తారుమారవుతాయి. కోటు సాపేక్ష రూపం తీసుకుంటుంది. బట్ట సమానకం పాత్ర పోషిస్తుంది.

రెండో రూపంలో ఒక రకం సరుకు ఒకేసారి తన సాపేక్ష విలువని పూర్తిగా విస్తరించగలదు. అంటే, అది ఎందుకు విస్తృత సాపేక్ష విలువ రూపం కలిగి వున్నది?ఎందుకంటే,దానికి సంబంధించి మిగిలిన సరుకులన్నీ సమానక రూపంలో ఉన్నాయి గనక.

చివరగా మూడో రూపంలో సమస్త సరుకులూ సాధారణ సామాజిక సాపేక్ష విలువ రూపంలో ఉన్నాయి-దానికీ సంబంధించిన సరుకులన్నీ సమానక రూపా న్నించి తొలగించబడ్డ మేరకు. విపర్యయంగా,సాధారణ సమానకంరూపంలో వున్న సరుకు సాధారణ సాపేక్ష రూపంలో వున్న సరుకుల నించి వేరవుతుంది. బట్ట- సాధారణ సమానక రూపం లోవున్న ఏ వస్తువైనా అదే సమయంలో సాధారణ సాపేక్ష విలువ రూపంలో పాల్గొనాల్సి వస్తే, తనకు తానే సమానకంగా వుండాల్సి వస్తుంది. అప్పుడు

20 గజాల బట్ట = 20 గజాల బట్ట అనేదోస్తుంది. ఇదొక పునరుక్తి మాత్రమే .ఇందులో విలువా వ్యక్తం కాదు, విలువ పరిమాణమూ వ్యక్తం కాదు. సాధారణ సమానకం యొక్క విలువ వ్యక్తం కావాలంటే, ఈ మూడో రూపాన్ని తిరగ దిప్పాలి. ఇది ఆతర సరుకులతో ఉమ్మడిగా సాపేక్ష రూపాన్ని కలిగి వుండదు; దాని విలువ సాపేక్షంగా ఇతర అనంతమైన సరుకుల భౌతిక రూపాల్లో వ్యక్తం చేసుకుంటుంది. ఆవిధంగా సరుకు విస్తృత సాపేక్ష విలువ రూపం (రెండో రూపం)ఇప్పుడు సాధారణ సమానకం గా వ్యవహరించే సరుకుయొక్క విశిష్ట సాపేక్ష విలువ రూపంగా కనబడుతుంది.

సాధారణ సమానక రూపం ఒక విలువ రూపం. అందువల్ల, అది ఏ సరుకుకైనా సంబంధించినదే. కాని ఎప్పుడయినా సరే, అన్ని ఇతర సరుకులనించి పైదొలగడం/వేరుపడడం ద్వారానే.

ఒకటో రూపం నించి రెండో రూపానికీ, రెండో దాన్నించి మూడో రూపానికీ పరిణామంలో సారభూతమైన మార్పులు సంభవించాయి.ఇందుకు భిన్నంగా మూడో దాంట్లో సమానకం గా ఉన్న బట్ట స్థానంలో నాలుగో రూపంలో బంగారం రావడం మినహా మార్పేమీ లేదు. బట్ట స్థానంలో బంగారం సమానకంగా వుంటుంది. అంతే. అన్ని సరుకుల లాగే బంగారం కూడా సమానకంగా, ప్రత్యేక సమానకంగా వ్యవహరించినదే. క్రమక్రమంగా కొద్దిస్థాయిలోనో,పెద్దస్థాయిలోనో సాధారణ సమానకంగా ఉన్నదే. ఈ స్థానాన్ని బంగారం ఒక్కటే సొంతం చేసుకోగానే అది డబ్బు సరుకు అవుతుంది. దాంతో సాధారణ విలువ రూపం డబ్బు రూపంలోకి మారుతుంది.

## IV. డబ్బు రూపం.

ఒక సరుకు (బట్ట ) విలువ డబ్బు గా వున్న సరుకులో(బంగారం) వ్యక్తీకరణే ధర రూపం.


కాబట్టి బట్ట ధర రూపం :

20 గజాల బట్ట = 2 ఔన్సుల బంగారం

లేక రెండు ఔన్సుల బంగారానికి రెండు పౌండ్ స్టెర్లింగ్ లు కరెన్సీ పేరు అయితే

20 గజాల బట్ట = 2 పౌండ్ స్టెర్లింగ్ లు

రేఖా చిత్రంగా చూస్తే




**ప్రాధమిక విలువ రూపమే డబ్బు రూపం యొక్క రహస్యం.**

డబ్బు రూపం దానికదిగా ఏ చిక్కూ పెట్టదు.సాధారణ సమానక రూపం నించి చూస్తే, ఈ రూపం బంగారం వంటి ఏదో ఒకప్రత్యేక సరుకుకి అంటి పెట్టుకుంటుందని గ్రహించడానికి జుట్టు పీక్కోవాల్సిన /బుర్రబద్దలు కొట్టు కోవాల్సిన పనేమీ లేదు. సాధారణ సమానక రూపం దాని స్వభావ రీత్యానే, అన్ని ఇతర సరుకుల నుండీ ఒక సరుకు తొలగించ బడాలి. ఇక ఈ తొలగింపు సామాజిక ఆమోదాన్నీ , స్థిరత్వాన్నీపొందడమే నని తేలికగా తెలుసుకోవచ్చు.

"డబ్బు రూపం భావనలో కష్టమంతా సాధారణ సమానకాన్ని (మూడో రూపాన్ని ) అర్ధం చేసుకోవడం లోనే వున్నది." ఏమయినా, మూడో రూపం రెండో రూపంగా దానికదే resolve అవుతుంది. ఆ రెండో రూపాన్ని ఏర్పరిచే ది మొదటి రూపమే:

20 గజాల బట్ట = 1 కోటు

లేక x సరుకు A = Y సరుకు B

ఇక ఇప్పుడు, ఉపయోగపు విలువ అంటే ఏమిటో, మారకం విలువ అంటే ఏమిటో తెలిస్తే, ఈ మొదటి రూపం ఏ శ్రమ ఉత్పాదితానికైనా ప్రాతినిధ్యం వహించే సరళమైన, ఏమాత్రం అభివృద్ధి చెందని సరళి అని మనకు తెలుస్తుంది. అదే సమయంలో 20 గజాల బట్ట = 1 కోటు అనే ఈ సరళ రూపం 20 గజాల బట్ట = 2 పౌండ్ స్టెర్లింగ్ లు అనే డబ్బు రూపానికి మారడంలో ఉన్న వరస క్రమాన్ని సులువుగా గ్రహిస్తాం.

**సాధారణ రూపం నించీ డబ్బు రూపానికి పరిణామం.**

ఇప్పుడు బంగారం డబ్బు. అంతకు ముందు అది మామూలు సరుకు అయి ఉన్నందువల్లనే అది డబ్బు అయింది. అది ప్రాధమిక విలువ రూపంలో అటో ఇటో ఒక వైపు వుంది. అలాగే విస్తృత విలువ రూపంలో కూడా ఆవైపో ఈ వైపో అంటే సాపేక్ష విలువ రూపంలోనో, సమానకం రూపం లోనో వుంది. అలాగే సాధారణ రూపం లో కూడా ఉండేది. క్రమంగా అది సార్వత్రిక సమానకంగా విభిన్న పరిమితుల్లో ఉపకరించింది. ఆస్థానాన్ని తానొక్కటే సొంతం చేసుకుంది.ఇప్పుడు సార్వత్రిక సమానకం రూపం స్థానం లో బంగారం మాత్రమే కనబడుతుంది.అన్ని సరుకుల విలువ డబ్బు రూపం అయిన బంగారంలోనే వ్యక్తమవుతుంది. ఒక సరుకు

విలువ డబ్బులో చెబితే అదే ధర. 20 గజాల బట్ట=2 ఔన్సుల బంగారం అనేది బట్ట యొక్క ధర రూపం. ఆబంగారాన్ని నాణెం గా చేస్తే 20 గజాల బట్ట=£2 .అదయినా ఇదయినా బట్ట యొక్క ధర రూపమే.
చరిత్రలో స్థల కాల భేదాల్ని బట్టి భిన్న సరుకులు సార్వత్రిక సమానకాలుగా వ్యవహరించాయి.అంతిమంగా వాటినన్నిటినీ పక్కకు నెట్టి సమాజం బంగారాన్నిమాత్రమే సార్వత్రిక సమానకంగా ఆమోదించింది. కనుకనే బంగారం డబ్బు కాగలిగింది.మార్క్స్ కాపిటల్ అంతటా బంగారమే డబ్బు అనుకుని (assumption)రాశాడు.

డబ్బురూపం భావన (concept) ఏర్పరచు కోవాలంటే ఉన్న చిక్కంతా, సార్వత్రిక సమానకాన్ని స్పష్టంగా గ్రహించడంలో ఉంది. అలాగే ఈ రూపం సాధారణ రూపానికి అవసరమైన విపర్యయం అని తెలుసుకోవడం లోనూ (ఆచిక్కు) ఉంది. సాధారణ రూపం విస్తృత విలువ రూపం నించి వచ్చేదే (deducible). విస్తృత రూపాన్ని ఏర్పరచే భాగాలు ప్రాధమిక రూపంలోవే. 20 గజాల బట్ట= 1 కోటు లేక x సరుకు A =y సరుకు B. అందువల్ల ప్రాధమిక విలువ రూపమే డబ్బు రూపానికి క్రిమిరూపం అని మార్క్స్ రుజువుచేశాడు. దాని అంతర్గత వైరుధ్యాల మూలంగా ఈ రూపం అత్యున్నతమైన డబ్బురూపం లోకి ఎలా పరివర్తన చెందిందో వివరించాడు.

మారక ప్రక్రియలో వేర్వేరు శ్రమ ఉత్పాదితాలు ఒకదానికొకటి సమపరచ బడతాయి. ఆవిధంగా ఆచరణద్వారా సరుకులుగా మారతాయి. ఈ మారకాల ప్రక్రియలో అనివార్యంగా/ఆవశ్యకంగా డబ్బు రూపొందుతుంది. మారకాల చారిత్రిక అభివృద్ధీ, విస్తృతీ, సరుకుల్లో నిద్రాణంగా /స్తబ్దంగా ఉన్నఉపయోగపు విలువకూ , విలువకూ మధ్య వున్న వైరుధ్యాన్ని వృద్ధి పరుస్తుంది. వాణిజ్య ప్రయోజనాల కోసం ఈ వైరుధ్యానికి బాహ్య వ్యక్తీకరణ అవసరమవుతుంది. ఆ అవసరమే విలువకు స్వతంత్ర రూపాన్ని ఏర్పాటు చేసేందుకు వత్తిడి పెడుతుంది. సరుకుల్ని సరుకులుగానూ, డబ్బుగానూ పూర్తిగా విడగొట్టేదాకా విశ్రాంతి చెందదు. ఉత్పాదితాలు సరుకులుగా మారడం ఎంతవేగంగా జరుగుతుందో, అంతే వేగంగా ఒక ప్రత్యేక సరుకు డబ్బుగా మారుతుంది.- మార్క్స్ కాపిటల్ 1.90

## 7. సరుకుల మార్మికతా, దాని రహస్యమూ

**సరుకుల సమాజంలో ఉత్పత్తిదారుల మధ్య ఉండే సంబంధాలు వాళ్ళ ఉత్పాదితాల మధ్య సంబంధాలుగా వాళ్లకు అగపడతాయి. ఇలా కనబడడమే సరుకుల మార్మికత.**

సమాజంలో ఎవరికివారు ఇతరులతో సంబంధం లేకుండా వేర్వేరు వస్తువులు ఉత్పత్తి చేస్తారు. ఒకరు దారం తీస్తారు. మరొకరు బట్ట నేస్తారు. ఇంకొకరు కుండలు చేస్తారు. వేరొకరు నాగళ్ళు చెక్కుతారు. ఇలా శ్రమ విభజన వుంటుంది. ఒకరివి ఒకరికి అవసరం. కనుక ఆయా వ్యక్తులు సంబంధంలోకి వస్తారు. అయితే ఉత్పత్తి జరిగేటప్పుడు కాదు. వస్తువులు తయారయ్యాక మార్కెట్లో కలుస్తారు. మారకాలు జరుగుతాయి.

నాగలికీ, 5 కుండలకీ మారకం జరిగిందనుకుందాం.ఇది వ్యక్తులమధ్య సామాజిక సంబంధం.కాని ఉత్పత్తిదారులకి అది నాగలికీ,కుండలకీ మధ్య సంబంధంగా కనబడుతుంది.నాగలి చెయ్యడానికి పట్టిన స్రమకాలం, కుండ చెయ్యడానికి పట్టిన శ్రమ కాలానికి 5 రెట్లు. వాటిని చేసిన శ్రమలు భిన్నమైనప్పటికీ, అనిర్దిష్ట మానవశ్రమ గా వాటిలో ఉన్నది ఒకేరకమైనది.కనుక భిన్న పరిమాణాల్లో సమానమవుతాయి. మారతాయి.

అయితే అన్ని రకాల శ్రమలు అనిర్దిష్టమానవ శ్రమగా ఒకటే అనేవిషయం ఉత్పాదకులు నేరుగా గ్రహించలేరు. మారుతున్నది సరుకులు కనుక వాటి విలువలు సమానమైనట్లు భావిస్తారు. నాగలివిలువ కుండవిలువకి 5 రెట్లు అనీ,వాటికి స్వతహాగా విలువ వున్నదనీ అనిపిస్తుంది. మారకం ఆ విలువల వల్ల జరిగినట్లుంది. వ్యక్తుల సామాజిక సంబంధాలు వస్తువుల మధ్య సామాజిక సంబంధాలుగా వాళ్లకి అగపడతాయి. ఇలా కనబడడమే సరుకుల మార్మికత.

************

జర్మన్ భాషలో Fetischcharakter అనేమాట ఉపయోగించాడు మార్క్స్. ఇంగ్లిష్ అనువాదకులు fetishism అనీ, fetishistic character తర్జుమా చేశారు. తెలుగులో సంకేతారాధన అనీ, భూతశక్తి అనీ, సరుకుల పూజ అనీ, మాయ అనీ అన్నారు. పేరు ఏదయినా ఇదొక భావన (concept). దీనికి నిఘంటువులో వుండే అర్థం సరిపోదు.పారిభాషిక పదం కనుక ఇక్కడ ప్రత్యేకార్థం వుంటుంది.

### ఫెటిషిజం అంటే నిఘంటువు అర్థం:

ఒక వస్తువుకి అతీత శక్తులు ఉన్నాయనుకొనో , ఆవస్తువుని ఏదో మానవాతీత శక్తి ఆవహించిందనుకొనో దాన్ని పూజించడం. తాయెత్తులు, జ్వరం తాళ్ళు , వశీకరణ ఉంగరాలు మొదలయినవి..చెట్టుకి ముడుపుగాడితే కోరికలు తీరతాయి అనుకోవడం . ఇలాంటివి.

### మార్క్స్ వాడిన అర్థం:

"సరుకులో మానవ శ్రమ యొక్క సామాజిక స్వభావం వాళ్లకి వాళ్ళ ఉత్పాదితాల మీద ముద్రించిన వస్తుగత స్వభావంగా కనిపిస్తుంది.అంటే,ఉత్పాదితాల కున్న వస్తుగత ధర్మంగా కనిపిస్తుంది;మొత్తం శ్రమతో వాళ్ళ సంబంధం వాళ్ళ వాళ్ళ మధ్య సంబంధంగా కాకుండా, వాళ్ళ శ్రమ ఉత్పాదితాల మధ్య సామాజిక సంబంధంగా కనబడుతుంది."-

"మనుషుల మధ్య సామాజిక సంబంధం వాళ్ళ దృష్టిలో వస్తువుల మధ్య సంబంధం రూపం తీసుకుంటుంది ."

"దీన్నే నేను Fetishism అంటాను." –అన్నాడు.

***************

ఇదేదో పైపై విషయం కాదు. మార్క్స్ సిద్ధాంతపునాదికి ఒక కీలకమైన విషయం. ఆయన ఆర్థిక సంక్షోభ భావనతో నేరుగా ముడిపడి వున్న అంశం.సందర్భం వచ్చినప్పుడు ఆవిషయం లోతుగా పరిశీలించవచ్చు.

ఈ భావన కాపిటల్ 3 సంపుటాల్లోనూ,అదనపు విలువ సిద్ధాంతాలలోనూ ఉంటుంది.

మార్మికత అనేది భ్రమ కాదు. ఉనికిలో వున్నవిషయం కనుకనే మార్మికత అనేది చైతన్యంలో చేరుతుంది.ఈ 'సామాజిక ఉనికి' సరుకు ఉత్పత్తి, సరుకు ఉత్పత్తి మాత్రమే. "అవి నిజంగా ఎలాగో అలాగే, (as what they really are)అంటే మనుషుల మధ్య పాదార్ధిక సంబంధాలుగానూ, వస్తువుల మధ్య సామాజిక సంబంధాలుగానూ కనబడతాయి."-78

నిజానికి ఏవస్తువుకీ స్వతస్సిద్ధంగా విలువ ఉండదు. కాని సరుకులకి స్వయం సిద్ధంగా విలువ ఉన్నట్లు కనబడుతుంది. ఇదే మార్మికత.

సరుకులుగా ఉత్పత్తి అయ్యేఅవగానే శ్రమ ఉత్పాదితాలకు ఇది అంటుకుంటుంది.

సరుకుల ఉత్పత్తి అభివృద్ధితోపాటు ఇదీ వృద్ధవుతుంది.

డబ్బు అమల్లోకి రాగానే సరకుల మార్మికత, డబ్బు మార్మికత రూపం తీసుకుంటుంది.బంగారంతో ఎవస్తువునైనా కొనవచ్చు. ప్రజల దృష్టికి ఇది బంగారానికున్న సహజ లక్షణంగా అగపడుతుంది. కాని నిజానికది సామాజిక సంబంధాల వాళ్ళ ఏర్పడింది. సామాజిక లక్షణం.

సరుకుల ఉత్పత్తి కొనసాగినంతకాలమూ సరుకుల మార్మికత సాగుతుంది. సరుకుల ఉత్పత్తి అంతరిస్తేనే మార్మికత అంతర్ధానం అవుతుంది.

**************

## సరుకుల ఉత్పత్తి

సరుకు ఉపయోగపువిలువ, విలువల సమ్మేళనం. రైతు ధాన్యం పండించి వాడు కోవచ్చు, మరొకడు పీటలు చేసి ఉపయోగించు కోవచ్చు అలా ఎవరు చేసినవి వారో,కుటుంబ సభ్యులో ఉపయోగించుకుంటే అవి ఉపయోగపు విలువలు. విలువలు కావు. ఇతరులకు మారకం లేకుండా వాడుకోడానికి చేసి ఇచ్చిన వస్తువులు కూడా విలువలు కావు. కనుక అవేవీ సరుకులు కావు.

స్వీయ ఉపయోగార్ధం ఉత్పత్తిచేసిన వస్తువులు కేవలం ఉపయోగపు విలువలు.

ఇతరులకోసం అంటే సమాజంకోసం తయారుచేసి వాటిని వస్తువులతోనో, డబ్బుతోనో మారకం చేస్తే అవి విలువలు. ఉపయోగపు విలువా విలువా కలసినవి.కనుక అవి సరుకులు.

స్వీయ ఉపయోగార్ధం కాకుండా, మారకం కోసం ఉత్పత్తి చెయ్యడమే సరుకుల ఉత్పత్తి.

తాను చేసుకున్న వస్తువులను మాత్రమే వాడుకున్న కాలం ఉన్నమాట నిజమే. కాని అదిపోయి దీర్ఘకాలం గడిచింది. పైగాఅలాంటి పరిస్థితుల్లో, ఒకరు చేసినవి మరొకరు వాడుకోక తప్పదు. అంటే, ఒకరి శ్రమని ఒకరు ఉపయోగించుకుంటారు. వ్యష్టి శ్రమ సామాజికం అవుతుంది. ప్రతి మనిషి శ్రమా సామాజిక శ్రమ మొత్తంలో చిన్న భాగం అవుతుంది. ఎవరి శ్రమ ఉత్పాదితాలు వారివే. కనక మరోకరి శ్రమ ఉత్పాదితంతో మారకం చేసుకుంటారు. ఇది వ్యక్తులమధ్య సామాజిక సంబంధం. అయినా వాళ్లకి అది వస్తువుల మధ్య సామాజిక సంబంధంగా కనబడుతుంది. ఇలా కనబడదాన్నే మార్క్స్ మార్మికత అంటాడు.

ఒకతను మంచాలు చేస్తాడు. మరొకతను నులక పేనుతాడు. మంచం చేసిన వానికి నులక కావాలి. నులక పేనిన వానికి మంచం కావాలి. మార్కెట్ కొచ్చి నప్పుడు మారకం చేసుకుంటారు. దర్జీ చొక్కాలు కుడతాడు. నేతగాడు శాలువాలు నేస్తాడు. నేతగాడికి చొక్కా కావాలి. దర్జీకి శాలువా అవసరంలేదు. కనుక నేతగాడు సలువాలు వేరేవారికి అమ్మి ఆడబబ్బులోనించి కొంతిచ్చి చొక్కా కొనుక్కుంటాడు. మిగిలిన డబ్బుతో కావలసినవి కొంటాడు. అలాగే దర్జీ చొక్కాలు అమ్మి వచ్చిన డబ్బు బెట్టి అవసరమైనవి కొనుక్కుంటాడు.

కనుక వాళ్లకి వాళ్ళ మధ్య సంబంధాలుగా కాకుండా, సరుకులకీ సరుకులకీ మధ్య సంబంధంగా, వస్తువుల మధ్య సంబంధంగా కనబడుతుంది. ఇదే శ్రమ ఉత్పాదితం సరుకు రూపం ఎత్తగానే దానికి అంటుకునే మార్మికత.

అందువల్లమార్మికత సరుకుల ఉత్పత్తి నించి విడదీయ జాలనిది.

సరుకు ఉత్పత్తితోనే మార్మికత తలెత్తిందని స్పష్టం చేశాడు.

***************

సరుకు కాగానే మార్మికత ఎక్కడనించి వస్తుంది?

పైకి సరుకు తేలికగా తెలిసేదే అనిపిస్తుంది. తీరా విశ్లేషిస్తే, అదేదో మార్మికమైనదిగా, నిగూఢమైనదిగా తేలుతుంది. సరుకు ఉపయోగపు విలువా, విలువా అని తెలుసు. సరుకు మార్మిక స్వభావం ఎందులో ఉంది?

A. ఉపయోగపు విలువలో ఉన్నదా?

సరుకు ఉపయోగపు విలువ అయినమేరకు

1.అది తన ధర్మాల ద్వారా మనిషి అవసరాలను తీరుస్తుంది.

2.ఆ ధర్మాలు మానవ శ్రమ వల్ల ఏర్పడినవి .

ఉదాహరణ:అడ్డం కట్టుకోవాలంటే, తడిక అవసరం. నీళ్ళు చేదాలంటే చేంతాడు కావాలి. అవి రెండూ రెండు వేర్వేరు అవసరాలను తీరుస్తాయి. రెండూ మానవ శ్రమ వల్ల తయారైనవే.

ప్రకృతిలో లభించిన వెదురు బొంగులు చీల్చి తడిక అల్లుతారు. నారతో చేంతాడు పేనుతారు.అంటే, ప్రకృతి ఉత్పాదితాలకు(బొంగులు,నార) మనిషి తన శ్రమను జోడించి వాటి రూపాలను మారుస్తాడు.ఇది స్పష్టమే. మనిషి ప్రకృతి లో దొరికే వస్తువుని తన శ్రమతో ఉపయోగపడే వస్తువుగా మారుస్తాడు. ఈ విషయం తలియడంలో చిక్కేమీ లేదు.

"ప్రకృతి కొయ్యని సమకూరుస్తుంది. మనిషి తన శ్రమతో దాన్ని ముక్కలుగా కోసి తనకు ఉపయోగపడే టేబుల్ చేస్తాడు . టేబుల్ గా చెయ్యడం వల్ల కొయ్య రూపం మారింది. అయినా, అది కొయ్యగానే ఉంటుంది."

అందువల్ల సరుకు ఉపయోగపు విలువకు సంబంధించి గ్రహించలేనిది ఏదీ లేదు. ఇందులో నిగూఢత లేనే లేదు. ప్రతిదీ స్పష్టంఅయినదే, ఇంద్రియగ్రాహ్యమైనదే. కనుక సరుకు మార్మికత ఉపయోగపు విలువలో లేదు.

B.పోనీ విలువని నిర్ణయించే అంశాల్లో ఉన్నదా? అంటే లేదంటాడు.

ఎందు కంటే, మొదటిది, ప్రయోజనకర శ్రమలు భిన్నమైనవే,అయినప్పటికీ అవన్నీ మనిషి భౌతిక చర్యలే, అలాంటి ప్రతి చర్యా ,దాని రూపం ఎదయినకావచ్చు,సారంశం లో మనిషి మెదడూ, నరాలూ కండరాలూ వగయిరాల వ్యయమే.

రెండు, విలువ పరిమాణాన్ని నిర్ణయించేది ఆశ్రమ వ్యయ వ్యవధి లేక శ్రమ పరిమాణం. దీనికి సంబంధించి గుణానికీ, పరిమాణానికీ తేడా ఉన్నదనేది స్పష్టమే. అన్ని సమాజాల్లోనూ జీవనాధార సాధనాలని ఉత్పత్తి చేసేందుకు పట్టే శ్రమ కాలం పట్ల మనుషులకు ఆసక్తి ఉంది. అయితే అన్ని అభివృద్ధి దశల్లో ఒకే స్థాయిలో కాదు కాక పోయినా.

చివరగా, మనుషులు ఒకరికోరకొకరు పనిచేస్తుంటే, వాళ్ళ శ్రమ సామాజికరూపం తీసుకుంటుంది.

ఇవన్నీ స్పష్టంగా బోధపడేవే. అన్ని సమాజాల్లోనూ ఉన్నవే.

“విలువ నిర్ణాయకాల సారం నించి కూడా మార్మికత ఉత్పన్నం కాదు” అంటాడు. సరుకుల మార్మిక స్వభావం వాటి ఉపయోగపు విలువనుండి పుట్టలేదు, విలువను నిర్ణయించే అంశాల నుండీ పుట్టలేదు.

C. కావలసినవన్నీ తయారుచేసుకుని తామే వాడుకున్న కాలం ఉంది, గాని అది ఏనాడో పోయింది. ఒకరుచేసినవి ఒకరు ఉపయోగించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకరి శ్రమను మరొకరు పరస్పరం వాడుకోవడం అవసరమయింది. శ్రమ సామాజికం అయింది. ఉత్పత్తిదారుల మధ్య సంబందాలు ఉండి తీరాలి. ఇందులోనూ మార్మికత లేదు.

మార్మికత శ్రమ విభజననుండి తలెత్తిందా?అంటే అదీ కాదు. సరుకుల ఉత్పత్తి లేకముందు కూడా శ్రమవిభజన ఉంది. దీన్నిబట్టి, మార్మికత శ్రమ విభజననుండి తలెత్తలేదని స్పష్టమవుతుంది.

***************

**మరి ఈ మార్మికత ఎక్కడ నించి పుట్టింది ?**

”శ్రమ ఉత్పాదితం సరుకు రూపం తీసుకోగానే దానికి మార్మిక స్వభావం ఎక్కడ నించి వస్తుంది? ” అని ప్రశ్నించి ,

“స్పష్టంగా సరుకు రూపం నించే” అంటాడు.

“అయితే ఆ టేబుల్ సరుకుగా వచ్చిందా, అదేదో ఇంద్రియాతీతమైన వస్తువుగా అయిపోతుంది. కాళ్ళ మీద నిలబడడమేకాదు,ఇతర సరుకులతో సంబంధంలో తలమీదా నిలబడుతుంది “అంటాడు.

విశ్లేషణ లో తేలిన విషయాలు సరుకు ఉత్పత్తిదారులకు వేరేవిధంగా కనబడతాయి.

అన్ని రకాల మానవ శ్రమలూ సమానమే,అనే విషయం విశ్లేషణలో తేలింది. అయితే అది వస్తుగతంగా ఆశ్రమల ఉత్పాదితాలన్నీ విలువలు కావడం గా వ్యక్తం అవుతుంది. సరుకులుగా మార్కెట్ కి వచ్చాక అవన్నీ విలువలు. కనుక గుణాత్మకంగా సమానమైనవి. విశ్లేషణలో అన్నిరకాల శ్రమలూ సమానమే అని తేలిన విషయం మార్కెట్లో అన్ని సరుకులూ విలువలుగా సమానం అని వ్యక్తమవుతుంది. సరుకు ఉత్పత్తి దారులకు అలాగే తెలుస్తుంది.

శ్రమ శక్తి వ్యయానికి కొలబద్ద శ్రమ శక్తి వ్యవధి.అంటే, ఎంత సేపు ఆ శ్రమ జరిగింది?అనేది. అయితే అది వస్తుగతంగా శ్రమ ఉత్పాదితాల విలువ పరిమాణం రూపం తీసుకుంటుంది. ఉదాహరణకి,టేబుల్ తయారీకి 4 గంటల శ్రమ పడితే, దాని విలువ పరిమాణం 200 రూపాయలుగా వ్యక్తం అవుతుంది.

ఒకరికొరకొకరు శ్రమ చెయ్యడంలో శ్రమ సామాజిక స్వభావం ఉంటుంది. అయితే ఇక్కడ ఉత్పత్తిదారుల సామాజిక సంబంధాలు వాళ్ళ ఉత్పాదితాల మధ్య సంబంధాల రూపం తీసుకుంటాయి.

సరుకు అందువల్ల నిగూఢమైన వస్తువు: సరుకులో మానవ శ్రమ యొక్క సామాజిక స్వభావం వాళ్లకి వాళ్ళ ఉత్పాదితాల మీద ముద్రించిన వస్తుగత స్వభావంగా కనిపిస్తుంది.అంటే,ఉత్పాదితాల కున్న వస్తుగత ధర్మంగా కనిపిస్తుంది;మొత్తం శ్రమతో వాళ్ళ సంబంధం వాళ్ళ వాళ్ళ మధ్య సంబంధంగా కాకుండా, వాళ్ళ శ్రమ ఉత్పాదితాల మధ్య సామాజిక సంబంధంగా కనబడుతుంది." శ్రమ ఉత్పాదితాలు సరుకులయ్యేది ఈ కారణంగానే." సరుకులు సామాజిక వస్తువులు, వేటి లక్షణాలయితే ఏక కాలంలో గోచరంగానూ అ గోచరంగానూ ఉంటాయో ఆ సామాజిక వస్తువులు, సరుకులు.

అదే విధంగా ఒక వస్తువునుంచి వచ్చే కాంతి మన కంటి నరంయొక్క ఉద్రిక్తత గా మనకి తట్టదు ; కంటి బయట వున్న దేనిదో వస్తుగత రూపంగా తడుతుంది.

అయితే చూడడంలో ప్రతి సందర్భంలోనూ కాంతి ఒక వస్తువు నించి మరొక వస్తువుకు అంటే, బయటవున్న వస్తువు నించి కంటికి ప్రసరిస్తుంది. ఇక్కడ భౌతిక వస్తువుల మధ్య భౌతిక సంబంధం వున్నది. అయితే సరుకుల విషయం వేరు. సరుకులుగా వస్తువుల మనుగడా, వాటిపై సరుకులముద్రవేసే శ్రమ ఉత్పాదితాల విలువ సంబంధమూ, వాటి భౌతిక ధర్మాలకు సంబంధించినవి కానే కావు. మానవుల మధ్య నిర్దిష్టమైన సామాజిక సంబంధం ఉంది. వాళ్ళ దృష్టికి వస్తువులమధ్య సంబంధం రూపాన్ని(విచిత్రమైన రూపాన్ని) తీసుకునే సామాజిక సంబంధం అది.

దీనికి పోలిక కావాలంటే మత ప్రపంచంలోకి పోవాల్సిందే. అందులో మనిషి మెదడు సృష్టించిన వాళ్ళు ప్రాణం వున్న స్వతంత్ర వ్యక్తులుగా కనబడతారు.ఒకరితో ఒకరు సంబంధంలోకి వస్తారు. అంతే కాదు, మానవ జాతితో కూడా సంబంధంలోకొస్తారు.

అలాగే సరుకుల ప్రపంచంలో మనిషి చేతులతో చేసిన సరుకులు కూడా. సరుకులుగా ఉత్పత్తి అయ్యీ కాగానే శ్రమ ఉత్పాదితాలకు ఈ మార్మికత అంటుకుంటుంది. అందువల్ల అది సరుకుల ఉత్పత్తి నించి విడివడదు. మార్మికతకీ సరుకుల ఉత్పత్తికీ విడగొట్టలేని సంబంధం ఉంది.

సరుకుల మార్మికతకి మూలం సరుకుల్ని ఉత్పత్తి చేసిన శ్రమ యొక్క ప్రత్యేక సామాజిక స్వభావంలో ఉంది- అని ఇప్పటికే మన విశ్లేషణ తేల్చింది.కాపిటల్.1.77

ఒకరితో ఒకరు సంబంధం లేకుండా విడివిడిగా ఉత్పత్తిచేసే ప్రైవేటు వ్యక్తుల,లేక బృందాల శ్రమ ఉత్పాదితాలు అయినందువల్లే ప్రయోజనకర వస్తువులు సరుకులవుతాయి. అందరు ప్రైవేటు వ్యక్తుల శ్రమ మొత్తం కలిసి సమాజపు శ్రమ అవుతుంది. ఉత్పత్తిదారులు వాళ్ళ వాళ్ళ ఉత్పాదితాల్ని మారకం చేసుకునేదాకా ఒకరితో

ఒకరు సంబంధంలోకి రారు. ఆకారణంగా ప్రతి ఉత్పత్తిదారుని శ్రమ యొక్కవిశిష్ట సామాజిక స్వభావం మారకంలో తప్ప బయట పడదు. వ్యక్తి శ్రమ సమాజ శ్రమలో భాగంగా ఎప్పుడు తెలుస్తుందంటే, మారకచర్య ప్రత్యక్షంగా ఉత్పాదితాల మధ్యా, పరోక్షంగా వాటిద్వారా ఉత్పాదకుల మధ్యా ఏర్పరచే సంబంధాల ద్వారా మాత్రమే నిర్ధారణవుతుంది. అందువల్ల ఆవుత్పాదకులకి ఒకరి శ్రమని మిగతా వారి శ్రమతో కలిపే సంబంధాలు, వ్యక్తుల మధ్య ప్రత్యక్ష సామాజిక సంబంధాలుగా కనబడవు. అవి నిజంగా ఎలాగో అలాగే, అంటే మనుషుల మధ్య పాదార్థిక సంబంధాలుగానూ, వస్తువుల మధ్య సామాజిక సంబంధాలుగానూ కనబడతాయి. మారకం అయినందువల్లనే, ప్రయోజనకర వస్తువులుగా వాటి వివిధ రూపాలకు భిన్నంగా , శ్రమ ఉత్పాదితాలు విలువలుగా ఒకేరకమైన సామాజిక హోదా ని పొందుతాయి. ఉపయోగపు విలువగానూ,విలువగానూ ఒక ఉత్పాదితం విభజన ఎప్పుడు ముఖ్యం అవుతుందంటే, ప్రయోజనకర వస్తువులు మారకం కోసమే ఉత్పత్తయ్యే స్థాయికి మారకం విస్తరించినప్పుడు, విలువలుగా వాటి స్వభావాన్ని ముందుగా ఉత్పత్తిలోనే లెక్కలోకి తీసుతీసుకోవలసి వచ్చినప్పుడు.ఆక్షణం నించీ వ్యక్తి ఉత్పత్తిదారునిశ్రమ సామాజికంగా ద్వంద్వ స్వభావాన్ని సంతరించుకుంటుంది.ఒకవైపు, నిర్దిష్టమైన ప్రయోజనకర శ్రమ గా అది ఒక నిర్దిష్ట సామాజికఅవసరాన్ని తీర్చాలి. ఉదాహరణకి కుండలు చేసే శ్రమ ఒక నిర్దిష్ట ప్రయోజనకర శ్రమ. సమాజానికి కుండలు అవసరం. ఆ అవసరాన్ని ఆశ్రమ తీరుస్తుంది. సామాజిక శ్రమ విభజనలో ఒక శాఖగా తన స్థానాన్ని పొందుతుంది.

మరొకపక్క , అది ఆశ్రమ చేసే వాని వివిధ కోర్కెలనూ తీర్చగలదు. అంటే కుండలకు మారుగా తనకు కావలసిన వస్తువులు తీసుకోగలదు. మిగతా అందరి శ్రమ తోనూ సమాన హోదా సాధిస్తుంది.సమాజ శ్రమలో భాగం అయినట్లు రుజువవుతుంది. భిన్న రకాల శ్రమల సమానత్వం వాటి అసమానత్వాల నించి అనిర్దిష్టీ కరించిన ఫలితం. లేక వాటి ఉమ్మడి విభాజకం అంటే మానవ శ్రమ శక్తి వ్యయం లేక అనిర్దిష్ట మానవ శ్రమకి దించడం ద్వారా మాత్రమే సాధ్యం. వ్యక్తి శ్రమ యొక్క సామాజిక ద్వంద్వ స్వభావం అతని మనస్సులో ప్రతిఫలించినప్పుడు అతనికి ఎలా కనబడుతుంది? రోజువారి అనుభవంలో ఉత్పత్తుల మారకం ద్వారా ఆశ్రమ మీద ముద్రపడిన రూపాలలో మాత్రమే. ఈ విధంగా తన సొంత శ్రమ సమాజానికి ఉపయోగ పడే స్వభావం కలిగివున్నది అనేది ఒక షరతు రూపం తీసుకుంటుంది. ఏమంటే ఉత్పాదితం కేవలం ప్రయోజనకరం అయినది కావడమే కాదు. ఇతరులకు ఉపయోగపడేదై ఉండాలి. అతని ప్రత్యేక శ్రమ అన్ని ఇతర రకాల శ్రమలతో సమానమైనది అనే సామాజిక స్వభావం ఏరూపం తీసుకుంటుందంటే: భౌతికంగా భిన్నమైన అన్ని శ్రమ ఉత్పాదితాలకూ ఒక ఉమ్మడి లక్షణం ఉంది.అదే విలువ కలిగి వుండడం కాపిటల్ 1.77-78

మన శ్రమ ఉత్పాదితాల్ని విలువలుగా సంబంధంలో కి తెచ్చామంటే, వాటిలో ఒకేరకమైన మానవ శ్రమ ఉన్నదని తెలిసి కాదు. అందుకు భిన్నంగా మారకం ద్వారా మన ఉత్పాదితాల్ని సమపరుచు కున్నప్పుడల్లా, ఆచర్యలో వాటికోసం చేసిన భిన్న రకాల శ్రమల్ని మానవ శ్రమగా సమపరుస్తున్నాం.ఇలా చేస్తున్నామని మనకు తెలియదు, అయినా చేస్తాం.గాలియానీ, విలువ ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధం అన్నాడు.

వస్తువుల మధ్య సంబంధంగా వ్యక్తమయ్యే సంబంధం అనేమాటలు కలిపి ఉండాల్సింది అన్నాడు మార్క్స్-కాపిటల్ 1 .79 .

అందువల్ల, విలువ తనేమిటో వర్ణించే చీటీ మొహానికి అంటించుకొని తిరగదు. పైగా విలువే ప్రతి ఉత్పాదితాన్నీ సామాజిక చిత్రలిపిగా (social hieroglyphic) మారుస్తుంది. ఆతర్వాత మనసొంత సామాజిక ఉత్పాదితాల వెనక వున్నరహస్యాన్ని గ్రహించడానికి, దాన్నిచదివే ప్రయత్నం చేస్తాం.డీకోడ్ (decode) చేస్తాం.

*************.

విలువ అనేది పైకి తలిసేది కాదు,కనుక విలువ శాస్త్రీయ విశ్లేషణకు వస్తువయింది.

ఆర్థికవేత్తలు శ్రమ నించి విలువ వస్తుంది అని కనుక్కున్నారు.ఇదొక గొప్ప ఆవిష్కరణ. అయితే అంతకు ముందు లాగానేఈ ఆవిష్కరణ తర్వాత కూడా శ్రమ సామాజిక స్వభావం శ్రమ ఉత్పాదితాల వస్తుగత స్వభావంగానే కనిపించడం ఆగలేదు.అలా కనిపించేట్లు చేసే మంచుపొరని ఈ ఆవిష్కరణ తొలగించలేక పోయింది.

ఎందువల్ల?

సరుకుల ఉత్పత్తి అనే ప్రత్యేక రూపాన్ని పరిశీలిస్తున్నాం.ఎవరికీ వారు స్వతంత్రంగా ఉత్పత్తిచేస్తారు.ఈ ప్రైవేట్ శ్రమ యొక్క సామాజిక స్వభావం ప్రతిశ్రమా మానవ శ్రమగా సమానమే అనేదాంట్లో ఉంటుంది. అయితే ఇది ఉత్పాదితంలో విలువ రూపం తీసుకుంటుంది. ఈ వాస్తవం ఉత్పత్తిదారులకు నిత్యమైనట్లూ, సత్యమైనట్లూ కనబడుతుంది- ఈ ఆవిష్కరణ తర్వాతకూడా. ఈ ఆవిష్కరణమార్మికత పట్టుని సడలించలేక పోయింది.ఎలాగంటే, "గాలి(air)లో భాగాలైన చాలా వాయువులని (gases)సైన్స్ కనుగొన్నాక కూడా, దానికదిగా వాతావరణం మారకుండా ఉన్నట్లే."

మారకం చేసుకునేటప్పుడు ఉత్పత్తిదారుల ఆలోచనంతా తమ సరుకుకి ఇతర సరుకులు ఎంత పరిమాణంలో వస్తాయనేదానిమీద ఉంటుంది. ఏ నిష్పత్తిలో ఆ ఉత్పదితాలు మారగలగుతాయి?

ఈ మారక నిష్పత్తులు అలవాటువల్ల ఒకింత స్తిరత్వంపొందుతాయి. అప్పుడు ఆనిష్పత్తులు ఉత్పాదితాల స్వభావం నించే వచ్చినట్లు కనబడతాయి. ఉదాహరణకి ఒక టన్ను ఇనుమూ రెండు ఔన్సుల బంగారమూ ప్రకృతి సిద్ధంగానే సమాన విలువ గలవిగా కనిపిస్తాయి. ఇది ఎంత సహజంగా కనిపిస్తుందంటే: బంగారమూ, ఇనుమూ వేర్వేరు భౌతిక, రసాయన ధర్మాలు కలిగి ఉన్నప్పటికీ, ఒక పౌను బంగారమూ, ఒక పౌను ఇనుమూ సమాన బరువుని కలిగివున్నంత సహజంగా . విలువ ఉండడం అనే స్వభావం ఒకసారి సరుకులమీద పడితే, ఆస్వభావం విలువ పరిమాణాలుగా చర్యలు ప్రతి చర్యలు జరగడం మూలంగా స్థిరపడుతుంది . ఈ పరిమాణాలు మారుతుంటాయి. ఉత్పాదకుల సంకల్పంతోగానీ,ముందు చూపుతో గానీ, చర్యతోగానీ ఎటువంటి సంబంధమూ లేకుండానే మారుతుంటాయి. వాళ్లకి వాళ్ళ సామాజిక చర్య వస్తువుల చర్య రూపం తీసుకుంటుంది. ఉత్పత్తిదారుల చేత పాలించ బడే బదులు, ఆసరుకులే వాళ్ళని పాలిస్తున్నట్లుంటుంది.

మార్కెట్లో సరుకులు యజమాని చెప్పినట్లుండవు. యధేచ్ఛగా వ్యవహరిస్తాయి. ఒకరోజు ఒక కలం 5 పెన్నిళ్ళతో మారవచ్చు. ఇంకోరోజు 8 రావచ్చు. మరో రోజు 3 రావచ్చు. ఒకసారి అసలు మారక పోవచ్చు.మార్కెట్లో నడిచే ఈ యాదృచ్చికమైన పరిస్థితి మూలంగా సరుకుకి స్వయంసిద్ధంగా విలువ వున్నదనిపిస్తుంది. ఉత్పత్తి యొక్క సామాజిక సంబంధాలను ఉత్పాదకులు గ్రహించరు.వస్తువులమధ్య సంబంధాలను మాత్రమే గమనిస్తారు. వస్తువుల మధ్య సంబంధాల మాటున వ్యక్తుల సామాజిక సంబంధాలు మరుగున పడిపోతాయి.

************

ఒకరితో ఒకరు సంబంధం లేకుండా,స్వతంత్రంగా,అయినా అభివృద్ధిచెందిన సామాజిక శ్రమ విభజన శాఖలుగా, నిర్వహించబడే అన్ని రకాల ప్రైవేటు శ్రమలూ సమాజానికి కావలసినట్లుగా పరిమాణాత్మక నిష్పత్తులుగా దిగుతాయి. ఎందుకు? అన్ని యాదృచ్చికమైన,ఒడిదుడుకులున్న సరుకుల మారక సంబంధాల నడుమ వాటి ఉత్పత్తికి పట్టిన సామాజికంగా అవసరమైన శ్రమ కాలం శాసించగల ప్రకృతి నియమం లాగా బలవంతంగా నిర్ధారణ అవుతుంది. అదే విధంగా ఒక ఇల్లు మన కళ్ళెదుట కూలినప్పుడు భూమ్యాకర్షణ నియమం నిరూపితమవుతుంది. అందువల్ల శ్రమ కాలం ద్వారా శ్రమ పరిమాణం నిర్ణయం అనేది ఒక రహస్యం.సరుకుల సాపేక్ష విలువలలో పైకి కనపడే నిర్ణయం వెనక దాగిన రహస్యం. దాని ఆవిష్కరణ ఉత్పాదితాల విలువ పరిమాణ నిర్ణయం కేవలం యాదృచ్చికమైనదిగా కనబడదాన్ని పూర్తిగా పోగొట్టినప్పటికీ, ఆనిర్ణయం జరిగే విధానాన్ని ఏ విధంగానూ మార్చలేదు.

సమాజ జీవిత రూపాల గురించిన మనిషి ఆలోచనలూ, తత్ఫలితంగా ఆరూపాలగురించిన మనిషి శాస్త్రీయ విశ్లేషణా వాస్తవ చారిత్రిక అభివృద్ధికి నేరుగా వ్యతిరేక దిశలో సాగుతాయి. అతనిముందు సిద్ధంగావున్న అభివృద్ధి ప్రక్రియ యొక్క ఫలితాలతో అతను మొదలుబెడతాడు.

ఉత్పాదితాలను సరుకులుగా ముద్రవేసే లక్షణాల స్థిరీకరణ సరుకుల చలామణీ కి ముందుగా వుండి తీరాలి. ఆలక్షణాలు సహజమైన,స్వయం స్పష్టమైన సమాజ జీవిత రూపాలయొక్క స్థిరత్వాన్ని అప్పటికే పొందాయి.మనిషి వాటి చారిత్రక స్వభావాన్నిగ్రహించే ప్రయత్నం చెయ్యకుండా, వాటి అర్థాన్ని తెలుసుకునే యత్నం చేశాడు. ఎందుకంటే,అతని దృష్టిలో ఆలక్షణాలు మారేవి కావు. కనుకనే వాటి అర్ధం వైపు దృష్టి పెట్టాడు. ఫలితంగా సరుకుల ధరల విశ్లేషణ ఒక్కటే విలువ పరిమాణం యొక్క నిర్ధారణకు లీడ్ చేసింది.అన్ని సరుకులూ డబ్బులో ఉమ్మడిగా వ్యక్తం కావడం విలువలుగా వాటి లక్షణాల నిర్ధారణకు లీడ్ చేసింది. ప్రైవేట్ శ్రమ యొక్క సామాజిక స్వభావాన్నీ,వ్యష్టి ఉత్పత్తిదారుల మధ్య సామాజిక సంబందాల్నీ బయటపెట్టే బదులు, దాచి పెట్టింది , సరుకుల అంతిమ రూపమైన డబ్బు రూపమే. కోట్లో బూట్లో బట్టతో, అది అనిర్దిష్ట మానవ శ్రమ అవతారం అయినందువల్ల, సంబంధంలో ఉన్నాయని అన్నప్పుడు అసంబద్ధత స్వయంస్పష్టమే . అయినాగాని,బూట్ల, కోట్ల ఉత్పత్తిదారులు వాళ్ళ వస్తువుల్ని సార్వత్రిక సమానకంగా బట్టతో పో ల్చినప్పుడు,లేక బంగారంతోనో, వెండితోనో పోల్చినప్పుడు, అవి వారి సొంత ప్రైవేట్ శ్రమకీ,సమాజం యొక్క శ్రమకీ ఉన్న సంబంధాన్ని అదే అసంబద్ధ రూపంలో వ్యక్తం చేస్తాయి

బూర్జువా ఎకానమీ యొక్క భావాభివర్గాలు అటువంటి(అసంబద్ధ) రూపాలతో ఉంటాయి. అవి సమాజ అంగీకారంతోచారిత్రకంగా నిర్దిష్ట మైన ఒక ఉత్పత్తి అంటే సరుకుల ఉత్పత్తి విధానం యొక్క పరిస్థితుల్నీ,సంబందాల్నీవ్యక్త పరుస్తాయి. శ్రమ ఉత్పాదితాలు సరుకులు గా ఉన్నంతకాలం వాటిని ఆవహించి ఉండే సరుకుల మొత్తం నిగూఢతా, ఇంద్రజాలం ఇతర ఉత్పత్తి విధానాలను చేరగానే అదృశ్యం అవుతాయి.

***********

మార్మికత లేని ఉత్పత్తి గురించి చెప్పడానికి మార్క్స్ రాబిన్సన్ క్రూసో ని ఉదాహరిస్తాడు.

1.రాబిన్సన్ ఉత్పత్తి.ఒక దీవిలో ఒక్కడే చిక్కుకుంటాడు.ఇంకెవ్వరూ ఉండరు. అతనికి ఎక్కువ కోర్కెలు కాపోయినా, కొన్నైనా తీర్చుకోవాలి. ఒంటరివాడు గనక తన అవసరాలు తీర్చే వస్తువుల్ని తనే ఏర్పరచుకోక తప్పదు.కనక రకరకాల పనులు చేశాడు. ఇల్లు కట్టాడు. చుట్టూ కంచె వేశాడు. పనిముట్లు,ఫర్నిచర్ చేసుకున్నాడు. జంతువుల్ని వేటాడేవాడు.బార్లీ పండించేవాడు.కుండలు చెయ్యడానికీ,మేకలు పెంచడానికీ అలవాటు పడ్డాడు. బుట్టలల్లాడు.చిన్న పడవ చేసుకున్నాడు.చేపలు పట్టడం అలవరచుకున్నాడు. " అతని పనిలో ఎంత వైవిధ్యం ఉన్నా,ఆశ్రమ రూపం ఏదయినా అంతా తన ఒక్కడి శ్రమే అని, దాని భిన్న రూపాలేననీ అతనికి తెలుసు. అవసరాన్ని బట్టి తన కాలాన్నివివిధ పనులకు కేటాయించేవాడు.

ఆతను తన stock-book లో తనవైన ప్రయోజనకర వస్తువుల జాబితా రాశాడు.వాటి తయారీకి అవసరపడే చర్యల గురించి రాశాడు. నిర్దిష్ట పరిమాణాల్లో ఆవస్తువుళ తయారీకి సగటున ఎంత సమయం పడుతుందో రాశాడు. రాబిన్సన్ కీ, ఆస్తిఅయిన అతని శ్రమతో తయారుచేసుకున్న వస్తువులకీ ఉన్న అన్ని సంబంధాలూ చాలా సరళ మైనవి, స్పష్టమైనవి. అయినా ఆసంబంధాలలో విలువ నిర్ణయానికి కావలసిన వన్నీఉన్నాయి

2.అర్థబానిసల ఉత్పత్తి . రాబిన్సన్ నించి మధ్యయుగాల ఐరోపాకి మరలుతాడు. అక్కడ ఉన్నది స్వతంత్రుడైన వ్యక్తికాడు. అందరూ ఆధారపడినవారే.- అర్థబానిసలూ-ప్రభువులూ (serfs and lords),సామంతులూ-సామ్రాట్లూ,( vassals and suzerains)సామాన్యుడూ-మతాధికారీ (laymen and clergy). శ్రమా, శ్రమ ఉత్పాదితాలూ వాస్తవ రూపానికి భిన్నమైన రూపాల్ని తీసుకోవాల్సిన అవసరం లేదు. సామాజిక లావాదేవీల్లో అవి పనిరూపంలో సేవలు, పనిరూపంలో చెల్లింపులు. సరుకులు ఉత్పత్తి ఆధారంగా ఉన్న సమాజంలో లాగా కాకుండా, ఇక్కడ శ్రమ యొక్క ప్రత్యేక ప్రాకృతిక రూపం శ్రమ యొక్క తక్షణ సామాజిక రూపం. బలవంతపు శ్రమ సరుకులుత్పత్తి చేసే శ్రమ లాగే కాలం చేత కొలవబడుతుంది; అయితే, తన యజమాని సేవలో వ్యయిస్తున్న శ్రమ నిర్దిష్ట పరిమాణంగల తనసొంత శ్రమ శక్తి అని ప్రతి అర్థబానిసకీ తెలుసు.

కార్వే పద్ధతిలో రైతు వారంలో కొంతకాలం(మాటవరసకి) తనపోలంలో పనిచేసుకుంటాడు. మిగిలిన రోజులు యజమాని పొలంలో తన పరికరాలతోనే పనిచేస్తాడు. ఇదంతా స్పష్టంగానే వుంటుంది. మార్మికతేమీ ఉండదు.

"మతాదిపతికి చెల్లించాల్సిన టితీ ఆయన దీవెనలకన్నా వాస్తవమైనవి" అలాంటప్పుడు ఆ సమాజంలో భిన్న వర్గాల ప్రజలు పోషించే పాత్రల గురించి మనం ఏమనుకున్నా, శ్రమచెయ్యడంలో వ్యక్తులమధ్య సామాజిక సంబంధాలు ప్రతి సందర్భం లోనూ వాళ్ళ పరస్పర వ్యక్తిగత సంబంధాలు గానే కనబడతాయి. శ్రమ ఉత్పాదితాల మధ్య సామాజిక సంబంధాల ఆకృతి కింద దాగి ఉండవు.

3. పితృస్వామిక రైతు కుటుంబం ఉత్పత్తి .ఇది ఉమ్మడి శ్రమ కి ఉదాహరణ. ఆ కుటుంబం ఉమ్మడిగా ధాన్యం పండిస్తుంది. పశువులు పోషిస్తుంది. దారం వడుకుతుంది. బట్టలు నేస్తుంది. దుస్తులు కుడుతుంది. ఆ ఉత్పత్తులు ఆకుటుంబం వాడుకుంటుంది. ఆభిన్నమైన వస్తువులన్నీ ఆకుటుంబం శ్రమ ఉత్పత్తులే. కాని కుటుంబ సభ్యులమధ్య అవి సరుకులు కావు. వాటిలో రూపొందిన భిన్న రకాల శ్రమలు –దున్నకం,పశు పెంపకం,వడకడం, నేయ్యడం,కుట్టడం- నేరుగా సామాజిక చర్యలే. ఎందుకంటే, అవి కుటుంబం చర్యలు.సరుకుల ఉత్పత్తి మీద ఆధారపడిన సమాజం లాగా కుటుంబంలో సద్యోజనితంగా వృద్ధయిన శ్రమ విభజన ఉంది. కుటుంబంలో పని పంపిణీ , సభ్యుల యొక్క శ్రమ కాలమూ లింగ, వయో భేదాల్ని బట్టీ ,ఋతువుల తేడాలని బట్టీ ఉంటుంది.ప్రతి సభ్యుని శ్రమ శక్తీ, మొత్తం కుటుంబ శ్రమ శక్తిలో నిర్దిష్ట భాగంగా మాత్రమేఉంటుంది. అందువల్ల,వ్యక్తి శ్రమ శక్తి వ్యయం దాని వ్యవధి ద్వారా కొలత స్వభావ సిద్ధంగానే శ్రమ యొక్క సామాజిక స్వభావంగా కనబడుతుంది.

4.ఉమ్మడి ఉత్పత్తిసాధనాలున్న సమాజం ఉత్పత్తి. ఇక్కడ అందరి వ్యక్తుల శ్రమ శక్తీ సమాజపు శ్రమ శక్తి అనే చైతన్యంతో అన్వయించ బడుతుంది. రాబిన్సన్ శ్రమ కున్న లక్షణాలన్నీ ఇక్కడ పునరావృతమవుతాయి.అయితే ఒకొక తేడా ఉంది. అది వ్యక్తిగతం ,ఇది సామాజికం.రాబిన్సన్ ఉత్పత్తి చేసినదంతా పూర్తిగా అతని శ్రమ ఫలితమే,అతని వాడకం కోసమే. మన సమాజపు ఉత్పత్తిఉత్పత్తి అంతా సమాజపు ఉత్పత్తి. అందులో ఒక భాగం కొత్త ఉత్పత్తి సాధనాల కోసం, కనుక అది సామాజికం. అయితే మరొక భాగం సభ్యులు జీవనాదారసాధనాలుగా వినియోగించు కుంటారు. కనుక ఈ భాగం పంపిణీ అవసరం. పంపిణీ పద్ధతి సమాజపు ఉత్పత్తి వ్యవస్థని బట్టీ, ఆ ఉత్పాదకుల చరిత్రకాభివృద్ధి స్థాయిని బట్టీ మారుతుంటుంది.

జీవితావసర వస్తువుల్లో ప్రతి వాని వాటా అతని శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయమవుతుందని అనుకుందాం. అప్పుడు శ్రమకాలం ద్వంద్వ పాత్ర పోషిస్తుంది.జరగవలసిన భిన్న రకాల శ్రమల మధ్య నిష్పత్తిని సమాజపు వివిధ అవసరాల నిష్పత్తి నీ ఒక పద్ధతిప్రకారం జరిగే దాని విభజన నిర్వహిస్తుంది.

మరొకవైపు, ఉమ్మడి శ్రమలో ప్రతి వ్యక్తీ చేసిన భాగాన్ని కొలిచేందుకూ, వ్యక్తుల వినియోగానికి కేటాయించిన ఉత్పాదితం మొత్తంలో అతని వాటా ఎంతో నిర్ణయించేందుకూ ఉపకరిస్తుంది. వ్యష్టి ఉత్పత్తిదారుల శ్రమతోనూ, ఆ శ్రమ ఉత్పాదితాలతోనూ వాళ్ళకున్న సామాజిక సంబంధాలు పూర్తిగా సరళ మైనవీ, తేలికగా తెలిసేవీ. ఉత్పత్తికి సంధించే కాదు, పంపిణీకి సంబంధించి కూడా.

మత ప్రపంచం నిజ ప్రపంచానికి ప్రతిబింబం మాత్రమే.సరుకుల ఉత్పత్తి మీద ఆధారపడ్డ సమాజానికి – ఎందులో అయితే ఉత్పత్తిదారులు తమ ఉత్పాదితాలను సరుకులుగా, విలువలుగా చూడడం ద్వారా, ఒకరితో

ఒకరు సంబంధాల్లోకి వస్తారో ఆసమాజానికి, అంటే వాళ్ళ ప్రైవేట్ శ్రమని తేడాలేని మానవ శ్రమకి కుదిస్తారో అటువంటి సమాజానికి క్రైస్తవమతం, మరీ ప్రత్యేకించి దాని బూర్జువారూపాలైన ప్రొటేస్టాంటిజం డీ యిజం మొదలైనవి- సరిగ్గా సరిపోతాయి. ప్రాచీన ఆసియాటిక్ లాంటి పురాతన ఉత్పత్తి విధానాలలో ఉత్పాదితాలు సరుకులుగా మారడం అందుమూలంగా మనుషులు సరుకుల ఉత్పాదకులు గా మారడం ద్వితీయ స్థానంలో ఉండేది. ప్రాచీన గుంపు సమాజాలు రద్దుకు చేరువవుతున్నకొద్దీ సరుకుల ఉత్పాదకులు గామారడం పెరిగింది. ప్రాచీన ప్రపంచంలో వ్యాపార జాతులు-ఇంటర్ ముండియా లో ఉండే ఎపిక్యురస్ యొక్క దైవాల లాగానో, లేక పోలిష్ సమాజంలో మారుమూలల్లో ఉండే యూదుల లాగానో- అక్కడక్కడా అరుదుగా మాత్రమే ఉండేవి. ఆప్రాచీన సామాజిక ఉత్పత్తి వ్యవస్థలు ఎంతో సరళమైనవి, పారదర్శకమైనవి. సులభంగా గ్రహించదానికి వీలైనవి. అవి ఆదిమగణ సమాజంలో మనిషి తన తోటివాళ్ళతో కలిపి ఉంచే బొడ్డుతాడు కూడా ఊడిపోనప్పుడు, వ్యక్తిగతంగా అభివృద్ధి పరిపక్వం చెందనప్పుడు ఏర్పడ్డాయి. లేకపోతే, ప్రత్యక్ష బానిస సంబంధాల్లో ఏర్పడ్డాయి. శ్రమ ఉత్పాదకత తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు, ఆకారణంగా,అందుకు తగినట్లుగా మనిషికీ మనిషికీ మధ్య, మనిషికీ ప్రకృతికీ మధ్య సామాజిక సంబంధాలు తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే అవి ఏర్పడగలవు, మనుగడ సాగించ గలవు. ప్రాచీన కాలంలో ప్రకృతిని పూజించడంలోనూ, ప్రజల మతాలకు సంబంధించిన ఇతర అంశాలలోనూ ఈ సంకుచితత్వం ప్రతిబింబిస్తుంది.

<u>నిజ ప్రపంచం యొక్క మతప్రతిబింబం అదృశ్యం అవగలిగేది ఎప్పుడంటే</u>, దైనందిన జీవితంలో ప్రకృతితోనూ, తోటి మనుషులతోనూ ఉండే ఆచరణాత్మక సంబంధాలు పూర్తిగా అర్థం అయ్యేట్లుగానూ, తర్కబద్ధంగానూ ఉన్నప్పుడు మాత్రమే ఈమత ప్రతిబింబం అదృశ్యం అవుతుంది.

స్వేచ్ఛగా కలసిన మనుషులు చేసే ఉత్పత్తిగానూ, ఒక ప్లాన్ ప్రకారం వాళ్ళచే క్రమబద్ధం చెయ్యబడే వరకూ పాదార్థిక ఉత్పత్తి ప్రక్రియమీద ఆధారపడ్డ సమాజపు జీవన ప్రక్రియ, దాని మార్మిక ముసుగుని తొలగించదు.

రాజకీయ అర్థశాస్త్రం, అసంపూర్ణంగానే అయినప్పటికీ, విలువనీ, విలువ పరిమాణాన్నీ విశ్లేషించి ఆరూపాల వెనక దాగి ఉన్న దాన్ని కనుక్కున్నది. కాని సాంప్రదాయ అర్థశాస్త్రం విలువలోకనబడే శ్రమకీ, ఉపయోగపు విలువలోకనబడే శ్రమకీ ఉన్న తేడాని పూర్తి స్పృహతో, స్పష్టతతో వ్యక్తం చెయ్యలేదు. అది దాని బలహీనతల్లో ఒకటి. అయితే ఆచరణలో తేడా చూచింది.ఎందుకంటే, శ్రమని ఒకసారి పరిమాణాత్మక అంశం గానూ, మరొకసారి గుణాత్మక అంశం గానూ చూసింది. అయితే వివిధ రకాల శ్రమల్నీకేవలం పరిమాణాత్మకంగా చూసేటప్పుడు, ఆశ్రమల ఏకత్వం ,లేక సమానత ఉంటుంది. ఆకారణంగా ఆశ్రమల్ని అనిర్దిష్ట మానవ శ్రమగా దింపడం అనే అర్థం ఇమిడి ఉంది. అయితే ఆ అర్థశాస్త్రానికి ఈ గ్రహింపు ఇసుమంతయినా లేదు.-కాపిటల్ 1.84 ఫుట్ నోట్.

శ్రమ ద్వంద్వ స్వభావం భావన వాళ్లకు లేదు.

రాజకీయ అర్థశాస్త్రం శ్రమ దాని ఉత్పాదితపు విలువ చేత ఎందుకు ప్రాతినిధ్యం వహించ బడుతుంది? శ్రమ కాలం ఆవిలువ పరిమాణం చేత ఎందుకు ప్రాతినిధ్యం వహించ బడుతుంది? అనే ప్రశ్నలు సంధించు కోలేదు. సరుకుల విశ్లేషణ ద్వారా,ప్రత్యేకించి సరుకుల విలువ విశ్లేషణ ద్వారా సంప్రదాయ అర్థశాస్త్రం విలువ ఏ రూపంలో మారకం విలువ అవుతుందో ఆరూపాన్ని కనుక్కోలేక పోయింది. ఆ శాఖకు అత్యుత్తం ప్రతినిధులైన స్మిత్ రికార్డోలు సైతం విలువ రూపాన్ని అప్రధాన విషయంగా, సరుకుల స్వతస్సిద్ధ స్వభావంతో సంబంధం లేని విషయంగా చూశారు.ఇందుకు కారణం వారు విలువ పరిమాణం మీదనే ధ్యాసపెట్టడం ఒక్కటే కాదు. ఇంకా లోతయినది. శ్రమ ఉత్పాదితపు సరుకురూపం అత్యంత అనిర్దిష్ట మైనది. అంతేకాదు,బూర్జువా సమాజంలో ఉత్పాదితం తీసుకునే సార్వత్రిక రూపం కూడా. విలువ రూపం ఆవుత్పత్తిని ప్రత్యేక సామాజిక ఉత్పత్తి గా ముద్ర వేస్తుంది. ఆవిధంగా ఆవుత్పత్తికి దాని ప్రత్యేక చారిత్రిక స్వభావాన్ని ఇస్తుంది. అలాంటప్పుడు ప్రతి సమాజానికి ఇదే ఉత్పత్తి విధానం శాశ్వతమైనది, ప్రకృతి సిద్ధమైనది అనుకున్నామంటే, విలువరూపపు విశిష్ట లక్షణాన్ని (differentia specifica) పట్టించుకోము. తత్ఫలితంగా, సరుకు రూపపు విశిష్ట లక్షణాన్నీ పట్టించుకోము. సరుకు రూపపు పరిణామాలైన డబ్బు రూపం, పెట్టుబడి రూపం వగయిరాల విశిష్ట లక్షణాల్ని పట్టించుకోము. ఆకారణంగా విలువ పరిమాణం కొలతకి శ్రమకాలాన్ని అంగీకరించిన ఆర్థికవేత్తలే సాధారణ సమానకం యొక్క పరిపూర్ణ రూపం అయిన డబ్బు విషయంలో వింతైన, విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

సాంప్రదాయ అర్థశాస్త్రం అంటే: విలియం పెట్టీ కాలం నించీ బూర్జువా సమాజంలో వాస్తవ ఉత్పత్తి సంబంధాల్ని పరిశోధించిన అర్థశాస్త్రం. ఇది పైపైన కనబడే అంశాల్ని మాత్రమే చూసే అపభ్రంశ అర్థ శాస్త్రానికి భిన్నమైనది.శాస్త్రీయ పరిశోధనలో తేలిన విషయాల్ని వదిలిపెట్టి, బూర్జువాల ఉపయోగార్థం వివరణలు సమకూరుస్తుంది. బూర్జువాల అభిప్రాయాల్ని క్రమబద్ధం చేసి,శాశ్వత సత్యాలుగా ప్రకటిస్తుంది. ఈ పద్ధతి సాంప్రదాయ అర్థశాస్త్రం అవలంబించే పద్ధతికి వ్యతిరేకమైనది. -కాపిటల్ 1.85 ఫుట్ నోట్

ఈ సూత్రీకరణలు ఒక సామాజిక వ్యవస్థ కి చెందుతాయి. ఏవ్యవస్థలో అయితే ఉత్పత్తి ప్రక్రియ మనిషి అదుపులో ఉండే బదులు మనిషి మీద తనే పెత్తనం చేస్తుందో ఆ వ్యవస్థకి చెందుతాయి. ఈ సూత్రీకరణలు స్వయం స్పష్ట మైన ప్రకృతి విధించిన ఆవశ్యకత లాగా బూర్జువా మనస్సుకి కనబడుతుంది. అందువల్ల చర్చి ఫాదర్లు క్రైస్తవ మతానికి ముందున్న మతాల్నిఎలా చూశారో అలాగే బూర్జువా రూపానికి ముందటి సామాజిక ఉత్పత్తి రూపాల్ని బూర్జువాలు చూశారు.

ఈ ఆర్థికవేత్తలకి ఒకే ఒక పద్ధతి ఉంది. వారికి రెండురకాల సంస్థలు ఉన్నాయి- సహజమైనవి, కృత్రిమమైనవి.భూస్వామ్యం సంస్థలు కృత్రిమమైనవి, బూర్జువా సంస్థలు సహజమైనవి. ఈ విషయంలో వీళ్ళు మతతత్వవేత్తల వంటి వారే. వాళ్లకి రెండు రకాల మతాలు ఉంటాయి. వాళ్ళది కాని మతం మనుషులు సృష్టించింది, వాళ్ళ మతం ఒక్కటే దైవ సృష్టి.-.-కాపిటల్ 1.85ఫుట్ నోట్2

************

సరుకుల్లో అంతర్గతంగా ఉన్న మార్మికత ఆర్థిక వేత్తల్ని తప్పుదోవ పట్టించింది. వాళ్ళ మధ్య విసుగు పుట్టించేటంతగా వాదోపవాదాలు నడిచాయి.మారకం విలువ ఒక వస్తువు మీద జరిగిన శ్రమ పరిమాణాన్ని వ్యక్తంచేసే నిర్దిష్ట సామాజిక సరళి మాత్రమే. ప్రకృతికి దానితో ప్రమేయం లేదు-మారకం నడకని (course ) నిర్ధారించే విషయంలో లేనట్లే. సరుకుల్ని నేరుగా మారకం కోసమే ఉత్పత్తిచేసే విధానం బూర్జువా ఉత్పత్తి యొక్క అత్యంత సాధారణ మైన రూపం,పిండ రూపం. అందువల్ల అది చరిత్ర తొలి కాలంలోనే కనబడుతుంది – ఈ రోజుల్లో వున్నంత ప్రబలమైన లక్షణాలతో లేనప్పటికీ. కనుక సరుకు మార్మిక స్వభావాన్ని గమనించడం ఇప్పటికంటే తేలిక.కాని, నిర్దిష్ట రూపాలకి వచ్చేసరికి ఈ సరళంగా కనబడడం కూడా పోతుంది. డబ్బు వ్యవస్థకి సంబంధించిన భ్రమలు( illusions) ఎక్కడనుండి ఏర్పాడ్డాయి?డబ్బుగా వ్యవరించేటప్పుడు వెండి,బంగారాలు దానికి(డబ్బు వ్యవస్థకి) ఉత్పాదకుల మధ్య సామాజిక సంబంధాలకు ప్రాతినిధ్యం వహించవు, వింత సామాజిక ధర్మాలు కలిగిన ప్రాకృతిక వస్తువులు మాత్రమే. ఆధునిక అర్ధశాస్త్రం డబ్బు వ్యవస్థని చిన్నచూపు చూస్తుంది. ఏవగించుకుంటుంది. అది పెట్టుబడిని చూసేటప్పుడు దాని మూఢ విశ్వాసం పట్ట పగల్లా,బట్టబయలు కావడంలేదా? కౌలు సమాజం నుంచి కాకుండా, నేల నించి వస్తుంది అనుకున్న ఫిజియోక్రాట్ల భ్రమని అర్ధశాస్త్రం వదిలించుకొని ఎంతకాలం అయింది?

ముందు జరగబోయే దాన్ని ఊహించకుండానే, సరుకు రూపానికి సంబంధించిన మరొక ఉదాహరణతో తృప్తి పడదాం. సరుకులే మాట్లాడ గలిగితే అవి ఇలా చెబుతాయి: మా ఉపయోగపు విలువ మనుషులకి ఆసక్తి కలిగిస్తే కలిగించవచ్చు.వస్తువులుగా అది మాలో భాగం కాదు.వస్తువులుగా మాకు సంబంధించింది మా విలువే.సరుకులుగా మా మధ్య జరిగే చర్య దీన్ని ధృవపరుస్తుంది. మాలో ఒకదాని దృష్టికి మరొకటి మారకం విలువ తప్ప మరేమీ కాదు.

ఇప్పుడు సరుకులు ఆర్థికవేత్త నోటితో ఏమి చెబుతాయో విందాం:

విలువ- (అంటే మారకం విలువ) వస్తువుల ధర్మం.

సంపద (riches అంటే ఉపయోగపు విలువ) మనిషి లక్షణం

విలువకి మారకాలతో సంబంధం ఉంటుంది. సంపదకి మారకాలతో సంబంధం ఉండదు.

ఒక మనిషి సంపన్నుడు,, ఒక సమాజం సంపన్నమైనది. ఒక ముత్యం ముత్యంగా విలువైనది. ఒక వజ్రం వజ్రంగా విలువైనది..అన్న బెయిలీమాటలు ఉటంకించి మార్క్స్ ఇలా అంటాడు:

ఇప్పటిదాకా, ఏ రసాయనవేత్తా ముత్యంలోగానీ, వజ్రంలోగానీ మారకం విలువని కనుక్కున్నది లేదు. ఈ రసాయన అంశాన్ని కనుక్కున్నామని విమర్శనాత్మక పరిశోధనలో నిష్ణాతులుగా ప్రత్యేకించి చెప్పుకునే ఆవిష్కర్తలు వస్తువుల ఉపయోగపు విలువ వాటి భౌతిక ధర్మాలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా వాటికి ఉంటుందని కనుక్కున్నారు.: వా టి విలువ వస్తువులుగా వాటిలో భాగంగా ఉంటుందని కనిపెట్టారు.

వాళ్ళకున్న ఈ అభిప్రాయాన్ని ధృవపరిచే ఒక ప్రత్యేక పరిస్థితి ఏదంటే, సరుకుల ఉపయోగపు విలువ మారకం లేకుండానే సఫలీకృతం అవుతుంది-వస్తువుకీ, మనిషికీ నేరు సంబంధం ద్వారా.

వాటి విలువ మారకంలో మాత్రమే, అంటే సామాజిక ప్రక్రియ ద్వారా మాత్రమే సాఫల్యం సాధిస్తుంది.

ఇక్కడ డాగ్ బెర్రీ తన పొరుగువాడయిన సీకోల్ కి చెప్పినదాన్ని గుర్తుచేసుకోకుండా ఎవరుండగలరు? అతను అన్నది ఇది:నలుగురికీ ప్రేమాస్పదుడు కావడం అదృష్టం, చదవ గలగడం, రాయగలగడం స్వాభావికంగా వస్తుంది".-అంటూ మార్క్స్ ముగిస్తాడు.

ఆవిధంగా మార్క్స్ సరుకుల మార్మికత ఏమిటో, దాని మూలాలేవో లోతుగా పరిశీలించి వివరిస్తాడు. శాస్త్రీయంగా పరిశోధన చేసిన సాంప్రదాయ ఆర్థికవేత్తలు సైతం దీని నుండి ఎందుకు తప్పించుకోలేక పోయారో తేల్చి చెప్పాడు.ఇక పెట్టుబడి దారీ విధానానికి సమర్థనలు చేకూర్చడమే పనిగా పెట్టుకున్న బూర్జువా ఆర్థికవేత్తలు మార్మికతకి ఎంతగా అంటుకుపోయారో వివరంగా చెప్పాడు.

కుగల్ మన్ కి 1871 జులై 11న రాసిన ఉత్తరంలో ఇలా రాశాడు:

"మారకచర్య ప్రత్యక్షంగా ఉత్పాదితాల మధ్యా, పరోక్షంగా ఉత్పత్తిదారుల మధ్యా ఏర్పరచే సంబంధాల ద్వారా వ్యక్తి శ్రమ సామాజిక శ్రమలో భాగంగా నిర్ధారణ అవుతుంది." సమాజం మొత్తం శ్రమలో, కొంత భాగం చేసే వ్యష్టి సరుకు ఉత్పాదకులు స్వతంత్రంగానూ, విడివిడిగానూ పనిచేస్తారు.అందువల్ల " సామాజిక శ్రమ యొక్క పరస్పర సంబంధం వ్యష్టి శ్రమ ఉత్పాదితాల పైపైటు మారకంలో వ్యక్తం అవుతుంది."-

మారకం గురించి వచ్చే పోస్ట్ లో

విలువల కొలమానం

# డబ్బు లేక సరుకుల చలామణీ

## 1వ విభాగం -విలువల కొలమానం

సరళత కోసం, 'డబ్బుసరుకు'గా బంగారం ఉన్నదని ఈపుస్తకం అంతటా అనుకుంటాను- ఇది ఈ అధ్యాయం మొదటి వాక్యం. అంటే డబ్బుగా ఉండే సరుకు ఏఏ చర్యలు చేస్తుందో, బంగారం ఆయా చర్యలు చేస్తుంది అని. డబ్బు ప్రధాన విధి సరుకుల విలువని తెలిపే పదార్థంగా ఉండడం. ఇప్పుడు బంగారం సరుకు విలువను కొలిచే పదార్థంగా ఉంటుంది. అంటే అన్ని ఇతర సరుకుల విలువల్ని వ్యక్తీకరిస్తుంది. ఏ సరుకు విలువ పరిమాణం అయినా బంగారం పరిమాణంలో వ్యక్తమవుతుంది.

ఉదాహరణకు,

ఒక టన్ను ఇనుం = 30 గ్రాముల బంగారం

100 కిలోల బియ్యం = 3 గ్రాముల బంగారం

ఒక టన్ను ఇనుం లోనూ ౩౦ గ్రాముల బంగారంలోనూ ఒకే పరిమాణంలో అనిర్దిష్టమానవ శ్రమ ఇమిడి ఉంది. కనుక ఒక టన్ను ఇనుం విలువని 30 గ్రాముల బంగారం వ్యక్తం చేస్తుంది. ఇలా అన్ని సరుకుల విలువల్నీ కొలుస్తుంది. సార్వత్రిక విలువ కొలమానంగా వుంటుంది. ఇది బంగారం ప్రధమ విధి.

ఈవిధి నిర్వహణ ద్వారా మాత్రమే విశిష్ట సమానక సరుకు అయిన బంగారం డబ్బు అవుతుంది.

<u>అంటే బంగారం మొదటినించీ డబ్బుకాదు</u>. అన్ని సరుకులవంటి సరుకే. అయితే అన్ని ఇతర సరుకుల విలువ కొలమానం ఎప్పుడయిందో అప్పుడది డబ్బు సరుకు అయింది. సరళ విలువ రూపంలో ఒకప్పుడు సాపేక్ష స్థానంలోనూ ఒకప్పుడు సమానకం స్థానంలోనూ ఉండేది. విస్తృత విలువ రూపం పొందింది. అంటే తన విలువని ఇతర అన్నిసరుకులలో వ్యక్తం చేసుకున్నది. సాధారణ విలువ రూపంలో అన్ని సరుకుల విలువల్నీ తనద్వారా వ్యక్తం చేసింది.అలా చెయ్యాలంటే, గుణాత్మకంగానూ, పరిమాణాత్మకంగానూ కొలవాలి. ఆవిధంగా విలువ కొలమానం అయింది.ఎప్పుడయితే విలువ కొలమానంగా సమాజం గుర్తించిందో అప్పటినించీ డబ్బయింది.

## సరుకుల్ని ఒకే ప్రమాణంతో కొలవడానికి వీలవడం అది డబ్బు అయినందువల్ల కాదు.

అందుకు భిన్నం అయిన విషయం. విలువలుగా అన్ని సరుకులూ వస్తుత్వం చెందిన మానవ శ్రమ అయినందువల్ల, ఆకారణంగా అవి సరిపోల్చడానికి వీలయినవి; అందువల్ల వాటి విలువల్ని ఒకే ప్రత్యేక సరుకుతో కొలవవచ్చు.ఆసరుకునే వాటి విలువలకు ఉమ్మడి కొలమానం లోకి అంటే డబ్బులోకి మార్చవచ్చు. సరుకులో అంతర్గతంగా ఉన్న విలువ కొలమానం -అంటే శ్రమ కాలం కొలమానం - తప్పనిసరిగా అగపడే రూపమే 'విలువ కొలమానం'గా ఉండే డబ్బు. ఇక్కడ ఒక ఫుట్ నోట్ ఉంది.

ఈక్రింది ఫుట్ నోట్ డబ్బు ఎందుకు శ్రమకు ప్రాతినిధ్యం వహించలేదో వివరిస్తుంది.

## డబ్బు నేరుగా శ్రమకాలానికి ఎందుకు ప్రాతినిధ్యం వహించదు?

### ఒక కాగితం ముక్క X గంటల శ్రమ కాలానికి ప్రతినిధిగా ఎందుకు ఉండకూడదు?

సరుకుల ఉత్పత్తి ఉన్నప్పుడు ఉత్పాదితాలు ఎందుకు సరుకుల రూపం తీసుకుంటాయి? అనే ప్రశ్నఎటువంటిదో ఈ ప్రశ్నకూడా అటువంటిదే. ఈ ప్రశ్నకు జవాబు స్పష్టమే. ఉత్పాదితాలు సరుకులరూపం తీసుకోవడం అనేదాంట్లో అవి సరుకులుగానూ డబ్బుగానూ వేరుగావడం అనే అర్థం ఇమిడి ఉంది.

ప్రైవేట్ శ్రమ –ప్రైవేట్ వ్యక్తుల కొరకు జరిగే శ్రమ- దానికి వ్యతిరేకమైన తక్షణ సామాజిక శ్రమగా ఎందుకు పరిగణించ కూడదు? అనే ప్రశ్న కూడా అటువంటిదే. సరుకుల ఉత్పత్తి పునాది మీద లేచిన సమాజంలో 'శ్రమ డబ్బు' (labour money) అనే ఉహాస్వర్గ భావాన్ని (Utopian idea) వేరొకచోట కూలంకషంగా పరిశీలించాను.దీని మీద ఒక విషయం చెప్పగలను. ఓవెన్ చెప్పే' శ్రమ డబ్బు' అనేది ఏమాత్రమూ డబ్బు కాదు. ఒక నాటకం టికెట్ ఎలా డబ్బు కాదో అలాగే. ఓవెన్ సరుకుల ఉత్పత్తికి సరిపడని ఉత్పత్తి రూపం

ఉన్నట్లు భావిస్తున్నాడు. ఆరూపం ఏదంటే ప్రత్యక్ష సామాజిక శ్రమ.ఇది సరుకుల ఉత్పత్తికి సరిపడనిది. విరుద్ధమైనది.

డబ్బు ఏదో ఒక సరుకుకి మాత్రమే ప్రతినిధిగా ఉండగలదు. శ్రమకు ప్రతినిధిగా ఉండజాలదు. కారణం శ్రమ సరుకు కాదు.

****

ఏ సరుకైనా శ్రమ వల్ల తయారయినదే. కొంత పరిమాణంలోశ్రమ సరుకులో ఉంటుంది.శ్రమ వల్లనే వస్తువుకి ఆరూపం వస్తుంది. శ్రమ వస్తుత్వం చెందడం అంటే ఇదే. భిన్న సరుకులు భిన్నరకాల శ్రమల వల్ల తయారవుతాయి. అయితే అనిర్దిష్ట మానవ శ్రమగా అన్ని శ్రమలూ ఒకటే. అలా చూచినప్పుడు అన్నిటి లోనూ వస్తుత్వం చెందిన శ్రమలు గుణాత్మకంగా ఏ తేడా లేనివి. ఒకే రకమైనవి. పట్టిన శ్రమల పరిమాణాల్లో మాత్రమే తేడాలుంటాయి. కనుక సరిపోల్చవచ్చు. ఉదాహరణకి,

ఒక గొడ్డలి లో 3 గంటల శ్రమా ఉండి, గడ్డపారలో 1 గంట శ్రమ ఉంటే

1 గొడ్డలి = 3 గడ్డపారలు

ఒక మిల్లీగ్రాం బంగారంలో 30 గంటల శ్రమా, ఒక గొడ్డలి లో 3 గంటల శ్రమా ఉండి, గడ్డపారలో 1 గంట శ్రమ ఉంటే

30 గడ్డపారలు = 1 మిల్లీగ్రాం బంగారం

10 గొడ్డళ్ళు = 1 మిల్లీగ్రాం బంగారం

ఒక సైకిల్ లో ఉన్న శ్రమని బట్టి బంగారంలో దాని విలువ చెప్పవచ్చు.ఇది అన్ని సరుకులకూ వర్తిస్తుంది.ఆవిధంగా బంగారం విలువ కొలమానంగా పనిచేస్తుంది. విలువ కొలమానంగా ఉండడం వల్లనే బంగారం డబ్బయింది.

సరుకువిలువ బంగారంలో చెప్పడమే డబ్బురూపం. ధర అన్నా అదే.ఇప్పుడు ఇనుం విలువని సమాజం ఆమోదించిన సరళిలో ఇలా చెబితే చాలు:

ఒక టన్ను ఇనుం= 2 ఔన్సుల బంగారం

ఈ సమీకరణ అన్ని ఇతర సరుకుల విలువల్నీ తెలిపే సమీకరణాల గొలుసులో ఒక లింకు గా ఉండాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు.ఎందుకంటే సమానక సరుకు అయిన బంగారం ప్రస్తుతం డబ్బు స్వభావంతో ఉంది.సాపేక్ష విలువ యొక్క సాధారణ రూపం ఇప్పుడు దాని మూల రూపాన్ని తిరిగి పొందింది.ఆ మూల రూపం సాపేక్ష విలువ యొక్క సరళ రూపం, విడి రూపం.

మరొక పక్క, సాపేక్ష విలువ యొక్క విస్తృత వ్యక్తీకరణ - అంతం లేని సమీకరణాల వరుస- ఇప్పుడు డబ్బుసరుకు యొక్క సాపేక్ష విలువకు ప్రత్యేకమైన రూపం అవుతుంది.ఆవరుస కూడా తెలిసిందే-దానికి వాస్తవ సరుకుల ధరలలో సమాజ గుర్తింపు కూడా ఉంది. అన్నిరకాల సరుకుల ధరలలో వ్యక్తమయ్యే బంగారం విలువ పరిమాణాన్ని తెలుసుకోవడానికి ఒక ధరల జాబితాని తిరగదిప్పితే చాలు.

ఇందుకు ఉదాహరణ

<u>ధరల జాబితా:</u>

30 కిలోల గోధుమలు = 1 గ్రాము బంగారం

1 కుట్టు మిషను = 1 గ్రాము బంగారం

5 పరుపులు = 1 గ్రాము బంగారం

6 కుర్చీలు = 1 గ్రాము బంగారం

ఆయా సరుకుల విలువలు బంగారంలో వ్యక్తం అవుతాయి.

<u>తిరగదిప్పిన జాబితా:</u>

1 గ్రాము బంగారం = 30 కిలోల గోధుమలు

=1 కుట్టు మిషను

=5 పరుపులు

=6 కుర్చీలు

ఇక్కడ బంగారం విలువ సరుకుల్లో వ్యక్తమయింది.

## అయితే డబ్బుకి ధర ఉంటుందా?ఉండదు

ఎందుకు ఉండదు?

డబ్బు కూడా ఒక సరుకే కదా! అన్ని సరుకులకీ ధర ఉన్నప్పుడు డబ్బుకి ధర ఎందుకు ఉండదు?

డబ్బు రీత్యా విలువ వ్యక్తీకరణే ధర. డబ్బు ధర అంటే డబ్బులో వ్యక్తమయ్యే డబ్బు విలువ. అంటే డబ్బువిలువ డబ్బులోనే చేబితే అది దాని ధర. ఏ సరుకు విలువ ఆసరుకురీత్యా వ్యక్తం కాదు అని తెలిసిందే. డబ్బుగా బంగారం ఉంటే,

ఒక బస్తా బియ్యం ధర 3 గ్రాముల బంగారం అని చెప్పవచ్చు. అలాగే 3 గ్రాముల బంగారం ధర ఎంత? 3 గ్రాముల బంగారం అని చెప్పవలసి వస్తుంది.

3 గ్రాముల బంగారం = 3 గ్రాముల బంగారం.

ఇందుమూలంగా కొత్తగా తెలిసేదేమీ ఉండదు. ఇది అర్ధవంతమైన విలువ సమీకరణ కాదు. దానానికి ధర ఉండదు.అయితే డబ్బు సరుకు విలువని అన్ని ఇతర సరుకుల రీత్యా చెప్పవచ్చు:

3 గ్రాముల బంగారం = ఒక బస్తా బియ్యం

=4 మంచాలు

= 10 పంచెలు

వగయిరా. అయితే ఇక్కడ వ్యక్తమయింది బంగారం విలువే కాని బస్తా బియ్యం అనేది బంగారం ధర కాదు. బంగారంలో చెబితేనే అది ధర. ఏ ఇతర సరుకుల్లో చెప్పినా అది ధరకాదు. విలువ.మంచాలూ, పంచెలూ బంగారం విలువని తెలుపుతాయే తప్ప బంగారం ధరని వ్యక్తం చెయ్యవు అనేది స్పష్టమే.

సరుకుల ధర లేక డబ్బు రూపం సరుకుల భౌతిక రూపానికి భిన్నమైనది- సరుకు విలువ ఆసరుకు భౌతిక రూపానికి భిన్నమైనదయిట్లే. అందువల్ల ధర అనేది కేవలం మనసులో ఉండేదే. మానసిక రూపం మాత్రమే.ఇనుం, బట్ట, ధాన్యం వంటి సరుకుల విలువ కనబడదు.కాని వాటిలో వాస్తవంగా ఉంటుంది. అది బంగారంతో సమపరచబడడం చేత భావాత్మకంగా తెలుసుకోడానికి సాధ్యమవుతుంది. ఆసంబంధం వాటి తలల్లో ఉంటుంది. అందువల్ల వాటికి వాటి ఓనర్లు నాలుక అరువు ఇవ్వాలి. లేకపోతే, ఇక చీటీ ని వాటికి కట్టాలి. అప్పుడు మాత్రమే వాటిధరలు ప్రపంచానికి తెలుస్తాయి.చీటీ చెప్పినంత చెల్లిస్తే ఆసరుకు ఇచ్చెయ్యాలి.

## అయితే అది ఎంతో చెప్పడానికి బంగారం అక్కడ ఉండక్కర లేదు

బంగారంలో సరుకుల విలువ వ్యక్తం చెయ్యడం భావాత్మక /మానసిక చర్య మాత్రమే కనుక, ఇందుకు మనం భావాత్మక లేక ఊహాత్మక డబ్బుని వాడవచ్చు.

సరుకుల విలువని ధరగా వ్యక్తం చెయ్యడానికి అక్కడ బంగారం ఉండక్కర్లేదు. చిన్నమెత్తు బంగారం లేకుండానే లక్షల పౌన్ల విలువగల సరుకుల్ని అంచనా కట్టవచ్చు. విలువ కొలమానంగా వాడేటప్పుడు, డబ్బు ఊహాత్మక డబ్బు(imaginary)గా మాత్రమే ఉంటుంది. అంటే ఊహలో మాత్రమే ఉండే డబ్బు అని. "ఇంగ్లండ్ సంపదనంతా వెలగడితే, ఆధరని పొందడానికి ప్రపంచంలోనే అంత డబ్బు లేదు అని అందరికీ తెలుసు. ఇక్కడ డబ్బు ఒక కాటగరీగా, ఒక మానసిక సంబంధంగా మాత్రమే అవసరం" అని వివరిస్తాడు తన గ్రున్డ్రిస్ లో

ప్రతి వర్తకుడికీ ఒక విషయంతెలుసు: తన సరుకుల విలువని ధరలో లేక ఊహాత్మక డబ్బులో చెప్పినప్పుడు, తన సరుకులు డబ్బులోకి మారడానికి దూరంలో ఉన్నట్లు తెలుసు. మిలియన్ల పౌన్ల సరుకుల్ని వెలకట్టడానికి నిజమైన బంగారం ఒక చిన్న ముక్కయినా అవసరం లేదనీ అతనికి తెలుసు. డబ్బు విలువ కొలమానంగా పనిచేసేటప్పుడు, అది ఊహాత్మక అంటే ఊహలో మాత్రమే ఉండే డబ్బు. ఈ పరిస్థితి చిత్ర విచిత్రమైన సిద్ధాంతాలు తలెత్తడానికి కారణమైంది. 'నామమాత్ర డబ్బు ప్రమాణం' సిద్ధాంతానికి దారితీసింది (క్రిటిక్.74) అయినప్పటికీ ధర డబ్బుగావున్న పదార్థం మీద ఆధార పడి ఉంటుంది. టన్ను ఇనుం విలువ –అంటే టన్ను ఇనుంలో ఉన్న మానవ శ్రమ పరిమాణం – అంతే పరిమాణం గల శ్రమ ఉన్న డబ్బు సరుకులో ఊహాత్మకంగా వ్యక్తమవుతుంది. అందువల్ల విలువ కొలమానం బంగారమా, వెండా, రాగా అనే దాన్ని బట్టి టన్ను ఇనుం విలువ వేర్వేరు ధరల్లో వ్యక్తం అవుతుంది. లేక భిన్న పరిమాణాల్లో ఆయా లోహాలు ఇనుం విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

## అయితే, రెండు సరుకులు కొలమానాలుగా కుదరవు

బంగారం వెండి వంటి రెండు సరుకులు ఒకేకాలంలో విలువ కొలమానాలుగా ఉన్నట్లయితే, అన్ని సరుకులకీ రెండు ధరలుంటాయి- ఒకటి బంగారం ధర, రెండు వెండి ధర. ఆరెండు లోహాల ధరల నిష్పత్తి (15:1 అనుకుందాం) మారకుండా ఉన్నంత కాలమూ ఆరెండు ధరలూ పక్కపక్కనే కొనసాగుతాయి. నిష్పత్తి

మారితే, బంగారంలో ధర, వెండిలో ధరల నిష్పత్తి మారుతుంది. ఇలా మారడం ప్రమాణం విధికి పొందికలేనిదని రుజువుచేస్తుంది- వాస్తవాల ద్వారా. ఫుట్ నోట్ లో చారిత్రిక వాస్తవాలు చూపుతాడు:

ఎక్కడెక్కడ వెండీ బంగారమూ రెండూ పక్కపక్కన డబ్బువిధులు చట్ట రీత్యా నిర్వహించాలసి వచ్చిందో, అక్కడల్లా ప్రయత్నం అయితే జరిగింది కాని ఆరెంటినీ ఒకే పదార్థంగా పరిగణించడంలో విఫలమైంది. ఒకే మొత్తం శ్రమ కాలం ఇమిడి ఉన్న వెండి, బంగారాల పరిమాణాల మధ్య ఒకే నిష్పత్తి ఉంటుంది అనుకోవడం, అవిరెండూ ఒకేపదార్థం అనుకోవడం వంటిదే. తక్కువ విలువ గల పదార్థం అయిన వెండి, ఎల్లప్పుడూ ఫలానింత మొత్తం బంగారం లో స్థిరమైన భాగం అనుకోవడం వంటిదే.

మూడవ ఎడ్వర్డ్ కాలం నించీ రెండవ జార్జ్ కాలం వరకూ ఇంగ్లండ్ లో డబ్బు చరిత్ర ఎన్నో గందర గోళాలతో కూడుకొని ఉంది. కారణం వెండి విలువకూ బంగారం విలువకూ ఉన్న చట్టబద్ధమైన నిష్పత్తికీ, వెండి బంగారాల వాస్తవ విలువల హెచ్చుతగ్గులకూ మధ్య ఘర్షణ ఉండడం. ఒకప్పుడు బంగారం విలువ పెరిగితే, మరొకప్పుడు వెండి విలువ పెరిగేది.తనవిలువకంటే తాత్కాలికంగా తక్కువగా అంచనా వెయ్యబడిన లోహం చలామణీ నించి తప్పించబడేది, కరిగించబడి ఎగుమతి చేయబడేది. అప్పుడు మళ్ళీ ఆలోహాల నిష్పత్తిని చట్టం మార్చేది. అయితే త్వరలోనే మళ్ళీ ఈ నామక నిష్పత్తి, వాస్తవ నిష్పత్తితో ఘర్షణ వచ్చేది. అంటే సరిపోయేది కాదు.

మార్క్స్ కాలంలో ఇండియా, చైనా దేశాల్లో వెండికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా వెండితో పోలిస్తే బంగారం విలువ తగ్గింది. ఈ తగ్గుదల ఫ్రాన్స్ లో వెండి చలామణీ బంగారం చేత నెట్టి వేయ బడింది. వెండి ఎగుమతయింది. 1855, 1856, 1857 సంవత్సరాలలో ఫ్రాన్స్ లో బంగారం ఎగుమతుల కంటే దిగుమతులు 41,580,000 పౌన్లు ఎక్కువ. అదే కాలంలో వెండి దిగుమతులకంటే ఎగుమతులు 34,704,000 పౌన్లు ఎక్కువ. వాస్తవానికి చట్ట బద్ధంగా రెండు లోహాలు విలువ కొలమానాలుగా ఉన్న దేశాల్లో రెంటిలో ఏలోహాన్నయినా చెల్లించవచ్చు. విలువ పెరుగుతున్న లోహం డిమాండ్ పెరుగుతుంది. దాని ధర, అన్ని ఇతర సరుకుల ధర లాగే అధిక అంచనా కట్టిన (అంటే, వాస్తవ విలువకంటే చట్టం ఎక్కువ విలువ కట్టిన) లోహంలో కొలవబడుతుంది. ఆలోహమే ఆచరణలో విలువ ప్రమాణంగా ఉంటుంది. అనుభవమూ, చరిత్రా చెప్పేదేమంటే: <u>రెండు సరుకుల విలువ కొలమానాలుగా ఉన్నప్రతిచోటా ఒక్కటి మాత్రమే ఆచరణలో ఆస్థానాన్ని నిలుపుకుంటుంది.</u>

## ధరల ప్రమాణం

5బస్తాల బియ్యంలో ఎంత శ్రమ ఉందో, అంతే శ్రమ ఒక గ్రాము బంగారంలో ఉంది అని తెలిసినంతమాత్రాన బియ్యం ధర తెలిసినట్లు కాదు. అందుకు ఎంత బంగారం ఒక డబ్బు యూనిట్ అవుతుందో కూడా తెలియడం అవసరం. ఈ రెండవ మెట్టు ధరల ప్రమాణంగా బంగారం విధి. ఇది విలువ కొలమానం కన్నా ఉన్నతమైన విధి కాదు. అనుబంధ విధి. సాంకేతిక విధి. విలువ కొలమానంగా దాని విధి నిర్వహణలో, బంగారం

ప్రతిసరుకునీ కొంత బంగారంతో అనుసంధానం చేస్తుంది. చేశాక భిన్న బంగారం పరిమాణాల్ని ఒకదానితో ఒకటి పోల్చాల్సిన అవసరం కలుగుతుంది. ఈ పోలికలో బంగారం విలువల ప్రమాణంగా వ్యవహరిస్తుంది.

ధరల్లో, అన్ని సరుకులూ ఒకేరకమైన విలువవ్యక్తీకరణ కలిగి ఉంటాయి.ఈ వ్యక్తీకరణ రెండు విషయాలు చెబుతుంది:

1.ప్రతిసరుకు విలువా దాని ఉపయోగపు విలువకు భిన్నంగా ఉంటుంది.

2.భిన్న సరుకుల విలువలు గుణాత్మకంగా ఒకటే, వాటి వాటి పరిమాణాలలో మాత్రమే భిన్న మైనవి.

అన్ని సరుకులూ గుణాత్మకంగా ఒకేరకమైనవి అయినప్పుడు, వాటి విలువలకు బంగారం ప్రాతినిధ్యం వహించేటప్పుడు, వేర్వేరు బంగారం మొత్తాల్ని పోల్చాల్సిన అవసరం కలుగుతుంది.

నిర్దిష్ట ధరలున్న సరుకులు కనబడే రూపం ఇది:

10 చొక్కాలు = 1 గ్రాము బంగారం

ఒకజత ఎద్దులు = 3 గ్రాముల బంగారం వగయిరా

ఈ సరుకుల విలువలు భిన్న పరిమాణాల బంగారంలోకి మనస్సులో మారతాయి. కనుక ఎన్నో రకాల సరుకులున్నా, వాటి విలువలు బంగారం పరిమాణాలు అవుతాయి. ఇప్పుడవి ఒకదానితో ఒకటి పోల్చడానికీ, కొలవడానికీ సాధ్యమవుతాయి. ఒక నిర్దిష్ట పరిమాణం ఉన్న బంగారం కొలత యూనిట్ సాంకేతికంగా అవసరమవుతుంది. ఈ యూనిట్ తర్వాత్తర్వాత భాగాలుగా విభజితం కావడం ద్వారా అది ప్రమాణం లేక స్కేల్ అవుతుంది. బంగారం, వెండి, రాగి డబ్బు కాక ముందే వాటి బరువు ప్రమాణాల్లో ప్రమాణ కొలమానాల్ని పొంది ఉన్నాయి. ఉదాహరణకి ఒక పౌను బరువు యూనిట్ గా ఉపకరిస్తూనే,ఒక పక్క ఔన్సుల్లోకి విభజితం కాగలదు, మరొకపక్క కలిసి పెద్దదిగాhundredweight ని ఏర్పరచగలదు. ఈ వాస్తవం వల్లనే, అన్ని లోహ డబ్బులలో ధర ప్రమాణాలకు పెట్టిన పేర్లన్నీ అంతకుముందు బరువుప్రమాణాలకున్న పేర్ల నుంచి వచ్చాయి.

## విలువల కొలమానానికీ, ధరల ప్రమాణానికీ మధ్య అనుకూలతా ప్రతికూలతా

షాపుల్లో చీటీల మీద ధరలు బంగారం ఔన్సుల్లోనో, గ్రాముల్లోనో ఉండవు. పౌన్లలోనో, మరొక కరెన్సీలోనో ఉంటాయి. పౌను అనేది ఒక నిశ్చిత పరిమాణంలో ఉన్న బంగారం. అది ఒక కొలత యూనిట్ గా ఉంటుంది.

1 టేబుల్ = 5 పౌన్లు అనుకుందాం. ఇక్కడ డబ్బు రెండు పనులు చేస్తుంది: ఒకపక్క విలువ కొలమానంగా, 1 టేబుల్ = 3 ఔన్సుల బంగారం. మరొక పక్క ధరల ప్రమాణంగా, అంటే, ఆబంగారం ఎన్ని పౌను నాణేలు అవుతుందో అన్ని నాణేలలో చెప్పడం.

ఆవిధంగా డబ్బు రెండు పూర్తిగా భిన్నమైన పనులు చేస్తుంది:

1. విలువ కొలమానంగా ఉండడం

2.ధర ప్రమాణంగా వ్యవహరించడం.

## రెంటికీ తేడా ఏమిటి?

A)సమాజం గుర్తింపుపొందిన మానవ శ్రమ అవతారంగా డబ్బు విలువ కొలమానం, ఒక లోహం యొక్క నిశ్చితమైన బరువుగా అది ధర ప్రమాణం.

పౌను ఇంగ్లండ్ డబ్బు పేరు. అది ఒక పౌను వెండిబిళ్ళ. కనుక అది ధర ప్రమాణం.

B) విలువ కొలమానంగా అది అన్ని సరుకుల విలువల్ని ధరల్లోకి మారుస్తుంది. అంటే ఊహాత్మక బంగారు పరిమాణాల్లోకి మారుస్తుంది.

ధర ప్రమాణంగా అది ఈ బంగారు పరిమాణాన్నే కొలుస్తుంది. ఆబంగారం మొత్తం ఎన్ని పౌన్ల బిళ్లలో చెబుతుంది.

C) విలువల కొలమానం విలువలుగా పరిగణించిన సరుకుల్ని కొలుస్తుంది.

ధర ప్రమాణం అలాకాకుండా, బంగారం పరిమాణాల్ని, బంగారం యూనిట్ పరిమాణంతో కొలుస్తుంది. బంగారం ధర ప్రమాణంగా ఉండాలంటే, ఒక నిర్దిష్ట పరిమాణం గల బంగారం యూనిట్ ఏర్పడాలి.

ఒకే పేరుగల పరిమాణాల్ని కొలిచేటప్పుడు స్థిరంగా ఉండే యూనిట్ ఉండడం ముఖ్యం. అలాగే విలువ పరిమాణాల్నికొలవడానికి కూడా మారని యూనిట్ అవసరం. ఈ యూనిట్ (ఇక్కడ బంగారం పరిమాణం) ఎంత తక్కువగా మార్పుకి లోనయ్యేదయితే, ధర ప్రమాణంగా అంత చక్కగా విధి నిర్వర్తిస్తుంది.

## శ్రమ ఉత్పాదితం అయినందువల్లనే,బంగారం విలువ కొలమానం అయింది

బంగారం 'విలువ కొలమానం' గా ఉండగలదు.కారణం, అదీ శ్రమ ఉత్పాదితం కావడమే. అదీ విలువ కావడమే. అన్ని ఇతర సరుకుల్లో లాగే బంగారం లోనూ అనిర్దిష్ట మానవ శ్రమ ఇమిడి ఉంటుంది.కనుకనే విలువను బంగారంతో కొలవచ్చు.విలువ లేనిదానితో విలువను కొలవడం కుదరదు.బరువు లేనిదానితో బరువును ఎలా కొలవలేమో విలువ కాని దానితో విలువను కొలవలేం.

నూనె తుయ్యాలంటే, తక్కెడలో ఒకసిబ్బిలో నూనె ఉన్న గిన్నె పాకెట్ పెట్టి మరోకసిబ్బిలో బరువు రాళ్ళు పెడతాం. రెండూ సమం అయినప్పుడు రాళ్ళ బరువువెంతో నూనె బరువు అంతే. రాళ్ళకు బరువు వుంది కనుకనే అవి బరువు కొలమానంగా ఉండగలవు.ముందుగా బరువు నిర్ణయించిన ఇనపముక్కల్ని వస్తువుల బరువు తుయ్యడానికి వాడతాం. బంగారం విలువే. కనుక ఇతర వస్తువుల విలువ కొలవడానికి పనికొస్తుంది. నిశ్చిత బరువు ఉన్న రాళ్ళు వాడినట్లే, నిశ్చిత బరువున్న బంగారం ముక్కల్ని విలువ కొలతకు వాడతాం. బంగారంవిలువే కనుక అది విలువ కొలమానంగా ఉండగలదు.

అయితే బంగారం శ్రమ ఉత్పాదితం కనుకనే దానికి విలువ ఉంటుంది. విలువ ఉంటుంది కనుకనే విలువ కొలమానంగా ఉపకరిస్తుంది.

శ్రమ ఉత్పాదకతలో వచ్చే ప్రతిమార్పూ ఉత్పాదితం విలువని మారుస్తుంది. బంగారం కూడా శ్రమ ఉత్పాదితమే. అందువల్ల బంగారం విలువ కూడా మారుతూ ఉంటుంది

మరైతే విలువ స్థిరంగా ఉండని బంగారం, ధరల ప్రమాణంగా ఉండగలదా?

శ్రమ ఉత్పాదితం అయినందువల్లనే దాని విలువలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. కనుకనే బంగారం విలువ కొలమానంగా ఉపకరించగలదు.

"విలువ కొలమానానికీ ధర ప్రమాణానికీ (విలువ ప్రమాణానికీ)మధ్య ఇంగ్లిష్ రచయితలు పడ్డ గందరగోళం వర్ణనాతీతం. వాటి విధులూ,వాటి పేర్లూ పొద్దాకులూ తారుమారు అయ్యేవి."-కాపిటల్ 1.101 ఫుట్ నోట్.

అన్నిసరుకుల విలువా మారుతుంటుంది, ఎందుకంటే, సరుకుల విలువ వాటిని ఉత్పత్తిచేసిన శ్రమ ఉత్పాదకత ని బట్టి ఉంటుంది. శ్రమ ఉత్పాదకత మారుతూ ఉంటుంది. కనుక అన్ని సరుకుల విలువ మారుతూ ఉంటుంది. బంగారమూ సరుకే. కనుక దాని విలువ మారుతూ ఉండ వలసిందే.“మారుతూ ఉండడం అనేది విలువ లక్షణం” అంటాడు – అదనపు విలువ సిద్ధాంతాలు 3వ భాగం .155

కనుక సమానకం విలువ మారేదిగా ఉంటుంది. ఎందుకంటే, విలువ ఉన్నది(సరుకు) మాత్రమే మారక సమీకరణల్లో సమానకంగా వ్యవహరించగలదు.

ఇతర సరుకుల విలువల లాగే బంగారం విలువకూడా మారుతూ ఉందేది నిజమే.అయినాగాని ధరల ప్రమాణంగా పనిచెయ్యడానికి ఆటంకం ఏమీ ఉండదు. ఎలాగో చూద్దాం:

బంగారం విలువ ఎంతమారినా, బంగారం పరిమాణాలు ఒకదానికొకటి అదేనిష్పత్తిలో ఉంటాయి. ఉదాహరణకు, బంగారం విలువ 1000 శాతం పెరిగినా, తగ్గినా అంతకు ముందు లాగే 12 ఔన్సుల బంగారం ఒక ఔన్సుకి 12 రెట్ల విలువే కలిగి ఉంటుంది. ధరలకి సంబంధించి, వివిధ బంగారు పరిమాణాల నిష్పత్తి తోనే పని. కనుక బంగారం నిశ్చిత ధరల ప్రమాణంగా పనిచేయ్యగలదు

దాని విలువ ఎంత మారినా.ఎందుకంటే, బంగారం విలువ ఎంత పెరిగినా ఎంత తగ్గినా ఒక ఔన్సు బంగారం బరువులో తేడ రాదు. అలాగే ఔన్సులో ని భాగాల బరువులోనూ మార్పు ఏర్పడదు. ఇతర సరుకుల విలువలు స్థిరంగా వుండి, బంగారం విలువ తగ్గితే, సరుకుల ధరలు పెరుతాయి, బంగారం విలువ పెరిగితే సరుకుల ధరలు తగ్గుతాయి.అయితే వాటివిలువలకి అనుగుణంగా లెక్కించాలి కనుక ఒక సరుకును మరొక సరుకు పోలికలో అదే విలువ వుంటుంది. మార్క్స్ చెప్పినట్లు " 2:4:8 అనే నిష్పత్తి, 1:2:4 గా మారినా, 4:8:16 గా మారినా తేడా ఏమీ ఉండదు."-క్రిటిక్.73. కనుక బంగారం ధర ప్రమాణంగా ఉండగలదు –దాని విలువ మారుతూ ఉన్నా.

బంగారం విలువ తగ్గితే, మునుపటితో పోలిస్తే,సరుకుల విలువ ఎక్కువ బంగారంలో వ్యక్తం అవుతుంది. బంగారం విలువ పెరిగితే, అవే సరుకుల విలువ తక్కువ బంగారంలో వ్యక్తం అవుతుంది. ఆవిధంగా బంగారం విలువ ఎంతగా మారినా, అది మార్పులేని ప్రమాణంగా ఎప్పుడూ ఉపకరిస్తుంది. తేలిందేమంటే, బంగారం విలువలో వచ్చే మార్పు ధర ప్రమాణంగా బంగారం విధి నిర్వహణ మీద ప్రభావం చూపదు.

రెండో విషయం. బంగారం విలువలో వచ్చే మార్పు విలువ కొలమానంగా బంగారం విధుల్లో జోక్యం చేసుకోదు. ఈమార్పుప్రభావం ఏకకాలంలో అన్నిసరుకుల మీదా పడుతుంది. అన్ని ఇతర పరిస్థితులూ యధాతతథంగా

ఉంటే, వాటి మధ్య వాటి సాపేక్ష విలువలు మారకుండా అలానే ఉంటాయి. అయితే వాటి విలువలు ఎక్కువో, తక్కువో, బంగారం ధరల్లో వ్యక్తం అవుతాయి.

**సరుకుల ధరలు పెరిగే పరిస్థితులు**. 1.డబ్బు విలువ స్థిరంగా ఉండి, సరుకుల విలువలు పెరగడం. లేదా 2. సరకుల విలువ స్థిరంగా ఉండి, డబ్బు విలువ తగ్గడం.

**సరుకుల ధరలు తగ్గే పరిస్థితులు**. 1.డబ్బు విలువ స్థిరంగా ఉండి, సరుకుల విలువలు తగ్గడం. లేదా 2. సరకుల విలువ స్థిరంగా ఉండి, డబ్బు విలువ పెరగడం.

విలువ స్థిరంగా ఉన్న సరుకుల విషయంలో మాత్రమే అటువంటి ధర మార్పు సరిపోతుంది (holds good). ఉదాహరణకి ఏ సరుకుల విలువలయితే డబ్బు విలువతోపాటు, అదే అనుపాతంలో పెరుగుతుందో ఆసరుకుల ధరల్లో మార్పు ఉండదు. వాటి విలువ డబ్బు విలువకంటే నెమ్మదిగాగానీ, వేగంగాగానీ పెరిగితే, వాటి విలువ మార్పుకీ, డబ్బు విలువ మార్పుకీ ఉన్న తేడా వాటి విలువలు తగ్గడాన్ని,పెరగడాన్నీ నిర్ణయిస్తుంది.

## బరువుల పేర్లనించి డబ్బుపేర్లు వేరయినాయి

మొదట్లో డబ్బు ప్రమాణాలకి పెట్టిన పేర్లు బరువు ప్రమాణాల నించి వచ్చినవే.డబ్బుగా ఉండే లోహం వివిధ బరువులలో ఉన్న ఇప్పటి డబ్బుపేర్లకూ, మొదట్లో ఆపేర్లు ప్రతినిధులుగా వున్న వాస్తవ బరువులకూ తేడా అంతకంతకూ ఎక్కువవుతున్నది. ఇందుకు చారిత్రిక కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి:

1.సరిగా అభివృద్ధి చెందని కమ్యూనిటీలోకి విదేశీ డబ్బు దిగుమతి గావడం. పాతరోజుల్లో రోమ్ లో అదే జరిగింది. అక్కడ వెండి, బంగారు నాణేలు విదేశీ సరుకులుగా చలామణీ అయ్యాయి. ఆ విదేశీ నాణేల పేర్లు స్వదేశీ బరువులతో సరిపోలేదు.

2. లోహాలు డబ్బు పదార్థాలుగా వున్నప్పుడు, డబ్బు ప్రమాణానికి పెట్టిన పేర్లన్నీ బరువు ప్రమాణాల నించి తీసుకున్నవే. సంపద పెరిగేకొద్దీ, తక్కువిలువ వున్నా లోహాన్ని ఎక్కువ విలువైన లోహం విలువ కొలమానంగా తొలగించింది. రాగిని తప్పించి వెండి వచ్చింది. అప్పుడు పౌను అనేది పౌను వెండికి పెట్టిన డబ్బు పేరు. తర్వాత వెండిని తప్పించి బంగారం ఆస్థానాన్ని ఆక్రమించింది.పౌను వెండికి విలువలో సమానమైన బంగారం యూనిట్ అయింది.వెండితో పోలిస్తే ఆనాడు బంగారం విలువ 15 రెట్లు. కనుక పౌనులో 15 వవంతు బంగారం యూనిట్ అయింది.అయితే పౌను అనే పేరు అలానే కొనసాగింది. ఆకారణంగా, డబ్బు పేరుగా పౌనూ, బంగారం బరువుగా పౌనూ, వేరువేరు అంశాలు అయ్యాయి..

3.రాజులూ, యువరాజులూ శతాబ్దాలతరబడి కరెన్సీ విలువని తగ్గించారు ఎంతగానంటే, నిజానికి మొదటి నాణేల బరువుల్లో పేర్లు మినహా మరేమీ మిగల్లేదు. ఈ చారిత్రిక కారణాల వల్ల బరువు పేరునుండి డబ్బు పేరు వేరవడం ఆకమ్యునిటీలో అలవాటుగా మారింది.

డబ్బు ప్రమాణం ఒకపక్క కేవలం సాంప్రదాయికం ,మరొకపక్క ప్రజామోదం పొంది ఉండాలి. చివరికి అది చట్టం ద్వారా క్రమబద్ధం కావాలి. ఒకానొక విలువైన లోహం నిశ్చిత బరువు ,ఉదాహరణకి ఒక ఔన్సు బంగారం

అధికారికంగా కొన్ని భాగాలుగా విభజితమవుతుంది. ఆభాగాలకు చట్టం పెట్టిన పౌను, డాలర్,వంటి పేర్లు వస్తాయి. డబ్బు ప్రమాణాలుగా ఉండే ఈ భాగాలు ఉపభాగాలుగా విభజితమవుతాయి. వాటికి షిల్లింగులు, పెన్నీలు వంటి చట్టం పెట్టిన పేర్లు ఉంటాయి. అయితే ఈ విభాగాలు కాక ముందూ,అయిన తర్వాతా కూడా ఒక నిశ్చిత బరువుగల లోహమే 'లోహం డబ్బు' ప్రమాణం. మార్పు కేవలం ఉపవిభజనలోనూ, భాగాల పేర్లలోనూ మాత్రమే.

బంగారం మొత్తాల్లోకి ఊహలో మార్చిన సరుకుల విలువలే ధరలు. ఇప్పుడు నాణేల పేర్లలో ధరలు వ్యక్తమవుతాయి.

ఒక క్వార్టర్ గోధుమలు ఒక ఔన్సు బంగారం అనే బదులు 3 పౌన్లా 17 షిల్లింగులా 10 పెన్నీలు అని చెబుతాం. ఈ విధంగా సరుకులు వాటి విలువని ధరలద్వారా వ్యక్తం చేసుకుంటాయి.ఒక వస్తువు తనవిలువని డబ్బురూపంలో నిర్ధారించవలసి వచ్చినప్పుడల్లా డబ్బు 'ఖాతా డబ్బు'గా ఉపకరిస్తుంది.

ఒక వస్తువు పేరు ఆ వస్తువు లక్షణాలనుండి భిన్నమైనది. ఒక మనిషి పేరు జాకబ్ అని తెలిసినంతమాత్రాన అతని గురించి ఏమీ తెలిసినట్లు కాదు. అలాగే పౌను, డాలర్, ఫ్రాంక్, డకెట్ వంటి డబ్బు పేర్లలో డబ్బుకు సంబంధించి విలువ సంబంధం జాడలన్నీ అదృశ్యమవుతాయి. ఈ సంకేతాలకు ఏదో గూడార్థాన్ని ఆపాదించడం వల్ల ఎంతో గందరగోళం కలుగుతుంది. ఎందుకంటే, ఈ డబ్బు పేర్లు సరుకుల విలువల్నీ, అదేసమయంలో డబ్బు ప్రమాణం గా ఉండే లోహం భాగాల బరువునీ రెంటినీ వ్యక్తం చేస్తాయి. మరొకపక్క,విలువని వివిధ రకాల సరుకుల శరీర రూపాలకు భిన్నమైనదిగా చేయడానికి, విలువ అనేది ఈ పాదార్థిక,అర్థరహిత రూపాన్నితీసుకొని తీరాలి. అయితే, అదే సమయంలో స్వచ్ఛమైన సామాజిక రూపాన్ని పొందాలి.

## విలువకీ ధరకీ మధ్య పొంతన లేకపోవడం

ఒక సరుకులో రూపొందిన శ్రమ యొక్క డబ్బు పేరే ధర. కనుక ఒక సరుకు ధరని ఏర్పరచే డబ్బు మొత్తంతోఆ సరుకు సమానం అనే వ్యక్తీకరణ కేవలం పునరుక్తే. ఒక సరుకు సాపేక్ష విలువ వ్యక్తీకరణ రెండు సరుకుల సమానత్వాన్ని చెప్పడమే అనడం వంటిదే ఇదికూడా. ధర సరుకు విలువపరిమాణాన్ని తెలిపేదయినందువల్ల , డబ్బుతో అది మారే నిష్పత్తిని తెలిపేదయినప్పటికీ , ఈ మారక నిష్పత్తి ని తెలిపేది తప్పనిసరిగా సరుకు విలువ పరిమాణాన్ని తెలిపేదిగా ఉండాలని లేదు. ఒక క్వార్టర్ గోదుమల్లోనూ, 2 పౌన్లలోనూ (సుమారు అర ఔన్సు బంగారంలోనూ) రెండు సమాన పరిమాణాల సామాజికంగా అవసరమైన శ్రమ ప్రాతినిధ్యం వహిస్తుందని అనుకుందాం. క్వార్టర్ గోదుమల విలువ పరిమాణం డబ్బులో వ్యక్తీకరణ రెండు పౌన్లు.అదే దాని ధర. పరిస్థితులవల్ల ఆధర 3 పౌన్లకు పెరిగినా, 1 పౌనుకి తగ్గినా....... అవి వాటి ధరలే. ఎందుకంటే, వాటి విలువ డబ్బు రూపంలో కనబడుతున్నది. రెండు, అవి డబ్బుతో మారక నిష్పత్తిని తెలుపేవి. వేరే మాటల్లో చెబితే, శ్రమ ఉత్పాదక శక్తి స్థిరంగా ఉంటే, ధరలో మార్పు జరగక ముందూ, జరిగిన తర్వాతా రెండు సందర్భాల్లోనూ క్వార్టర్ గోధుమల పునరుత్పత్తికి ఒకేమొత్తం సామాజిక శ్రమకాలం

వ్యయమవుతుంది. ఈ పరిస్థితి గోధుమ ఉత్పత్తిదారుని ఇష్టం మీదగానీ, ఇతర సరుకుల ఓనర్ల అభీష్టం మీదగానీ ఆధారపడదు.

అందువల్ల ఒక సరుకు విలువ పరిమాణం తప్పనిసరిగా సామాజిక శ్రమకాలంతో సంబంధాన్ని వ్యక్తపరుస్తుంది. ఏ శ్రమ కాలం అయితే ఆసరుకుని ఉత్పత్తిచేసిన ప్రక్రియలో అంతర్గతంగా ఉంటుందో, ఆ శ్రమకాలంతో సంబంధాన్ని వ్యక్తపరుస్తుంది.

సరుకులోని సామాజికంగా అవసరమైన శ్రమ కాలం వర్తకుల మారక నిర్ణయాలను బట్టి మారదు. ఏ ఆదేశం వల్లా మార్పుచెందదు. అందువల్లనే మార్క్స్ విలువ పరిమాణాన్ని 'అవసరమైన సంబంధం' అంటాడు. అయినప్పటికీ, మారక సంబంధాలు ఐచ్ఛిక చర్యలతో మార్చవచ్చు. విలువ సంబంధాలకు సరిపోని మారక సంబంధాలతో, ప్రజలు సరుకులు మార్చుకోగలరు. అయితే వాళ్ళు ఆ విలువ సంబంధాల్ని మాత్రం మార్చలేరు.

అది ఒకానొక వస్తువుకీ, సమాజం మొత్తం శ్రమకాలంలో దాన్ని ఉత్పత్తిచేయ్యడానికి అవసరమయ్యే భాగానికీ మధ్య సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది.విలువ పరిమాణం ధరలోకి మారగానే, ఆ తప్పనిసరైన సంబంధం ఆసరుక్కీ,దానికి బయట ఉన్న డబ్బుసరుక్కీ మధ్య ఎంతోకొంత యాదృచ్ఛిక మారక నిష్పత్తి రూపం తీసుకుంటుంది. అయితే, ఈ మారక నిష్పత్తి ఆసరుకు విలువ యొక్క నిజ పరిమాణాన్ని తెలుపుతుంది. లేక, ఆవిలువనుంచి తప్పుకున్న బంగారం పరిమాణాన్నైనా తెలుపవచ్చు. ఈ సంబంధం సరుకు విలువ పరిమాణాన్నీ,అప్పటి పరిస్థితుల్లో అది అమ్ముడు పోగల ఎంతోకొంత డబ్బు పరిమాణాన్నీ రెంటినీ వ్యక్తం చెయ్యవచ్చు

అందువల్ల ధరకీ,విలువ పరిమాణానికీ పరిమాణాత్మకంగా పొసగకపోయే అవకాశం ఉంది. అంటే, ధర విలువ పరిమాణం నించి వేరయ్యే అవకాశం అన్నమాట.ఈ అవకాశం ధర రూపం లోనే అంతర్గతంగా ఉంది.

ధర అనేది అంతర్గత విలువయొక్క బాహ్య వ్యక్తీకరణ. ఈ విలువ రూపం లోనే ఉందంటాడు. ఈ బాహ్యరూపం ఇతర ప్రభావాలకు కూడా గురవుతుంది. అయితే విలువకీ ధరకీ మధ్య వ్యత్యాసం లోపమేమీ కాదు. ప్రైవేట్ సరుకు ఉత్పత్తికి అవసరం.

లోపంగా కనబడే రెండో అంశం ఇది. దానిలాగే ఇది కూడా అవసరమైనదే. బంగారం విలువ లో మార్పులు రావడం లాగానే, సరుకుల ధరలు వాటి విలువలనుంచి పైదొలగడం అవసరమైనదే.

పరిమాణాత్మక అసంబద్ధత నుండి, ఇక పరిమాణాత్మక అసంబద్ధతకు: సరుకుల ధర రూపం అభివృద్ధి అయిందంటే, విలువ లేని వస్తువులు కూడా ధరను పొందగలవు. వస్తువులు చలామణీలో ధరను పొందగలవు: " బంగారంలోకి మారినదేదో బంగారం చెప్పదు. కనుక ప్రతిదీ, అది సరుకైనా కాకపోయినా బంగారంలోకి మార్చదగి ఉంటుంది." ప్రతి వస్తువూ అమ్మదగినదీ, కొనదగినదీ అవుతుంది. చలామణీ అనే సామాజిక కొలిమిలో పడిన ఎవస్తువైనా తిరిగి బంగారం గుళిక గా బయటకొస్తుంది. ఈప్రక్రియకు ఏదీ అతీతం కాదు.

విలువ పరిమాణానికీ, ధరకీ మధ్య- అంటే, విలువ పరిమాణానికీ డబ్బులో దాని వ్యక్తీకరణకీ మధ్య - పరిమాణాత్మక అసంబద్ధతకి అవకాశం ఉంటుంది. ధర రూపం ఈ అవకాశానికి తగినదిగా ఉంటుంది. అంతే కాదు, ధర రూపం గుణాత్మక అసంబద్ధతని కనబడకుండా దాచిపెట్టవచ్చు. ఎంతగా అంటే, డబ్బు సరుకుల విలువ రూపమే అయినప్పటికీ, ధర విలువ వ్యక్తీకరణగా అసలే/బొత్తిగా ఉండక పోవచ్చు.

అలా ఉండడం అనేది ధర రూపంలోనే అంతర్గతంగా ఉంది. ఆధర రూపమొక గుణాత్మక వైరుధ్యాన్ని సైతం కలిగి ఉండవచ్చు. ఎలాగంటే, ధర అసలు విలువనే వ్యక్తం చెయ్యదు- డబ్బు సరుకుల విలువ రూపమే అయినప్పటికీ. సరుకులు కాని వస్తువులు కొన్ని (ఆత్మసాక్షి, గౌరవం వంటివి) వాటి సొంత దారులచేత అమ్మబడవచ్చు. అప్పుడు వాటికి ధర ఏర్పడుతుంది. అలా వాటి ధర ద్వారా అవి సరుకు రూపాన్ని పొందుతాయి. కనుక కొన్ని సందర్భాలలో ఒక వస్తువు విలువ లేకపోయినా ధరను కలిగిఉండవచ్చు. ఇలాంటప్పుడు ధర వ్యక్తీకరణ ఉహాత్మకమే. మరొకపక్క, ఉహాత్మక ధర రూపం ప్రత్యక్ష లేక పరోక్ష వాస్తవ విలువ సంబంధాన్ని, మరుగుపరచవచ్చు. ఉదాహరణకు, దున్నని భూమికి ఉండే ధర. ఆభూమికి విలువ ఏమీ ఉండదు – కారణం అందులో మానవ శ్రమ ఏమీ చేరలేదు గనక.సరుకు విలువకీ ధరకీ వ్యత్యాసం ఉండడం లోపమేమీ కాదు. అందుకు భిన్నంగా ఇది ధర రూపాన్ని ఈ ఉత్పత్తి విధానానికి తగినట్లు తయారుచేస్తుంది.

## విలువ కొలమానం నించి చలామణీ సాధనంగా

ధర సరుకు విలువని వ్యక్తం చేస్తుంది.

ఒక టన్ను ఇనుం ఒక ఔన్సు బంగారంతో నేరుగా మారగలదు అని.చెప్పడం ద్వారా.

ఒక టన్ను ఇనుం = ఒక ఔన్సుబంగారం

అయితే ఇది దాన్ని తిరగదిప్పి- అంటే, ఇనుం బంగారంతో నేరుగా మారగలదు అని - ఏవిధంగానూ చెప్పదు. అందువల్ల ఆచరణలో ఒకసరుకు మారకం విలువగా సమర్ధవంతంగా పనిచెయ్యాలంటే, అది దాని శరీర రూపాన్ని వదలివేసి, దానికదే ఉహాత్మక బంగారం నుంచి, నిజమైన బంగారంలోకి మారాలి. ఇది ఈ చాలా కష్టమైనదే. హెగెల్ భావనకు అవసరం నించి స్వేచ్ఛకి పరివర్తన ఎంత కష్టమో అంతకన్నా ఎక్కువ కష్టం ఇది. ఎండ్రకాయకి తన డిప్పని వదిలించుకోవడం ఎంత కష్టమో, అంతకన్నా ఇది ఎక్కువ కష్టమైనది. ఎంతటి కష్టమైనదయినప్పటికీ, ఇది తప్పదు. ఒక సరుకు , ఉదాహరణకి ఇనుం తనవాస్తవ రూపం పక్కనే, మన ఉహలో అయితే బంగారం రూపం తీసుకోవచ్చు, కాని అది ఒకేసమయంలో నిజంగా ఇనుమూ, బంగారమూ కాలేదు. దాని ధర నిర్ధారించడానికి దాన్ని బంగారంతో ఉహలో సమపరిస్తే సరిపోతుంది. కాని ఓనర్ కి సార్వత్రిక సమానకంగా ఉపకరించడానికయితే అది బంగారంలోకి మారి తీరాలి. ధర చీటీ ఇనుముని బంగారంతో నేరుగా మారేట్లు చెయ్యదు. ఇనుం ఓనర్ డబ్బు ఓనర్ దగ్గరకి పోయి ప్రతి టన్ను ఇనుం కీ ఔన్సు బంగారం ఇవ్వమని అడగలేడని తెలిసిన విషయమే. అందుకు అతని సరుకు సాధారణ సమానకంగా ఉపకరించాలి. అన్ని సరుకులూ ఏక కాలంలో సాధారణ సమానకాలు కాజాలవు. అలా కావడం

సాధ్యమయ్యేది కాదు అని ఇంతకుముందే విశ్లేషణలో తేలింది. ఇప్పుడు ఒక పరిష్కారం ముందుకొచ్చింది. మొదట ఉత్పత్తిదారులు తమ మామూలు సరుకుల్ని డబ్బులోకి మారిస్తే, అప్పుడు వాళ్ళ చేతుల్లో సాధారణ సమానకం ఉంటుంది. ఊహలో ఉన్న బంగారం ఆచరణలో నిజమైన బంగారంలోకి మారాలి. సరుకుకి ధర పెట్టడానికి ఊహాత్మక డబ్బు సరిపోయినప్పటికీ, చేతులు మారాలంటే ఆసరుకులు నిజమైన బంగారంలోకి మారి తీరాలి.ధరరూపం సరుకులు డబ్బులోకి మారగల అవకాశాన్నీ, మారవలసిన అవసరాన్నీ సూచిస్తుంది. డబ్బు అక్కడ లేకుండానే సరుకులు ధర రూపం పొందినా, నిజమైన డబ్బులోకి అవి మారాలి. మరి డబ్బు ఉన్నదా? ఉన్నది. అన్ని సరుకులూ తమతమ విలువల్ని వ్యక్తం చేసుకునే బంగారమే డబ్బు.. అది అప్పటికే చలామణీలో ఉన్నది. ఏ సరుకైనా ఇతరసరుకుల్లోకి మారాలంటే, ముందు డబ్బులోకి మారాల్సి ఉంటుంది.

ఇక్కడ సరుకుల్ని అమ్మడంలో ఉన్న కష్టాలు చెబుతున్నాడు. ఆ సరుకులకు అవతల వైపు ఉండే డబ్బుతో వాటిని కొనడం తేలిక. ఒక సరుకు ఓనర్ ఇంకో సరుకు ఓనర్ దగ్గరకు పోయి ఇనుం ధరని, అప్పటికే డబ్బుఅనడానికి రుజువు అని అంటే, ఆ నాణెం యొక్క లోహమిశ్రమాన్నీ, బరువునీ పరీక్షించాలి. అది నీపర్సులో ఉందా చెప్పుఅంటాడు అవతలివాడు.

ధర అనేది సరుకు డబ్బుతో మారకం అవడానికి అనువైనదే అని సూచిస్తుంది. అలాగే అది మారకం అయి తీరాలి అని కూడా సూచిస్తుంది. మరొక పక్క, మారక ప్రక్రియలో బంగారం అప్పటికే డబ్బు సరుకుగా తన్ను తాను రూఢి చేసుకుంది కనుకనే బంగారం ఊహాత్మక విలువ కొలమానంగా ఉండగలుగుతుంది. ఈభావాత్మక కొలమానం చాటున నగదు డబ్బు(hard cash) పొంచి ఉంటుంది.

చలామణీ సాధనంగా డబ్బు –వచ్చే పోస్ట్

# భాగం 3. డబ్బు లేదా సరుకుల చలామణీ

(Money, or the Circulation of Commodities)

## విభాగం.2 చలామణీమాధ్యమం

(The Medium of Circulation)

### A. సరుకుల రూపపరివర్తన (The Metamorphosis of Commodities)

**సరుకుల సమాజంలో** సరుకుల మారకాలు స్తంభించడమే సంక్షోభం. మారకాలు సజావుగా సాగించ గలిగినంత కాలం సంక్షోభం ఉండదు. కొన్ని ఆటంకాలు కలిగినా, వాటిని దాటే రూపం మార్చు రావచ్చు. సంక్షోభాన్ని కలిగించే స్థాయికి చేరకుండా వైరుధ్యాలు పక్కపక్కనే కొనసాగ గలిగే మార్గాలు దొరికితే అవి అంత వరకూ తమ్ముతాము సమన్వయ పరుచుకుంటాయి. సర్దుబాటు చేసుకుంటాయి. వైరుధ్యం తననుతాను వాస్తవం చేసుకోడానికి కావలసిన రూపం: అన్ని విరుద్ధ అంశాలూ తమతమ ఉనికిని చాటుకోవాలి. దీన్నిబట్టి, అడుగున వుండే వైరుధ్యం అంటిపెట్టుకునే ఉంటుందన్నమాట. కనుక ఈ వాస్తవీకరణ వైరుధ్యాన్ని తోసిసివేయదు. ఒకరూపంలో విరుద్ధ అంశాలూ చలనంలో ఉండలేకపోతే మెరుగ్గా చలనంలో ఉంచగలిగే

రూపం రావాలి. ఉదాహరణకి వస్తుమార్పిడి అమ్మకం-కొనుగోలు అనే రెండు చర్యలుగా విడిపోయింది. ఈ కొత్తరూపం వస్తుమార్పిడిలో ఉన్న రెండు విరుద్ధాంశాల్నీ కొనసాగనిచ్చే రూపమే. అయితే, అమ్మకానికీ, కొనుగోలుకీ విభజన సంక్షోభానికి అవకాశం ఉంచుతుంది, అంటే అది వైరుధ్యాన్ని వైరుధ్యంగా తొలగించదు.

## నిజమైన వైరుధ్యాలు పరిష్కారం అయ్యే పద్ధతి

సరుకుల మారకంలో విరుద్ధమైనవీ, పరస్పరం ఒకదాన్నొకటి బహిష్కరించుకునేవీ అయిన పరిస్థితులు ఉంటాయి- అనే విషయాన్ని ఇంతకుముందు ఒక అధ్యాయంలో తెలుసుకున్నాం. సరుకు తదుపరి అభివృద్ధి ఈ వైరుధ్యాల్ని రద్దు పరచలేదు. సరుకులు మామూలు సరుకులుగానూ,డబ్బు గానూ విడిపోయినప్పటికీ, ఆ పొసగని అంశాలు రద్దవలేదు. కాని వాటి చలనాన్ని అడ్డగించే చిక్కులు తొలగిపోయాయి. ఆ అంశాలు సహనంతో సామరస్యంగా పక్కపక్కనే ఉండడడానికి తగిన రూపం (modus vivandi) అభివృద్ధి అయింది. వస్తుమార్పిడి కొనుగోలూ, అమ్మకంగా వేరవడం వీలయింది. ఇలా వేరవడం వస్తుమార్పిడిలో ఉన్న విరుద్ధాంశాల చలనానికి అవకాశం కలిగించింది. "సాధారణంగా నిజమైన వైరుధ్యాలు సమన్వయం (reconcile) చెయ్యబడే పద్ధతి ఇదే."

ఉదాహరణకి, ఒకవస్తువు వేరొకవస్తువు వైపు వస్తుందనీ, అదేసమయమయంలో దాని నుంచి దూరంగా వెళ్లి పోతున్నదనీ వర్ణించడం ఒక వైరుధ్యమే. అయితే దీర్ఘ వృత్తం అనేది ఈ వైరుధ్యం సాధ్యమయ్యే, అలాగే సమన్వయమయ్యే చలనరూపం. అంటే, అది ఈ వైరుధ్యం కొనసాగడాన్ని అనుమతిస్తూనే, అదేసమయంలో వైరుధ్యాన్ని సమన్వయపరుస్తుంది. దీర్ఘవృత్తం కక్ష్య గురుత్వాకర్షణకీ, జడత్వానికీ ఉన్న వైరుధ్యాల్ని ఎలా నడవ నిస్తుందో అలాగే.

**నిజమైన వైరుధ్యాలు రద్దయి పోవు.** ఎందుకంటే, అంతర్లీనంగా వున్నవైరుధ్యం అంటిపెట్టుకునే వుంటుంది. ఉదాహరణకి ప్రత్యక్ష బార్టర్ అమ్మకంగానూ, కొనుగోలుగానూ విడివడడం సంక్షోభాలను సాధ్యం చేసే రూపం – అది బార్టర్ లోని విరుద్ధాంశాల్ని అనుమతిస్తుంది. అంతేగాని అది వైరుధ్యాన్ని వైరుధ్యంగా తొలగించదు. సంక్షోభం కలిగే అవకాశాన్ని నిర్మూలించదు..

## మరైతే, విడివడడంవల్ల ఒరిగిందేమిటి?

బార్టర్ లో ఇబ్బందుల్ని తొలగించేందుకు. మారకాలు సజావుగా సాగడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. వాటిని అధిగమించడానికి, మామూలు సరుకులుగానూ, డబ్బుగానూ సరుకులు విడివడిపోయాయి. బార్టర్లోని ఆటంకాలు పటాపంచలయ్యాయి.

## డబ్బు తొలగించిన చిక్కులేమిటి?

బార్టర్ లో ఒకరు తనవస్తువు ఇచ్చి , మరొకరి వస్తువు తీసుకుంటాడు. ఇవ్వడానికీ పుచ్చుకోడానికీ ఐక్యత ఉంటుంది. ఒక చర్య ఒకేచోట జరగాలి. ఒకేకాలంలో జరగాలి. అదే వ్యక్తులమధ్య జరగాలి. అంటే వస్తుమార్పిడిలో ప్రదేశానికీ, కాలానికీ, వ్యక్తులకీ సంబంధించి పరిమితులుంటాయి. సరుకులు కొద్దిగా వున్న

కాలంలో వస్తుమార్పిడి సమాజ జీవన క్రియకి సరిపోయింది. అయితే ప్రతి కొత్త శ్రమ విభజనతోనూ సరుకులజాబితా పెరిగింది. సంఖ్యా పెరిగింది. వస్తుమార్పిడి మారక అవసరాలకు సరిపోలేదు. ఇబ్బందులు తలెత్తాయి. అవేవంటే:

1. వస్తుమార్పిడి జరగాలంటే, అవతల మనిషి దగ్గర మనకు కావాల్సిన వస్తువు ఉంటేనే చాలదు. మన వస్తువు అతనికి కావలసినదై ఉండాలి. అది అతనికి ఉపయోగపు విలువ అయి ఉండాలి.

మనదగ్గర పాలున్నాయి. బదులుగా మనకి బియ్యం కావాలి. బియ్యం వున్నా ప్రతివానితోనూ మనకు మారకం కుదరదు.ఎందుకంటే పాలు వాళ్లకి అవసరం లేకపోవచ్చు. అప్పుడు మనం బియ్యం ఉంది పాలు కావాల్సిన మనిషిని వెదికి పట్టుకోవాలి. ఇదొక ఇబ్బంది.

దీనికి సంబంధించి ఒక ఉదంతం ఉంది:

ఒక అన్వేషకుడు ఆఫ్రికాలో ఒక నదిలో తిరగడానికి పడవకోనాలనుకున్నాడు. పడవ అమ్మేవాడిని పట్టుకున్నాడు. అయితే అతను పడవని దంతంతో తప్ప మార్చుకోడు.మనవాడి దగ్గర దంతం లేదు. కొంత వైరు మాత్రం ఉంది. దంతం ఉన్నవాడేమో బట్ట కావాలన్నాడు. ఇతని దగ్గర అదీ లేదు. మూడోవాడిని చూశాడు. అతను బట్టని అమ్ముతాడు, కాని వైరుకి మాత్రమే. మనవాడి దగ్గర కొంత వైరుంది. దాన్ని బట్టతో మార్చి,ఆబట్టనిచ్చి దంతంతీసుకుని, ఆదంతం ఇచ్చి పడవ పట్టుకుపోయాడు.

ఇలా తిరగటం అసౌకర్యం కలిగిస్తుంది. టైం వేస్ట్ కూడా. మనవాడిదగ్గర వైరు ఉంది కాబట్టి పనయింది. ఒకవేళ వైరు లేకపోతే నువ్వా నువ్వా అంటూ తిరగవలసి వచ్చేది.

2. సరుకుల విలువ పరిమాణాల్లో తేడా వస్తుమార్పిడికి ఆటంకం అవుతుంది. ఒకని వద్ద మేక ఉంది. అతనికి 2 కుండలు కావాలి. కుండవానికి మేక అవసరమే. 1మేక = 100 కుండలు. రెండు కుండలతో మేక మారాలంటే, మేకని 50 ముక్కలు చెయ్యాలి. కుండలవానికి మేక అవసరం మాంసం కాదు. పాలు. ఒకవేళ మాంసమే అయినా, ఒక ముక్కకే రెండు కుండలు వస్తాయి. మిగిలిన ముక్కల్ని మారకం చేసుకోలేకపోతే అవి చెడతాయి.

కొన్ని వస్తువుల్ని విభజించగలిగినా, అవి విలువని కోల్పోతాయి. ఒక ముత్యం ఉన్న వాడికి అన్నం కావాలి. ఒకసారి తినే అన్నం కంటే ముత్యం ఎన్నో రెట్లు విలువైంది. ముక్కలు చేస్తే పాడవుతుంది, విలువ కోల్పోతుంది. పోనీ మొత్తానికి అన్నం తీసుకుంటే అది ఎంతోసేపు నిల్వ ఉండదు.

ఇవి వస్తుమార్పిడిలో ఇబ్బందులు. డబ్బు రాగానే ఈ ఇబ్బందులు పోయాయి.

## డబ్బు ఈ ఇబ్బందుల్ని ఎలా పోగొట్టింది?

సరుక్కీ సరుక్కీ మధ్య డబ్బు ఉంటుంది.ఇప్పుడు మారక రూపం: సరుకు-డబ్బు-సరుకు. ఏసరుకైనా మొదట డబ్బులోకి మారుతుంది. ఆడబ్బు మరోకసరుకులోకి మారుతుంది.

సరుక్కీ సరుక్కీ మధ్యలో ప్రతిసారీ డబ్బు ఉంటుంది. డబ్బు మధ్యవర్తి పాత్ర పోషిస్తుంది.

మొదటి ఉదాహరణలో తన వైరుని రెండోవానికి అమ్మి ఆడబ్బుతో నేరుగా పడవ కొంటాడు.

వైరు - డబ్బు- పడవ

మన ఉదాహరణ బార్టర్ లో అయితే:

వైరు – బట్ట ; బట్ట – దంతం ; దంతం - పడవ

కనక బార్టర్ లో కలిగే ఈ ఇబ్బందిని డబ్బు అధిగమిస్తుంది.

ముత్యం –ఆహారం మారకంవిషయం: ముత్యాన్ని ముక్కలు చేస్తే చెడుతుంది. ముత్యాన్ని అమ్మి ఆడబ్బుని భాగాలు చేసినా విలువ తగ్గదు.కొంత డబ్బుతో ఆహారం కొని, మిగిలిన డబ్బుతో కావలసిన ఇతర సరుకులు కొనుక్కోవచ్చు.

కాలానికి సంబంధించిన ఇబ్బంది: ఒకరి వస్తువు మరొకరికి పరస్పరం కావలసినా, ఇద్దరి అవసరాలూ ఒకే సమయంలో ఉండక పోవచ్చు. రొట్టె వానికి బట్ట కావాలి. బట్టవానికీ రొట్టె కావాలి. కాని అప్పటికప్పుడు కాదు. కనుక బట్టవాడు మారకానికి ఒప్పుకోడు. కారణం: రొట్టె మర్నాడు తినేందుకు పనికిరాదు.

| వస్తు మార్పిడి<br>( సరుకు-సరుకు) | డబ్బు మధ్యవర్తిగా మారకం<br>(సరుకు- డబ్బు- సరుకు) |
|---|---|
| 1.ఎవరికిస్తామో వానివద్దే తీసుకోవాలి | ఎవరి వద్దయినా తీసుకోవచ్చు |
| 2.ఎప్పుడిస్తామో అప్పుడే తీసుకోవాలి | ఎప్పుడయినా తీసుకోవచ్చు |
| 3. ఎక్కడిస్తామో అక్కడే తీసుకోవాలి. | ఎక్కడయినా తీసుకోవచ్చు |

వస్తు మార్పిడిలో ఉన్న స్థల కాల వ్యక్తి పరిమితులు డబ్బు మధ్యవర్తిగా ఉన్న మారకాల్లో ఉండవు.

మార్క్స్ మాటల్లో: "వస్తు మార్పిడిలో ఒకరి వస్తువు ఇవ్వడం, ఇంకొకరి వస్తువు పొందడం- అనే నేరు ఐక్యతని అమ్మకం కొనుగోలుల వ్యతిరేకతలోకి విడగొట్టడం ద్వారా ప్రదేసనికీ, కాలానికీ, వ్యక్తులకీ సంబంధించి వస్తుమార్పిడి విధించిన పరిమితుల్ని చలామణీ అధిగమించింది." కాపిటల్ 1.115

మరొకచోట: "వస్తు మార్పిడికుండే స్థానిక,వైయక్తిక హద్దుల్ని అధిగమించి మారకం సరుకుల చలామణీని అభివృద్ధి పరిచింది."- కాపిటల్ 1.11

## మారక రంగం నుండి వాడక రంగంలోకి

సరుకులు ఎవరికి ఉపయోగపు విలువలుగా ఉండవో వారి చేతుల్లోనుంచి ఎవరికి ఉపయోగపు విలువలో వారి చేతుల్లోకి పోయే ప్రక్రియే మారకం. ఒకరకం శ్రమ ఉత్పాదితం మరొక శ్రమ ఉత్పాదితం స్థానంలోకి చేరుతుంది. ఇది సామాజిక జీవనక్రియ. ఉపయోగపు విలువగా ఉండే చోటుకి చేరాక, సరుకు మారకరంగం నుంచి నిష్క్రమించి, వాడకరంగంలో ప్రవేశిస్తుంది. వల కొన్నవాడు దాంతో నదిలో చేపలుపడతాడు. అంటే వల మారక రంగం వీడి వాడక రంగంలోకి పోయింది.

అయితే ప్రస్తుతానికి మనద్యాసంతా మారక రంగం మీదే.

## మారకాన్ని రూపం వైపు నించి పరిశీలించాలి

శ్రమ విభజన ఉన్న ఏ సమాజంలోనైనా వస్తువులు ఉత్పత్తయ్యాక చేతులు మారితీరాలి. ప్రతి వ్యక్తీ తన శ్రమ ఉత్పాదితాల్ని వదులుకొని, ఇతరుల ఉత్పాదితాల్ని తీసుకోవాల్సిందే. ఇదొక సామాజిక జీవన క్రియ (social metabolism)." ఉపయోగపు విలువలుగా వుండని వారి చేతుల్లోంచి, ఉపయోగపు విలువలుగా ఉండే వారిచేతుల్లోకి బదిలీ చేసే ప్రక్రియగా ఉన్న మేరకు, మారక ప్రక్రియ సామాజిక జీవన క్రియ యొక్క ప్రక్రియ."

ప్రతి సమాజంలోనూ ఈప్రక్రియ ఉత్పాదితాల మారకం ద్వారా జరరిగిందని కాదు. ఇక్కడ పరిశీలిస్తున్నది సరుకులు ఉత్పత్తిచేసే సమాజాన్ని. మార్క్స్ లక్ష్యం ఈ సమాజంలో ఈబదిలీ జరిగే సామాజిక రూపాన్ని పరిశీలించడమే ఈప్రక్రియ యొక్క సారం గురించి ఇక్కడ ఆసక్తి లేదనీ, కుతూహలం అంతా దాని రూపం గురించే ననీ స్పష్టం చేస్తాడు. "మనం ఈ సామాజిక జీవన క్రియలో మాధ్యమంగా పనిచేసే సరకుల రూప పరివర్తన-లేక సరుకుల రూపాంతరాన్ని గురించి పరిశోధించాలి. కనుక మొత్తం మారక ప్రక్రియని దాని రూపం అంశంలో చూడాలి. అంటే, సామాజిక జీవనక్రియని జరిపించే సరుకుల రూపం మార్పుని / రూప పరివర్తనని పరిశోధించాలి.

మార్కెట్ లావాదేవీల్ని రూపం వైపు నించి చూసేటప్పుడు, ఒక పొరపాటు చెయ్యకూడదు. రెండు మామూలు సరుకుల మధ్య జరిగే వస్తుమార్పిడి కి కొనుగోలు లేక అమ్మకం భిన్నస్వభావం కలవి. పాల్గొనే వ్యక్తుల ఆలోచనలూ, నిర్ణయించుకునే ప్రమాణాలూ (criteria)రెండు సందర్భాలలోనూ భిన్నంగా ఉంటాయి.

ఈ చలనం యొక్క రూపం అంశం గ్రహించడం కొంచెం కష్టం. ఎందువల్లనంటే,ఒక సరుకు యొక్క ప్రతి రూపం మార్పూ రెండు సరుకుల మారకం ద్వారా వస్తుంది. వాటిలో ఒకటి సాదా సరుకు,రెండోది డబ్బుసరుకు. అలాంటి రూపం మార్పుకి ఉదాహరణ: ఒకసరుకు తన ఉపయోగపు విలువను వదలివేసి, డబ్బు రూపాన్ని తీసుకోవడం. ఇదెలా జరుగుతుంది?బంగారంతో దాని మారకం ద్వారా. ఒక వాస్తవంగా చూస్తే అది రెండు సరుకుల మారకం. అయితే మరింత దగ్గరగా చూడాల్సిన అవసరం ఉంది.

డబ్బు చలామణీ ప్రక్రియలో అనివార్యంగా ఏర్పడ్డది.

ఒక సరుకు బంగారంతో మారింది అనే విషయాన్ని మాత్రమే మనస్సులో పెట్టుకుంటే, కచ్చితంగా గమనించాల్సిన విషయాన్ని వదిలేస్తాము. అదేమంటే, సరుకు రూపానికి ఏమి జరిగిందో దాన్ని పట్టించుకోము.

1) ఉత్త సరుకుగా ఉన్నప్పుడు బంగారం డబ్బు కాదు అనే విషయాన్ని గమనించం.

2)ఇతర సరుకులు తమ ధరల్ని బంగారంలో చెప్పినప్పుడు బంగారం ఆసరుకుల డబ్బు రూపమే-అనే విషయాన్ని పట్టించుకోము.

ఉదాహరణకి, ఒక పడవ = 2 గ్రాముల బంగారం

రెండు సరుకులూ రెండు భిన్న శ్రమల ఉత్పాదితాలని తెలిసిందే. మారకం జరిగితే, అవి చేతులు మారతాయి. పడవ ఉపయోగపు విలువగా లేని ఉత్పత్తిదారు నించి వినియోగదారుకి చేరుతుంది. అంటే అది మారక రంగాన్ని వదలి వాడకరంగంలోకి అడుగిడుతుంది. పడవ బంగారంతో మారింది అనే విషయాన్ని మాత్రమే గమనిస్తే ఆసరుకుల రూపంలో వచ్చిన మార్పుని గమనించం. అయితే ఇదే అసలు గమనించాల్సిన విషయం. బంగారం కూడా మామూలు సరుకే, పడవలాంటి సరుకే. అలా మామూలు సరుకుగా ఉన్నప్పుడు, బంగారం డబ్బుకాదు. అన్ని సరుకులూ బంగారంలో తమ ధరలు చెప్పినప్పుడు అది విశిష్టమైన సరుకు - డబ్బు సరుకు – అవుతుంది; ఇతర సరుకుల యొక్క డబ్బురూపం అవుతుంది.రూపాన్ని డబ్బులో వ్యక్తం చేస్తాయి.అలా ఇతర సరుకుల ధరల్ని వ్యక్తం చేసే మాధ్యమమే(medium) బంగారం. మిగిలిన ఏ సరుకూ అలాంటి మాధ్యమంగా ఉండజాలదు.

సరుకులు మారక ప్రక్రియలోకి వచ్చేటప్పుడు అవి ఎలావున్నాయో అలానే ఉంటాయి అసలు ఆకారంలో వస్తాయి. మారకప్రక్రియ సరుకుని రెండు మూలకాలుగా – సరుకుగా, డబ్బుగా - వేరుచేస్తుంది.ఆవిధంగా సరుకులో ఉపయోగపు విలువ, విలువలమధ్య అంతర్గతంగా ఉండే విరుద్ధత (opposition) ఇప్పుడు దానికి అనుగుణమైన సరుకు, డబ్బుల మధ్య బాహ్య విరుద్ధతని కలిగిస్తుంది. ఈ విరుద్ధతలో సరుకులు ఉపయోగపు విలువలుగా డబ్బుని మారకం విలువగా ఎదుర్కొంటాయి. మరొకపక్క, ఈ విరుద్ధతకి రెండువైపులా ఉన్నవి సరుకులే, అయినందువల్ల ఉపయోగపు విలువ, విలువల ఐక్యతలే. అయితే ఈ విరుద్ధతల ఐక్యత రెండు వ్యతిరేక ధృవాల వద్ద వ్యక్తమవుతుంది. .ధ్రువాలు అయినందువల్ల అవి సంబంధంలో ఉన్నట్లే, వ్యతిరేకంగానూ ఉంటాయి. సమీకరణానికి ఒకవైపున మామూలు సరుకు, నిజానికి ఒక ఉపయోగపు విలువ ఉంటుంది. దాని విలువ దాని ధరలో ఊహాత్మకంగా వ్యక్తమవుతుంది. ధరద్వారా సరుకు (అవతలవైపునున్న) వ్యతిరేకి అయిన బంగారంతో సమపరచబడుతుంది. మరొకపక్క లోహమైన బంగారం విలువ అవతారంగా , డబ్బు హోదా పొందుతుంది. బంగారం బంగారంగా మారకం విలువే .
దాని ఉపయోగపు విలువ ఊహాత్మకంగా మాత్రమే కనబడుతుంది. సరుకులపైన ఈ విరుద్ధ రూపాలు వాటి మారకం జరిగే ప్రక్రియ యొక్క నిజమైన చలన రూపాలు.

సరుకుల వ్యతిరేక రూపాలు మారక ప్రక్రియ యొక్క వాస్తవ చలన రూపాలు.

సరుకులు ఉపయోగపువిలువలుగా డబ్బుని ఎదుర్కొంటాయి. ఇరువైపులా ఉన్నది సరుకులే. అంటే ఉపయోగపు విలువ, విలువల ఐక్యతలే. అయితే ఈ వ్యత్యాసాల ఐక్యత ఆధ్రువం వద్దా, ఈధ్రువం వద్దా వ్యతిరేక మార్గంలో ప్రాతినిధ్యం వహిస్తుంది. అందువల్ల అదే సమయంలో వాటి పరస్పర అంతఃసంబంధానికి ప్రతినిధి అవుతుంది/ ప్రాతినిధ్యం వహిస్తుంది.

వేరేరకంగా చెబితే, పిప్పిపళ్ళలో కూరే బంగారం ఉపయోగపు విలువ ఉపేక్షించబడుతుంది. ఫ్రెంచ్ కూర్పులో సరుకుకీ డబ్బుకీ ఉండే సంబంధం ఏవిధంగా రెండు మామూలు సరుకులకి ఉండే సంబంధానికి భిన్నమైనదో చక్కగా వివరిస్తాడు.

ఒకధ్రువంలో బంగారం ఉంటుంది.అన్ని ఉపయోగకర వస్తువులూ ఇంకో ధ్రువాన్ని చేరతాయి. రెండు వైపులా ఉన్నవి సరుకులే. అటూ సరుకే ఇటూ సరుకే. రెండూ ఉపయోగపు విలువ, విలువల సమ్మేళనాలే. అయితే ఈరెండు చివరలా ఉన్న వ్యతిరేకాంశాల ఐక్యత రెంటిలో ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆరెండూ ఒకదానికొకటి విలోమంగా ఉంటాయి. సరుకు ప్రయోజనకరరూపం దాని వాస్తవ రూపమే. దాని మారకం విలువ దాని ధర ద్వారా ఊహాత్మక బంగారంలో వ్యక్తమవుతుంది. ఇందుకు విరుద్ధంగా బంగారం యొక్క ప్రాకృతిక, లోహ రూపం దాని సాధారణ రూపం, అంటే విలువ రూపం. దాని ఉపయోగపు విలువ దానికి సమానకాలుగా ఉన్న సరుకుల పరంపర(series)లో ఊహాత్మకంగా వ్యక్తమవుతుంది.ఆ కారణంగా ఒక సరుకు బంగారంతో మారినప్పుడు, తన ప్రయోజనకర రూపాన్నిఅదేసమయంలో తన విలువ రూపంలోకి మార్చుకుంటుంది. బంగారం ఒక సరుకుతో మారినప్పుడు, తన విలువ రూపాన్ని ప్రయోజనకర రూపంలోకి మార్చుకుంటుంది.

ఈ సరుకు-డబ్బు బహిర్గత వ్యతిరేకత మారక ప్రక్రియలో ఏర్పడ్డది. ఈ సరుకు-డబ్బు బహిర్గత వ్యతిరేకత ప్రతి సరుకులోనూ ఉన్న ఉపయోగపు విలువ-విలువల అంతర్గత వ్యరేకతకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ సరుకుల వ్యతిరేక రూపాలు మారక ప్రక్రియ యొక్క వాస్తవ చలన రూపాలు.

## ఉద్దేశ్యపూర్వకంగా ప్రవేశపెట్టబడిన సాధనం కాదు

అమ్మకంగానూ, కొనుగోలుగానూ బార్టర్ విడివడడం అనేది ప్రత్యక్ష వస్తుమార్పిడిలో తలెత్తిన ఇబ్బందుల్ని తొలగించడానికి మార్కెట్లో పాల్గొనే వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా ప్రవేశపెట్టబడిన సాధనం కాదు. డబ్బు ఎకానమీ కేంద్రం(core)లో ఉత్పత్తిసంబందాల ఉపరితల వ్యక్తీకరణగా ప్రవేశపెట్టబడింది. డబ్బు రాకతో ప్రతి సరుకులోనూ ఉపయోగపు విలువకూ, విలువకూ అంతర్గతంగా ఉన్న వైరుధ్యం, సరుకులు మామూలు సరుకులుగానూ, డబ్బుగానూ విడివడడంలో బహిర్గతమయింది.

సరుకు మారకప్రక్రియలో నడచేటప్పుడు, సరుకు ఈరెండు వ్యతిరేక సరుకు రూపాలగుండా పోతుంది.

డబ్బు-మామూలు సరుకు గురించి చర్చించాక, అసలు ప్రక్రియని చర్చిస్తాడు:

## అసలు ప్రక్రియ- కొనడం కోసం అమ్మడం

నేతగాడు తాను నేసిన 20గజాల బట్టతో మార్కెట్ కి పోతాడు. ఆ బట్టకి నిర్దిష్టమైన ధర-రెండు పౌన్లు- ఉంటుంది. అంతకే దాన్ని అమ్మి, అంతే ధర ఉన్న బైబిల్ కొంటాడు. బట్ట అతని దృష్టిలో విలువ నిక్షేపం మాత్రమే. దాన్ని బంగారంతో మారకంలో పరాధీనం చేస్తాడు. బంగారం బట్ట యొక్క విలువ రూపం. ఈ రూపాన్ని మరొక సరుకు అయిన బైబిల్ కోసం వదులుకుంటాడు. బైబిల్ కుటుంబానికి ఉపయోగపువిలువగా అతని ఇల్లు చేరుతుంది.

అప్పటికి మారకం వాస్తవంగా పూర్తవుతుంది. మారకం వాస్తవం అవడం రెండు రూపాంతరాల (metamorphoses) ద్వారా సాధ్యం అవుతుంది. ఈరెండు రూపాంతరాలూ ఒకదానికొకటి విరుద్ధమైనవి. అయినా పరస్పరం అనుబంధ స్వభావం కలవి. మొదటి రూపాంతరం , సరుకు డబ్బులోకి మారడం- 20గజాల బట్ట 2 పౌన్ల లోకి మారడం. రెండో రూపాంతరం ,ఆ రెండు పౌన్ల డబ్బు తిరిగి బైబిల్ అనే మరొక సరుకులోకి మారడం. ఈరూపంతరం లోని రెండు దశలూ నేతగాడు జరిపిన రెండు భిన్న లావాదేవీలు.తొలి దశ అమ్మడం-తన సరుకుని డబ్బుకి మారకం చెయ్యడం. మలి దశ కొనడం-తన డబ్బుని సరుకుతో మారకం చెయ్యడం. రెంటినీ కలిపితే 'కొనడం కోసం అమ్మడం'.

నేతగాని లావాదేవీ ఫలితం ఏమిటి? అతని వద్ద బట్ట బదులు బైబిల్ ఉంది.తన అసలు సరుకు పోయి, అంతే విలువగల, భిన్నమైన ఉపయోగపు విలువ ఉన్న మరొక సరుకు అతనిదయింది. ఇదే పద్ధతిలో అతను జీవితావసర వస్తువుల్నీ, ఉత్పత్తి సాధనాలనీ సమకూర్చుకుంటాడు. ఈ దృష్టితో చూస్తే, ఈ మొత్తం ప్రక్రియ ఫలితం ఏమిటి? అతని శ్రమ ఉత్పాదితం వేరొకరి శ్రమ ఉత్పాదితంతో మారకం కావడమే. ఉత్పాదితాల మారకం మినహా మరేమీ కాదు. అందువల్ల సరుకుల మారకం వాటి రూపంలో ఈక్రింది మార్పుల్ని తెస్తుంది:

సరుకు – డబ్బు – సరుకు

స – డ – స

ఆవస్తువులకి సంబంధించినంత వరకూ మొత్తం ప్రక్రియ ఫలితం, స – స. ఒకసరుకుకి మరొక సరుకుతో మారకం. వస్తు రూపం పొందిన సామాజిక శ్రమ యొక్క చలామణీ. ఈ ఫలితం వచ్చీ రాగానే ప్రక్రియ ముగుస్తుంది.

సరుకు రూప పరివర్తనలో రెండు దశలుంటాయి :

మొదటి దశ సరుకు-డబ్బు. సరుకు డబ్బుగా మారడం.

రెండో దశ డబ్బు-సరుకు ఆడబ్బు మరొక సరుకుగా మారడం.

మొదటి దశ గురించి వచ్చే పోస్ట్ లో

## సరుకు – డబ్బు. మొదటి రూపాంతరం లేదా అమ్మకం

**C – M. First metamorphosis, or sale**

ఉత్పత్తయిన సరుకు అమ్ముడవాలి. బంగారంలోకి మారాలి.అంటే ఆ సరుకు 'విలువ' ఆ సరుకు శరీరం లోనుంచి 'బంగారం' శరీరం లోకి దూకాలి. దూకితేనే అమ్మకం. ఉదాహరణకి, 50 పౌన్ల ఇనుం అమ్ముడవడం అంటే దాని విలువ 2 ఔన్సుల బంగారంలోకి దూకడమే. దూకకపోతే అమ్మకం జరగనట్లే. మార్క్స్ ఈ 'దుముకు'ని తాను మరొకచోట 'salto mortale of the commodity' అని అన్నానంటాడు. ఆ మరొక చోటు 'క్రిటిక్' పేజి 88. అక్కడిలా అంటాడు:

ఈ పరివర్తన జరగకపోతే టన్ను ఇనుమూ సరుకు అవకుండా పోతుంది, అంతేకాదు ఉత్పాదితం కూడా కాకుండా పోతుంది. కారణం: దాని ఓనర్ కి ఉపయోగపు విలువ కాకుండా ఉండి, ఇతరులకు ఉపయోగపు విలువ అయితేనే అది సరుకు. అంటే, అతని శ్రమ ఇతరులకు ప్రయోజనకర శ్రమ అయితేనే అది నిజమైన శ్రమ. అది అనిర్దిష్ట సాధారణ శ్రమ అయితేనే ఓనర్ కి ప్రయోజనకరం. అందువల్ల ఇనుం ఓనర్ తన సరుకు బంగారాన్ని ఆకర్షించగల -అంటే బంగారంతో మారగల- చోటు వెతుక్కోవాల్సి ఉంటుంది. ఈ సింపుల్ చలామణీ విశ్లేషణలో మనం ఆశించినట్లు అమ్మకం జరిగితే, అవరోధాన్ని (the *salto mortale* of the commodity)అధిగమించినట్లే."

ఈ అన్యాక్రాంతం అవడం – అంటే, ఉపయోగపు విలువ కాని వ్యక్తినుండి ఉపయోగపు విలువగా ఉండే వ్యక్తికి బదిలీ కావడం-ఫలితంగా ఇనుం వాస్తవంగా ఉపయోగపువిలువ అయినట్లు రుజువు చేసుకుంటుంది; అదే సమయంలో దాని ధర సిద్ధిస్తుంది, కేవలం ఊహాత్మక బంగారం నిజమైన బంగారం లోకి మారుతుంది.-క్రిటిక్

salto mortale (సాల్టో మోర్టాలే) ఇది ఇటాలియన్ మాట. salto అంటే 'దుముకు'. mortale అంటే ప్రమాదకరమైన . రెండూ కలిపితే, ప్రమాదంతోకూడిన, సాహసోపేతమైన దుముకు అని అర్థం. సర్కస్ లో తాడుమీద పరిటీలు కొట్టడం ఒక salto mortale. గ్లోబులో మోటార్ సైకిళ్ళు నడపడం అలాంటిదే.ఒక ఎత్తైన చోట నుంచి మరొక ఎత్తైన చోటుకి మోటార్ సైకిల్ ఎక్కి దూకడం ఒక ఫీట్. సరిగ్గా దూకాలి. ఏమాత్రం ఇవతల దూకినా ఎత్తునుంచి కింద పడడమే, ప్రమాదమే.

ఇక్కడ ఒక సరుకు లోంచి విలువ మరోకసరుకులోకి దూకే చర్య. సరుకు విలువ బంగారంలోకి సరిగ్గా దూకాలి. దూకలేకపోతే ప్రమాదం. అయితే ఆ ప్రమాదం సరుకుకి కాదు. కాని దాని ఓనర్ కి కచ్చితంగా ప్రమాదమే. ఎందుకంటే, అది అమ్మకంకోసం ఉత్పత్తయిన సరుకు. అమ్ముడవకపోతే, ఉన్నదలానే, అతని వద్దే ఉండిపోతుంది. మరల తయారు చెయ్యలేడు. అదే అతనికి పొంచివున్న ప్రమాదం.

సరుకు ఉత్పత్తిదారులు శ్రమవిభజన ఉన్న సమాజంలో జీవిస్తారు. తమ ఉత్పాదితాల్ని తామే వాడుకోలేరు. పైగా వాళ్లకి ఇతరుల ఉత్పాదితాలు ఎన్నో అవసరమవుతాయి. వాళ్ళ ఉత్పాదితం వాళ్లకి కేవలం మారకంవిలువ మాత్రమే, అంటే రకరకాల ఇతరుల సరుకులకు మారకం వేసుకునేవే. సరుకుల ఉత్పత్తిదారులు వాటిని డబ్బులోకి మార్చుకొని తీరాలి.

ఆడబ్బు వేరేవారి జేబులో ఉంటుంది. ఆడబ్బుని బయటకు లాగాలంటే మనమిత్రుని సరుకు డబ్బు ఓనర్ కి ఉపయోగపు విలువ అయి ఉండడం ముఖ్యం. అందుకు దాని ఉత్పత్తికి వ్యయించిన శ్రమ సామాజికంగా ప్రయోజనకరమైన రకానికి చెందినదై, సామాజిక శ్రమ విభజనలో ఒక విభాగమై ఉండాలి.

అయితే శ్రమ విభజన ఉత్పత్తిదారుల ఎరుకలేకుండా ఎదిగిన ఉత్పత్తి వ్యవస్థ, ఎదుగుతున్న వ్యవస్థ. అయితే మార్కెట్ అనిశ్చితులు ఏర్పడడానికి కారణం పద్ధతీ, ప్రణాళికా, సమన్వయమూ లేకపోవడం.

సరుకు అమ్ముడుపోని అంటే కొనేవాడు దొరకని పరిస్థితులు:

- · మారకం కావాల్సిన సరుకు, కొత్తగా ఏర్పడ్డ అవసరాల్ని తీర్చేందుకంటూ వచ్చిన కొత్తరకం శ్రమ ఉత్పాదితం కావచ్చు. కొత్త అవసరాలను తానే కలిగించేదీ కావచ్చు. అయితే దాన్ని ప్రయోజనకర వస్తువుగా వినియోగదారులు గుర్తించకపోవచ్చు. కరెంట్ నిరంతరాయంగా ఉన్న చోట్ల ఇన్ వర్టర్లు అవసరం ఉండదు. ఆపరిస్తితుల్లో కొనే వారు దొరకరు.
- · నిన్నటిదాకా ఒక సరుకు ఉత్పత్తిలో ఉత్పత్తిదారుడు నిర్వహించిన అనేక క్రియల్లో ఒకటి ఇవ్వాళ వేరుపడవచ్చు. అంటే ఒక స్వతంత్ర శ్రమ విభాగంగా ఏర్పడవచ్చు. మొత్తంగా లేని ఉత్పాదితాన్ని స్వతంత్రమైన సరుకుగా మార్కెట్లో కి దించవచ్చు. అయితే అలా విడిపోవడానికి అప్పుడున్న పరిస్థితులు అనుకూలంగా ఉండవచ్చు. ఉండక పోనూవచ్చు. ఉండకపోతే, అది అమ్ముడవదు. టీ.వీ బోర్డ్ లో చాలా భాగాలుంటాయి. ఏది పనిచేయక పోతే దాన్ని మార్చాలి. అయితే మొత్తం బోర్డే మారుస్తున్న పరిస్తితులో, విడిభాగాలు అమ్ముడుపోవు.
- · ఇవ్వాళ ఒక సరుకు సామాజిక అవసరాన్ని తీర్చేదే కావచ్చు.రేపు అటువంటిదే మరొక సరుకు ప్రత్యామ్నాయంగా వచ్చి పాతదాన్ని పాక్షికంగానో, సంపూర్ణంగానో తొలగించవచ్చు. ఒకప్పుడు వీడియో కాసెట్స్ కి ఎంత గిరాకీ ఉండేదో! వాటికి ప్రత్యామ్నాయంగా సీ.డీ లొచ్చాయి. ఇప్పుడు హవా అంతా మెమరీ కార్డులడీ, పెన్ డ్రైవ్ లదీ. పాతకాలపు సరుకులు మార్కెట్లో కదలవు.
- · మన నేతగాని శ్రమ సామాజిక శ్రమ విభజనలో గుర్తింపు ఉన్నదే. ఆగుర్తింపు అతని 20గజాల బట్ట ప్రయోజనానికి హామీగా సరిపోదు. కారణం: ఆసమాజానికి కావలసిన బట్ట పరిమాణానికి ఒక పరిమితి ఉంటుంది – అన్ని ఇతర వస్తువులకూ ఉన్నట్లే. పోటీ నేతగాళ్ళు కొంతమంది ఉంటారు. వాళ్ళ బట్టతో నిండి మార్కెట్ అవసరం పూర్తిగా తీరిపోతే, మన మిత్రుని బట్టతో అవసరముండదు. ఫలితంగా అది నిరుపయోగమై పోతుంది.వృధా అవుతుంది. బహుమతిగా వచ్చిన గుర్రం వయసు తెలుసుకోవడానికి దాని నోరు తెరిచి చూడరు. కాని మన మిత్రుడు మార్కెట్ కి తరచుగా పోయేది బహుమతులివ్వడానికి కాదు గదా! అతని ఉత్పాదితం నిజమైన ఉపయోగపు విలువ అయిందనీ, డబ్బుని ఆకర్షించిందదనీ అనుకుందాం. ఇప్పుడు ఒక ప్రశ్నపడుతుంది-ఎంత డబ్బుని ఆకర్షిస్తుంది?అనేదే ఆ ప్రశ్న. ఇది పరిమాణానికి సంబంధించిన ప్రశ్న.(అది ఉపయోగపు విలువా కాదా అనేది గుణానికి సంబంధించిన ప్రశ్న). ఆసరుకు విలువ పరిమాణం ముందుగానే ధరగా ఉహించ బడింది. ప్రతి సరుకుకీ ధర చీటీ ఉంటుంది. అయితే, ఉత్పత్తిదారుడు ఆశించిన ధరకీ మార్కెట్లో వచ్చేదానికీ తేడా ఉండవచ్చు. అందుకు తగిన కారణాలు ఎన్నో ఉంటాయి.
- · సరుకు ఉత్పత్తి దారుడు ధరని నిర్ణయించడంలో పొరపాటు పడితే, దాన్ని మార్కెట్ సవరిస్తుంది. అందుకని మార్క్స్ ఆవిషయాన్నివదిలేస్తాడు.
- · సరుకు సగటు పరిస్తితుల్లో ఉత్పత్తి కాకపోతే, ఆ సరుకులో చేరిన శ్రమ మొత్తానికీ మార్కెట్ ప్రతిఫలం ఇవ్వకపోవచ్చు. మార్క్స్ దీన్ని కూడా వదిలేస్తాడు- అతను సామాజికంగా అవసరమైన శ్రమనే తనసరుకు ఉత్పత్తిలో వినియోగించాడని అనుకుందాం అంటాడు. అప్పుడు ధర అనేది

ఆసరుకులో వస్తుత్వం చెందిన సామాజికంగా అవసరమైన శ్రమ పరిమాణానికి డబ్బు పేరు,అంతే. అంటే, ఆధరని ఒప్పుకుంటుందనా? ఆమోదించని పరిస్థితులు రెండు చూపిస్తాడు:

- · ఒక సరుకు సగటు పరిస్థితుల్లో తయారయినప్పటికీ, ఇతర ప్రాంతాల్లో ఉత్పత్తి పరిస్థితుల్లో మార్పులు రావచ్చు. అంటే అతను వ్యక్తిగతంగా అంతా సవ్యంగానే చేసినా, అనిర్దిష్ట శ్రమ అనేది సామాజిక భావన అని ఉత్పత్తిదారునికి గుర్తు చేస్తుంది. నేత పనిలో నేతగానికి తెలియకుండా, అతని అనుమతి లేకుండా పాత నేత విధానం మారవచ్చు. నిన్నఒక గజం బట్ట నేయ్యడానికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలం పరిమాణం ఇవ్వాళ అంతే కాకపోవచ్చు. మారవచ్చు. ఈ వాస్తవాన్ని డబ్బున్నవాడు మన మిత్రుని పోటీ నేతగాళ్ళు చెప్పే ధరలనుండి రుజువు చెయ్యడానికి తొందరపడతాడు. మన నేతగాని దురదృష్టం కొద్దీ, నేతగాళ్ళు తక్కువమంది కారు, చాలామంది ఉన్నారు.
- · ఇకపోతే,ఎక్కువగా ఉత్పత్తయినప్పుడు అందరు ఉత్పత్తిదారులూ ధరలు తగ్గించుకోవాల్సిన పరిస్తితి తలెత్తుతుంది. మార్కెట్ లో ప్రతి బట్ట ముక్కలోనూ సామాజికంగా అవసరమైన శ్రమ కాలానికి మించి లేదనే అనుకుందాం. అలా అయినాగాని, అన్ని బట్టముక్కల్నీ కలిపి మొత్తంగా చూస్తే వాటికి వ్యయించిన ప్రమకాలం అధికంగా ఉండవచ్చు. గజం 2షిల్లింగుల లెక్కన మొత్తం బట్టని మార్కెట్ ఇముడ్చుకోలేక పోవచ్చు. అప్పుడు సామాజిక శ్రమలో మితిమీరిన భాగం నేతరూపంలో వ్యయమయినట్లు రుజువవుతుంది. దీని ప్రభావం ప్రతి నేతగాడూ సామాజికంగా అవసరమైన శ్రమని మించి వ్యయించి నప్పుడు కలిగే ప్రభావం వంటిదే. మనం ఇక్కడ జర్మన్ సామెతతో గొంతు కలపవచ్చు: 'కలిసికట్టుగా పట్టుకోబడ్డారు, కలిసికట్టుగా ఉరితీయబడ్డారు'. మార్కెట్లో ఉన్న మొత్తం బట్ట ఒకే వర్తక వస్తువుగా లెక్కకొస్తుంది. అందులో ప్రతి ముక్కా తగిన భాగం అంతే. వాస్తవానికి ప్రతి గజం విలువా సామాజికంగా నిర్ణయమైన ఒకేరకమైన మానవశ్రమ పరిమాణం యొక్క వస్తు రూపం తప్ప వేరేమీ కాదు.

ఆవిధంగా సరుకుని అమ్ముకోవడంలో ఉన్న ఇబ్బందుల్ని చెప్పాక, వాటినించి ఈక్రింది నిర్ధారణకి వస్తాడు: సరుకులు డబ్బుపట్ల ప్రేమలో ఉంటాయి. కాని నిజమైన వలపు తిన్నగా సాగదు. శ్రమ యొక్క గుణాత్మక విభజన లాగానే, పరిమాణాత్మక విభజన కూడా స్వయంజనిత, యాదృచ్ఛిక సరళిలో సంభవిస్తుంది.
అందువల్ల, తమను స్వతంత్ర వ్యష్టి ఉత్పత్తిదారులుగా చేసిన శ్రమ విభజనే, సామాజిక ఉత్పత్తి ప్రక్రియనీ, ఆప్రక్రియ లోపల విడివిడి ఉత్పత్తిదారుల పరస్పర సంబంధాల్నీ, ఆ యా ఉత్పత్తిదారుల ఇష్టం మీద ఆధారపడి ఉండడం నుండి విముక్తి చేస్తుంది అనే విషయాన్ని ఉత్పత్తిదారులు తెలుసుకుంటారు. పైకి కనబడే వ్యక్తుల పరస్పర స్వేచ్ఛ తోపాటుగా ఉత్పాదితాల ద్వారా సాధారణ పరస్పరం ఆధారపడడం అనే వ్యవస్థ అంటిపెట్టుకొని ఉంటుంది అనికూడా తెలుసుకుంటారు.

## సరుకు డబ్బులోకి మారడం యాదృచ్చికం

శ్రమ విభజన శ్రమ ఉత్పాదితాన్ని సరుకులోకి మారుస్తుంది. తద్వారా ఆసరుకు ఆతర్వాత డబ్బులోకి మారడాన్ని అవసరపరుస్తుంది. అదేసమయంలో మారుతుందా లేదా అనేది యాదృచ్చికం. ఈవిషయాన్ని స్వచ్ఛమైన రూపంలో పరిశీలిస్తున్నాం. కనుక మనం అంతా మామూలుగానే జరుగుతున్నట్లు భావిస్తాం.అంతేకాక, రూపంతరీకరణ జరిగితే, అంటే సరుకు అమ్మకానికి పూర్తిగా అనర్హం కాకపోతే, ఈరూపాంతరీకరణ జరుగుతుంది – సిద్ధించిన ధర సరుకు విలువకంటే అసాధారణంగా ఎక్కువో, తక్కువో అయినప్పటికీ.

## 'సరుకు-డబ్బు' అనేది 'డబ్బు-సరుకు' కూడా

అమ్మినవానికి సరుకు బదులు డబ్బొస్తుంది. కొన్నవానికి డబ్బు పోయి సరుకొస్తుంది. ఇక్కడ ఒక విషయం కొట్టొచ్చినట్లు కానొస్తుంది. ఏమంటే, ఒక సరుకూ, డబ్బూ 20 గజాల బట్టా 2 పౌన్లూ చేతులు మారాయి. చోట్లు మారాయి. అంటే అవి మారకం అయ్యాయి. అయితే, సరుకు దేనితో మారింది? తనసొంతవిలువ ఏ రూపాన్ని తీసుకున్నదో దానితో, ఆ సార్వత్రిక సమానకంతో. మరి డబ్బు మారింది దేనితో? దాని సొంత ఉపయోగపు విలువయొక్క ఒకానొక ప్రత్యేక రూపంతో.(బంగారం ఉపయోగపువిలువకి ప్రతిసరుకూ ప్రత్యేకరూపమే)

బట్టకు ఎదురుగా ఉన్నప్పుడు, బంగారం డబ్బు రూపాన్ని ఎందుకు తీసుకుంటుంది? ఎందుకంటే, బట్ట ధర 2 పౌన్లు. బట్ట ఇప్పటికే డబ్బుస్వభావంతో ఉన్న బంగారంతో సమానమైనదిగా పరిగణించబడింది.

ఒకసరుకు డబ్బులోకి మారడం అనేది అదే సమయంలో డబ్బు సరుకులోకి మారడం కూడా. పైకి ఒకేప్రక్రియగా ఉండేది, వాస్తవానికి ద్వంద్వ ప్రక్రియ. సరుకు సొంతదారుని వైపునించి చూస్తే అది అమ్మకం.అవతలవైపు నించి అంటే డబ్బువాని వైపునించి చూస్తే అది కొనుగోలు. అంటే అమ్మకం ఒక కొనుగోలు కూడా. సరుకు-డబ్బు అనేది డబ్బు-సరుకు కూడా.*

## కొనేవాడికి డబ్బు ఎక్కడ నుండి వచ్చింది?

'సరుకు-డబ్బు' నించి 'డబ్బు-సరుకు' పరివర్తనని డబ్బు-సరుకు దృష్ట్యా కాకుండా 'సరుకు ఓనర్' 'డబ్బు ఓనర్' దృష్ట్యా చూస్తే, ఒక ప్రశ్నతలెత్తుతుంది: కొనేవాడికి డబ్బు ఎక్కడ నుండి వచ్చింది?

ఇంతదాకా మనుషుల్ని సరుకుల ఓనర్లుగా మాత్రమే పరిగణించాం. వాళ్ళుతమతమ శ్రమ ఉత్పాదితాల్ని పరాధీనం చేసి, ఇతరుల శ్రమ ఉత్పాదితాల్నిస్వాయత్టం చేసుకోగలరు. అందువల్ల, ఒక సరుకు ఓనర్ మరొకసరుకు, డబ్బు ఓనర్ ని కలుసుకోవడానికి, ఆరెండో(కొనే) వాని శ్రమ ఉత్పాదితం డబ్బు( అంటే బంగారం) అయి ఉండాలి. లేదా అతని ఉత్పాదితం అప్పటికే అసలు రూపం అయిన ప్రయోజనకర వస్తువు నుండి తొలగించబడి అన్నా ఉండాలి. డబ్బుపాత్ర పోషించడానికి బంగారం ఏదో ఒక సమయంలో మార్కెట్లోకి ప్రవేశించి ఉండాలి.

ఆసమయం ఏది? బంగారం ఉత్పత్తయిన చోట, అది శ్రమ ఉత్పాదితంగా అంటే విలువ ఉన్న మరొక ఉత్పాదితంతో వస్తుమార్పిడి అయిన చోట. ఆక్షణం నుండీ ఒక సరుకు యొక్క సిద్ధించిన ధరకి ప్రతినిధిగా ఉంటుంది. ఉత్పత్తయిన చోట ఇతర సరుకులతో మారకం కావడానికి తోడు, బంగారం ఎవరి చేతుల్లో ఉన్నా, అది ఏదో సరుకు ఓనర్ పరాధీనం చేసిన సరుకు యొక్క మారిన రూపం. అది అమ్మకం మొదటి పరివర్తన అయిన 'సరుకు- డబ్బు' వచ్చింది. ఇంతకూ ముందే చూసినట్లు బంగారం ఊహాత్మక డబ్బులేక విలువల కొలమానం అయింది- అన్ని సరుకులూ తమ విలువల్ని బంగారం ద్వారా కొలవడం వల్ల, ఆవిధంగా ప్రయోజనకర వస్తువులుగా వాటి ఆకారం నుండి ఊహాత్మకంగా వేరుచేసుకోవడం వల్ల, వాటి విలువ రూపంగా చేసుకోడం వల్ల, అది ఊహాత్మక డబ్బు అయింది.

## ఊహాత్మక డబ్బు నిజమైన డబ్బు ఎలా అయింది?

డబ్బు కాక మిగిలిన సరుకు ఏదయినా అమ్మేవానికి ఎలా వస్తుంది? ఆటను ఆసరుకుని ఉత్పత్తిచేసాడు కనుక. బంగారం విషయం వేరు.బంగారం ఉత్పత్తిదారుల మొదటి అమ్మకం మార్కెట్లో ఉండే బంగారంలో కొద్ది భాగమే. మార్కెట్లో పాల్గొనే ఎక్కువ మంది జేబుల్లో ఉండే డబ్బు వారివారి సొంత ఉత్పాదితాలను అమ్మి పొందినదే.

సరుకుల పరాదీనం ద్వారా, ప్రయోజనకర వస్తువులుగా వాటి సొంత రూపాలతో వాస్తవంగా చోట్లు మారడం ద్వారా. ఆవిధంగా నిజంగా వాటి విలువల ఆకారం అయింది. అలా బంగారం నిజమైన డబ్బు అయింది. ఎప్పుడయితే సరుకులు డబ్బు రూపం పొందుతాయో, అప్పుడు అవి వాటి ప్రాకృతిక ఉపయోగపు విలువ యొక్క ప్రతి జాడనూ, వాటిని ఉత్పత్తిచేసిన ప్రయోజనకర శ్రమ జాడనూ వదిలించుకుంటాయి- ఒకేరకమైన,సామాజికంగా గుర్తింపు పొందిన శ్రమగా అవడానికి.

కొంత డబ్బుని చూసినంత మాత్రాన అది ఏసరుకుకు బదులుగా వచ్చిందో చెప్పలేం. అన్ని సరుకులూ వాటి డబ్బు రూపంలో ఒకేరూపంలో (alike)కనబడతాయి.

అంతకుముందే తన సరుకు అమ్మినందువల్లనే, సాధారణంగా కొనేవానిచేతికి డబ్బొచ్చింది.

మన నేతగాడు బట్టని అమ్మగా రెండు బంగారం ముక్కలు వచ్చాయి. బట్టకోన్నవానికి ఎక్కడనుమ్డి వచ్చాయి? అవి బహుశా అతను ఒక పావు గోధుమలు అమ్మగా వచ్చి ఉండవచ్చు.

బట్ట అమ్మకం,(సరుకు- డబ్బు), అదే సమయంలో దాని కొనుగోలు (డబ్బు-సరుకు) కూడా. బట్ట అమ్మకంగా చూస్తే, ఈ ప్రక్రియ మొదలు పెట్టిన కదలిక దాని వ్యతిరేక లావాదేవీతో ముగుస్తుంది. అంటే బైబిల్ కొనుగోలుతో ముగుస్తుంది. మరొకపక్క బట్ట కొనుగోలు, దానికి వ్యతిరేకమైన గోధుమల అమ్మకంతో మొదలైన కదలికని ముగిస్తుంది. స-డ-స (బట్ట-డబ్బు-బైబిల్) కదలికలో మొదటి దశ అయిన సరుకు- డబ్బు(బట్ట-డబ్బు) అనేది, మరొక కదలిక స-డ-స (బట్ట-డబ్బు-బైబిల్) లో డ-స (డబ్బు-బట్ట)అనేది వేరొక కదలిక (గోధుమలు-డబ్బు- బట్ట) యొక్క చివరి దశ. అందువల్ల, ఒక సరుకుయొక్క మొదటి రూపాంతరం/రూప

పరివర్తన అంటే సరుకు డబ్బుగా మారడం అనేది తప్పకుండా మరొక సరుకు యొక్క రెండో రూపపరివర్తన కూడా. మరొక సరుకు పునః పరివర్తన అంటే డబ్బునుండి సరుకులోకి మారడం.

ఇంతకూ ముందే చెప్పినట్లు, బంగారం వెండి వాస్తవ ఉత్పత్తిదారుడు ఇందుకు మినహాయింపు. అతని ఉత్పాదితాన్ని మరొక సరుకుతో మారకం చేసుకుంటాడు –ముందుగా దాన్ని అమ్మకుండానే.

'డబ్బు-సరుకు' రూపాంతరం గురించి వచ్చేపోస్ట్

## డబ్బు- సరుకు, రెండో రూపపరివర్తన లేదా కొనుగోలు

**Second metamorphosis, or purchase**

### డబ్బు ఏ సరుకుతో నైనా మారకం అవుతుంది

డబ్బుకి మార్కెట్ ఎప్పుడయినా స్వాగతం పలుకుతుంది. ఎర్రతివాసీ పరిచి వుంచుతుంది.ఎందుకంటే డబ్బు ఎలాటి పరిమితులూ, షరతులూ లేకుండా, ఏసరుకుతోనైనా అప్పటికప్పుడే మారుతుంది. అన్ని ఇతరసరుకులు రూపాంతరం చెందిన ఆకృతే డబ్బు. అది అన్ని ధరలని తిరగదిప్పి చదువుతుంది. ధరలు ఇలా ఉంటాయి:

20 గజాల బట్ట=2 ఔన్సుల బంగారం


1 కోటు =2 ఔన్సుల బంగారం

10 పౌన్ల టీ =2 ఔన్సుల బంగారం


40 పౌన్ల కాఫీ =2 ఔన్సుల బంగారం

పావు ధాన్యం =2 ఔన్సుల బంగారం

అర టన్ను ఇనుం పావు ధాన్యం =2 ఔన్సుల బంగారం వగయిరా.



ధరలని తిరగదిప్పితే:




2 ఔన్సుల బంగారం /2పౌన్లు =20 గజాల బట్ట =1 కోటు
=10 పౌన్ల టీ =40 పౌన్ల కాఫీ = పావు ధాన్యం =1/2 టన్ను ఇనుం వగయిరా
ఆవిధంగా డబ్బుఇతర సరుకుల శరీరాల్లో తననుతాను చిత్రించుకుంటుంది.కాబట్టి డబ్బు దేనితోనైన ఏ షరతులూ లేకుండా మారకం కాగలదు.

## డబ్బుకి ఏ వాసనా అంటదు

డబ్బుని చూసి అది ఎలా ఒకని చేతిలోకి వచ్చిందో, ఏ సరుకు మారకంఅయినందువల్ల వచ్చిందో, చెప్పడం సాధ్యంకాదు. అది ఎక్కడ నుండి వచ్చినా, దానికి ఏ వాసనా ఉండదు. Pecunia non olet అనేది ఒక రోమన్ సామెత. దానర్థం ' డబ్బుకంపు కొట్టదు' అని. నీరో చక్రవర్తి చనిపోయాక, క్రీ.శ 69-79 కాలంలో వెస్పాసియన్ రోమన్ చక్రవర్తిగా ఉన్నాడు. ఆదాయం పెంచడం కోసం పబ్లిక్ పాయఖానాల మీద పన్ను విధించాడు. ఆయన కొడుకు టైటస్ పాయఖానాలమీద పన్ను వెయ్యడమేమిటని తప్పుబట్టాడు. దానికి వెస్పాసియన్ ' డబ్బుకంపు కొట్టదు ' అన్నాడని ప్రతీతి. "Money does not stink". ఎక్కడ నుండి వచ్చినా డబ్బుకి ఏ వాసనా అంటదు.

## డబ్బు అమ్మిన సరుక్కీ, కొనబోయే సరుక్కీ రెంటికీ ప్రతినిధే

మన చేతిలో ఉన్న డబ్బు ఎలా వచ్చింది? మన సరుకుని అమ్మితే దాని బదులు వచ్చింది. అంటే మన డబ్బు మనం అమ్మిన సరుక్కి ప్రతినిధి. అలాగే మనం ఆడబ్బుతో మరోకసరుకు కొనబోతాం. డబ్బు పోయి సరుకొస్తుంది. కొనబోయే సరుకుకి మన డబ్బు ప్రతినిధి.

ఒకవైపున అమ్మిన సరుకుకి ప్రతినిధిగా ఉంటూనే, మరొకవైపు కొనబోయే సరుకుకి కూడా ప్రతినిధిగా ఉంటుంది. అంటే,డబ్బు అమ్మిన సరుక్కీ, కొనబోయే సరుక్కీ కూడా ప్రతినిధిగా ఉంటుంది.

"మన చేతుల్లో ఉన్న డబ్బు మనం కొనబోయే వస్తువులకు ప్రతినిధి అయినట్లయితే, ఆడబ్బు పొందడానికి మనం అమ్మిన వస్తువులకు కూడా ప్రతినిధి అవుతుంది" - Mercier de la Rivière చెప్పాడని ఫుట్ నోట్ ఇచ్చాడు.

## ఒక సరుకు అమ్మకంతో, కొన్ని కొనుగోళ్ళు

ఒక సరుకు ఉత్పత్తిదారుడు ఆఒక్క దాన్నే మారకంలో ఇవ్వగలడు. దాన్ని తరచుగా పెద్ద మొత్తాల్లో అమ్ముతాడు. వచ్చిన డబ్బుతో అవసరమైన సరుకులు కొంటాడు. ఉదాహరణకి, ఒకడు బట్టీ పెట్టి ఇటుకలు కాలుస్తాడు. వాటిని ట్రాక్టర్ ఇంతనో, లారీ ఇంతనో అమ్ముతాడు. అతని సరుకు డబ్బులోకి పరివర్తన చెందుతుంది. దాన్ని పెట్టి కావలసిన కొన్ని సరుకులు తెస్తాడు. అంటే, ఆడబ్బుని భాగాలు చేసి అనేక కొనుగోళ్ళు చేస్తాడు. అమ్మకం ఒకటే అయినా అది అనేక కొనుగోళ్లకు దారితీస్తుంది.

## డబ్బు- సరుకు అనేది  సరుకు- డబ్బు కూడా

డ-స అంటే డబ్బుని సరుకులోకి మార్చడం- కొనడం. అదే సమయంలో అది స-డ కూడా. అంటే సరుకుని డబ్బులోకి మార్చడం- అమ్మడం. ఒక సరుకు చివరి పరివర్తన మరొక సరుకు మొదటి పరివర్తన. మన నేతగానికి సంబంధించి, బట్ట జీవితం తాను 2పౌన్లను తిరిగి మార్చిన బైబిల్ తో ముగిస్తుంది. ఒకవేళ బైబిల్ అమ్మినవాడు నేతగాడిచ్చిన 2 పౌన్లను బ్రాందీ లోకి మార్చాడు అనుకుందాం.అది డబ్బు- సరుకు, బైబిల్-డబ్బు-బ్రాందీ వలయంలో ముగింపు దశ. ఇదే బైబిల్-డబ్బు-బ్రాందీ వలయంలో తొలిదశ.సరుకూ-డబ్బూ కూడా. ఒక సరుకు తుది రూప పరివర్తన భిన్నమైన ఇతర సరుకుల తొలి రూపపరివర్తనల సమూహం అవుతుంది.

## అమ్మేవాడూ—కోనేవాడూ

సరుకు పూర్తి రూపపరివర్తనని మొత్తంగా చూస్తే, మొదట అది ఒకదాన్నొకటి పూరించుకునే రెండువ్యతిరేక చలనాలతో(స-డ, డ-స ) ఏర్పడినట్లు అగపడుతుంది. సరుకుయొక్క ఈ రెండు విరుద్ధ రూప పరివర్తనలు ఆసరుకు ఓనర్ చేసే రెండు పరస్పర విరుద్ధ సామాజిక చర్యలవల్ల ఏర్పడతాయి. అతను చేసే ఈచర్యలు తిరిగి అతను పోషించే ఆర్థిక పాత్రల స్వభావాన్ని ముద్రిస్తాయి.అమ్మకం జరిపేవాడుగా, అతను అమ్మకందారుడు; కోనేవాడుగా, అతను కొనుగోలుదారుడు.

సరుకు రూపమూ, డబ్బురూపమూ ఏక కాలంలో ఉంటాయి. అయితే వ్యతిరేక ధ్రువాలవద్ద. అందువల్ల కొనుగోలుదారుడికి ఎదురుగా అమ్మకందారుడుంటాడు. అమ్మకందారుడికి అవతలవైపు కొనుగోలు దారుడుంటాడు.

## చలామణీలో పాల్గొనే వాని పాత్ర కూడా మారుతూ వుంటుంది

ఒకసరుకు - అంటే సరుకు నుండి డబ్బులోకి, డబ్బు నుండి వేరొక సరుకులోకి - వరసగా రెండు రూపపరివర్తనలు చెందుతున్నప్పుడు, సరుకు ఓనర్ ముందు అమ్మేవాడుగా, ఆ తర్వాత కోనేవాడుగా మారుతుంటాడు. అందువల్ల అమ్మేవాడుగానో, కోనేవాడుగానో అతని పాత్ర శాశ్వతం కాదు. స్థిరమైనది కాదు. ఒకసారి అమ్మేవాడుగా ఉంటాడు, మరోకసారి కోనేవాడవుతాడు. మొదటి దశలో అమ్మేవాడయితే, రెండో దశలో కొనేవాడవుతాడు.

మొదటి రూప పరివర్తనలో చివరి అంశం అయిన డబ్బు,అదేసమయంలో రెండో లావాదేవీకి మొదటి అంశం. తొలి లావాదేవీలో అమ్మేవాడు ఆవిధంగా రెండో దాంట్లో కోనేవాడవుతాడు; ఈరెండో దాంట్లో మూడోవాడు రంగంలోకోస్తాడు.

## ముగ్గురు పాత్రధారులూ నాలుగు అంచులూ

ఒక సరుకు పూర్తి రూపపరివర్తన(సరుకు-డబ్బు-సరుకు) లోరెండు కదలికలుంటాయి: ఒకటి, సరుకు-డబ్బు; రెండు, డబ్బు-సరుకు.

ఒక సరుకు పూర్తి రూపపరివర్తనని చూస్తే, నాలుగు అంచులు కనబడతాయి, (extremes) ముగ్గురు పాత్రధారులు కనబడతారు.మొదట ఒక సరుకు డబ్బుకి ఎదురుగా వుంటుంది. ఆడబ్బు సరుకువిలువ తీసుకునే రూపం. అది నగదుగా కోనేవాని జేబులో ఉంటుంది. మొదటి రూప పరివర్తనలో చివరి అంశం అయిన డబ్బు,అదేసమయంలో రెండో లావాదేవీకి డబ్బు ఆరంభ అంశం. తొలి లావాదేవీలో అమ్మేవాడు ఆవిధంగా రెండో దాంట్లో కోనేవాడవుతాడు; ఈరెండో దాంట్లో మూడోవాడు రంగంలోకోస్తాడు. అతనే మరొక సరుకు అమ్మేవాడు.

ఇక్కడ ఒక ఫుట్ నోట్ ఉంది: ఒప్పందం చేసుకునే వ్యక్తులు ముగ్గురూ వుంటారు. వీళ్ళలో ఒకరు రెండు సార్లు జోక్యం చేసుకుంటారు.-లేట్రాస్నె

ఒకడు పార మరొకరికి (రెండోవానికి) అమ్మాడు. మూడో వాని దగ్గర రోట్టె కొన్నాడు.

నాలుగు అంచుల గురించి: తొలిదశ స-డ( పార-డబ్బు) ఒక అంచున పార, రెండో అంచున డబ్బు.

రెండో దశ డ-స (డబ్బు-రొట్టె). ఒక అంచున డబ్బు,మరో అంచున రొట్టె. వెరసి నాలుగు అంచులు.

ముగ్గురు వ్యక్తులు: పార అమ్మినవాడు, పార కొన్నవాడు, రొట్టె అమ్మిన వాడు. పార అమ్మినవాడే రొట్టెకొన్నవాడు. అతను రెండు సార్లు జోక్యం చేసుకుంటాడు.

## స - డ - స వలయం (circuit)

ఒక సరుకు పూర్తి రూపపరివర్తనలో రెండు వ్యతిరేక దశలుంటాయి, ఒకటి స-డ అయితే రెండోది డ-స.ఇవి రెండూ కలిసి చక్రీయ చలనాన్ని, ఒక వలయాన్ని ఏర్పరుస్తాయి.

<u>వలయం ఏమంటే: సరుకు రూపం-ఆరూపాన్ని వదలడం-తిరిగి సరుకు రూపానికి రావడం.</u>

ఇక్కడ సరుకు రెండు భిన్న అంశాల కింద కనబడుతుంది. ఆరంభంలో సరుకు దాని ఓనర్ కి ఉపయోగపు విలువ కాదు, ముగింపులో అది ఉపయోగపు విలువే. మొదట్లో అతను అమ్మిన పార అతనికి ఉపయోగపు విలువ కాదు. కాని చివరలో అతను కొన్న రొట్టె అతనికి ఉపయోగపువిలువే. అలాగే తొలిదశలో డబ్బు సరుకు తహతహలాడుతూ ఘనీభవించిన విలువ స్ఫటికం(crystal) గా కన్పిస్తుంది. రెండో దాంట్లో డబ్బు, ఒక ఉపయోగపు విలువ చేత తొలగించ బడాల్సిన తాత్కాలిక సమానక రూపంలోకి ద్రవీభవిస్తుంది.

వలయాన్ని ఏర్పరచే రెండు రూప పరివర్తనలూ అదే సమయంలో రెండు ఇతర సరుకుల యొక్క రెండు తలక్రిందయిన (inverse), పాక్షిక రూపపరివర్తనాలు కూడా. ఒకే సరుకు 'బట్ట' తన పరివర్తనల వరసని మొదలెడుతుంది, మరోకసరుకు 'గోధుమ' రూపపరివర్తనతో ముగిస్తుంది. మొదటి దశ 'అమ్మకం'లో బట్ట ఈరెండు పాత్రల్నీ తనరూపంలోనే పోషిస్తుంది.అయితే, అప్పుడు బంగారంలోకి మారి తన రెండో,అంతిమ పరివర్తనని పూర్తిచేస్తుంది; అదేసమయంలో మూడో సరుకు తొలి పరివర్తనకి సహకరిస్తుంది. అందుకే ఒకసరుకు ఏర్పరచిన వలయం (సర్క్యూట్) తన పరివర్తనల క్రమంలో ఇతర సరుకుల వలయాలతో విడదీసే వీలులేనివిదంగా కలగలిసి పోతుంది. ఈ భిన్న వలయాలన్నిటి మొత్తమే సరుకుల చలామణీ. "ఈమొత్తం ప్రక్రియే సరుకుల చలామణీ"

## వస్తుమార్పిడీ- చలామణీ

అలా సరుకుల చలామణీ ని చేరుకున్నాక, మార్క్స్ తిరిగి వస్తుమార్పిడి వైపు చూస్తాడు. చలామణీ వస్తుమార్పిడి నుండి రూపంలోనే కాకుండా, సారంలోకూడా విభేదిస్తుందని నిర్ధారిస్తాడు.ఇందుకు సంఘటనల క్రమాన్ని చూస్తే సరిపోతుంది. నేతగాడు తన సరుకు బట్టని వేరొకరి సరుకు బైబిల్ తో మార్చాడు. ఈవిషయం అతనికి సంబంధించినంత వరకే వాస్తవం. బైబిల్ అమ్మినవాడు గనక మరేదైనా డ్రింక్ ని మరింత ఇష్టపడే వాడయితే, బట్టకి బైబిల్ ని మార్చడు. అలాగే తనబట్ట గోధుమలతో మారినట్లు నేతగానికి తెలియదు. ఎందుకంటే అతని బట్ట మారింది డబ్బుతో. ఆడబ్బు ఏ సరుకు అమ్మితే తన బట్ట కొన్నవానిచేతిలో పడ్డదో నేతవానికి తెలియదు.

బైబిల్ వాడు బట్ట కావాలనుకున్నాడు.కనకనే నేతగాడు బట్టని బైబిల్ కి మార్చగలిగాడు. బైబిల్ వాడు బ్రాందీ కావాలనుకొని ఉంటే, బట్టతో బైబిల్ మార్చాలనుకోడు.మన నేతగానికి తన 'బట్ట'కి మారింది 'గోధుమ' అని ఎలా తెలియదో అలాగే.

B సరుకు A సరుకు చోట్లో చేరుతుంది. అయితే A, B లు ఒకరి సరుకుని ఒకరు మారకం చేసుకోరు. అరుదుగా అలా జరగవచ్చు. అటువంటి అసాధారణమైన లావాదేవీలు సరుకుల చలామణీ యొక్క సాధారణ పరిస్థితుల తప్పనిసరి ఫలితం కాదు.ఇక్కడ మనం, ప్రత్యక్ష వస్తుమార్పిడి నుండి విడదీయరాని స్థానిక,వ్యక్తిగత పరిధులన్నిటినీ అధిగమించి సరుకుల మారకం సామాజిక శ్రమ ఉత్పత్తుల చలామణీని అభివృద్ధి చేస్తుందో చూస్తాం.రైతు గోధుమలు అమ్మాడు, కనకనే నేతగాడు బట్టని అమ్మగలిగాడు. నేతగాడు

బట్టని అమ్మాడు కనకనే మరొక వ్యక్తి బైబిల్ అమ్మగలిగాడు. అతను బైబిల్ అమ్మాడు కనకనే బ్రాందీ కొనగలిగాడు. అలా ...అలా...అలా.

సరుకుల చలామణీ ప్రత్యక్ష వస్తుమార్పిడికి భిన్నమైన బదలీ నమూనా ఏర్పరుస్తుంది. వస్తుమార్పిడి లో B అనేవాడు గనక Aఅనేవాడి సరుకుల్నిపొందినట్లయితే, అప్పుడు A, B సరుకుల్ని పొందుతాడు. ఒకరి సరుకులు మరొకరికి మారతాయి. చలామణీలో అలాకాదు. B అనేవాడు A అనేవాడి సరుకుల్నిపొందుతాడు, A అనేవాడు B అనేవాడి సరుకుల్నిపొందడు. డబ్బు పొందుతాడు. దాంతో A అనేవాడు C అనేవాడి సరుకుల్ని పొందుతాడు....చలామణీలో తను ఇచ్చినవానిదగ్గరే తీసుకోవాలని లేదు.అప్పటికప్పుడే మారకం చేసుకోవాలనే లేదు. అక్కడికక్కడే జరగాలని లేదు.. ఆవిధంగా ప్రత్యక్ష వస్తుమార్పిడికి ఉన్న వ్యక్తిగత, స్థానిక అవరోధాల్ని చలామణీ అధిగమిస్తుంది. మరొకవైపు, ఆర్థిక ఏ జంట్ల సామాజిక సంబంధం అదుపు లేని దవుతుంది.

## ఎప్పుడూ ఎవరో ఒకరిదగ్గర డబ్బు ఉంటుంది

వస్తుమార్పిడికి లేనిదీ, చలామణీ కి ఉన్నదీ ఏమంటే చలామణీ డబ్బుని ప్రతి రంధ్రం నుంచీ చమటలాగా కారుస్తుంది. ఇది దాని రెండో లక్షణం. A, B లు ఇద్దరూ తమతమ సరుకుల్ని మారకం చేసుకుంటే, ఈ లావాదేవీలో పాల్గొన్న అన్ని సరుకులూ చలామణీ నుంచి తప్పుకున్నట్లే. చలామణీలో బైబిల్ బట్ట చోటులో చేరిన అనంతరం నేతగానికి కూడా ఈ లావాదేవీ పూర్తయింది, ఈ ఉత్పాదితాల్ని తొలిగించినట్లే కచ్చితంగా ఉంటుంది. మరొకచోట ఒక మార్పు కూడా జరిగింది: బైబిల్ అమ్మినవాని దగ్గర అంతకు ముందు లేని డబ్బు ఇప్పుడు ఉంది; బట్ట కొన్న వాని వద్ద ఇప్పుడులేని డబ్బు ఇంతకు ముందు ఉంది. ఎప్పుడూ ఎవరో ఒకరిదగ్గర డబ్బు ఉంటుంది. ఈ వాస్తవం ఎప్పటికీ అసంపూర్ణ చలామణీ ప్రక్రియలు ఉంటాయి అనే విషయాన్ని సూచిస్తుంది.

అందువల్ల వస్తుమార్పిడి లాగా ఉపయోగపు విలువలు చేతులూ, చోట్లూ మారగానే చలామణీ ప్రక్రియ ఆగిపోదు. ఒకసరుకు రూపపరివర్తన వలయం బయటకు రాగానే డబ్బు మాయం అవదు. చలామణీలో ఇతరసరుకులు కాళీచేసిన చోట్లకి డబ్బుఎడతెగకుండా/నిరంతరం చేరుతూనే ఉంటుంది. ఉదాహరణకి, బట్ట పూర్తి పరివర్తన బట్ట-డబ్బు-బైబిల్. ఇందులో మొదట బట్ట చలామణీ నుండి బయటపడుతుంది, దాని చోటులో డబ్బు అడుగు పెడుతుంది. తర్వాత బైబిల్ చలామణీ నించి తప్పుకుంటుంది.ఆచోటులోకి డబ్బొస్తుంది. ఒక సరుకుని తొలగించి దాని స్థానంలోకి మరొక సరుకు వచ్చినప్పుడల్లా, డబ్బుసరుకు మరొక మూడో మనిషి చేతుల్లోకి చేరుతుంది. ఫుట్ నోట్ లో: ఇది స్వయం స్పష్టమే అయినాగాని ఆర్థిక వేత్తలు అనేక సందర్భాలలో ఈవిషయాన్ని గమనించలేదు అంటాడు.

## సరుకుల చలామణీ లో సంక్షోభం వచ్చే అవకాశం

అమ్మకం కొనుగోలు మధ్యన ఉన్న ఏకత్వం, ధ్రువత్వం, ఐక్యతా వైరుధ్యం గురించి చర్చ నడుస్తుంది. ఈమొత్తం చర్చ ఫలితం ఏమంటే: సరుకుల చలామణీ లో సంక్షోభం వచ్చే అవకాశం ఉంటుంది."ప్రతి

కొనుగోలూ ఒక అమ్మకం, ప్రతి అమ్మకమూ ఒక కొనుగోలు కాబట్టి, సరుకుల చలామణీలో అమ్మకానికీ కొనుగోలుకీ సమతుల్యత ఉంటుంది –అనే దాన్ని మించిన పిల్లతరహా పిడివాదం మరొకటి ఉండదు. దీనర్థం అమ్మకాల సంఖ్య కొనుగోళ్ళ సంఖ్యకు సమానం కావడం అయితే, అది చెప్పిందే చెప్పడం(tautology). ఈవాదం అభిప్రాయం ఏమంటే: అమ్మేప్రతి వాడూ కొనే వాణ్ని మార్కెట్ కి తెచ్చుకుంటాడు అని. అయితే అలా ఏం తెచ్చుకోడు. అటువంటిదేమీ జరగదు.నిజంగా అలా జరిగితే సంక్షోభానికి అవకాశం ఉండదు.

ఈ పిడివాదం చేసినవాడు జీన్ బాప్టిస్ట్ సే (1767 –1832) ఫ్రెంచ్ ఆర్థికవేత్త, వ్యాపారవేత్త కూడా.

సరఫరాయే తన గిరాకీని ఏర్పరచుకుంటుంది. ఇది సే (మార్కెట్ల) నియమంగా ప్రసిద్ధి చెందింది. మొత్తం సరఫరా మొత్తం గిరాకీని సృష్టించుకుంటుంది. ఉత్పత్తయిన వన్నీ వినియోగమవుతాయి- అని బ్రిటిష్ ఆర్థికవేత్త డేవిడ్ రికార్డో(1772- 1823) పలుమార్లు చెబుతాడు.అమితోత్పత్తి సాధ్యం కాదు. సరుకులు సరుకులుతో మారతాయి-అనే ప్రతిపాదన దీనికి ఆధారం..దీని నుంచి వచ్చే నిర్ధారణ: గిరాకీ ఉత్పత్తి వల్ల మాత్రమే నిర్ణయమవుతుంది. ఉత్పత్తీ గిరాకీ సరిగా సమంగా ఉంటాయి. - TSV2.493 సే నియమాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతాడు. సుప్రసిద్ధ బ్రిటిష్ ఆర్థికవేత్త జేమ్స్ మిల్(1773- 1836) ఇలా చెబుతాడు: సంవత్సర ఉత్పత్తి మొత్తం అది ఎంతైనా కానీ, సంవత్సర గిరాకీ మొత్తాన్ని మించదు.అందువల్ల, ఏ దేశంలోనైనా సరుకు గిరాకీని మించిన పరిమాణంలో ఉండడం అసాధ్యం....క్రిటిక్ 96

మిల్ ఆవిధంగా చలామణీ ప్రక్రియని వస్తుమార్పిడికి కుదించడం ద్వారా సమతుల్యతని సాధిస్తాడు అని మార్క్స్ తప్పుబడతాడు.

ప్రతి అమ్మకమూ ఒక కొనుగోలే, ప్రతి కొనుగోలూ ఒన అమ్మకమే. కనుక సరుకుల చలామణీ లో అమ్మకాలకీ కొనుగోళ్ళకీ మధ్య సమతుల్యత ఉంటుందనుకోవడం 'పిల్లతరహా పిడివాదం'. జరిగిన అమ్మకాలసంఖ్య,జరిగిన కొనుగోళ్లసంఖ్యకు సమానం అని దీని అర్థంఅయినట్లయితే,ఇది చెప్పినదాన్నే చెప్పడం(tautology) మాత్రమే.దాని ఉద్దేశ్యం ఏమంటే: ప్రతి అమ్మకందారుడూ తనవెంట కోనుగోలుదారుణ్ణి మార్కెట్ కి తెచ్చుకుంటాడని.అయితే అది జరిగేపని కాదు.

ఈ విమర్శల తర్వాత పరిస్థితిని మరింత వివరంగా పరిశీలిస్తాడు. కొనుగోలూ అమ్మకమూ ఒకేరకమైన చర్యలు, అదే సమయంలో వ్యతిరేక ధ్రువాలు.అయితే ఇది తార్కిక వైరుధ్యం కాదు:'ఒకే రకంగా ఉండడమూ' 'వ్యతిరేక ధృవాలుగా ఉండడమూ' ఇప్పుడు పాల్గొన్నవారికీ,లావాదేవీకీ విస్తరించింది/ పంపిణీ అయింది. అమ్మకమూ కొనుగోలూ ఒకే స్వభావంగల చర్య-సరుకు ఓనర్ కీ డబ్బు ఓనర్ కీ మారకం- అవుతుంది. అయస్కాంతం ధ్రువాల లాగా, ఒకరికొకరు వ్యతిరేకంగా ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఒకేరకమైన చర్య.

ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఒకే లావాదేవీ యొక్క రెండు వైపులుగా అమ్మకం కొనుగోళ్లను చూస్తే, ఆ లావాదేవీ అమ్మకమా కొనుగోలా అనే సందిగ్ధత(ambiguity) ఉంటుంది; అది ఒకరికి అమ్మకమూ, మరొకరికి కొనుగోలూ. లావాదేవీలో పాల్గొన్నవారి పాత్రగురించి సందిగ్ధత ఏమీ లేదు: ఒకరు అమ్మకందారుడూ, మరొకరు కొనుగోలుదారుడూ.

రెండు చర్యల్నీ ఒకే వ్యక్తి చేస్తే అవి ధ్రువస్వభావమూ, వ్యతిరేక స్వభావమూ ఉన్న భిన్న చర్యలవుతాయి. ఇందుకు భిన్నంగా, ముందు అమ్మి తర్వాత కొనే వాడిని అనుసరిస్తే, ఏ చర్య అమ్మకమో, మరేది కొనుగోలో సందిగ్ధత ఉండదు. అవి ధ్రువ వ్యతిరేకతలు ఏర్పరుస్తాయి.ఏమైనా అతన్ని గురించి చెప్పగలిగేదంతా ఇదే: అతను అమ్మకం దారుడూ, కొనుగోలు దారుడూకూడా. అతను మొదట అమ్ముతాడు, తర్వాత కొంటాడు. చలామణీ అనే గుండం (alchemist's retort) లోకి సరుకుని విసిరినప్పుడు, అది డబ్బుగా తిరిగి రాకపోతే ఆసరుకు నిరుపయోగమైనదని అర్థం. అంటే దాని ఓనర్ దాన్ని అమ్మలేకపోతే, అందువల్ల కొనుగోలుదారుడు కొనలేకపోతే ఆసరుకు నిరుపయోగమైనది. అమ్మకం కొనుగోలుల ఐక్యత తెలిపేది ఈ విషయాన్నే.
ఆసరుకు డబ్బుగా చలామణీ నుండి బయటకి రాకపోతే,అమ్మేవాడికే కాదు, ఎవ్వరికీ పనికిరాదు.
ఒక సరుకుని అంతిమంగా వినియోగదారుని చేతుల్లోకి జరిపే లావాదేవీ అదే సమయంలో ఉత్పత్తిదారుడు ఏర్పరచిన విలువ సిద్ధింపుకూడా. ఈలావాదేవీ రెండు వైపులూ – విలువ సిద్ధింపూ వినియోగదారుడు ఉపయోగపు విలువని ఏమ్చుకోవడమూ- విడదీయరాని బంధంలో ఉంటాయి.ఒకటి లేకుండా రెండోది ఉండదు. విలువలు సిద్ధించడం వీలుకాకుంటే, ఉపయోగపువిలువలు ముక్కిపోతాయి.

ఈ ఐక్యత మరొక విషయాన్ని కూడా చెబుతుంది: మారకం జరిగినా విరామ సమయం ఏర్పడుతుంది. అది ఆసరుకు జీవితంలో ఎక్కువ కావచ్చు తక్కువా కావచ్చు. మొదటి పరివర్తన ఒకేసారి అమ్మకమూ కొనుగోలూ కావడం వల్ల, అది ఒక స్వతంత్ర ప్రక్రియ కూడా. కొన్నవాని దగ్గర సరుకుంది, అమ్మినవాని వద్ద డబ్బుంది. అంటే మళ్ళీ ఏ క్షణంలోనైనా చలామణీ లోకి పోవడానికి రెడీగా వుండే డబ్బుంది.
ఎవరో ఒకరు కొననిదే, ఎవరూ అమ్మలేరు. అయితే ఒకడు తన సరుకులు అమ్మాడు కనక ఆడబ్బుతో ఇతరుల సరుకులు కొని తీరాలనేదేమీ లేదు.

మారకం అమ్మకం,కొనుగోలు గా విడివడడం సాధారణ వాణిజ్య సంక్షోభాలకు అవకాశాన్నిఇముడ్చుకొని ఉంటుంది-క్రిటిక్

ఈ చర్యల స్వతంత్రత సే నియమాన్ని చెల్లుబాటు కానివ్వదు తన సరుకుల్ని అమ్మగా వచ్చిన డబ్బుతో అప్పటికప్పుడు కొనాల్సిన అగత్యం ఏమీలేదు. ఎందుకంటే, ఆడబ్బు ఎన్నేళ్ళ తర్వాతయినా కొనుగోళ్ళు చెయ్యగలదు. సేనియమాన్ని తిరస్కరించాక, కొనుగోలు అమ్మకం రెంటి ఐక్యతా, ధ్రువత్వాల గురించి చర్చిస్తాడు. అమ్మకమూ కొనుగోలూ విడదీయరాని యూనిట్ గా ఉండకపోవడం, స్థల కాలాలలో వేరు చేయబడడం మంచిదే.
టైం కి, ప్రదేశానికి, వ్యక్తులకి వస్తుమార్పిడి విధించిన అన్ని పరిమితుల్నీ చలామణీ తెంచుకుంటుంది. ఈపని అది ఎలా చెయ్యగలుగుతుంది? అమ్మకం కొనుగోలు లోకి విడిపోవడంద్వారా. ప్రత్యక్ష వస్తుమార్పిడిలో ఒకరి సొంత ఉత్పాదితాన్ని పరాధీనం చెయ్యడానికీ మరొకరి ఉత్పాదితాన్ని పొందడానికీ ఉన్న ప్రత్యక్ష ఐక్యత చలామణీ లో అమ్మకం కొనుగోలు అనే విరుద్ధత లోకి విడిపోవడంద్వారా.
మార్క్స్ ఇక్కడ రెండు విషయాలు చెబుతున్నాడు:

1.అమ్మకమూ కొనుగోలూ ఐక్యతని ఏర్పరుస్తాయి.ఎందుకంటే, అవి మారకప్రక్రియ రెండుగా చీలడంవల్ల ఏర్పడతాయి గనక.

2. ఈవిడివడడం అనేది చలామణీ కాలానికీ, స్థలానికీ, వ్యక్తులకీ సంబంధించిన అన్ని పరిమితులనూ చేదించి, చొచ్చుకొనిపోతుంది.

ఈ రెండు పాయింట్లకీ ఉన్న సంబంధం ఫ్రెంచ్ కూర్పులో ఇంకొంత స్పష్టంగా ఉంటుంది: అమ్మిన తర్వాత, అదే చోటగానీ, అదే టైం లో, అదే నేను అమ్మిన వ్యక్తివద్దనే గానీ గానీ కొనాలనే బలవంతం నామీద ఉండదు. ఇది మంచిదే. కాని ఇలావిడివడడం అనేదానికి లోపం కూడా ఉంది.

సరుకు సంపూర్ణ రూపపరివర్తనలోని రెండు అనుబంధ దశలకీ –అమ్మకానికీ కొనుగోలుకీ – మధ్య విరామకాలం మరీ ఎక్కువయితే వాటి మధ్య ఉండే బంధం అంటే వాటి ఏకత్వం సంక్షోభం కలిగించడంద్వారా చాటుకుంటుంది.

అంతర్గత ఐక్యతని ఏర్పరచే రెండు అంశాల యొక్క స్వతంత్ర ప్రాతినిధ్యానికి రెండు ఫలితాలుంటాయి:

1. కాలానికీ, స్థలానికీ సంబంధించిన అన్ని పరిమితుల గుండా చలామణీని చొచ్చుకు పోనిస్తుంది.

2.సంక్షోభాలు వచ్చే అవకాశాన్ని ఇముడ్చుకొని ఉంటుంది.

అయితే సంక్షోభాల వాస్తవికతని చలామణీ సూత్రాలనించి రాబట్టడం కుదరదు

సరుకులోఅంతర్భూతంగా ఉపయోగపు విలువకూ, విలువకూ మధ్య వ్యతిరేకత ఉంటుంది;

ప్రత్యక్ష సామాజిక శ్రమగా ఏకకాలంలో తననుతాను వ్యక్తపరచుకోవాల్సిన ప్రైవేట్ శ్రమకీ, సార్వత్రిక అనిర్దిష్ట శ్రమగా మాత్రమే లెక్కకొచ్చే ఒక ప్రత్యేక నిర్దిష్ట తరహా శ్రమకీ మధ్య విరుద్ధత ఉంటుంది;

వస్తువుల్ని వ్యక్తులుగా చూడడానికీ,వ్యక్తుల్ని వస్తువులుగా చూడడానికీ మధ్య వైరుధ్యం ఉంటుంది.

ఈ అంతర్గత వైరుధ్యం అభివృద్ధి చెందిన చలన రూపాల్ని, సరుకు రూప పరివర్తనలోని వ్యతిరేక దశలలో పొందుతుంది.

అందువల్ల ఈరూపాలు సంక్షోభాలు వచ్చేఅవకాశాన్ని ఇముడ్చుకొని ఉంటాయి. కేవలం అవకాశాన్ని మాత్రమే. అంతకెక్కువ కాదు.

అవకాశం వాస్తవం లోకి అభివృద్ధి చెందాలంటే, ఒకమొత్తం సంబంధాల పరంపర అవసరం. సరుకుల సరళ చలామణి దృష్ట్యా ఆపరంపరకి ఇప్పటికింకా ఉనికిలో లేదు.

## సంక్షోభం ఎందుకేర్పడుతుంది?

సరుకుల ఉత్పత్తిలో సరుకుని అమ్మడం అనేది తప్పనిసరి షరతు...అమ్మడం అసాధ్యం అయితే, దాని ఫలితమే సంక్షోభం- అదనపు విలువ సిద్ధాంతాలు భాగం 2.509

పెట్టుబడి దారీ విధాన సమర్ధకులు అనివార్యతని అంగీకరించరు. సమర్ధకులు వాళ్ళ పుస్తకాల ప్రకారం ఉత్పత్తి చేస్తే సంక్షోభాలు సంభవించవంటారు. అంటే ఏవో పొరపాట్లవల్ల వస్తాయనీ, సరిదిద్దుకోగానే సర్దుకుంటాయనీ వాదిస్తారు.

సరుకు డబ్బుగా మారితీరాలి, కాని డబ్బు వెంటనే సరుకులోకి మారాల్సిన అవసరం లేదు.అందువల్ల కొనుగోలూ అమ్మకం విడిపోవచ్చు. ఈరూపం లో సంక్షోభానికి అవకాశం ఉంది. అంటే, కలిసిఉన్న,విడివడే వీలులేని అంశాలు విడదీయ బడ్డాయి, ఫలితంగా బలవంతంగా తిరిగి కలపబడ్డాయి. వాటి పొందిక వాటి పరస్పర స్వతంత్రతకి వ్యతిరేకంగా బలవంతంగా ప్రకటించ బడింది. సంక్షోభం అనేది ఉత్పత్తిప్రక్రియలో పరస్పరం స్వతంత్రమైన అంటే విడివడిన అంశాల ఐక్యత యొక్క బలవంతపు వక్కాణింపు తప్ప వేరేమీ కాదు. - అదనపు విలువ సిద్ధాంతాలు భాగం 2.509

అమ్మకమూ,కొనుగోలూ ఒకదానినుండి మరొకటి విడిపోయి, ఘర్షణ పడక పోతే సంక్షోభం ఉండదు.512

సంక్షోభాల్ని తిరస్కరించడానికి, సమర్థకులు వైరుధ్యం, ఘర్షణ ఉన్నచోట ఐక్యత ఉన్నది అని నొక్కివక్కాణిస్తారు. వాస్తవంగా ఉన్న వైరుధ్యాల్ని లేవనుకుంటారు.ఉండకూడదు అనుకుంటారు.- అదనపు విలువ సిద్ధాంతాలు భాగం 2. 513

సంక్షోభాలకు మూలం ఎక్కడ ఉందో తేల్చి చెప్పాడు. అవి ఎదో యాదృచ్ఛికంగా వచ్చిపోయేవి కావు. ఉత్పత్తిదారులు పొరపాట్ల వల్ల ఏర్పడేవికావు. పెట్టుబడిదారీ విధానంలో అనివార్యమైనవి. ఇకముందు రావు అని పలుమార్లు ప్రకటించారు. అయినా వస్తూనే ఉన్నాయి.మొదటి సార్వత్రిక సంక్షోభం మార్క్స్ కాలంలో వచ్చింది.

వాళ్ళ పుస్తకాల్ని అనుసరిస్తున్నా, ప్రభుత్వాలు అత్యుత్సాహంతో సహకరిస్తున్నా పదే పదే ఎందుకు వస్తున్నాయి?ఇందుకు మూల కారణమేదో మార్క్స్ సిద్ధాంతపరంగా తేల్చిచెప్పాడు. అమ్మకమూ,కొనుగోలూ ఒకదానినుండి మరొకటి విడిపోయి, ఘర్షణ పడక పోతే సంక్షోభం ఉండదు- అదనపు విలువ సిద్ధాంతాలు భాగం 2.512

అమ్మకమూ కొనుగోలూ విడివడ్డాయి.ఎందువల్ల?మారకాల అభివృద్ధికి అది అవసరం. అందువల్ల సంక్షోభాలు అనివార్యం.

## B. డబ్బు చలనం

సరుకుల చలామణీ (స-డ-స) సరుకుల రూపపరివర్తన ద్వారా జరుగుతుంది. ఇందుకు స-డ-స ప్రక్రియని కొంత 'విలువ' మొదలు పెట్టాలి. ఆవిలువ ఒక సరుకు ఆకారంలో ఉంటుంది.కనక ఈ ప్రక్రియ ఒకసరుకుతో మొదలవాలి. అలాగే ఒక సరుకుతో ముగియాలి. కనుక ఆసరుకు కదలిక (movement) ఒక సర్క్యూట్. అంటే సరుకు బయలుదేరిన చోట, చివరకి సరుకే ఉంటుంది. అంటే సరుకు వలయం (సర్క్యూట్) చేస్తుంది. మరొక పక్క, ఈకదలిక రూపం డబ్బుని సర్క్యూట్ చెయ్యనివ్వదు.

ఉదాహరణకి, టాంగా- డబ్బు-నెక్లెస్ ఇదొక పూర్తి రూపపరివర్తన. మొదటిది సరుకు. చివరదీ సరుకే. సరుకు స్థానంలోకి సరుకొచ్చింది. ఇదే సర్క్యూట్ పూర్తికావడం అంటే. సరుకుపోయి సరుకోచ్చింది.మరి డబ్బు బయలుదేరిన చోటికి డబ్బోచ్చిందా? రాలేదు,రాదు.

<u>స-డ-స లో సరుకు సర్క్యూట్ చేస్తుంది కాని, డబ్బుని సర్క్యూట్ చెయ్యనివ్వదు.</u>

దీని ఫలితం ఏమంటే: డబ్బు బయలుదేరిన చోటికి రాదు, అక్కడనించీ మరింత మరింత దూరదూరంగా పోతూ ఉంటుంది. అమ్మినవాడు డబ్బుని గుప్పెట్లో పెట్టుకుని కూర్చుంటే, ఆసరుకు దాని రూప పరివర్తనలో మొదటి దశ లోనే ఇంకా ఉన్నట్లు, సగం మాత్రమే పూర్తిచేసినట్లు.

అయితే అతను తనసరుకు అమ్మగా వచ్చిన డబ్బుతో మరోకసరుకు కొన్నాడంటే, అతని చేతిలో డబ్బుండదు, వెళ్ళిపోతుంది. మళ్ళీ కొత్తగా బట్ట అమ్మితే డబ్బొచ్చే మాట నిజమే. కానీ అది మొదటి 20 గజాల బట్ట అమ్మకం తాలూకూ డబ్బు కాదు. అప్పుడొచ్చిన డబ్బు బైబిల్ కొనగానే నేతగాని చేతిలోంచి బైబిల్ అమ్మిన వానికి చేరింది. ఇప్పుడు నేతగాని దగ్గరున్న డబ్బు కొత్తగా బట్ట అమ్మకం వల్ల వచ్చింది. మరొక సరుకు కొనగానే ఈ డబ్బుకూడా వెళ్ళిపోతుంది. పాత ప్రక్రియలోజరిగినట్లే కొత్తప్రక్రియలోనూ జరుగుతుంది. కనుక సరుకుల చలామణీ డబ్బుకి కలిగించిన ఈ కదలిక డబ్బుని దాని ఆరంభ స్తానాన్నించి నిరంతరం తొలగిస్తూనే ఉంటుంది- ఒక సరుకు ఓనర్ చేతుల్లోనించి మరోకసరుకు ఓనర్ చేతుల్లోకి డబ్బు ప్రయాణిస్తూనే ఉంటుంది. డబ్బు పయనించే ఈక్రమమే డబ్బు చలనం (currency)

(మార్క్స్ వాడిన జర్మన్ మాట Umlauf. ఇంగ్లిష్ అనువాదకులు వేర్వేరు పదాలు - currency, circulation- ఉపయోగించారు. మూర్ currency అన్నాడు. అంతే కాదు ఇది circulation కి భిన్న మైనది అని నోట్ పెట్టాడు:

కరెన్సీ అనే పదాన్ని మార్క్స్ ఇక్కడ దాని మూలార్థం లో వాడాడు. చేతులు మారేటప్పుడు డబ్బు నడిచేదారి (track) అనే అర్థంలో. ఇది చలామణీ నుండి సారభూతంగా భిన్నమయింది)

ఒకే ప్రక్రియ(స-డ-స) నిరంతరం పునరావృతం అవడమే 'డబ్బు చలనం'. సరుకు ఎప్పుడూ అమ్మేవాని చేతుల్లో ఉంటుంది; కొనుగోలు సాధనంగా డబ్బు కోనేవాని చేతుల్లోనే ఉంటుంది. సరుకు ధరని సిద్ధింపచేయ్యడం ద్వారా, డబ్బు కొనుగోలు సాధనంగా ఉపకరిస్తుంది. ఈ సిద్ధింపు సరుకుని అమ్మేవాని నుంచి కొనే వానికి బదిలీ చేస్తుంది; కొనే వాని చేతుల్లోనించి డబ్బుని అమ్మేవాని చేతుల్లోకి చేరుస్తుంది.

ఒకే లావాదేవీలో డబ్బు అమ్మినవాని చేతిలోకీ, సరుకు కొన్నవాని చేతిలోకీ వెళతాయి. ఆవిధంగా సరుకూ, డబ్బూ వ్యతిరేక దిశల్లో కదులుతాయి. ఈచోట్లు మారడం బూర్జువా సమాజం ఉపరితలం అంతటా లెక్కలేనన్ని చోట్ల ఏకకాలంలో జరుగుతుంటుంది. మరొక సరుకుతో ఇదే ప్రక్రియ తిరిగి మొదలవుతుంది. పదేపదే జరుగుతుంటుంది.

డబ్బు కదలిక ఒకే దిశలో ఉంటుంది.సరుకు కదలిక రెండు దిశలలో ఉంటుంది. డబ్బు ఒకే దిశలో కదలే స్వభావం, సరుకు కదలిక యొక్క రెండు వైపుల స్వభావం నుండి వచ్చింది. అయితే ఈ వాస్తవ పరిస్థితి మరుగుపడి ఉంటుంది. అసలు సరుకుల చలామణీ స్వభావమే తనకు వ్యతిరేకమైన బాహ్యరూపాన్ని కనబరుస్తుంది.

(స-డ- స రూపపరివర్తన డబ్బుకి కలిగించే చలనం ఈ ప్రక్రియ నిజ స్వభావాన్ని స్పష్టపరిచే బదులు తెలియకుండా కప్పిపెడుతుంది.

ఒకసరుకు మొదటి రూప పరివర్తన డబ్బు చలనమూ, సరుకు చలనమూ రెండూ అని స్పష్టంగా తెలుస్తుంది. అయితే రెండో రూప పరివర్తన, అందుకు భిన్నంగా కేవలం ఒక్క డబ్బుచలనంగా మనకు కనబడుతుంది. మొదటిదాంట్లో సరుకు డబ్బుతో చోటు మార్చుకుంటుంది. ఆపైన ప్రయోజనకర వస్తువుగా చలామణీ నించి బయటపడి, వాడకం లోకి వెళుతుంది. ఒకవేళ ఒక సరుకు మరలమరల అమ్మబడినా,(మనకి ఆవిషయం ఇక్కడ ఉనికిలో లేదు) చివరసారి అమ్ముడయినప్పుడు ఆసరుకు చలామణీ రంగాన్ని వదలి, వాడక రంగంలో పడవలసిందే- జీవనాధార సాధనంగానో,లేదా ఉత్పత్తిసాధనంగానో.

ఆసరుకుకి బదులు విలువరూపం-డబ్బు – ఉంటుంది. అప్పుడు రెండోదశ నడుస్తుంది. అయితే దానిసొంత సహజరూపంతో కాదు, డబ్బు రూపంతో. అందువల్ల డబ్బు వల్లనే ఈకదలిక అలాగే కొనసాగుతుంది. అదే సమయంలో సరుకుకి సంబంధించి, ఇదే కదలిక విరుద్ధ స్వభావం ఉన్న రెండు ప్రక్రియలతో ఉంటుంది; సరుకుకి సంబంధించిన ఈ కదలిక, డబ్బు కదలికగా చూస్తే,ఎప్పుడూ ఒకే ప్రక్రియ, అదే ప్రక్రియ – భిన్న భిన్నమైన కొత్త కొత్త సరుకులతో నిరంతరం చోట్లు మారడం. అందువల్ల సరుకుల చలామణీ- అంటే, ఒకసరుకు చోట్లోకి మరోకసరుకు రావడం – సరుకుల రూపపరివర్తన వల్ల జరిగినట్లు కాకుండా, చలామణీ మాధ్యమంగా పనిచేసే డబ్బు వల్ల- సరుకుల్ని చలామణీ చేసే చర్య వల్ల- జరిగినట్లు అగపడుతుంది. వాటిలో ఏ చలనమూ లేనట్లూ, డబ్బే వాటిని చలామణీలో పెడుతున్నట్లూ, వాటిని ఉపయోగపు విలువలు కాని వారి చేతుల్లోంచి, ఉపయోగపు విలువలు అయిన వారి చేతుల్లోకి బదిలీ చేస్తున్నట్లూ అగపడుతుంది; ఈ ప్రక్రియ ఎల్లప్పుడూ సరుకుల దారికి వ్యతిరేకదిశ తీసుకుంటుంది. డబ్బు సరుకుల్ని చలామణీ రంగం నించి నిరంతరం తొలగిస్తుంటుంది – చలామణీలో నిరంతరం సరుకులున్న చోట్లలోకి అడుగు పెట్టడం ద్వారా, ఆవిధంగా తన మొదటి చోటునించీ నిరంతరం దూర దూరంగా పోవడం ద్వారా.

అదే ప్రక్రియ మరలమరల విసుగూ విరామంలేకుండా కొనసాగడమే 'డబ్బుచలనం'

ఈకదలిక ఫలితం డబ్బు తిరిగి రావడం కాదు, బయలుదేరిన చోటు (ఆరంభ బిందువు) నుండీ అంతకంతకూ దూరందూరంగా పోవడం.

అందువల్ల డబ్బు చలనం సరుకుల చలామణీ యొక్క వ్యక్తీకరణ అయినప్పటికీ పరిస్థితి అందుకు వ్యతిరేకమైనదిగా- అంటే సరుకుల చలామణీ డబ్బు చలనం ఫలితం అయినట్లు - కనబడుతుంది. ఫుట్ నోట్ లో ఉన్న లె ట్రాస్నే మాటలు: ఉత్పాదితాల వల్ల కలిగిన చలనం తప్ప డబ్బుకి మరే చలనమూ లేదు.

సరుకు రూపం మార్పు కేవలం డబ్బు చోటు మార్పుగానూ,చలామణీ కదలిక కొనసాగడం పూర్తిగా డబ్బు వైపుకే చెందినట్లుగానూ కనబడుతుంది. ఎందువల్లంటే, డబ్బుకి వ్యతిరేకదిశలో సరుకు ఒక కదలిక మాత్రమే చేస్తుంది, సరుకు మొదలెట్టిన కదలికని పూర్తిచేయ్యడానికి డబ్బు సరుకుకోసం రెండో అడుగు వేస్తుంది- అంటే రెండో కదలిక చేస్తుంది. అందువల్ల ఈమొత్తం కదలికని ప్రారంభించినట్లు అనిపిస్తుంది- అమ్మకంలో సరుకు

డబ్బుని కదిలించి, ఆవిధంగా డబ్బు చలనాన్ని కలిగించినప్పటికీ -కొనుగోలులో డబ్బు సరుకుల చలామణీని కలిగించినట్లే. పైగా కొనుగోలు సాధనంగా డబ్బు సరుకులకి ఎదురవుతుంది. కొనుగోలు సాధనంగా డబ్బు సరుకులకి కదలిక తెస్తుంది- కేవలం వాటి విలువల్ని సిద్ధింప చెయ్యడం ద్వారా. అందువల్ల చలామణీ కదలిక మొత్తంసరుకులతో డబ్బు చోట్లు మారడంగా కనిపిస్తుంది.

ఏకకాలంలో పక్కపక్కనే జరిగే విడివిడి లావాదేవీల్లో గానీ,లేదా ఒకదానితర్వాత మరొకటి జరిగే లావాదేవీల్లో(ఒకే నాణెం భిన్న సరుకుల ధరల్ని ఒకదాని తర్వాత మరొకటి సిద్ధింపచేసి ) గానీ వాటి ధరలు సిద్ధింప చేయ్యడం ద్వారా. ఉదాహరణకి,స-డ-స$^{1}$-డ-స$^{2}$-డ-స$^{3}$ .....ని (వాస్తవ చలామణీ లో గమనించజాలని గుణాత్మక అంశాల్ని వదిలిపెట్టి) పరిశీలిస్తే, ఒకేరకమైన చర్య ఉంటుంది. సరుకు ధర సిద్ధించిన తర్వాత డబ్బు వరసగా స$^{1}$, స$^{2}$, స$^{3}$ ధరలను సిద్ధింప చేస్తుంది. స$^{1}$, స$^{2}$, స$^{3}$ అనే సరుకులు అనివార్యంగా డబ్బు కాళీచేసిన చోట్లోకొస్తాయి. ఆవిధంగా ధరల్ని సిద్ధింప చెయ్యడం ద్వారా సరుకుల చలామణీని డబ్బే కలిగిస్తున్నట్లు అగపడుతుంది.

## వాస్తవానికి సరుకుల చలామణీయే డబ్బుకి చలనం కలిగిస్తుంది

ధరల్ని సిద్ధింప చెయ్యడం లో ఉపకరిస్తూనే, డబ్బు తను కూడా ఆగకుండా కదులుతూ చలనంలో ఉంటుంది.

### సరుకుల చలామణీకీ, డబ్బు చలనానికీ తేడాలు

### 1.సరుకు చోటు మార్చుకుంటే ఇక చలామణీ రంగంలో ఉండదు

అయితే చలామణీ రంగంలో సరుకు మొదటి కదలికే చివరి కదలిక కూడా. బంగారం సరుకుని ఆకర్షించిందా(డ-స) సరుకు బంగారాన్ని ఆకర్షించిందా(డ -స) అనేది అప్రస్తుతం. ఏదయినా సరుకు చోటు మార్చుకుంటుంది. ఒక్క కదలికతో, ఒకసారి చోటు మార్చుకోవడంతో సరుకు చలామణీ రంగం నుంచి బయటపడి, వాడక రంగంలో పడుతుంది.

## చలామణీ సాధనంగా డబ్బుఎల్లప్పుడూ కొనుగోలు సాధనంగా అగపడుతుంది

అన్ని అమ్మకచర్యలూ, అన్ని కొనుగోలు చర్యలూ రూపంలో ఒకేరకమైనవిగా అగపడతాయి. డబ్బెప్పుడూ కొనుగోలు సాధనంగా కనబడుతుంది.

### రెండు విరుద్ధ దశల్లో భిన్నమైన చర్యలు చేస్తుంది.

సరుకుల అంతులేని కదలికే చలామణీ- క్రిటిక్ .ఆ కదిలే సరుకులు ఎల్లప్పుడూ భిన్నమైనవే.ఒక్కో సరుకు ఒక కదలిక మాత్రమే చేస్తుంది. వలయంలో సరుకుమొదలుపెట్టే రెండోకదలిక అదే సరుకుగా కాదు, మరొక సరుకుగా- అంటే బంగారంగా. రూప పరివర్తన చెందిన సరుకు కదలిక ఆవిధంగా బంగారం కదలిక. స-డ లావాదేవీలో సరుకుతో చోటుమార్చుకున్న నాణెం లేదా బంగారుముక్క డ-స లో లావాదేవీని మొదలుపెట్టేదిగా ఉంటుంది. ఆవిధంగా రెండోసారి మరొక సరుకుతో చోట్లు మార్చుకుంటుంది. కొనేవాని (B) చేతుల్లోనించి అమ్మేవాని (A)చేతుల్లోకి పోయినట్లుగానే, ఇప్పుడు కోనేవాడుగా మారిన A చేతుల్లోంచి మరొక అమ్మేవాని (C) చేతుల్లోకి పోతుంది.సరుకు రూప పరివర్తన దీంతో ముగుస్తుంది.

సరుకుల కదలిక ఉంటుంది అలాగే డబ్బు కదలికా ఉంటుంది.

అమ్మేవాడు సరుకుతో వస్తాడు. కనుక అతడు సరుకుకి ప్రతినిధి. కొనేవాడు డబ్బుతో వస్తాడు. కనుక అతడు డబ్బుకి ప్రతినిధి. అందువల్ల చలామణీ సాధనంగా డబ్బుఎల్లప్పుడూ కొనుగోలు సాధనంగా అగపడుతుంది. ఇలా అగపడడం వల్ల, ఒక వాస్తవం మరుగున పడుతుంది.

ఆవాస్తవం : డబ్బు సరుకుల రూపపరివర్తన యొక్క రెండు విరుద్ధ దశల్లో భిన్నమైన చర్యలు చేస్తుంది. స-డ ఒక దశ, డ-స రెండో దశ.ఈరెండు పరస్పర విరుద్ధ దశలు.

డబ్బు చర్యరెంటిలోనూ ఒకటే కాదు.తేడా ఉంది.

1.డబ్బెప్పుడూ ఒకే పని చేస్తుంది. సరుకు రెండు పనులు చేస్తుంది. అందువల్ల డబ్బు కదలిక నించి ప్రతిసరుకు చలామణీలో రెండు దశలున్నట్లు కనబడదు.

డబ్బు 'చలామణీ సాధనం' గా పనిచేస్తుంది.ఎందుకంటే, దానిలో సరుకుల విలువ స్వతంత్ర రూపం తీసుకుంటుంది. అందువల్ల చలామణీ మాధ్యమంగా 'డబ్బు చలనం' వాస్తవానికి సరుకులు వాటి రూపం మార్చుకునేటప్పుడు ఆసరుకులు పొందే చలనమే. ఆవిధంగా బట్ట సరుకు రూపం నుంచి మొదట డబ్బురూపం లోకి మారింది. సరుకు మొదటి రూప పరివర్తనలో (సరుకు-డబ్బు) చివరి పదం (డబ్బు) చివరి రూప పరివర్తనలో(డబ్బు-సరుకు) మొదటి పదం అవుతుంది.

బట్ట-డబ్బు మొదటి రూప పరివర్తన

డబ్బు-బైబిల్ రెండో రూప పరివర్తన.

డబ్బు తిరిగి బైబిల్ రూపంలో కి మారుతుంది.

అయితే ఈ రెండు రూపపరివర్తనలూ సరుకూ డబ్బూ మారడం వల్ల, పరస్పరం ఒకదాన్నొకటి తొలగించి అక్కడ చేరడం వల్ల సాధ్యమయ్యాయి. అవి రెండుమార్లు తొలిగించు కున్నాయి. బట్ట మొదటి రూప పరివర్తన ఈ నాణేల్ని నేతగాని జేబులో పెడుతుంది. రెండో రూపపరివర్తన ఆనాణేల్ని బయటకు లాగుతుంది.అంటే అవే నాణేలు రెండుసార్లు చోట్లు మారాయి-అయితే వ్యతిరేకదిశల్లో.అలా మారడంలో ఒకే సరుకు కి జరిగిన ఈ రెండు విలోమ మార్పులు ప్రతిబింబించాయి.

అలాకాకుండా, మొదటి రూప పరివర్తన వరకే జరిగితే, అంటే అమ్మకాలే జరిగి,కొనుగోళ్ళు జరగకపోతే, ఆడబ్బు ఒకసారే తనచోటు మార్చుకుంటుంది. దాని రెండోసారి మార్పు సరుకు యొక్కరెండో రూప పరివర్తనని - అంటే డబ్బు తిరిగి సరుకులోకి మారడాన్ని- వ్యక్తం చేస్తుంది. అవే నాణేలు తరచుగా చోట్లు మారుతుంటే, అది ఒకే సరుకు పొందిన రూపపరివర్తనల పరంపరని ప్రతిబింబిస్తుంది; అంతేకాదు, సరుకుల ప్రపంచంలో అసంఖ్యాక రూపపరివర్తనలు ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉండడాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఒక అమ్మకం దారుడి నుండి మరొకనికి సజావుగా చేరుతూఉంటే భిన్న సరుకుల రూపపరివర్తనలు సరిగా ఒకదానితో ఒకటి అల్లుకొని ఉన్నట్లు.ఇదంతా ఇప్పుడు మనం పరిశీలిస్తున్న సరుకుల సరళ చలామణీ (స-డ-స) కి మాత్రమే వర్తిస్తుంది.

సరుకుల చలామణీ అంతర్లీనంగా ఉన్న సరుకుల రూప పరివర్తనల్నిఎలా దాచిపెడుతుందో చర్చించాక, ఇప్పుడు డబ్బు చలనాన్నిఒక ప్రక్రియగా విడిగా చూస్తాడు.

ప్రతి సరుకూ చలామణీలోకి అడుగుపెట్టి, మొదటి రూప పరివర్తన పొందినప్పుడు, అలా ఎందుకు చేస్తుందంటే, చలామణీ నించీ బయటపడి,ఇతర సరుకుల చేత స్థానభ్రంశం చెయ్య బడడానికి. ఇందుకు భిన్నంగా డబ్బు చలామణీ సాధనంగా నిరంతరాయంగా చలామణీ రంగంలోనే ఉండి, అందులోనే కదులుతూ ఉంటుంది. అందువల్ల ఒక ప్రశ్న ఉదయిస్తుంది:

ఈరంగం నిరంతరం ఎంత డబ్బుని ఇముడ్చుకుంటుంది?

ఒక దేశంలోప్రతిరోజూ లెక్కలేనన్ని కొనుగోళ్ళూ ,అమ్మకాలూ జరుగుతుంటాయి. సరుకులు ముందుగా ఊహలో నిర్ణయించిన వాటి ధరలద్వారా నిశ్చితమైన డబ్బు పరిమాణాలకు సమాన మవుతుంది. ప్రస్తుతం పరిశీలిస్తున్న చలామణీ రూపంలో డబ్బూ, సరుకులూ ఎప్పుడూ ముఖాముఖీ తలపడతాయి- ఒకటి కొనుగోలు యొక్క ధనధ్రువం వద్ద, రెండోది అమ్మకం యొక్క రుణ ధ్రువం వద్దా. కనుక కావలసిన చలామణీ సాధనం మొత్తం ఎంతో ఆమొత్తం సరుకుల ధరల మొత్తం చేత నిర్ణయమవుతుందనేది స్పష్టమే.

మొత్తం సరుకులధరలు ముందుగా ఊహాత్మకంగా వ్యక్తపరిచే బంగారం మొత్తానికి వాస్తవ డబ్బు ప్రాతినిధ్యం వహిస్తుంది.అందువల్ల ఈ రెండు మొత్తాలూ సమానం అనేది స్వయం స్పష్టమే.

చలామణీ లో ఉండే డబ్బు మొత్తం ఎంతో నిర్ణయించేది అమ్మాల్సిన సరుకుల ధరల మొత్తం.

ఊహాత్మకంగా అప్పటికే ధరల్లో ఉన్న దాని వాస్తవీకరణే డబ్బుకనక, సరుకుల్ని చలామణీలో పెట్టేది డబ్బుకాదు, దాని కదలిక చలామణీ ప్రతిబింబం కనక, చలామణీ లో ఉండాల్సిన డబ్బు మొత్తాన్ని రూప పరివర్తనలు చెందే సరుకుల ధరల మొత్తంచేత నిర్ణయమవుతుంది. డబ్బు పరిమాణం ధర స్థాయిని నిర్ణయించదు. అందుకు భిన్నంగా ధర స్థాయే డబ్బు పరిమాణాన్ని నిర్ణయిస్తుంది.

అయినా, డబ్బే ధరల్లో మార్పుకలిగించే పరిస్థితులు కూడా ఉన్నాయి: డబ్బు పరిమాణంలో మార్పు వల్ల కాదు, డబ్బు విలువలో మార్పువల్ల.

సరుకుల ధరలు మారకుండా స్థిరంగా ఉంటే, సరుకుల ధరలు, బంగారం విలువ మారితే మారతాయి.

బంగారం విలువ తగ్గితే అదే నిష్పత్తిలో లో సరుకుల ధరలు పెరుగుతాయి. బంగారం విలువ పెరిగితే, అదే నిష్పత్తిలో సరుకుల ధరలు తగ్గుతాయి. ఒకవేళ బంగారం విలువపెరిగి నందువల్లో, తగ్గి నందువల్లో మొత్తం సరుకుల ధరలు పెరగడమో తగ్గడమో జరిగితే, దాన్ని బట్టి చలనంలో ఉన్న డబ్బు మొత్తం పెరుగుతుంది లేదా తగ్గుతుంది.

ఈ సందర్భంలో డబ్బు పరిమాణంలో వచ్చిన మార్పు, డబ్బు వల్లనే వచ్చిందన్నది నిజమే. కాని చలామణీ మాధ్యమంగా డబ్బు చర్య(function)వల్ల కాదు, విలువ కొలమానంగా డబ్బు చర్యవల్ల.

సరుకుల ధర డబ్బు విలువకు విలోమంగా మారుతూ ఉంటుంది; తర్వాత చలామణీ మాధ్యమంగా డబ్బు పరిమాణం సరుకుల ధరలకు అనుగుణంగా (directly)మారుతూ ఉంటుంది.

డబ్బు విలువలో మార్పు, సరుకుల ధరల్లో మార్పు తెస్తుంది, అప్పుడు ఈధర మార్పు చలామణీలో ఉన్న డబ్బు పరిమాణంలో మార్పు తెస్తుంది. దీన్ని స్పష్టపరచేందుకు మార్క్స్ ధరల్లో మార్పు వచ్చాక పరిమాణాల్లో మార్పువచ్చే పరిస్థితిని మనముందు పెడతాడు.

బంగారం విలువ తగ్గే బదులు, విలువ కొలమానంగా వెండి వచ్చినా సరిగ్గా ఇలాగే జరుగుతుంది. వెండి ధర పెరిగే బదులు, బంగారం వెండిని విలువ కొలమానం గా ఉండకుండా గెంటినా జరిగేదిదే. మొదటి సందర్భంలో అంతకుముందు ఉన్న బంగారం కంటే ఎక్కువ వెండికావాలి.

రెండు సందర్భాల్లోనూ డబ్బుపదార్థం విలువ - అంటే, విలువ కొలమానంగా వ్యవహరించే సరుకు విలువ – మారి ఉంటుంది. అందువల్ల తమ విలువల్ని డబ్బులో చెప్పే సరుకుల ధరలు కూడా మారి ఉంటాయి. అలాగే ఆధరల్ని సిద్ధింప చేసే డబ్బు పరిమాణం కూడా మారి ఉంటుంది. డబ్బు పదార్థం అయిన బంగారం నిర్దిష్ట విలువతో ప్రవేశించగానే చలామణీ రంగం మొదలవుతుంది.

ఇప్పుడు మొదట ఎత్తుకున్న సమస్యకి తిరిగి వస్తాడు:

## డబ్బు విలువ మారితే ఏమవుతుంది?

డబ్బుగా ఉన్న పదార్థం బంగారమో వెండోమరొకటో కావచ్చు. అది ఏదయినా నిశ్చిత విలువ ఉన్న సరుకుగా చలామణీ రంగంలో ప్రవేశిస్తుంది. ఈ విషయం తెలిసిందే. కనుక విలువ కొలమానంగా పనిచేసేటప్పుడు, ధరలను నిర్ణయించేటప్పుడు దాని (ఆ డబ్బు సరుకు ) విలువ ముందుగానే తెలిసి ఉంటుంది.

## డబ్బు సరుకు విలువ పడిపోతే ఏమవుతుంది?

ఇప్పుడు డబ్బు విలువ పతనం, ఆలోహాల ఉత్పత్తిస్థలంలో వాటితో వస్తుమార్పిడి జరిగిన సరుకుల ధరలలో మార్పువల్ల జరిగినట్లు రుజువవుతుంది.

ఇతర సరుకులలో ఎక్కువభాగం- ప్రత్యేకించి సరిగా అభివృద్ధికాని దశలో ఉన్న సమాజాల్లో- 'పాత విలువ కొలమానం' యొక్క ఊహాత్మక విలువ ప్రకారమే చాలాకాలం పాటు అంచనా వెయ్యడం కొనసాగుతుంది. అయినాగాని, వాటి ఉమ్మడి విలువ సంబంధంద్వారా ఒక సరుకు మరొక సరుకుమీద ప్రభావం చూపుతుంది. వెండి, బంగారాల్లో వ్యక్తమయ్యే ఆసరుకుల ధరలు, క్రమంగా వాటి సాపేక్ష విలువల బట్టి నిర్ణయమైన నిష్పత్తుల్లో నిలబడతాయి. డబ్బు లోహం యొక్క కొత్త విలువ రీత్యా అన్ని సరుకుల విలువలూ అంచనా కట్టే వరకూ అలాగే జరుగుతుంది. ఈప్రక్రియని అనుసరించి అమూల్య లోహాల పరిమాణం పెరుగుతూ పోతుంది- ఈపెరుగుదల ఎందుకు కలుగుతుంది? నేరుగా వాటి ఉత్పత్తి స్థలంలో వాటితో (లోహాలతో)వస్తుమార్పిడి అయిన వస్తువుల్ని replace చెయ్యడానికి అవి ప్రవహించడం వల్ల. సరుకులు వాటి నిజమైన ధరల్ని పొందే అనుపాతంలో, అంటే వాటి విలువలు డబ్బులోహం తగ్గిన విలువ ననుసరించి అంచనావేసే నిష్పత్తిలో, ఆకొత్త

ధరల్ని సిద్ధింప చేసేందుకు అవసరమైన బంగారం మొత్తం ముందే సమకూర్చబడి ఉండాలి. బంగారం వెండి సరఫరా పెరగడంవల్ల కలిగిన ఫలితాల ఏక పక్ష పరిశీలన కొందరు ఆర్ధికవేత్తల్ని17 వ శతాబ్దంలో, ప్రత్యేకించి 18 వ శతాబ్దంలో ఒక తప్పు నిర్ధారణవైపు పంపింది.

ఆతప్పునిర్ధారణ ఇదే: చలామణీ సాధనంగా ఉపకరిస్తున్న

వెండి బంగారాల పరిమాణం పెరిగినందువల్ల సరుకుల ధరలు పెరిగాయి.

ఇకముందు బంగారం విలువ ముందుగా నిర్ణయమైన అంశం అయినట్లు భావిద్దాం.

ఈ ఊహ ననుసరించి చలామణీ సాధనం పరిమాణం సిద్ధించవలసిన సరుకుల ధరల మొత్తం చేత నిర్ణయమవుతుంది.

ప్రతి సరుకు ధరా తెలుసునని కూడా అనుకుంటే, సరుకుల ధరల మొత్తం చలామణీలో ఉన్న సరుకుల మొత్తం మీద ఆధారపడి ఉంటుంది. ఇది స్వయం స్పష్టం.ఒక క్వార్టర్ గోధుమలు 2 పౌన్లయితే 100 క్వార్టర్లు 200 పౌన్లనీ, 200 క్వార్టర్లు 400 పౌన్లనీ తెలుసుకోడానికి బుర్ర బద్దలు కొట్టుకోనక్కర లేదు. గోధుమలతో చోటు మారే డబ్బు పరిమాణం గోధుమల పరిమాణం పెరిగేకొద్దీ పెరుగుతుంది

సరుకుల రాసి స్థిరంగా ఉంటే, ఆసరుకుల ధరల్లో వచ్చే ఎగుడుదిగుళ్ళని బట్టి చలామణీలో ఉండే డబ్బు పరిమాణం మారుతుంది. ధర మార్పు ఫలితంగా ధరలమొత్తం పెరగడమో తగ్గడమో జరుగుతుంది కనక చలామణీలో ఉండే డబ్బు పరిమాణం పెరగడమో తగ్గడమో జరుగుతుంది. ఈ ప్రభావం కలిగించడానికి అన్ని సరుకుల ధరలూ ఒకేసారి పడాల్సిన పనిగానీ, పెరగాల్సిన పనిగానీ లేదు. కొన్ని ముఖ్యమైన వస్తువులధరలు పెరిగితే అన్ని సరుకుల ధరలూ పెరగడానికి చాలు; అలాగే కొన్ని ముఖ్యమైన వస్తువులధరలు తగ్గితే అన్ని సరుకుల ధరలూ తగ్గడానికి చాలు;.అందువల్ల చలామణీలో ఎక్కువో తక్కువో డబ్బు పెట్టడానికి చాలు. ధరలో మార్పు సరుకుల విలువ వాస్తవమార్పుకి అనుగుణంగా ఉన్నా లేకున్నా, ధరలో మార్పు మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గుల ఫలితమైనా, కాకున్నా – చలామణీ మాధ్యమం పరిమాణం మీద ప్రభావం అదేవిధంగా ఉంటుంది. మారదు.

## డబ్బు చలన వేగం మారితే

అమ్మవలసిన సరుకులు క్వార్టర్ గోధుమలు,20 గజాలబట్ట, ఒక బైబిల్, నాలుగు గాలన్ల బ్రాందీ. ఒకేసారి భిన్న ప్రాంతాలలో అమ్మాలనుకుందాం.ఒక్కక్కదాని ధర రెండేసి పౌన్లయితే సిద్ధించాల్సిన ధరల మొత్తం 8 పౌన్లు. అంటే, 8పౌన్ల డబ్బు చలామణీలోకిపోవాలి. ఒకవేళ అలాకాకుండా అవే వస్తువులు ఈకింది రూపపరివర్తనల గొలుసులో లింకులయితే,

1క్వార్టర్ గోధుమలు - £2 - 20 గజాలబట్ట - £2 - ఒక బైబిల్ - £2 - నాలుగు గాలన్ల బ్రాందీ - £2.

ఇలాంటి గొలుసు మనకు తెలుసు.

ఈసందర్భంలో అవే 2 పౌన్లు ఒక సరుకు తర్వాత మరోకసరుకుతో చలామణీ జరిగేట్లు చేస్తాయి. వరసగా వాటి ధరల మొత్తం 8 పౌన్లనీ సిద్ధింపచేసి, చివరకి ఆరెండు పౌన్లు బ్రాందీ అమ్మేవాడి జేబులో కొస్తాయి. ఆవిధంగా అవే రెండు పౌన్లు నాలుగు కదలికలు చేస్తాయి.

ఈ వరస పూర్తవడానికి కొంత టైం పడుతుంది.ఆకారణంగా డబ్బుచలన వేగం నిర్దిష్ట కాలంలో, నిర్దిష్ట డబ్బు ముక్కచేసిన కదలికల సంఖ్య చేత కొలవబడుతుంది.

4 వస్తువుల చలామణీ కి ఒక రోజు పట్టిందనుకుందాం. ఒకరోజులో సిద్ధించిన ధరలు 8పౌన్లు. 2పౌన్ల ముక్క చేసిన కదలికలు 4. చలామణీ అవుతున్న డబ్బు 2 పౌన్లు. అందువల్ల చలామణీలో కొంత కాలవ్యవధికి ఈకింది సంబంధం వస్తుంది: చలామణీ మాధ్యమంగా ఉండే డబ్బు పరిమాణం = సరుకుల ధరల మొత్తం/అవే నాణేలు చేసే కదలికల సంఖ్య. ఈసూత్రం సాధారణంగా చెల్లుబాటు అవుతుంది.

ఒకానొక దేశంలో, నిర్ణీత వ్యవధిలో సరుకుల మొత్తం చలామణీ ఒకపక్క ఏకకాలంలో జరిగే అనేక విడివిడి పాక్షిక రూపపరివర్తనలుగా ఉంటాయి. అవి అదేసమయంలో కొనుగోళ్ళు కూడా అయిన అమ్మకాలు. వాటిలో ప్రతి నాణెమూ ఒక్క సారే చోటు మారుతుంది. ఒకే కదలిక చేస్తుంది. మరొకపక్క, సరుకుల మొత్తం చలామణీ పాక్షికంగా పక్కపక్కన జరిగే భిన్నమైన, ఒకదానికొకటి సహకరించుకునే రూపపరివర్తనల పరంపరగా ఉంటుంది.ఆపరంపరలో ప్రతిదానిలోనూ ప్రతి నాణెమూ చాలా కదలికలు చేస్తుంది. ఆసంఖ్య పరిస్థితుల్ని బట్టి పెద్దది గానో చిన్నదిగానో ఉంటుంది.

ఒకే పేరుతో (denomination) చలామణీ ఉన్ననాణేలు చేసే మొత్తం కదలికల సంఖ్య తెలిస్తే, ఒక నాణెం చేసే సగటు కదలికల్నితెలుసుకోగలం.డబ్బు సగటు చలన వేగం తెలుసుకోగలం. ప్రతిరోజు మొదట్లో చలామణీ లోకి ప్రవేశపెట్టిన డబ్బు పరిమాణం, ఒకే కాలంలో పక్కపక్కనే చలామణీ అవుతున్నఅన్ని సరుకుల ధరల మొత్తం చేత నిర్ణయమవుతుంది. అయితే ఒకసారి చలామణీలోవున్నాయంటే, నాణేలు ఒకదానికొకటి బాధ్యతవహిస్తాయని చెప్పవచ్చు. ఒకటి తన వేగాన్ని పెంచుకుంటే,మరొకటి తనసొంత వేగాన్ని అడ్డుకొని తగ్గించుకోనన్నా తగ్గించు కుంటుంది, లేదా చలామణీనించి బయటకుపోనన్నా పోతుంది. ఎందువల్లనంటే,ఒక నాణెం చేసే సగటు కదలికల సంఖ్య చేతహెచ్చిస్తే, సిద్ధించాల్సిన ధరల మొత్తానికి సమానం అయిన పరిమాణం బంగారాన్ని మాత్రమే చలామణీ ఇముడ్చుకోగలదు.

అందువల్ల, వేరువేరు నాణేల కదలికల సంఖ్య పెరిగితే, చలామణీలో ఉన్న ఆ నాణేల సంఖ్య తగ్గుతుంది. కదలికల సంఖ్య తగ్గితే మొత్తం నాణేల సంఖ్య పెరుగుతుంది. ఒకానొక సగటు చలనవేగం ఉంటే, చలామణీ ఇముడ్చుకోగల డబ్బు పరిమాణం ఎంతో తెలుస్తుంది. కనుక చలామణీ నించీ నిర్ణీత సంఖ్యలో సావరిన్లను(పౌను స్టెర్లింగ్ కి సమానమైన పూర్వపు 7.988 గ్రాముల బంగారు నాణేలు) తొలిగించడానికి అదే సంఖ్యలో పౌను నోట్లను పెడితే సరిపోతుంది. ఈ చిట్కా బాంకర్లందరికీ బాగా తెలిసిందే.

సాధారణంగాపరిగణిస్తే, డబ్బు చలనం అనేది సరుకుల చలామణీ యొక్క ప్రతిబింబం, సరుకులు పొందే విరుద్ధ రూప పరివర్తనల యొక్క ప్రతిబింబం. అదేవిధంగా చలన వేగం అనేది సరుకులు ఎంత వేగంగా వాటి

రూపాల్ని మార్చుకుంటాయో ఆ వేగాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక రూపపరివర్తనల పరంపరతో మరొక రూప పరివర్తనల పరంపర నిరంతరాయంగా పెనవేసుకొనడాన్ని,వేగంగా జరిగే పదార్థం యొక్క సామాజిక అంతఃపరివర్తన(interchange)ని, చలామణీ రంగం నుంచి సరుకులు వేగంగా బయటకు పోవడానికి, వాటి స్థానంలోకి కొత్త సరుకులు అంటే వేగంగా రావడాన్ని ప్రతిబింబిస్తుంది.

అందువల్ల, చలన వేగంలో పరస్పర విరుద్ధమూ, పరస్పర పూరకమూ అయిన దశల ఐక్యతని, సరుకుల ప్రయోజనకర అంశం వాటి విలువ అంశంలోకి మారడం , వాటి విలువ అంశం తిరిగి ప్రయోజనకర అంశంలోకి మారడం యొక్క ఐక్యతని, అమ్మకం కొనుగోలు అనే రెండు ప్రక్రియల ఐక్యతని మనం గమనిస్తాం. మరొకవైపు చలనవేగం వెనకపట్టు పట్టడం అనేది ఈ రెండు ప్రక్రియలూ విడివిడి,విరుద్ధదశలుగా విడిపోవడాన్ని ప్రతిబింబిస్తుంది.రూపం మారడంలో కలిగిన మందకొడి తనాన్ని ప్రతిబింబిస్తుంది.అందువల్ల పదార్థం యొక్క సామాజిక అంతఃపరివర్తనలో వచ్చే మందకొడి తనాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ మందకొడి తనానికి మూలకారణం గురించి చలామణీ 'క్లూ' ఏమీ ఇవ్వదు. కేవలం ఈవిషయాన్నే రుజువుగా పెడుతుంది. డబ్బుచలనం తిరోగమనాన్నీ, దానితోపాటు అదేసమయంలో చలామణీ రంగం అంచుల్లో డబ్బు తక్కువ తరచుగా కనబడడాన్నీ, కనపడకుండా పోవడాన్ని ప్రజలు గమనిస్తుంటారు. సహజంగానే వాళ్ళు ఈ తిరోగమనానికి కారణం చలామణీ మాధ్యమం పరిమాణంలో కొరత అని అనుకుంటారు.

తాను అమ్మాలనుకునే సరుకులు కొనేవాడు చిక్కకపోతే, దేశంలో డబ్బు కొరత ఏర్పడినందువల్లనే అమ్ముడవడంలేదని అనుకుంటాడు. అందువల్ల డబ్బు లేదు అనే నినాదం అన్నిచోట్ల వినబడుతుంది. ఆనినాదం సర్వసాధారణం అవుతుంది. అయితే ఇది పెద్ద పొరపాటు...డబ్బుకోసం అరిచేవాళ్ళకి నిజంగా ఏం కావాలి?

దేశంలో డబ్బుంటే తన సరుకులకి ధర వచ్చేది అనుకుంటాడు రైతు.అటువంటప్పుడు అతను కావాలని కోరుకునేది డబ్బునికాదనీ, అతను అమ్మలేకపోతున్న దాన్యానికీ, పసువులకీ ధర అనీ అనిపిస్తుంది...

**అతనికి ధర ఎందుకు రావట్లేదు?..**

1) దేశంలో ధాన్యమూ, పశువులూ అతిగా ఉండి ఉండాలి.మార్కెట్ కి వచ్చేవాళ్ళలో ఎక్కువమంది అమ్మేవాళ్ళూ తక్కువమంది కొనేవాళ్ళూ ఉంది ఉండవచ్చు.

2) ఇతరదేశాలకు మామూలుగా పంపే అవకాశం తగ్గి ఉండవచ్చు.

3) వస్తువుల వినిమయం తగ్గి పోవచ్చు. పేదరికంవల్ల జనం ఇంతకుముందు ఖర్చుపెట్టినట్లుగా ఇళ్ళలో ఖర్చుపెట్టలేక పోతే వినిమయం తగ్గుతుంది; అందువల్ల, రైతు సరుకులు అమ్ముడయ్యేట్లు చేసేది డబ్బు పెరగడం కాదు. మార్కెట్ ని మందకొడిగా ఉంచే పైన చెప్పిన మూడు కారణాల్లో దేన్నైనా తొలగించడం.

మార్కెట్ మందకొడిగా ఉన్నందువల్ల వర్తకుడూ, షాపువాడూ కూడా తమసరుకులు అమ్ముడయ్యేందుకు డబ్బు కావాలంటారు. "సంపద ఒకచేతినించి మరోకచేతిలోకి మారినప్పుడు వృద్ధి చెందినంత ఎక్కువగా , ఎన్నడూ వృద్ధి చెందదు."(Sir Dudley North—Discourses upon Trade,‖ Lond. 1691)

సరుకుల స్వభావంలోనే తలెత్తి, సరుకుల చలామణీలో ఉపరితలానికొచ్చే వైషమ్యం చలామణీ మాధ్యమాన్ని పెంచడం ద్వారా పోగొట్టవచ్చు అని స్విస్ ఆర్థికవేత్త JeanHerrenschwand (1728-1 812) వింత అభిప్రాయం వ్యక్తపరిచాడు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఒకపక్క, ఉత్పత్తిప్రక్రియ లోనూ, చలామణీ ప్రక్రియలోనూ స్తంభనకి(stagnation) కారణం చలామణీ మాధ్యమం సరిపోకపోవడం అనేది ప్రజల భ్రమ. మరొకపక్క, కరెన్సీ క్రమబద్ధీకరణ కోసం శాసనాల జోక్యం వంటి చర్యల ఫలితంగా ఏర్పడే వాస్తవ మాధ్యమం కొరత అటువంటి స్థబ్దతని కలిగించక పోవచ్చు అనడం మాత్రం ఏ విధంగానూ కుదరదు.

ఒకపక్క, చలామణీలో ఉన్న సరుకుల ధరల మొత్తం, మరొకవైపు, రూప పరివర్తనల విరుద్ధ దశలు ఒకదాన్నొకటి అనుసరించే వేగం. ఈ వేగం మీద ఒక నాణెంవల్ల సగటున ధరల మొత్తంల్లో ఎంత భాగం సిద్ధిస్తుందనేది ఆధారపడి ఉంటుంది. అయితే చలామణీలో ఉన్న సరుకుల ధరల మొత్తం సరుకుల మొత్తం మీదా, దానితోపాటు ఆసరుకుల ధరలమీదా కూడా ఆధారపడతాయి.

ఏమయినప్పటికీ ఈమూడు అంశాలూ- ధరల స్థితీ, చలామణీ అయ్యే సరుకుల పరిమాణమూ, డబ్బు చలన వేగమూ- అన్నీ మారుతూ ఉంటాయి. వాటి కలయికలతో ఈ మూడు అంశాలూ అనేక విధాలుగా మారుతుంటాయి. కనుక సిద్ధించాల్సిన ధరలమొత్తమూ, తత్ఫలితంగా ఆధరలమొత్తం మీద ఆధారపడే చలామణీ మాధ్యమం పరిమాణమూ ఆయా మార్పులకు అనుగుణంగా మారుతుంటాయి. ఈ మార్పులలో ధరల చరిత్రలో అత్యంత ప్రధానమైన వాటిని మాత్రమే ఇక్కడ పరిశీలిస్తాము.

ధరలు స్థిరంగా ఉన్నా, చలామణీ మాధ్యమం పరిమాణం పెరగవచ్చు- సరుకుల సంఖ్య పెరగడం వల్లగానీ, చలన వేగం తగ్గడం వల్లగానీ, పై రెండూ కలసినందువల్ల గానీ ఈపరిస్థితి ఏర్పడుతుంది. మరొకపక్క, చలామణీ మాధ్యమం పరిమాణం తగ్గవచ్చు – సరుకుల సంఖ్య తగ్గినందువల్లగానీ, వాటి చలామణీ వేగం పెరిగినందువల్ల గానీ ఈపరిస్థితి ఏర్పడుతుంది.

సరుకుల ధరలు పెరిగినా, వాటి పెరుగుదలకి అనుగుణంగా సరుకుల సంఖ్య తగ్గితే చలామణీ మాధ్యమం పరిమాణం మారదు, స్థిరంగా ఉంటుంది. సరుకుల సంఖ్య స్థిరంగా ఉండి, ధరల పెరుదలకి తగిన నిష్పత్తిలో డబ్బు చలన వేగం పెరిగినా కూడా చలామణీ మాధ్యమం పరిమాణం మారదు, స్థిరంగా ఉంటుంది. సరుకుల సంఖ్య మరింత వేగంగా తగ్గినా, డబ్బు చలన వేగం మరింతగా పెరిగినా, చలామణీ మాధ్యమం పరిమాణం తగ్గవచ్చు.

సరుకుల ధరలు తగ్గినా, అవి తగ్గిన నిష్పత్తికి తగినట్లు సరుకుల సంఖ్య పెరిగితే చలామణీ మాధ్యమం పరిమాణం మారదు, స్థిరంగా ఉంటుంది.

సరుకుల ధరలు తగ్గినా, డబ్బు చలన వేగంఅదే నిష్పత్తిలో తగ్గితే చలామణీ మాధ్యమం పరిమాణం మారదు, స్థిరంగా ఉంటుంది.

ధరలు తగ్గేదానికన్నా మరింత వేగంగా సరుకుల సంఖ్య పెరిగితే చలామణీ మాధ్యమం పరిమాణం పెరుగుతుంది. అలాగే ధరలు తగ్గేదానికన్నా మరింతగా చలన వేగం తగ్గితే కూడా చలామణీ మాధ్యమం పరిమాణం పెరుగుతుంది.

వేర్వేరు అంశాల్లో వచ్చే మార్పులు ఒకదాన్నొకటి సరిపుచ్చుకోవచ్చు. అలా జరిగితే, అస్థిరత ఉన్నప్పటికీ సిద్ధించాల్సిన సరుకుల ధరల మొత్తమూ, చలామణీ లో ఉన్న డబ్బు పరిమాణమూ స్థిరంగా ఉంటాయి. ఫలితంగా దీర్ఘకాల వ్యవధుల్ని తీసుకుంటే, ఏ దేశంలోనైనా చలనంలో ఉన్న డబ్బు పరిమాణంలో సగటు స్థాయికి కలిగే వ్యత్యాసాలు మనం మొదట అనుకునేదానికన్నా తక్కువే. నిర్ణీత కాలానికి వచ్చే పారిశ్రామిక, వాణిజ్య సంక్షోభాలవల్ల కలిగే తీవ్ర కుదుపుల్నీ (perturbations నీ, అంతకన్నా తక్కువ తరచుగా వచ్చే డబ్బు విలువలో హెచ్చుతగ్గులవల్ల కలిగే తీవ్ర కుదుపుల్నీ పక్కనబెడితే, వ్యత్యాసాలు మనం మొదట అనుకునేదానికన్నా తక్కువే.

ఇక చివరి పేరాలో: ధరలు డబ్బు పరిమాణాన్ని బట్టి ఉంటాయి- అనే భ్రమని గురించి చర్చిస్తాడు. ఈచర్చక్రిటిక్ లో మరింత వివరంగా సాగుతుంది. ముందుగా నియమాన్ని రూపొందిస్తాడు: ఇది డబ్బుయొక్క పరిమాణ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఉంటుంది.

చలామణీలో ఉండే డబ్బు పరిమాణాన్ని నిర్ణయించేది ఏది? చలామణీలో ఉన్న సరుకుల ధరలూ, సగటు చలన వేగమూ (velocity). దీన్నే మరోరకంగా చెప్పవచ్చు: సరుకుల విలువలమొత్తం ఎంతో, వాటి రూపపరివర్తనల సగటు వేగం ఎంతో ఇస్తే, (given) డబ్బుగా ఉండాల్సిన లోహం పరిమాణం ఆ లోహం విలువమీద ఆధారపడి ఉంటుంది.

ఇందుకు భిన్నమైన తప్పు అభిప్రాయాలు:

మారక మాధ్యమం చేత ధరలు నిర్ణయించబడతాయి;మారక మాధ్యమం దేశంలో ఉన్న అమూల్య లోహాల పరిమాణాన్ని బట్టి ఉంటుంది.

ఈ అభిప్రాయాలు అర్థంపర్థంలేని, అసంబద్ధ పరికల్పన (absurd hypothesis) మీద అధారపడ్డది. ఆపరికల్పన ఇదే:

మొదట చలామణీలో ప్రవేశించేటప్పుడు సరుకులు ధరలేకుండా ఉంటాయి, డబ్బు విలువ లేనిదిగా ఉంటుంది.

ఒకసారి చలామణీలో చేరాక సరుకుల్లో కొంతభాగం అమూల్యలోహాల కుప్పలో కొంత భాగంతో మారకం అవుతాయి – అనుకోవడమే ఈ తప్పు అభిప్రాయానికి మూలం.

నియమం : చలామణీ మాధ్యమం పరిమాణం చలామణీలో ఉన్న సరుకుల ధరల మొత్తం చేతా, డబ్బు సగటు చలన వేగం చేతా నిర్ణయమవుతుంది. దీన్నే ఇలాకూడా చెప్పవచ్చు: సరుకుల విలువల మొత్తమూ, వాటి రూప పరివర్తనల సగటు వేగమూ తెలిస్తే డబ్బుగా ఉన్న లోహం పరిమాణం ఆలోహం విలువ మీద ఆధారపడి ఉంటుంది.

ఒక దేశంలో వర్తకం నడవడానికి ఒక నిర్దిష్ట పరిమాణంలో డబ్బు కావాలి. అంతకుమించి ఉన్నా, తగ్గినా ఇబ్బందవుతుంది.చిన్న చిల్లర వర్తకంలో వెండి డబ్బుని మార్చడానికి ఒక నిష్పత్తిలో ఫార్దింగులు* అవసరమవుతాయి. (*ఫార్దింగు అనేది ఇంగ్లండ్ లో పెన్నీ లో నాలుగో వంతు విలువ గల చిన్న ఇత్తడి నాణెం.)

అతిచిన్న వెండి ముక్కలతోకూడా లెక్క సర్దుబాటు కాదు. అందుకు ఫార్దింగులు అవసరం. అవసరమైన ఫార్దింగుల సంఖ్య నిష్పత్తి ప్రజల సంఖ్యనిబట్టీ, వాళ్ళ మారకాల వేగాన్ని బట్టీ ఉంటుంది.అలాగే చిన్న వెండి నాణేల విషయంలోనూ.అదేవిధంగా వ్యాపారంలో అవసరమైన డబ్బు (బంగారం వెండీ )నిష్పత్తి కూడా మారకాల వేగాన్నిబట్టీ, చెల్లింపులు ఎంత పెద్దవి అనేదాన్ని బట్టీ నిర్ణయమవుతాయి.–విలియం పెట్టీ A Treatise of Taxes and Contributions.1667

డేవిడ్ హ్యూమ్ సిద్ధాంతాన్ని జే.స్టువర్ట్ ప్రభ్రుతులు విమర్శించినప్పుడు, హ్యూమ్ ని ఏ.యంగ్ సమర్ధించాడు.** తన Political Arithmetic (1774)లో 'ధరలు డబ్బు పరిమాణం మీద ఆధారపడతాయి' అనే పేరుతో ఒక ప్రత్యేక అధ్యాయమే ఉంది.

ఆడమ్ స్మిత్ పొరపాటు గురించి తన క్రిటిక్ లో ప్రస్తావించినదాన్ని ఇక్కడ చెబుతాడు: ఆయన (స్మిత్) చలామణీలో నాణేల పరిమాణం సమస్య గురించి మాటయినా చెప్పకుండా దాటవేస్తాడు.డబ్బు కేవలం ఒక సరుకు మాత్రమే అని డబ్బుని గురించి తప్పుఅభిప్రాయంతో ఉన్నాడు. అయితే తన సొంత సిద్ధాంతాలు వృద్ధిపరిచే టప్పుడు మాత్రమే స్మిత్ ఇలాంటి అభిప్రాయంతో ఉంటాడు. తనకు ముందున్న అర్ధశాస్త్రాన్ని విమర్శ చేసే సందదర్భలో లాగానే, అప్పుడప్పుడు సరైన అభిప్రాయం చెబుతాడు:

ప్రతి దేశంలోనూ నాణేల పరిమాణం వాటిద్వారా చలామణీ అయ్యే సరుకుల విలువని బట్టి నిర్ణయమవుతుంది. . ప్రతి సంవత్సరం ఏదేశంలోనైనా అమ్మే,కొనే వస్తువుల విలువ చలామణీకి, వాటి పంపిణీకీ ఒక నిర్దిష్ట పరిమాణంలో డబ్బు అవసరం. అంతకు మించి అవసరం ఉండదు. చలామణీ కాల్వ తను నిండటానికి సరిపోయే మొత్తాని మాత్రమే లాక్కుంటుంది. అంతకుమించి అనుమతించదు. (—Wealth of Nations)

డబ్బు పరిమాణ సిద్ధాంతం రావడానికి మూలాన్ని బయటకు తెచ్చాడు మార్క్స్.

తప్పు అభిప్రాయం: ధరలు చలామణీ మాధ్యమం పరిమాణాన్ని బట్టి నిర్ణయమవుతాయి. చలామణీ మాధ్యమం పరిమాణం, దేశంలో ఉన్న అమూల్య లోహాల పరిమాణం మీద ఆధారపడి ఉంటుంది.

మారక మాధ్యమం చేత ధరలు నిర్ణయించబడతాయి;

మారక మాధ్యమం దేశంలో ఉన్న అమూల్య లోహాల పరిమాణాన్ని బట్టి ఉంటుంది.

ప్రజల దగ్గర వెండి బంగారాలు పెరిగేకొద్దీ, సరుకుల ధరలు కచ్చితంగా పెరుగుతాయి. ఏదేశంలోనైనా వెండి బంగారాలు తగ్గితే అన్ని సరుకుల ధరలూ అదే నిష్పత్తిలో తగ్గుతాయి – అని జాకబ్ వాండర్ లింట్ 'Money Answers all Things' (1734)లో సూత్రీకరించాడు. హ్యూమ్ ఆపుస్తకాన్ని కచ్చితంగా చదివి ఉంటాడని

మార్క్స్ తేల్చుకున్నాడు. ధరలు చలామణీ మాధ్యమం పరిమాణం మీద ఆధారపడతాయి – అనే అభిప్రాయం బార్బన్ కీ, అతనికి ముందు మరికొందరికీ కూడా ఉంది. ఈ అభిప్రాయం తప్పు.

ఈ అభిప్రాయం అర్ధంపర్ధంలేని, అసంబద్ధ పరికల్పన (absurd hypothesis) మీద అధారపడ్డది. ఆపరికల్పన ఇదే:

చలామణీ లోకి ధర లేకుండా సరుకులూ,విలువలేకుండా డబ్బూ ప్రవేశిస్తాయనీ, ఒకసారి చలామణీలో చేరాక సరుకుల్లో కొంతభాగం అమూల్యలోహాల కుప్పలో ఒక పూర్ణాంక భాగంతో మారకం అవుతుంది – అనుకోవడమే ఈ తప్పు అభిప్రాయానికి మూలం.

ప్రతిఒక్క రకం సరుకు ధరా చలామణీలో ఉన్న అన్నిసరుకుల ధరలమొత్తం లో భాగం అనేది స్వయం స్పష్టమే. అయితే ఒకే కొలమానంతో కొలవడానికి వీలుపడని ఉపయోగపు విలువలు మొత్తం ఒకే ఒక గ్రూప్ గా , దేశం లో ఉన్న మొత్తం వెండిబంగారాలతో ఎలా మారకం అవుతాయో అర్ధం అవని విషయం అంటాడు మార్క్స్. ఆవిధంగా 'డబ్బు పరిమాణ సిద్ధాంతం' రావడానికి మూలాన్ని బయటకు తెచ్చి, అదెలా తప్పో వివరించాడు.

## C. నాణెమూ, విలువ చిహ్నాలూ

సరుకుల ధరల నిర్ణయంలో బంగారం ప్రత్యక్షంగా ఉండక్కరలేదు. సరుకుల ధరలకు ఊహాత్మక బంగారం బరువు ప్రతినిధిగా ఉంటుంది. మార్కెట్లో ఏసరుకు కొనాలన్నా డబ్బుసరుకు కావాలి. ఆడబ్బు సరుకు బంగారం. మార్క్స్ కాలంలో అది బంగారం లేక వెండి. మూడో అధ్యాయం ఆరంభం లోనే ఈ పుస్తకం అంతటా బంగారాన్ని డబ్బు సరుకుగా భావిస్తాను అని చెప్పాడు.

### చలామణీలో నాణేలు తప్పనిసరి

చలామణీ సాధనంగా ఉండేటప్పుడు నిజమైన బంగారం అక్కడ ఉండాల్సిందే. చలామణీలో ఉండే బంగారం వేర్వేరుపరిమాణాల్లో ఉండే బంగారం ముక్కలుగా ఉంటుంది. ఆముక్కలు నాణేలరూపంలో ఉంటాయి. నిర్దిష్ట ఆకారంతో, నిర్దిష్ట బరువుతో ఉండే బంగారం ముక్కలే నాణేలు.1792లో డాలర్ వెండి నాణెం. బరువు 27గ్రాములు. 1834లో డాలర్ బంగారు నాణెం బరువు 1.5048 గ్రాములు. పౌండ్ స్టెర్లింగ్ 7.98 గ్రాములు బరువుండే బంగారు నాణెం. 1862 లో వెండి రూపాయి వచ్చింది. దాని బరువు 11.66 గ్రాములు. నాణ్యత 0.917. నాణెం వ్యాసం 30.5 మి.మీ. గుండ్రని ఆకారం. 1939 లో నాణ్యత తగ్గించారు. 1947లో వెండి బదులు నికెల్ నాణేలు ముద్రించారు.

తొలి నాణేలు లిడియా దేశానివి.క్రీ.పూ. 7వ శతాబ్దానికి చెందినవి. వెండి బంగారం మిశ్రమలోహం(ఎలెక్ట్రం)తో చేసినవి. పెద్దనాణెం బరువు 4.7గ్రాములు(Stater లోమూడోవంతు). పేరు ట్రైట్ (Trite) చిన్న చిన్న నాణేలూ ఉన్నాయి.stater ఆరోవంతు, పన్నెండో వంతు నించి 96వ వంతుదాకా ఉన్నాయి.

ఏ దేశంలో నయినా ఎక్కువ విలువగల నాణేలతోపాటు కొద్దివిలువలున్నవి కూడా ఉంటాయి. దశాంశ విధానం అమలుకు ముందు ఇంగ్లండ్ లో అతి తక్కువ విలువగల నాణెం ఫార్తింగ్. 4 ఫార్తింగుల నాణెం పెన్నీ. 12 పెన్నీల నాణెం షిల్లింగ్. 2 షిల్లింగుల నాణెం ఫ్లానిన్. అయిదు షిల్లింగుల నాణెం క్రౌన్. 20 షిల్లింగుల నాణెం పౌండ్ (సావరిన్) .21 షిల్లింగుల నాణెం గ్వినియా. పౌండ్ లో ఫార్తింగ్ 960 వ వంతు.

గతంలో ఇండియాలో రూపాయి, అర్ధరూపాయి, పావలా, బేడా, అణా అర్ధణా, కానీ, దమ్మిడీ/పైసా. అతి తక్కువ విలువైనది పైసా. 2 పైసలు అర్ధణా. 4 పైసలు అణా. రెండు అణాలు బేడ. నాలుగు అణాలు పావలా. రెండు పావలాలు అర్ధరూపాయి. 2 అర్ధరూపాయలు ఒక రూపాయి. బేడ,అర్ధణా నలచదరంగా ఉండేవి. మిగిలినవి గుండ్రంగా ఉండేవి. మధ్యలో చిల్లి ఉన్న కానీ లుండేవి. వాటిని పిల్లలు మొలతాడులో కట్టుకునేవాళ్ళు కూడా. అతి చిన్నది దమ్మిడీ.అది రూపాయిలో 192 వ వంతు. దేశం మారితే నాణేల పేర్లూ,వాటి బరువులూ ఆకారాలూ మారతాయి. చలామణీలో ఆప్రాంత నాణేలు ఉండి తీరాల్సిందే.

## నాణేల ముద్రణ కూడా రాజ్యం పనే.

నాణేలు ముద్రించే విశిష్టాధికారం రాజ్యానిదే. ధరల ప్రమాణం ఏర్పాటు లాగానే నాణేల ఏర్పాటు కూడా రాజ్యం పనే. ఫలానింత బంగారం ఒక డాలర్ అని చట్టం చెబితేనే సరిపోదు. అది చలామణీ కోసం రెడీగా ఉండాలి. అంటే అది ముద్రణ అయి ఉండాలి. అంటే, రాజ్యం రెండు చర్యలు చేస్తుంది

1.ధరల ప్రమాణాన్ని ఏర్పరచడం. ఈ ఏర్పాటు ఒక డబ్బు యూనిట్ ఎంత బంగారానికి ప్రతినిధిగా ఉంటుందో చెబుతుంది. ఉదాహరణకి 1834లో డాలర్ బంగారు నాణెం బరువు 1.5048 గ్రాములు. 1792లో డాలర్ వెండి నాణెం. బరువు 27గ్రాములు.

2. బంగారాన్ని నాణేలు గా ముద్రిస్తుంది. యూనిట్ల పేరుతో బంగారాన్ని నాణేలుగా మారుస్తుంది.

వేర్వేరు దేశాలు వేర్వేరు నాణేల్ని ఉపయోగించాయి.కారణం వేర్వేరు ధరల ప్రమాణాలు ఉండడమే. అంతర్జాతీయ బదిలీలకి, ఈ నాణేల్ని బులియన్లోకి కరగించ వలసిందే.

సంపదపెరిగేకొద్దీ తక్కువ విలువగల లోహాలు పోయి వాటిస్థానంలో మరింత విలువగల లోహాలు నాణేలుగా వచ్చాయి. వెండి రాగిని తొలగించింది. వెండిని బంగారం తోసివేసింది. ఒకప్పుడు పౌండ్ అనేది ఒక పౌను వెండికి పెట్టిన డబ్బు పేరు. బంగారం వెండిని తొలగించగానే, పౌనులో 15 వ వంతు బంగారానికి అదే పేరు కొనసాగింది. అది బంగారం వెండి విలువల నిష్పత్తిని బట్టి ఏర్పడింది. డబ్బు పేరుగా పౌండ్, బంగారం బరువు పేరుగా పౌండ్ వేరువేరు విషయాలయ్యాయి.

100 పౌన్ల 22 కేరెట్ల బంగారానికి 4672½ బంగారు సావరిన్లోస్తాయి. రెంటినీ త్రాసు సిబ్బెల్లో పెడితే తూకం సమంగా వుంటుంది. దీన్నిబట్టి సావరిన్ అనేది నిర్దిష్ట ఆకృతి, ముద్ర ఉన్న బంగారం పరిమాణం మాత్రమే.- అని రుజువవుతుంది.- క్రిటిక్

## నాణేలు స్థానికంగా మాత్రమే చెల్లుతాయి. సార్వత్రికంగా చెల్లవు.

నాణేలధర నిర్ధారించడమూ, వాటిని ముద్రించడమూ రాజ్యం చేతిలో ఉంటుంది. ముద్రిత నాణెం స్థానిక, రాజకీయ స్వభావంతో ఉంటుంది. భిన్న జాతీయ భాషల్ని వాడుతుంది. భిన్న జాతీయ యూనీఫాం లను ధరిస్తుంది. ప్రపంచామార్కెట్లో ఆయూనిఫాంలను విప్పేస్తుంది. ఇంగ్లాండ్ లో నాణెం పౌండ్ స్టెర్లింగ్ అనే యూనిఫాం ధరిస్తుంది. అది ఇంగ్లండ్ ఎల్లల లోపల చెల్లుతుంది. ఎల్లలు దాటితే యూనిఫాం విప్పుతుంది. అంటే బంగారంగా ఉంటుంది. బంగారం డబ్బుగా ఎక్కడైనా చెల్లుతుంది. నాణేలరూపంలో ఉన్న డబ్బు ఒక కమ్యూనిటీ హద్దుల్లో మాత్రమే చెల్లుతుంది. అన్ని ప్రాంతాలలో సార్వత్రికంగా చెల్లుబాటు కాదు. రూపాయలు చైనాలో చెల్లవు. ఎన్లు ఇంగ్లండ్ లో నడవవు. ఒక్క ముక్కలో ఏదేశ నాణెమైనా ఎల్లలు దాటితే చెల్లదు.

## నాణేలు చలనంలో అరుగుతాయి

నాణేలకి చేతులు తగులుతాయి, సంచులు, పర్సులు,పెట్టెలు తగులుతాయి.అందువల్ల నాణెం ఇక్కడొక కణం (particle) అక్కడొక కణం కోల్పోతుంది. చలనాలు పెరిగేకొద్దీ అరుగుతుంది. .-క్రిటిక్

నాణేలు చలనంలో అరుగుతాయి- కొన్ని ఎక్కువగానూ, కొన్ని తక్కువగానూ.

రొట్టెలవాడు ఒకరోజు తీసుకున్న సావరిన్ ని మర్నాడు మిల్లర్ కి ఇస్తాడు. అయితే అది కచ్చితమైన సావరిన్ కాదు.అతను తీసుకున్నప్పటికంటే కొంచెం తేలికయినది.

బాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్ 1848 లో హౌస్ ఆఫ్ లార్డ్స్ కమిటీ కి ఇలా చెప్పాడు: ప్రతి ఏడాదీ కొత్తగా కొన్ని సావరిన్లు చాలా తేలిక అవుతున్నాయి.ఒక సంవత్సరం సమానంగా తూగిన సావరిన్లు మరుసంవత్సరం అరుగుదలవల్ల తగినంత బరువు కోల్పోతున్నాయి.

1809లో యూరప్ లో 38కోట్ల పౌండ్ లు ఉన్నాయి.1829 వచ్చేసరికి 20 ఏళ్లలో 1కోటీ 90లక్షల పౌండ్ లు అరుగుదలవల్ల అదృశ్యమయ్యాయి-అని జాకబ్ అంచనావేసాడు.

## నాణెం ఉండాల్సిన బరువూ, ఉన్న బరువూ వేరవుతాయి

ఒకే పేరుగల భిన్న నాణేలు బరువులో తేడాలున్నందు వల్ల వాటి విలువలో తేడా ఏర్పడుతుంది. ముద్రించినప్పుడు 10 పౌండ్ నాణేలని తూస్తే అన్నీ సమంగా ఉంటాయి. చలామణీలో చేతులు మారుతున్నాక, వాటినే తూస్తే అరిగినందువల్ల ఒక్కొక్కటి ఒక్కక్క బరువు ఉంటుంది. ధరల ప్రమాణంగా బంగారం బరువు, చలామణీ మాధ్యమంగా బంగారం బరువు నుండి పక్కకుపోతుంది. ఆకారణంగా అది సిద్ధంపచేసే సరుకుల ధరలకు సమానకంగా ఇక ఉండదు.

నాణెంగా దానిబరువుకీ బంగారంముక్క గా దాని బరువుకీ తేడా వస్తుంది. 'ఇక మిగిలి ఉండేది దాని నీడ. నాణెం శరీరం ఇప్పుడు కేవలం నీడ మాత్రమే'-క్రిటిక్

magni nominis umbra అనే లాటిన్ పదబంధాన్ని ప్రయోగించాడు. దానర్థం ఘనత తగ్గిన గొప్ప పేరు యొక్క నీడఅని. ఒక నాణెం ఎన్ని ఎక్కువ చలనాలు జరిపితే, అంత ఎక్కువ అరుగుతుంది. మొదట్లో ఉన్న బరువుకన్నా చలామణీవల్ల దానిబరువు తగ్గుతుంది. ఇక మిగిలేది నీడ. నాణెం శరీరం ఇప్పుడు నీడ

మాత్రమే. అయినప్పటికీ ప్రతి కొనుగోలులోనూ అమ్మకం లోనూ అది మొదట్లో ఉన్న బరువుగానే చలామణీ అవుతుంది- సూడో సావరిన్ గా .

"సూడో సావరిన్ చట్టబద్ధంగా బంగారు నాణెంగా పనిచేస్తుంది."-క్రిటిక్

బరువుతగ్గినా వాటి ముఖవిలువనే అంగీకరించాలని చట్ట నియంత్రణ ఉంటుంది. అందువల్ల జనం దాన్ని వద్దనలేరు. తీసుకుంటారు.నాణెం ఉండాల్సినంత బరువు ఉండక పోయినా అంతే బరువు వున్నట్లు చలామణీ అవుతుంది. అంటే, నాణెం 'విలువ చిహ్నం '(token of value)అవుతుంది.

చలామణీలో నాణేల బరువు తగ్గడం(బరువుతగ్గినా వాటి ముఖవిలువనే అంగీకరించాలని చట్ట నియంత్రణ) అనేది ధరల ప్రమాణం గానూ (అంటే, కొంత బరువున్న బంగారాన్ని నిర్ధారించి, దానికి ఒక డాలర్ అనో, ఒక పౌండ్ స్టెర్లింగ్ అనో పేరుపెట్టడం), చలామణీ సాధనంగానూ (తక్కువ బరువున్న నాణేలు కూడా పనిచెయ్యగలవు) విడివడడానికి మొదటి అడుగు.

చలామణీలో కొంచెం తక్కువ బరువున్న నాణేలు చెల్లడం, బంగారు నాణేల బదులు తక్కువ విలువున్న నాణేల్ని వాడ వచ్చు అని తెలియజెప్పింది. తక్కువ విలువున్న బంగారు నాణేల తోనే ఇది ఆగలేదు. మరింత ముందు పోయింది. బంగారు నాణేల బదులు వెండి, రాగి నాణేలు వచ్చాయి.

బంగారు నాణేల స్థానంలో తక్కువ విలువగల వెండి, రాగి నాణేలు రావడం అనేది మొదటి అడుగు మాత్రమే. తర్వాతి అడుగు అసలేవిలువా లేని వస్తువుల్ని కాగితం ముక్కల వంటి వాటిని వాడడమే.

ఇది చెప్పాక మార్క్స్ 'మొదటి అడుగే లెక్క (matters)' అంటాడు.

కొంచెం తక్కువ బరువున్న నాణేల్ని చలామణీ చెయ్యడమే మొదటి అడుగు. ఇది ఒక విషయాన్ని చెబుతుంది: ముఖవిలువ కన్నా తక్కువ విలువ వున్న బంగారు నాణేల్నితీసుకోడానికి జనం అభ్యంతరపెట్టరు.పెట్టలేరు. ఇక ఆపరిస్థితిలో వెండి, రాగి నాణేలూ, కాగితం డబ్బూ రావడం దాదాపు ఆటోమేటిక్. బంగారు నాణేల నుండి కాగితం డబ్బుదాకా సాగిన ప్రయాణాన్ని వివరిస్తాడు.

## నాణేల బదులు వాటి 'చిహ్నాలు'

మొదటి అడుగు- తక్కువ బరువున్నా, నిర్ణయించిన బరువే ఉన్నట్లుగా చలామణీ అవడం.

రెండో అడుగు –బంగారానికి బదులు మరొక పదార్థం ఏదయినా చిహ్నంగా వాడడం.

నాణేల చలనం అవి ఉండాల్సిన (నామక) బరువునీ, నిజంగా ఉన్న బరువునీ వేరుపరుస్తుంది. ఒకవైపు లోహంముక్కలుగా, మరొకవైపు నిర్దిష్ట చర్యనిర్వహించే నాణేలుగా తేడా ఏర్పరుస్తుంది. లోహ నాణేల స్థానంలో మరేదయినా పదార్థంతో చేసిన 'చిహ్నాల'ని(tokens) వాడవచ్చు. అంటే నాణేల లాగే ఉపకరించే 'గుర్తుల్ని' (symbols) వాటికి బదులు వాడవచ్చు.నాణెం తయారయ్యేది బంగారంతో. మరేఇతర పదార్థంతో తయారైనా అది నాణెం కాదు. నాణేనికి చిహ్నం మాత్రమే. బాంకులో టోకెన్ ఇస్తారు. అదిస్తే దానికి బదులు డబ్బిస్తారు. మరొక బాంకులో ఇవ్వరు. ఏబంకులోనూ అది చెల్లదు. అలాంటిటోకెన్ ని 'మార్చుకోగల టోకెన్' అంటాం. పౌండ్ స్టెర్లింగ్ నాణెం అంటే నిర్దిష్ట బరువున్న బంగారం. పౌండ్ స్టెర్లింగ్ నోటు అనేది ఏమీ విలువలేని ఒక

కాగితం ముక్క. అయినా ఈ కాగితంముక్క బంగారునాణెం లాగే చలామణీలో పాల్గొంటుంది. అందుకే అది చిహ్నం.

మరొకపరిస్థితి కూడా ఉంది.

1.అతి కొద్ది బంగారాన్నీ, వెండినీ నాణేలుగా ముద్రించడం కష్టం.

2. విలువ కొలమానంగా ఆరంభంలో ఎక్కువ విలువైన లోహాల్నికాకుండా తక్కువ విలువైన లోహాల్నివాడిన పరిస్థితి ఉంది. వెండి కాకుండా రాగి, బంగారం కాకుండా వెండి. మరింత విలువైనది వచ్చే వరకూ ఈతక్కువ విలువైనదే చలామణీ అయిన పరిస్థితి ఉంది.

ఈ వాస్తవాలు బంగారు నాణేలకి ప్రత్యామ్నాయాలుగా రాగీ వెండీ చరిత్రలో పోషించిన పాత్రల్ని వివరిస్తాయి. నాణేలు మరీ వేగంగా చేతులు మారే ప్రాంతాల్లో అంటే, అవి మరీ ఎక్కువగా అరిగే చోట్ల, బంగారు నాణేల స్థానంలో వెండి నాణేలు, రాగి నాణేలూ వచ్చాయి. కొద్దిస్థాయి అమ్మకాలూ, కొనుగోళ్ళూ నిరంతరాయంగా సాగే చోట్ల అలా జరుగుతుంది. ఈ ఉపగ్రహాలు శాశ్వతంగా బంగారం స్థానంలో స్థిరపడకుండా నిరోధించేందుకు చట్టాలుంటాయి. బంగారం బదులు వాటిని ఏమేరకు అనివార్యంగా అంగీకరించాలో చట్టాలు నిర్ణయిస్తాయి.

చలామణీలో రకరకాల నాణేలు నడిచే ప్రత్యేక దారులు, సహజంగానే ఒకదానిలోకి మరొకటి వెళ్తాయి. చిహ్నాలు బంగారంతో తోడుగా ఉంటాయి- అతిచిన్న బంగారు నాణేలయొక్క చిల్లర భాగాలు(fractional parts) చెల్లించడానికి; ఒకపక్క బంగారం చిల్లర చలామణీలో(retail circulation) కి వస్తూ వుంటుంది. మరొకపక్క నిరంతరాయంగా బయటకు గెంటివేయబడుతుంది – చిహ్నాలలోకి మారడంద్వారా. ఈ విషయం గురించి డేవిడ్ బుకానిన్ చెప్పినమాటలు ఫుట్ నోట్లో ఉంటాయి:

"చిల్లర చెల్లింపులకు అవసరమైన వెండి కంటే ఎక్కువ వెండి లేకపోతే, పెద్ద చెల్లింపులకు వెండిని సేకరించడం వీలవదు. ముఖ్య చెల్లింపుల్లో బంగారం వాడడం ఉన్నదంటే చిల్లర వర్తకంలోనూ బంగారం వాడకం ఉన్నట్లే అని అర్థం: బంగారు నాణెంఉన్నవ్యక్తి చిన్న కొనుగోళ్లకు కూడా వాటినిచ్చి కొన్న సరుకుతోపాటు తనకు రావలసిన చిల్లరని వెండిరూపంలో తీసుకుంటాడు; ఆవిధంగా చిల్లరవర్తకునికి చేరే అదనపు వెండి చలామణీలో చేరుతుంది. చిన్న చెల్లింపులకు సరిపడేంత వెండి- బంగారంతో పనిలేకుండా – ఉంటే, చిల్లర వర్తకుడు చిల్లర కొనుగోళ్లకు వెండినే పొందుతాడు; వెండి అతని చేతుల్లో పోగు పడుతుంది."- డేవిడ్ బుకానిన్

## చలామణీ ప్రక్రియలో ఒక ఔన్స్ నిజంగా 10 ఔన్సులంత అవచ్చు

ఈసావరిన్లు వేర్వేరుచోట్ల చలామణీలో ఉంటాయి. ప్రతిరోజూ ఎన్నో కొన్ని చలనాలు చేస్తాయి. కొన్ని సావరిన్లు ఎక్కువ చలనాలు చేస్తాయి, కొన్ని తక్కువ చేస్తాయి.ఒక ఔన్స్ బంగారం ఒక రోజులో చేసే సగటు చలనాలు 10 అయితే, 1200 ఔన్సుల బంగారం 12000 ఔన్సుల బంగారం ఎంత మొత్తం సరుకుల ధరలను సిద్ధింప చేస్తుందో,అంత సిద్ధింప చేస్తుంది. అంటే 46,725సావరిన్లు సిద్ధింప చేసేటంత. ఔన్సు బంగారం ఎటు తిప్పినా ఎలావంచినా 10 ఔన్సులు తూగదు. అయితే ఇక్కడ చలామణీ ప్రక్రియలో ఒక ఔన్స్ నిజంగా 10 ఔన్సులంత

అవుతుంది. చలామణీ ప్రక్రియలో ఒక నాణెం అదిచేసే చలనాల సంఖ్యచేత హెచ్చవేస్తే ఎంత బంగారం అవుతుందో అంతకు సమానం.ఒక నిర్దిష్ట పరిమాణంగల బంగారం ముక్కగా వాస్తవ మనుగడకు తోడు, నాణెం అది చేసే చర్య వల్ల నామమాత్రపు మనుగడను కూడా పొందుతుంది.ఒక సావరిన్ ఒక చలనం చేసినా, పది చలనాలు చేసినా,ప్రతి ప్రత్యేకఅమ్మకంలోనూ, కొనుగోలు లోనూ ఆ నాణెం ఒక్క సావరిన్ గా మాత్రమే పనిచేస్తుంది.- .-క్రిటిక్

## వెండి, రాగి టోకెన్ లలో లోహం బరువుని రాజ్యం ఇష్టానుసారం నిర్ణయిస్తుంది

చలనంలో అవి బంగారు నాణేల కంటే తొందరగా అరుగుతాయి. నాణెంగా బంగారం చర్య ఆబంగారం లోహ విలువకు సంబంధం లేకుండా స్వతంత్ర మైనదవుతుంది. అందువల్ల, ఎవిలువా లేని వస్తువులు- కాగితం నోట్ల వంటివి- బంగారం నాణేల స్థానంలో ఉపకరించగలవు. ఈ చిహ్న స్వభావం లోహ చిహ్నలలో కొంత మేరకు మరుగున పడుతుంది. కాగితం డబ్బులో కొట్టొచ్చినట్లు కానొస్తుంది. వాస్తవానికి, మొదటి అడుగు మీదే మొత్తం ఆధారపడి ఉంటుంది.

ఇక్కడ ప్రస్తావిస్తున్నది బంగారంలోకి మార్చుకోడానికి వీలులేని కాగితం డబ్బు (inconvertible paper money)గురించి. అది రాజ్యం జారీచేసినదే. అనివార్యంగా చలామణీ అవుతున్నదే. కాగితం డబ్బు పుట్టుక లోహ కరెన్సీయే. మరొకపక్క, అప్పుమీద ఆధారపడ్డ డబ్బు ఇతర పరిస్తితులని తెలుపుతుంది. ఆపరిస్థితులు మన సరళ సరుకుల చలామణీ దృష్ట్యా ఇప్పటికింకా మనకి తెలియవు. అయినా ఒక విషయం గట్టిగా చెప్పగలం. ఏమంటే, చలామణీ సాధనంగా డబ్బు చర్యలో కాగితం డబ్బుఏర్పడినట్లే, చెల్లింపు సాధనంగా డబ్బుచేసే చర్యలో ‘అప్పుపై ఆధారపడిన డబ్బు’ సహజంగా ఏర్పడింది.

## చలామణీలో కాగితం డబ్బు ఎంత ఉండాలి?

రాజ్యం కాగితంముక్కలమీద 1 పౌండ్, 5 పౌండ్లు వగయిరా పేర్లు ముద్రించి చలామణీలో పెడుతుంది.

అవి వాస్తవంగా అంతే మొత్తం బంగారం స్థానంలో ఉన్నమేరకు, వాటిచలనం డబ్బు చలనాన్ని నియంత్రించే నియమాలకు అనుగుణంగా ఉంటుంది. కాగితం డబ్బు చలామణీకి సంబంధించిన ప్రత్యేక నియమం, ఆ కాగితం డబ్బుప్రాతినిధ్యం వహించే బంగారం నిష్పత్తి నుంచి ఏర్పడుతుంది. అటువంటి నియమం ఉంది; అది ఇదే: చిహ్నలచేత తొలగించబడకుండా, ఎంత బంగారం వాస్తవ చలామణీ లో ఉండేఉండేదో ఆమొత్తం బంగారం/వెండి కన్నా కాగితం డబ్బు ఎక్కువ వుండకూడదు. ఇప్పుడు చలామణీ ఇముడ్చుకోగల బంగారం పరిమాణం ఎప్పటికప్పుడు ఒక స్థాయికి అటూ ఇటూ హెచ్చుతూ,తగ్గుతూ ఉంటుంది. అయినాగాని, ఒకానొక దేశంలో చలామణీ మాధ్యమం మొత్తం కనీస స్థాయినించి కిందికి ఎన్నటికీ పడనేపడదు. ఈకనీస స్థాయి ఎంతో, అనుభవంతో నిర్ధారించవచ్చు. ఈ కనీస మొత్తం దాని భాగాలలో మార్పులు చెందుతుంది అనే వాస్తవంగానీ, దానిలో ఉండే బంగారు ముక్కల స్థానంలో ఎప్పటికప్పుడు కొత్తవి వస్తాయి అనే వాస్తవం కానీ దాని మొత్తంలోనూ,దాని చలామణీ సాగింపులోనూ ఏమార్పూ కలిగించదు. అందువల్ల దాని స్థానంలో కాగితం చిహ్నలు ఉంచవచ్చు. మరొకపక్క చలామణీ కాలువలు (conduits) అన్నీఅవి ఇముడ్చుకోగల

పూర్తిస్థాయిలో కాగితం డబ్బుతో ఇవ్వాళ నిండిపోతే, సరుకుల చలామణీలో ఏర్పడే ఆటుపోట్ల(fluctuati) కారణంగా రేపు ఆకాలువలు పొంగి పొర్లవచ్చు. ఇక ప్రమాణం(standard)అంటూ ఏదీ ఉండదు.

కాగితం డబ్బు కి సరైన పరిమితి: వాస్తవ చలనంలో ఉండగలిగిన బంగారు నాణేల మొత్తం ఎంతో, అంతే. ఉదాహరణకి లక్ష పౌండ్లు బంగారు నాణేలు చలామణీలో ఉండాలి అనుకుంటే, కాగితం నోట్లయినా లక్ష పౌండ్లు మాత్రమే ఉండాలి. అదే పరిమితి. మించి ఉండకూడదు.

బంగారు నాణేలకి ఏనియమం వర్తిస్తుందో అదే నియమం కాగితం డబ్బుకీ వర్తిస్తుంది.

## ఎక్కువకాగితం డబ్బు వుంటే ఏమవుతుంది?

ఒకవేళ కాగితం డబ్బు పరిమితిని మించితే, అది అపఖ్యాతి పాలయ్యే ప్రమాదం ఉంటుంది. దానికి తోడు సరుకుల చలామణీ నియమాల ప్రకారం ఎంత బంగారం అవసరమో, అంత బంగారానికి మాత్రమే అది (ఆకాగితం డబ్బు) ప్రాతినిధ్యం వహిస్తుంది. ఉదాహరణకు లక్షపౌండ్ల ధర గల సరుకులుంటే, చలామణీలో లక్ష పౌండ్లు నాణేలు అవసరం. వాటి చిహ్నాలైన కాగితం నోట్లయినా అంతే ఉండాలి.

అలాకాకుండా, లక్షపౌండ్ల సరుకులే ఉండి, కాగితం డబ్బు 2 లక్షల పౌండ్లు జారీ అయ్యాయి అనుకుందాం. అప్పుడు అంతకుముందు లక్ష పౌండ్ల నాణేలకు వచ్చిన సరుకులు ఇప్పుడు రెండులక్షల కాగితం పౌండ్లవుతాయి. అంటే, అంతకు ముందు ఒక పౌండ్ ధరగా వ్యక్తమయిన విలువలు ఇప్పుడు రెండు పౌండ్ల ధరచేత వ్యక్తమవుతాయి. పౌండ్ అనే డబ్బుపేరు వాస్తవంగా ఔన్స్ బంగారంలో నాలుగోవంతుకి డబ్బుపేరు కాకాకుండాపోతుంది. ఎనిమిదోవంతుకు డబ్బుపేరు అవుతుంది.

ధరల ప్రమాణంగా బంగారం చర్యలో మార్పు వల్ల ఎలాంటి ప్రభావం ఉంటుందో, దీనివల్ల కూడా అలాంటి ప్రభావమే ఉంటుంది.

కాగితం డబ్బనేది బంగారానికి, డబ్బుకి ప్రతినిధిగా ఉండే టోకెన్ దానికీ సరుకుల విలువలకీ ఉన్న సంబంధం: సరుకుల విలువలు ఊహాత్మకంగా ఏ బంగారు పరిమాణాల్లో అయితే వ్యక్తమవుతాయో,
ఏబంగారు మొత్తాలు కాగితం చేత చిహ్నాలుగా ప్రాతినిధ్యం పొందుతాయో, అవే మొత్తాలలో సరుకుల విలువలు ఊహాత్మకంగా వ్యక్తీకరించబడతాయి. కాగితం డబ్బు (అన్ని సరుకులలాగే విలువ కలిగివున్న) బంగారానికి ఏమేరకు ప్రాతినిధ్యం వహిస్తుందో, ఆమేరకే అది విలువ చిహ్నంగా వుంటుంది.

## డబ్బు చర్యల విషయంలో ఆర్థిక వేత్తల తప్పు అభిప్రాయాలు

డబ్బు గురించి రాసిన అత్యుత్తమ రచయితలు సైతం డబ్బుచేసే భిన్న చర్యల విషయంలో చాలాఅస్పష్టతతో ఉన్నారు. ఎంత అస్పష్టతో ఫుల్లర్టన్ మాటలు స్పష్టం చేస్తాయి: మన దేశీయ మారకాలకు సంబంధించి, వెండి బంగారాలు నిర్వహించే ద్రవ్య చర్యలు అన్నీ, చట్టం వల్ల చేకూరిన కల్పితమైన/కృత్రిమమైన సాంప్రదాయకమైన విలువ తప్ప మరే విలువా లేని, మార్చుకోడానికి వీలుకాని నోట్ల (inconvertible notes) చలామణీ ద్వారా అంతే సమర్థవంతంగా జరగవచ్చు-అనేది నిరాకరించరాని వాస్తవం అని విశ్వసిస్తున్నాను.

ఈతరహా విలువ అంతర్గతవిలువ యొక్క అన్ని లక్ష్యాలకూ సమాధానమిచ్చేట్లు, చెయ్యబడవచ్చు. ఒక ప్రమాణం అవసరాన్ని తొలగించవచ్చు- అయితే జారీ అయ్యే నోట్ల పరిమాణాన్ని తగిన పరిమితిలో ఉంచాలి. వేరే మాటల్లో, చలామణీలో డబ్బుసరుకు స్థానంలో విలువ చిహ్నాలు చేరగలవు కనుక విలువ కొలమానంగానూ, ధరల ప్రమాణంగానూ అది అనవసరం అని అంటున్నాడు. ఈ విషయంలో ఫుల్లర్టన్ పెద్ద పొరపాటు చేశాడు. కారణం చలామణీ సాధనం చర్యనీ, విలువ కొలమానాన్నీ వేరుగా చూడలేకపోవడమే.

## అసలు విలువే లేని చిహ్నాలు బంగారం స్థానం లోకి ఎలా రాగలుగుతాయి?

ఇప్పటికే మనం ఒక విషయాన్ని గమనించాం. ఏమంటే: ప్రత్యేకంగా ఒక నాణెంగా పనిచేసినప్పుడు మాత్రమే, అంటే చలామణీ మాధ్యమంగా ఉన్నప్పుడు మాత్రమే చిహ్నం బంగారం స్థానంలో చేరగలదు. వేరే విధంగా చేరడం సాధ్యం అవదు. డబ్బుకి ఇదికాక చేయవలసిన ఇతర చర్యలు కూడా ఉన్నాయి. బంగారు నాణేనికి ఉన్నది, చలామణీ మాధ్యమంగా ఉండడం అనే ఒకేఒక పని మాత్రమే కాదు. అయితే అరిగిపోయినప్పటికీ చలామణీ అవుతున్న నాణేలు మాత్రం ఈఒక్క చర్యనే చేస్తాయి. ప్రతి డబ్బు ముక్కా కేవలం ఒక నాణెం,లేదా చలామణీ సాధనం- చలామణీలోఉన్నంతవరకు మాత్రమే. అయితే కాగితం డబ్బు చేత తొలగించబడే కనీస బంగారం మొత్తానికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఆమొత్తం ఎప్పుడూ చలామణీ పరిధిలోనే ఉంటుంది. చలామణీ మాధ్యమంగా పనిచేస్తుంటుంది. పూర్తిగా ఆపనికోసమే ఉంటుంది. స-డ-స రూపపరివర్తనలోరెండు విరుద్ధ దశలుంటాయి. ఆ దశల్లో సరుకులు వాటి విలువ రూపాల్ని ఎదుర్కొని, వెంటనే అదృశ్యమవుతాయి. ఒక సరుకు మారకం విలువ యొక్క స్వతంత్ర మనుగడ అనేది ఇక్కడ తాత్కాలికమైన దృశ్యం మాత్రమే. ఆసరుకు స్థానంలోకి వెంటనే మరోకసరుకు వస్తుంది. అందువల్ల, డబ్బు ఒకరి చేతినించి మరొకరి చేతికి ఆగకుండా మారే ఈ ప్రక్రియలో కేవలం డబ్బుయొక్క 'చిహ్నామనుగడ'(symbolical existence) సరిపోతుంది. అందువల్ల ఒక చిహ్నం చేత తొలగించబడగలదు.

నాణేలుగా ఉన్న మేరకు, అంటే చలామణీ మాధ్యమంగా వ్యవహరించిన మేరకు, బంగారం వెండి వాటి సొంత చిహ్నాలు అవుతాయి. ఈ వాస్తవాన్ని పట్టుకొని నికోలస్ బార్బన్ ప్రభుత్వాలకు డబ్బును పెంచే హక్కు అంటే, షిల్లింగ్ అనబడే వెండి పరిమాణానికి అంతకంటే ఎక్కువ పరిమాణం ఉండే క్రౌన్ లాంటి పేరు పెట్టవచ్చంటాడు. ఆవిధంగా అప్పులవాళ్ళకు క్రౌన్ల బదులు షిల్లింగులు ఇవ్వచ్చంటాడు. 'పదేపదే లెక్కబెట్టడం వల్ల డబ్బు అరిగిపోయి, తేలిక అవుతుంది... బేరం ఆడేటప్పుడు జనం పట్టించుకునేది ఆడబ్బు పేరునీ,, దాని చలామణీని. అంతేగాని వెండి పరిమాణాన్ని కాదు..ఆ లోహం మీద ప్రభుత్వానికి ఉండే అధికారమే దాన్ని డబ్బుగా చేస్తుంది.- నికొలాస్ బార్బన్.

ఏది ఏమైనా, ఒకటి తప్పనిసరి; ఈ చిహ్నానికి తనసొంత వస్తుగత సామాజిక ఆమోదం అవసరం, ఈ కాగితం చిహ్నం బలవంతపు చలనం ద్వారా సామాజిక ఆమోదాన్ని పొందుతుంది. ఈ తప్పనిసరి రాజ్య చర్య ఆసమాజపు హద్దుల్లో ఉండే అంతర్గత చలామణీ రంగంలో మాత్రమే ప్రభావం నెరుపుతుంది. ఆపరిధిలో మాత్రమే చలామణీ మాధ్యమంగా దాని చర్యకు స్పందిస్తుంది. అంటే నాణెం అవుతుంది.

# విభాగం 3- డబ్బు

## A. నిల్వ (hoarding)

విలువ కొలమానంగానూ, చలామణీ మాధ్యమం గానూ పనిచేసే సరుకే డబ్బు. ఆ పనులు చేసే సరుకు బంగారం(లేక వెండి). అందువల్ల బంగారమే (లేక వెండే) డబ్బు. అది బంగారం శరీరంతో దర్శనం ఇవ్వాల్సివచ్చినప్పుడు అది డబ్బుగా పనిచేస్తుంది. అప్పుడది డబ్బు సరుకు; నిజమైన బంగారం అక్కడ ఉండాలి.

### బంగారం ఉండి తీరాల్సిన అవసరం లేని పరిస్థితులు

1.డబ్బు విలువ కొలమానంగా పనిచేస్తుంది. అందుకు బంగారం అక్కడ ఉండాల్సిన పనిలేదు. ఊహాత్మకం మాత్రమే.

ఒక సరుకు విలువని డబ్బులో చెబితే అదే దాని ధర.అలా చెప్పడానికి డబ్బుగా ఉన్నలోహమేదో తెలిస్తే చాలు.అది బంగారమయితే, 100 కిలోల జొన్నల ధర 3 గ్రాముల బంగారం. అదే వెండి అయితే 80 గ్రాముల వెండి. ఇలా చెప్పడానికి ఆ డబ్బు చేతిలో ఉండక్కర్లేదు.అది ఉహాత్మకమైనది.

2. అలాగే బంగారం చలామణీ మాధ్యమం గాపనిచేస్తుంది. అయితే ఆచర్యలో ప్రతినిధులని పెట్టగలదు.

ఇక్కడ ఊహాత్మకం వీలవదు. కాని తానే అక్కడ ఉండాల్సిన పని లేదు. తనకు బదులుగా చిహ్నాలని (tokens) పెట్టవచ్చు. అంటే, రాగి, నికెల్ లాంటి మరొక పదార్థమో, కాగితం నోటో ఏదో ఒక టోకెన్. అయితే అది రాజ్యం జారీ చేసినది అయి ఉండాలి. అంతే.

ఈ రెండు సందర్భాలలో బంగారం ప్రత్యక్షంగా ఉండాల్సిన పనిలేదు. కాని అది బంగారం శరీరంతో దర్శనం ఇవ్వాల్సివచ్చినప్పుడు అది డబ్బు సరుకు; నిజమైన లోహ బంగారం అక్కడ ఉండాలి.

### డబ్బు విలువయొక్క ఏకైక రూపం

తన చర్య తనే చేసినా, ప్రతినిధి ద్వారాచేసినా ఆ చర్య చెయ్యడం వల్ల డబ్బు విలువయొక్క ఏకైక రూపం అవుతుంది. మరోమాటల్లో చెబితే, ఉపయోగపు విలువకు భిన్నంగా, మారకం విలువ యొక్క మనుగడ రూపంగా ఉంటుంది. అన్ని ఇతరసరకులూ కేవలం ఉపయోగపు విలువల పాత్ర మాత్రమే పోషిస్తాయి.

అది తనచర్య చేత విలువ యొక్క ఏకైక రూపంలోకి లోకి ఘనీభవించాల్సివచ్చినప్పుడు అది డబ్బుగా పనిచేస్తుంది. అది ఆచర్యని స్వయంగా చేసినా,లేక ప్రతినిదిద్వారా చేసినా తేడా ఉండదు. ఆవిలువరూపం ఉపయోగపు విలువకు విరుద్ధమైన మారకం విలువయొక్క తగిన మనుగడ రూపం. ఆరూపం అన్ని ఇతర సరుకుల చేతా ప్రాతినిధ్యం వహించబడేది.

### రెండు పనులూ చేస్తేనే డబ్బవుతుంది

విలువ కొలమానంగానూ, చలామణీ సాధనంగానూ రెంటి గానూ పనిచేసే సరుకే డబ్బు. సమాజం మొదట విలువ కొలమానంగా పనిచేసే సరుకుగా బంగారానికి హోదా ఇచ్చింది. రెండో చర్యలో దానికి ఆచరణలో చలామణీ సాధనంగా పట్టం గట్టింది. ఆరెండు పనులూ చేసే బంగారమే డబ్బయింది -ఇక మరో సామాజిక

చర్యతో పనిలేకుండానే. మార్క్స్ కాలంలో ఈరెండు పనులూ చేసింది బంగారమే. అందువల్ల బంగారమే డబ్బు అని తేల్చాడు.

## రెంటిలో ఒక్కపనే చేస్తే సరిపోదు

మొదటి చర్య బంగారానికి సాధారణ సమానకం హోదా కల్పించడం. రెండో చర్య అదే లోహాన్ని చలామణీ సాధనంగా వాడడం. ఇవి రెండూ రెండు భిన్నమైన చర్యలు.రెంటి కలయిక ఒక కొత్త అంశాన్ని తెచ్చింది. వీటిలో ఏఒక్కటీ ఈ కొత్త అంశాన్ని తేలేదు, తేవడానికి సరిపోదు. ఇందుకు చరిత్ర నుంచి ఉదాహరణ ఇస్తాడు: ఇంగ్లండ్ లో వెండి డబ్బు అవలేదు.ఎందుకంటే వెండి అక్కడ విలువ కొలమనంగా లేదు, చలామణీ సాధనంగా ప్రబలంగా లేదు. అలాగే హాలండ్ లో బంగారం విలువ కొలమానం స్థానం నించి దిగిపోగానే డబ్బు హోదా పోయింది. ఇక డబ్బుగా ఉండడం నిలిచిపోయింది.

అందువల్ల రెండు చర్యల్లో ఒకటే జరిగితే అది డబ్బు కాలేదు. రెండు చర్యలూ జరగాలి. మూడో చర్య తో పనిలేదు.

## విలువ ప్రమాణం చలామణీ సాధనం- రెంటి ఐక్యతే డబ్బు.-క్రిటిక్

అయితే అటువంటి ఐక్యత ఉన్న బంగారం ఈ రెండు చర్యలతోనూ సంబంధం లేని స్వతంత్ర మనుగడ కలిగి ఉంది. విలువ కొలమానంగా పనిచేసినప్పుడు వెండి బంగారాలు అక్కడ ఉండక్కరలేదు.

చలామణీ సాధనంగా పనిచేసినప్పుడు ప్రతినిధి ద్వారా నడిపించగలదు.ఈరెంటి ఐక్యతగా పనిచేసేప్పుడు మాత్రమే స్వయంగా (తనరూపంలో)బంగారం ఉండితీరాలి.-క్రిటిక్

ఇలా బంగారం అక్కడ ఉండాల్సిన చర్యలు ఉంటాయి. వాటిగురించి చర్చ తర్వాత ఉంటుంది.

## A.నిల్వ (Hoarding)

అమ్మకాలూ కొనుగోళ్ళూ ఒకదాని వెంట ఒకటిగా ఎడతెగకుండా జరుగుతూ వుంటే, డబ్బు కూడా చలనంలో ఉండగలుగుతుంది. అయితే అమ్మకం జరిగిన వెంటనే కొనుగోలు జరగాలని లేదు. ఈరూప రెంటికీ మధ్య కొంత కాలవ్యవధి ఉండవచ్చు.అటువంటి పరిస్తితిలో, అంటే అమ్మకం అవగానే కొనుగోలు జరగకపోతే, డబ్బు చలనం ఆగిపోతుంది. ఫ్రెంచ్ ఆర్ధికవేత్త బోయిస్ గిల్లె బర్ట్ చెప్పినట్లు, అది చలన స్థితి నుంచి నిశ్చలస్థితికి వస్తుంది, నాణెం స్థితి నుంచి డబ్బుస్థితికి మారిపోతుంది. ఈస్థితి మార్పు ఎందుకొస్తుంది?

నాణెం ప్రతి సరుకు ఓనర్ దగ్గరా కాసేపే ఉండి, మరొకరికి వెళుతుంది. ఆవిధంగా అది చలన స్థితిలో ఉంటుంది. ఎప్పుడైతే చలన స్థితి నుంచి నిశ్చలస్థితికి వస్తుందో అప్పుడు అమ్మినవాని దగ్గర కొంత కాలం కదలకుండా ఉంటుంది. అప్పుడు ఆనాణెం నాణెం గా ఉండదు. కేవలం డబ్బు స్థితికొస్తుంది.e

ఒక నాణెం పదిచలనాలు చేసినా పదకొండో చలనం జరగక పొతే, అప్పుడు ఆ నాణెం ఎవరి జేబులోవుందో వారి జేబులోనే ఉంటుంది. దాన్ని వీడదు.

తన సరుకులు అమ్మాక ఇతరుల సరుకులు కొనకుండా ఉంటేనే జేబులో ఉన్నదున్నట్లే డబ్బుండడం సాధ్యం.ఈ డబ్బు సరుకు యొక్క మారిన ఆకారం. సరుకు యొక్క బంగారం స్థితి(gold-chrysalis).

సరుకులు ఆవిధంగా అమ్మి ఇతరుల సరుకులు కొనడానికి కాకుండా, సరుకుల రూపాన్ని డబ్బురూపంలోకి మార్చుకోడానికి అమ్మబడతాయి.ఈ రూపంమార్పు సరుకుల చలామణీ జరగడానికి అవసరం, అనివార్యం. సరుకులు డబ్బురూపంపొందాక అంతటితో ఆగిపోతుంది. తాత్కాలిక డబ్బురూపం పరాదీనంకాగల రూపంగా ఉండదు. ఈ డబ్బు రూపమే లక్ష్యం అవుతుంది. డబ్బు నిల్వ (hoard) అవుతుంది. అమ్మినవాడు 'నిల్వచేసినవాడు' (hoarder) అవుతాడు.

సరుకుల చలామణీ తోలి దశల్లో, మిగులు ఉపయోగపు విలువలు మాత్రమే డబ్బుగా మారాయి. ఆవిధంగా వెండి బంగారాలు superfluity కి, సంపదకి, సామాజిక వ్యక్తీకరణలు అయ్యాయి. పరిమితమైన గృహావసరాల కోసం సంప్రదాయక ఉత్పత్తివిధానం కొనసాగిన ఆసమాజాల్లో ఈ రకం నిల్వ చెయ్యడం అనేది మొదలయింది, క్రమంగా స్థిరపడింది. ఇది సహజమైనది, సరళమైనది. కావాలని చేసినది కాదు. ఆసియా, అందునా ప్రత్యేకించి ఈస్ట్ ఇండియా ప్రజలకు సంబంధించి జరిగిందదే.

ఒక దేశంలో ఉన్న వెండి బంగారాల పరిమాణాన్ని బట్టి ధరలు నిర్ణయమవుతాయి అని (తప్పుగా)ఊహించిన వాండర్ లింట్ ఒక ప్రశ్నవేసుకున్నాడు: ఇండియా సరుకులు ఎందువల్ల అంత చౌక? ఆయనే జవాబు చెప్పాడు: హిందువులు డబ్బుని పూడ్చిపెడతారు. అందువల్ల సరుకులు చౌక. దీనర్థం: డబ్బులో కొంత పూడ్చి పెట్టిందువల్ల, తక్కువవుతాయి. ధరల్నినిర్ణయించేది వెండి బంగారాల పరిమాణం కనుక, అవితక్కువయ్యాయి కనుక ధరలు తగ్గుతాయి. ఇదీ ఆయన వాదన.దీన్ని మార్క్స్ ఇంతకుముందే ఖండించాడు. ఇక్కడ గమనించాల్సింది డబ్బుని నిల్వ చెయ్యడం అనే అలవాటు.

1602-1734 కాలంలో హిందువులు దిగుమతయిన 15 కోట్ల పోన్ల వెండి స్టెర్లింగుల్ని పాతిపెట్టారు. 1856-1866 కాలంలో అంటే పదేళ్ళలో తనకి ఆస్ట్రేలియా బంగారం మార్చగా ఇంగ్లండ్ కి వచ్చిన వెండిలో చైనా ఇండియా లకి 12కోట్ల పౌండ్ల వెండిని ఎగుమతి చేసింది. చైనా కి ఎగుమతైన వెండిలో అత్యధిక భాగం ఇండియాకే చేరింది.

## కూడ బెట్టడానికి కారణాలు

సరుకుల ఉత్పత్తి ఇంకా పెరిగేకొద్దీ ప్రతి ఉత్పత్తిదారుడూ సరుకు ఉత్పత్తి చేసే సమయంలో పోషణకూ, అనుకోని అవసరాలకూ కొంత రిజర్వ్ ఉండాల్సి వస్తుంది.హామీగా కొంత డబ్బు అవసరమవుతుంది. అందుకు ఒత్తిడి పడుతుంది. ' డబ్బు....ఒక హామీ' అని జాన్ బెల్లర్స్ తన 1699పుస్తకంలో మాటలు కోట్ చేస్తాడు ఫుట్ నోట్ లో.

ప్రతి ఉత్పత్తిదారుడికీ నిరంతరం అవసరాల ఒత్తిడి ఉంటుంది. అందుకోసం ఇతరుల సరుకులు కొనాల్సివస్తుంది. తన సరుకుల ఉత్పత్తికీ అమ్మకానికీ టైం పడుతుంది.ఎంత సమయం అనేది పరిస్థితుల్ని బట్టి ఉంటుంది. తన సరుకులు అమ్మేదాకా అతను తనకు కావాల్సిన సరుకులు కొనలేడు. అమ్మకపోయినా కొనగలగాలి అంటే, అంతకు ముందు అమ్మినా, ఆడబ్బుబెట్టి ఇతరుల సరుకులు కొనకుండా ఉండి ఉండాలి. అప్పుడయితేనే అతనిదగ్గర డబ్బు ఉంటుంది. దాంతో కొనగలడు- అప్పుడు అమ్మకపోయినా.

ప్రతిచోటా వ్యక్తులు కూడబెట్టాలనే లక్ష్యంతో ఉంటారు. మరి ఈ నిల్వలు ఎలా సాధ్యం?
ప్రతివాడూ కొనకుండానే ఎలా అమ్మగలుగుతాడు? సాధారణ స్థాయిలో జరిగే ఈచర్యలో ఒక వైరుధ్యం ఉన్నట్లు కనబడుతుంది. కాని అమూల్యలోహాలు అవి ఉత్పత్తయిన చోట నేరుగా ఇతరసరుకులతో మారకం అయివున్నాయి. ఇక్కడ సరుకుల ఉత్పత్తిదారుల అమ్మకాలు ఉన్నాయి, వెండి బంగారాల ఓనర్లవైపునుండి కొనుగోళ్ళు లేకుండానే.( ఫుట్ నోట్ లో దీని వివరణ ఉంది: అమ్మకం అన్నప్పుడు వెండిబంగారాలు అప్పటికే సరుకుల పరివర్తిత/మారిన రూపం అనే అర్థం అందులో ఇమిడి ఉంది. అంటే అప్పటికే అమ్మినదాని బదులు వచ్చినదని. బంగారం ఉత్పత్తయిన చోట ఉన్న బంగారంతో సరుకులు మారకం అయితే, అది కొనుగోలు కాదు. సరుకుల ఉత్పత్తిదారులు వాళ్ళ సరుకులు అమ్ముకున్నట్లే. వచ్చిన డబ్బుతో ఇతర సరుకులు కొన్నప్పుడు అది కొనుగోలు.ఎందుకంటే, ఆ బంగారం అతని సరుకులు అమ్మగా వచ్చినది, అతని సరుకుల మారిన రూపం.)

ఇతర ఉత్పత్తిదారులు తర్వాత కొనుగోళ్ళు చెయ్యకుండా జరిపే అమ్మకాలు కొత్తగా ఉత్పత్తయిన అమూల్య లోహాల్నిసరుకుల ఉత్పత్తిదారులందరి మధ్యా పంపిణీ చేస్తుంది. ఈవిధంగా మారకమార్గం పొడవునా వివిధ స్థాయిల్లో వెండి బంగారు నిల్వలు పోగుపడతాయి. ఒక ప్రత్యేక సరుకు (బంగారం)రూపంలో మారకం విలువని నిల్వగా అట్టిపెట్టుకునే అవకాశం ఉంది. ఈ అవకాశం నుంచి బంగారం పట్ల అత్యాశ పుడుతుంది. చలామణీ విస్తరణతో పాటు, డబ్బు శక్తి ఎక్కువవుతుంది. డబ్బనేది రెడీగా ఉపయోగించగలిగిన ఎప్పుడుబడితే అప్పుడు ఉపయోగపడే సంపద యొక్క సామాజిక రూపం. 1503 లోనే కొలంబస్ జమైకా నుండి రాసిన ఉత్తరంలో ఇలా అంటాడు: బంగారం అద్భుతమైనది. అది ఉన్న వాడు అతను కోరుకున్నవాటన్నిటికీ ప్రభువు. బంగారంబెట్టి ఆత్మల్నిసైతం స్వర్గానికి పంపగలడు.

ఏసరుకు బంగారం లోకి మారి, ఆబంగారం వచ్చిందో అది చెప్పాడు. కనుక ప్రతిదీ సరుకైనదీ, కానిదీ ఏదైనా బంగారం లోకి మారగలదు. ప్రతిదీ అమ్మేందుకూ, కొనేందుకూ వీలయినదే అవుతుంది. చలామణీ అనేది అలాచేయగల పెద్దగుండం అవుతుంది. ప్రతిదీ అందులోకి విసరబడి, తిరిగి బంగారం గుళికగా బయటకొస్తుంది. ఈ అల్కెమీని* తట్టుకోగలిగినదంటూ ఏదీ లేదు; సాధువుల ఎముకలు కూడా తట్టుకొని నిలవలేవు. ఇక అంతకన్నా సున్నితమైన, మానవ వర్తకానికి అతీతమైన పవిత్ర వస్తువులు సరే, అసలు తట్టుకోలేవు.

**ఒక పదార్థాన్ని మరొక పదార్థంలోకి మార్చడమే ఆల్కెమీ.చౌక లోహాల్ని అమూల్య లోహాలుగా ముఖ్యంగా బంగారంలోకి మార్చడమే లక్ష్యం. మారకంలో ఏదైనాసరే బంగారమై తిరిగిరావలసిందే*

ఫ్రెంచ్ రాజు మూడో హెన్రీ పురాతన మత మందిరాలలో ఉన్న స్మారక చిహ్నాలని కొల్లగొట్టి డబ్బులోకి మార్చుకున్నాడు. గ్రీసు చరిత్రలో ఫోషియన్లు చేసిన డెల్ఫీ ఆలయ ధ్వంసం గురించి తెలిసిందే. ఫోషియన్లు పవిత్రభూమిని సాగు చేసారని క్రీ.పూ. 357 లో థీబ్స్ దేశం వారిపై భారీ ఫైన్ వేసింది. అయితే ఫోషియన్లు

దాన్ని చెల్లించకుండా ఏథెన్స్ తో కలిసి యుద్ధానికి తలపడ్డారు. డెల్ఫీ లోని అపోల్లో దేవాలయాన్ని స్వాధీనం చేసుకుని అక్కడి నిధుల్ని సైనికావసరాలకు వినియోగించారు.

సరుకుల గుణాత్మక వ్యత్యాసాలలో ప్రతిదీ, డబ్బులో అంతం అవుతుంది. అలాగే డబ్బు ఒక పెద్ద సమవాదిగా (leveller) అన్ని తేడాలనూ అంతరింప చేస్తుంది: షేక్స్పియర్ నాటకం Timon of Athens(Act 4, Scene 3) లోని ఈ మాటలు ఈవిషయాన్ని వివరిస్తాయి:

బంగారం? పసిమితో మెరిసిపోయే అమూల్యమైన బంగారం?

ఈమాత్రం బంగారం నలుపుని తెలుపు చేస్తుంది

తప్పుని ఒప్పు చేస్తుంది

తుచ్ఛమైనదాన్ని ఉత్తమమైనదిగా చేస్తుంది

ముదుసలిని యువకుడిగా చేస్తుంది

పిరికిపందని సాహసిని చేస్తుంది.....

ఈ పసుప్పచ్చని బానిస మతాల్ని కలుపుతుంది, బద్దలుకొడుతుంది

శాపగ్రస్తుల్ని దీవిస్తుంది

దొంగలకి బిరుదులూ,పాదనమస్కారాలూ, పొగడ్తలూ వచ్చేట్లు చేస్తుంది........

## డబ్బుని ప్రాచీన సమాజం చెడ్డదిగా, చెడగొట్టేదిగా భావించింది.

అయితే డబ్బనేదే ఒక సరుకు. బయట ఉండే వస్తువు.కనుక అది ఏ వ్యక్తికైనా ప్రైవేట్ ఆస్తిగా ఉండగలదు. ఆవిధంగా సామాజిక శక్తి ప్రైవేట్ వ్యక్తుల ప్రైవేట్ శక్తి అవుతుంది. ప్రాచీన సమాజం డబ్బుని ఆర్థిక, నైతిక వ్యవస్థని చెడగొడుతుంది అని తెగనాడింది. ఉదాహరణకి,

ఏదీ డబ్బంత చెడ్డది కాదు.

అది నగరాల్ని కూలుస్తుంది.

మనుషుల్నివాళ్ళ వాళ్ళ ఇళ్లనుంచి బయటకు వెళ్ళకొడుతుంది.

నిజాయతీ పరుల్ని సిగ్గుపడే పనులు చేసేట్లు తర్ఫీదిస్తుంది.

విలన్లు చేసేపనులు జనానికి అలవాటు అయ్యేట్లుగా నేర్పుతుంది...... (గ్రీకు నాటక కర్త సోఫోక్లిస్ –ఏంటిగనీ నాటకంలో )

## ఇందుకు భిన్నంగా ఆధునిక సమాజం డబ్బుకోసం పరితపిస్తుంది

అయితే ఆధునిక సమాజం పసివయస్సులోనే భూగర్భం నుండి ప్లూటస్ ని జుట్టుబట్టుకొని బయటకి లాగింది. ప్లూటస్ ని రోమన్లు'ధనం ఇచ్చే దేముడి' గా భావిస్తారు. అత్యాశ భూగర్భంలోనించి ప్లూటో నే(ప్లూటస్ అని జర్మన్ మూలంలో ఉంది) బయటకి లాగాలని ఆశిస్తుంది.( అన్నాడు Athenaeus అనే గ్రీకు వ్యాకర్త. అతను 2 వ శతాబ్ది చివర 3 వ శతాబ్ది మొదట జీవించాడు)

బంగారాన్ని Holy Grail గా ఆహ్వానం పలికింది. హోలీ గ్రెయిల్ అనేది శిలువ వేయబడిన జీసస్ నెత్తురు పట్టిన పాత్ర. ఆయన చివరిగా (last supper)అందులో తిన్నాడు. జీసస్ శరీరాన్ని పెట్టడానికి సమాధిని

ఇచ్చిన జోసఫ్ (Joseph of Arimathea) కి ఇవ్వబడింది. ఆ నెత్తురుకి అన్ని గాయాలనూ మాన్చే శక్తి ఉంది అని మతస్తుల విశ్వాసం. దానికోసం Arthur's knights వెదికారు. కాని ఎక్కువమంది గాయాలతో తిరిగి వచ్చారు. హోలీ గ్రెయిల్ కోసం వీరులు చేసినట్లే, బంగారం కోసం ఆధునిక సమాజం విశ్వప్రయత్నం చేస్తున్నది. ధనార్జనే దాని జీవిత పరమార్థం.

ఉపయోగపు విలువగా ఒక సరుకు ఒక ప్రత్యేక కోరికని తీరుస్తుంది. అది భౌతిక సంపదలో ఒక మౌలిక అంశం (element). అది దాని ఓనర్ యొక్క సామాజిక సంపద ఎంతో కొలుస్తుంది. ఒక ఆటవిక సరుకుల ఓనర్ కి, పశ్చిమ ఐరోపా రైతుకి కూడా విలువ అనేది విలువ రూపం ఎలాంటిదో అలాంటిదే.

అందువల్ల వెండి బంగారాల నిల్వ పెరుగుదల అంటే అతనికి విలువ పెరుగుదలే. డబ్బు విలువ మారేది నిజమే; ఒకసారి దాని సొంత విలువలో మార్పు ఫలితంగా డబ్బు విలువ మారుతుంది. మరొకసారి ఇతర సరుకుల విలువల్లో మార్పు వల్ల డబ్బువిలువ మారుతుంది. అయితే ఈపరిస్థితి 100ఔన్సుల బంగారంలో కన్నా 200 ఔన్సుల బంగారంలో ఎక్కువ విలువ ఉండడాన్నినివారించలేదు; మరొకవైపు, అన్ని ఇతర సరుకులయొక్క సార్వత్రిక సమానకంగా దాని లోహ రూపం కొనసాగడాన్ని, మానవ శ్రమ యొక్క తక్షణ సామాజిక అవతారంగా కొనసాగడాన్ని నిరోధించజాలదు.

## కూడబెట్టాలనే కోరిక ఆరేదీ, తీరేదీ కాదు.

దాని స్వభావమే అంత. గుణాత్మక అంశంలో డబ్బు సామర్థ్యానికి అవధులు లేవు. పాదార్థిక సంపదకు అది సార్వత్రిక ప్రతినిధి. ఎందువల్లనంటే, డబ్బు ఏసరుకుతోనైనా నేరుగా మారగలదు కాబట్టి. అయితే అదే సమయంలో, ఎంత మొత్తం వాస్తవ డబ్బయినా పరిమితమైనదే. ఒక పరిమితి ఉన్నదే. కనుక కొనుగోలు సాధనంగా పరిమిత సామర్థ్యం మాత్రమే ఉంటుంది.

50 వేల రూపాయలకు ఒక మోటార్ సైకిల్ వస్తుంది. ఆమొత్తానికి కారు రాదు. 3 లక్షలన్నా కావాలి. ఆమొత్తం 50 వేలకన్నా ఎక్కువే.కాని అదీ పరిమితమయినదే. దానికి విమానం రాదు. కొన్ని కోట్లవుతుంది. పెద్దమొత్తమే అయినా అదీ పరిమితమైనదే. దానికి మిసైల్ రాదు. అది ఎంత మొత్తమైనా కావచ్చుగాక, అది పరిమితమైనదే. డబ్బుకున్న పరిమాణాత్మక పరిమితులకీ, దాని గుణాత్మక అపరిమితికీ ఉన్న వైరుధ్యం కూడబెట్టేటందుకు విశ్రాంతి లేకుండా సిసిఫస్* లాగా శ్రమ చేసేట్లు ప్రేరేపిస్తుంది. అందుకు ప్రోత్సాహకంగా పనిచేస్తుంది. దండయాత్రచేసి గెలిచినవాడు (conqueror) దేశాల్ని కలుపుకుంటాడు. అతని రాజ్యం సరిహద్దులు మారతాయి. అంతటితో ఆగడు. ఆముందున్న దేశాన్ని జయించాలనుకుంటాడు. అలా గెలిచి, ఆక్రమించుకున్న దేశం సరిహద్దు తనదే. అక్కడ నిలబడి అవతల దేశం సరిహద్దుని, ఇంకొక కొత్త సరిహద్దుని మాత్రమే చూస్తాడు. వేరేమీ చూడడు. అలాగే నిల్వదారుడు కూడా. ముందు కోటి. కూడినాక మరొక హద్దు. 10కోట్లు. తర్వాత 100కోట్లు.లక్ష కోట్లు ఇలా ఒకదాని తర్వాత మరొక హద్దు. ఆహద్దులు పరిమితులు లేనివి. అంతూపొంతూ లేనివి.

* సిసిఫస్ – గ్రీకు పురాణాల్లో కోరింథ్ రాజు. మోసగాడు. అబద్దాలకోరు. అతిథుల్నీ, పర్యాటకుల్నీ ఆదరించకపోగా, చంపుతాడు. జినియా (xenia) ని అతిక్రమించాడు. అతిథి పట్ల స్నేహం అని జినియా కి అర్థం. వచ్చిన వాళ్ళని స్నేహితుల్లాగా ఆప్యాయంగా చూడాలి. దీన్ని అమలయ్యేట్లు చూసే బాధ్యత జీయస్ (Zeus)ది. అదే కాక ఎన్నో తప్పులు చేస్తాడు. అప్పుడు జీయస్ ఒక పెద్ద బండని కొండ పైచివరకి తోసుకెళ్ళమని శిక్ష వేస్తాడు. శిఖరానికి నెట్టగానే దొర్లుతూవచ్చి కింద పడుతుంది. మళ్ళీ కష్టపడి పైకి నేడతాడు. మళ్ళీ కిందికి దొర్లుతుంది. అతని శ్రమ అలాగే ఎప్పటికీ కొనసాగుతూ ఉంటుంది.

అలాగే నిల్వదారుడు కూడా జీవితాంతం కూడబెడుతూనే ఉంటాడు. శ్రమ పడుతూనే ఉంటాడు. అతని ఆశ అంతులేనిది. ఎప్పటికీ తీరేది కాదు.

## నిల్వ చెయ్యాలంటే

డబ్బుగా బంగారాన్ని నిల్వ ఉంచాలంటే, దాన్నిచలామణీలోకి రాకుండా ఆపాలి.అనుభోగ వస్తువుగా మారకుండా చూడాలి. అంటే ఆభరణాలుగానో, మరొక రకంగానో మార్చకుండా ఉండాలి. చలామణీ లో ఉన్నా, అనుభోగ వస్తువుగా ఉన్నా అది నిల్వ కాదు. అందువల్ల నిల్వదారుడు తన శరీర కోర్కెల్ని త్యాగం చేస్తాడు- బంగారాన్ని ఆరాధించడం ధ్యేయంగా పెట్టుకుంటాడు. వైరాగ్య బోధలకు తగినట్లు నడుచుకుంటాడు. మరొకపక్క, చలామణీలో అతను సరుకుల రూపంలో పెట్టిన దాని కంటే, చలామణీ నుండి ఎక్కువ తిరిగి తీసుకోలేడు. ఎక్కువ ఉత్పత్తి చేస్తే, ఎక్కువ అమ్ముతాడు. అందువల్ల కఠోర శ్రమ, పొదుపు, అత్యాశ – ఇవి మూడూ అతని ముఖ్య సుగుణాలు. ఎక్కువ అమ్మడమూ,తక్కువ కొనడమూ – అతని ఆర్థికవిధానసారం.

పెర్రీ మాటలు కోట్ చేస్తాడిక్కడ: అర్థశాస్త్ర చర్యలన్నీ తిరిగే ఇరుసులు ఇవి: ప్రతి సరుకు అమ్మేవాళ్ళ సంఖ్యని సాధ్యమైనంతగా పెంచడం, కొనేవాళ్ళ సంఖ్యని సాధ్యమైనంతగా తగ్గించడం.

వెండి బంగారు ప్రత్యక్ష నిల్వ రూపంలో ఉండడంతో పాటు, వెండి బంగారాలతో చేసిన కళాత్మక, సౌందర్యాత్మక వస్తువుల రూపంలో కూడా ఉంటాయి. పౌరసమాజపు సంపద పెరిగేకొద్దీ ఇది పెరుగుతుంది.

'మనం సంపన్నుల మవుదాం, లేదా సంపన్నులుగా కనపడదాం' –డిడెరాట్ ఈవిధంగా ఒకవైపు బంగారానికి నిరంతరంపెరిగే మార్కెట్ ఏర్పడుతుంది. ఇది డబ్బుగా బంగారం చర్యతో సంబంధం లేనిది. స్వతంత్రమైనది. మరొకవైపు, ద్రవ్య సరఫరాకి బయటకు కనపడని వనరు ఏర్పడుతుంది. ఈ వనరు ప్రత్యేకించి సంక్షోభసమయాల్లోనూ, సామాజిక కల్లోల కాలాల్లోనూ ఆశ్రయించబడుతుంది.

## నిల్వచెయ్యడంవల్ల ప్రయోజనాలు

లోహ చలామణీ ఉండే ఆర్థిక వ్యవస్థలో నిల్వచెయ్యడంవల్ల వివిధ ప్రయోజనాలు ఉంటాయి.

దాని మొదటిచర్య వెండి, బంగారు నాణేల చలనం ఏ పరిస్థితులకు లోబడుతుందో, ఆ పరిస్థితుల నుండి తలెత్తుతుంది. సరుకుల చలామణీ విస్తృతీ వేగాల్లోనూ, సరుకుల ధరలలోనూ అవిశ్రాంతంగా వచ్చే హెచ్చుతగ్గులతో పాటు, డబ్బు పరిమాణం కూడా ఎలా అవిరామంగా పెరుగుతూ, తగ్గుతూ ఉంటుందో మనకు తెలిసిందే. అందువల్ల డబ్బు మొత్తం పెరగడానికీ, తగ్గడానికీ తగినట్లు ఉండి తీరాలి. ఒకసమయంలో

చలామణీ నాణెంగా వ్యవహరించడానికి డబ్బు ఆకర్షించబడాలి, మరొక సమయంలో ఎంతోకొంత కదలికలేని డబ్బుగా వ్యవహరించడానికి చలామణీ నాణెం వికర్షించ బడాలి. అంటే చలామణీ నుండి గెంటివేయ బడాలి.

వాస్తవంగా చలనంలో ఉన్న డబ్బు మొత్తం చలామణీ యొక్క ఇముడ్చుకునే శక్తికి అనుగుణంగా ఉండాలంటే, నాణెం గా అవసరమైన వెండిబంగారాల మొత్తం కంటే దేశంలో మరింత ఉండడం అవసరం. డబ్బు నిల్వ రూపం పొందడం ద్వారా ఈ షరతు నెరవేరుతుంది. చలామణీ లోకి డబ్బుని సరఫరా చెయ్యడానికీ, అలాగే చలామణీ నుండి డబ్బుని ఉపసంహరించడానికీ ఈనిల్వలు కాల్వలుగా ఉపకరిస్తాయి. ఆవిధంగా చలామణీ గట్టు దాటి ఎప్పటికీ పొంగి పోర్లిపోదు.

ఒక దేశం వ్యాపార నిర్వహణకి కొంత మొత్తంలో డబ్బు ఉండాలి; అది పరిస్థితుల్ని బట్టి ఒకప్పుడు ఎక్కువ ఉండాలి, మరొకప్పుడు తక్కువ ఉండాలి. డబ్బు ఎక్కువకావడం, తక్కువ కావడం అనేది దానికదే సర్దుబాటవుతుంది. రాజకీయ వేత్తల సహాయం/ జోక్యం అవసరముండదు. డబ్బు కొరవపడితే బులియన్ కాయన్ గా ముద్రించ బడుతుంది/అవుతుంది. బులియన్ కొరవ ఏర్పడితే, నాణేలు కరిగించ బడతాయి (Sir D. North).

ఈస్ట్ ఇండియా కంపెనీలో చాలా కాలం అధికారిగా పనిచేసిన జాన్ స్టువర్ట్ మిల్ ఒక విషయం చెప్పాడు: ఇండియాలో ఇప్పటికీ వెండి ఆభరణాలు నిల్వలు చేసే చర్యలు చేస్తున్నాయి. వడ్డీ రేటు ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వెండి నగలు బయటకు తేబడి నాణేలుగా ముద్రించబడేవి. వడ్డీ రేటు పడిపోతే తిరిగి ఆనాణేలు నగలయ్యేవి. (J. S. Mill‘s Evidence ―Reports on Bank Acts,‖ 1857, 2084.)

ఇండియాలో వెండి బంగారాల ఎగుమతి దిగుమతుల గురించి 1864 పార్లమెంటరీ పత్రం ప్రకారం,

1863 లో వాటి దిగుమతి ఎగుమతి కన్నా 19,367,764 పౌండ్లు ఎక్కువయింది. 1864 ని ఆనుకొని ముందున్న 8 ఏళ్లలో మొత్తం వెండి బంగారాల ఎగుమతుల కంటే దిగుమతులు 109,652,917 పౌండ్లు ఎక్కువ. ఈ శతాబ్దంలో ఇండియా 200,000,000 పౌండ్ల ను మించి నాణేలు ముద్రించింది.

ఆవిధంగా సిద్ధాంతపరంగా చూపిన ప్రతిదానికీ మార్క్స్ చారిత్రక దృష్టాంతాల్ని చూపించాడు.

## B. చెల్లింపు సాధనం (means of payment)

ఇంతదాకా పరిశీలించిన సరుకుల చలామణీ (సరుకు-డబ్బు-సరుకు) సరళ చలామణీ. ఇందులో విలువ రెండు ఆకారాల్లో ఉంటుంది: ఒకటి సరుకు, రెండు డబ్బు. ఒకధ్రువం వద్ద సరుకు మరొక ధ్రువం వద్ద డబ్బు. అవి రెండూ సమానమైనవి. వాటి ప్రతినిధులుగా వాటి ఓనర్లు కలుసుకుంటారు.ఒకరు సరుకిస్తే, మరొకరు డబ్బిస్తారు. అలాంటి లావాదేవీల్లో ఒకేచోట ఒకేకాలంలో సరుకూ,డబ్బూ ఉండాలి. అయితే సరుకు మారకానికి అలా ఉండడం తప్పనిసరి కాదు. అప్పుడు సరుకు తీసుకొని తర్వాతెప్పుడో అనుకున్న రోజుకి డబ్బివ్వవచ్చు.ఇందుకెప్పుడూ అవకాశం ఉంది.చలామణీ వృద్ధయ్యేకొద్దీ ఆ అవకాశం వాస్తవమయింది. ముందుగా సరుకులిచ్చి ఆతర్వాత వారానికో నెలకో అనుకున్న ప్రకారం డబ్బు తీసుకోవడం కూడా అమల్లోకొచ్చింది. ఇలాంటి లావాదేవీలు నిరంతరం జరుగుతున్నవే, అందరం ఎరుగున్నవే.

### అలాంటి పరిస్థితులు ఏర్పడడానికి కారణాలు

ఒక సరుకు ఓనర్ వేరొకరి సరుకు కొనాలంటే, ముందు తనసరుకు అమ్మాలి. అమ్మి వచ్చిన డబ్బుపెట్టి కొంటాడు. అయితే అమ్మకపోయినా కొనాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

1. ఒక సరుకు ఉత్పత్తికి తక్కువ టైం పడుతుంది, మరొకదానికి ఎక్కువ టైం పడుతుంది. ఒక సరుకు ఉత్పత్తయ్యేచోటే అమ్ముడవచ్చు. మరొకటి అమ్మడంకోసం మార్కెట్ కి చాలా దూరం పోవాల్సి రావచ్చు. రెండో సరుకు ఓనర్ కొనేదానికి రెడీ కాక ముందే, మొదటి సరుకు ఓనర్ అమ్మేదానికి సిద్ధంగా ఉండవచ్చు.

గడ్డపారలు చేసేవాడు గంటకొకటి చెయ్యగలడు.ఇటుకలు కాల్చేవాడికి కొన్ని వారాలు పడుతుంది. ఇటుకలవానికి గడ్డపార కావలసి వస్తే తనసరుకు ఇంకా తయారవదు. కనుక కొనడానికి డబ్బుండదు. అందువల్ల కొనగానే డబ్బివ్వలేడు. తనసరుకు అమ్ముడయ్యేదాకా గడువు కావాలి.

2.దూరప్రాంతాల్లో అమ్మాల్సిన సరుకులు ఉంటాయి. పోయి అమ్ముకొని వచ్చేసరికి కొంత టైం పడుతుంది. ఈలోగా తనకు కావలసిని సరుకులు కొనాలంటే చెల్లించడానికి గడువు తప్పనిసరి.

3.రైతులకి పంట సీజన్ లోనే వస్తుంది. దాన్నమ్మేదాకా కొనడానికి డబ్బుండదు. కొన్ని పంటల్ని మార్కెట్ కి తీసుకుపోవాలి. వాళ్ళు అమ్మి డబ్బిచ్చే సందర్భాలు ఉంటాయి. గడువు పెట్టుకుంటారు.

అలాంటి పరిస్థితుల్లో సరుకులు చేతులు మారతాయి. తర్వాత కొంతకాలానికి అవి డబ్బవుతాయి. సరుకు అవసరం అవడానికీ, కొనేందుకు డబ్బు ఉండడానికీ పొంతన ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో డబ్బు చెల్లించడం తర్వాత జరుగుతుంది- ఒప్పందం ప్రకారం.

4.మరొకపక్క, ఇల్లు లాంటి సరుకు ఉపయోగం కొంత కాలానికి, (ఒక ఏడాదికి అనుకుందాం) అమ్మవచ్చు- ఉదాహరణకి ఇల్లు. దీన్ని మామూలుగా అద్దెకివ్వడం అంటాం. ఆసరుకు ఉపయోగపు విలువని కొన్నవాడు (అద్దెకు తీసుకున్నవాడు) గడువు చివరకి గాని వాస్తవంగా పొందలేడు. అంటే అతను చెల్లించక ముందే కొంటున్నాడు. అమ్మినవాడు ఉన్న సరుకుని అమ్ముతాడు, కొన్నవాడు డబ్బుయొక్క ప్రతినిధిగా, అదికూడా భవిష్యత్తులో ప్రతినిధిగా కొంటాడు.

## రుణ దాత- రుణగ్రహీత

ఆ పరిస్థితుల్లో వాళ్ళ పాత్రలు మారతాయి.అమ్మినవాడు అప్పిచ్చినవాడు (అంటే రుణ దాత) అవుతాడు. కొన్నవాడు అప్పు తీసుకున్నవాడు (అంటే రుణగ్రహీత) అవుతాడు. . రుణగ్రహీత, రుణ దాత – స్వభావాలు సరళ చలామణీ నుండి తలెత్తుతాయి.

పనులుచేసేవాళ్ళకి వారం చివర్లోగాని కూలీ రాదు.అప్పటిదాకా సరుకులు అరువు తెచ్చుకొని కూలి డబ్బులొచ్చాక చెల్లిస్తారు. డబ్బు చెల్లింపు సాధనమయింది. అది మరొక చర్య చేయవలసి వచ్చింది.

ఈసందర్భంలో సరుకుల రూప పరివర్తన ఒక కొత్త అంశంగా కనబడుతుంది. డబ్బుకి ఇంకొక పనికూడా పడుతుంది. డబ్బు చెల్లింపు సాధనం అవుతుంది

అప్పిచ్చినవాడికీ, పుచ్చుకున్న వాడికీ మధ్య సంబంధాలు మొరటుగా మారవచ్చు

.చలామణీ యొక్క ఈ మారిన రూపం కొన్నవాడికీ అమ్మినవాడికీ కొత్త రంగు వేస్తుంది. ఈ కొత్త పాత్రలు అమ్మేవాడూ, కోనేవాడూ అనే పాత పాత్రల లాగే తాత్కాలికమయినవి, ఒకపాత్ర మరోకపాత్రలోకి మారుతుంది. ఆ నటులే అటూ ఇటూ మారి పాత్రలు పోషిస్తుంటారు. అయితే ఈ వ్యతిరేకత అంత అనుకూలమైనది కాదు. గట్టిపడే అవకాశం ఉంటుంది. అప్పిచ్చినవాడికీ, పుచ్చుకున్న వాడికీ మధ్య సంబంధాలు మొరటుగా మారవచ్చు.ఇందుకు ఉదాహరణ ఫుట్ నాట్ లొ ఉండి:18 వ శతాబ్దం మొదట్లో " ఇంగ్లండ్ వర్తకుల మధ్య ఉన్న మొరటుదనం మరే ఇతర సమాజాల్లోనూలేదు. ప్రపంచంలో ఏఇతర దేశంలోనూలేదు"- (—An Essay on Credit and the Bankrupt Act)

సరుకుల చలామణీ ప్రమేయం లేకుండానే స్వతంత్రంగా అవే పాత్రలు రూపొందవచ్చు కూడా.

ప్రాచీన ప్రపంచంలో వర్గపోరాటాలు ముఖ్యంగా అప్పులిచ్చినవాళ్ళకీ, తీసుకున్న వాళ్ళకీ మధ్య పోటీ రూపం తీసుకున్నవే. రోమ్ లో ఈ పోరాటాలు అప్పుపడ్డ సామాన్యుల (plebeian debtors) వినాశనంతో ముగిసింది. వాళ్ళ స్థానంలో బానిసలొచ్చారు.

మధ్య యుగాల్లో ఫ్యూడల్ రుణగ్రస్తుల నాశనంతో పోటీ ముగిసింది.వాళ్ళ ఆర్థిక పునాదినీ, దాని మీద ఆధారపడ్డ రాజకీయాధికారాన్నీ కూడా కోల్పోయారు. అయినా, ఈరెండు కాలాల్లోనూ అప్పు ఇచ్చినవాడికీ, తీసుకున్న వాడికీ మధ్య ఉండే సంబంధం వర్గాల యొక్కసాధారణ ఆర్థిక పరిస్థితుల మధ్య ఎంతో లోతుగా ఉన్న శత్రుత్వాన్ని మాత్రమే ప్రతిబింబిస్తుంది.

సరుకుల చలామణీకి తిరిగొద్దాం. అమ్మక ప్రక్రియలో సరుకులూ డబ్బూ సమానకాలుగా ఒకేసారి కనబడడం నిలిచి పోతుంది. మొదటి విషయం.అమ్మిన సరుకు ధర నిర్ణయంలో డబ్బు ఇప్పుడు విలువ కొలమానంగా పనిచేస్తుంది; ఒప్పందంలో నిర్ణయమైన ధర, అప్పు తెసుకున్నవాని బాధ్యత ఎంతో కొలుస్తుంది. ఫలానా రోజుకి ఇవ్వాల్సిన మొత్తం ఎంతో కొలుస్తుంది. అంటే ఫలానా తేదీకి ఫలానింత ఇవ్వాలని తెలుస్తుంది.

రెండోవిషయం. అది భావాత్మక కొనుగోలు సాధనంగా ఉపకరిస్తుంది.చెల్లిస్తాను అని కొన్నవాడు చేసిన వాగ్దానంలో మాత్రమే ఉండి, సరుకుని చేతులు మారేట్లు చేస్తుంది (అంటే కాని అక్కడ వాస్తవంగా డబ్బుండదు).చెల్లించాల్సిన రోజు వచ్చేదాకా, చెల్లింపు సాధనం చలామణీ లోకి రాదు. అంటే కొన్నవాని చేతిలోంచి అమ్మినవాని చేతిలోకి రాదు.

## నిల్వ- చెల్లింపు సాధనమూ

ఈ మూడో చర్య గురించి వివరించేటప్పుడు మార్క్స్ నిలవనీ, చెల్లింపుసాధనాన్నీ పోలుస్తాడు.

సరుకు-డబ్బు-సరుకు ప్రక్రియ తొలి దశ 'సరుకు-డబ్బు' ముగియగానే అంతటితో నిలిచిపోయింది. అంటే,సరుకు మారిన రూపం అయిన డబ్బు చలామణీ నుండి ఉపసంహరించబడింది. కాబట్టి చలామణీ మాధ్యమం నిల్వగా మారింది. సరుకు చలామణీ నుండి వెళ్ళిపోయాక మాత్రమే, చెల్లింపు సాధనం చలామణీలో ప్రవేశిస్తుంది.ఈ ప్రక్రియని తెచ్చేది డబ్బు కాదు. ముగించేది మాత్రం డబ్బు. మారకం విలువ యొక్క నిరపేక్ష మనుగడ రూపంగా లేక సార్వత్రిక సరుకుగా

ప్రవేశించడం ద్వారా ఈ ప్రక్రియని పూర్తిచేస్తుంది. అమ్మినవాడు తనసరుకును డబ్బుగా మార్చుకున్నాడు- ఏదో ఒక అవసరాన్ని తీర్చుకోడానికి.నిల్వదారుడు కూడా అదే చేశాడు –తన సరుకుని డబ్బు రూపంలో ఉంచడానికి. అప్పుపడ్డవాడూ చెల్లించ గలిగేందుకు అదే చేశాడు. అతను చెల్లించకపోతే, షరీఫ్ అతని వస్తువుల్ని అమ్మివేస్తాడు. సరుకుల విలువ రూపం అయిన డబ్బే ఇప్పుడు లక్ష్యమూ, పరమావధీ కూడా. అది కూడా చలామణీ ప్రక్రియనుండి తలెత్తే సామాజిక అవసరమే.

## ముందు సరుకు అప్పగింత, తర్వాతే ధర చెల్లింపు

కొన్నవాడు సరుకుల్ని డబ్బులోకి మార్చేముందే డబ్బుని తిరిగి సరుకుల్లోకి మారుస్తాడు. వేరే విధంగా చెబితే, మొదటి రూప పరివర్తన లేకుండానే రెండో రూప పరివర్తనని సాధిస్తాడు.అమ్మినవాని సరుకు చలామణీ అవుతుంది. దాని ధరని పొందుతుంది.అయితే అది ఆడబ్బుమీద చట్టబద్ధమైన హక్కు రూపంలోమాత్రమే.అది డబ్బులోకి మారకముందే ఉపయోగపువిలువలోకి మారుతుంది.దాని మొదటి రూప పరివర్తన తర్వాతి కాలంలో మాత్రమే పూర్తవుతుంది.

## ముందు ధర చెల్లింపు, తర్వాతే సరుకు అప్పగింత

**ముందు డబ్బివ్వడం తర్వాతెప్పుడో సరుకులు పొందడం కూడా ఉంటుంది.**

డబ్బు ఉపయోగపువిలువ సిద్ధించకముందే, వాస్తవంగా సరుకు అప్పగింతకు ముందే,సరుకుధర సిద్ధించవచ్చు. ముందస్తు చెల్లింపుల రూపంలో ఇది ప్రతిరోజూ నిరంతరం జరుగుతుంటుంది. ఇంగ్లిష్ ప్రభుత్వం ఇండియా రైతులనుండి నల్లమందు ఈ పద్ధతిలోనే కొనేది... రష్యాలో ఉత్పత్తుల్ని కొనడానికి విదేశీ వర్తకులు ఈవిధానాన్నిపాటించేవాళ్ళు. ఏమైనా ఈ సందర్భాలలో డబ్బు కొనుగోలు సాధనంగా పనిచేస్తుంది.... పెట్టుబడి కూడా డబ్బురూపంలో అడ్వాన్స్ చెయ్యబడుతుంది....అయితే ఈ దృక్పథం (point of view) సరళ చలామణీ పరిధిలోకి రాదు.-క్రిటిక్

చలామణీ లోకొచ్చే సరుకు కోనేవానికి ఉపయోగపువిలువ అయ్యే ముందే, అమ్మేవానికి మొదట మారకం విలువ, డబ్బు అవాలి. మారిన అమ్మకం పద్ధతిలో ఈరెండు దశలు కూడా తారుమారవుతాయి.మొదట కొన్నవాడికి అది ఉపయోగపువిలువ అవుతుంది.అమ్మినవానికి మారకం విలువ అవడం ఆలస్యమవుతుంది.

ఒక నిర్ణీత సమయంలో బాకీలు చెల్లించాల్సిన బాధ్యతలు అమ్ముడయిన సరుకుల ధరల మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఆమొత్తాన్ని సిద్ధింప చెయ్యడానికి అవసరమైన బంగారం పరిమాణం మొదట చెల్లింపు సాధనంయొక్క వేగాన్ని బట్టి ఉంటుంది. ఆపరిమాణం రెండు పరిస్థితులమీద ఆధార పడుతుంది.

1. అప్పు పెట్టినవాళ్ళ, తీసుకున్నవాళ్ళ సంబంధాలు ఒక గొలుసుగా ఏర్పడతాయి. ఎలాగంటే, తనబాకీదారుడు B డబ్బివ్వగానే A దాన్ని నేరుగా తనకి అప్పిచ్చిన C చేతిలో పెడతాడు. C నించి D కి D నించి E కి....ఇలా పోతూనే ఉంటుంది. ఇదే గొలుసు ఏర్పడడం అంటే.

2. రెండో పరిస్థితి. బకాయీలు చెల్లించాల్సిన వేర్వేరు గడువు రోజుల మధ్య వ్యవధులు. ఆగని చెల్లింపుల గొలుసు లేక నెమ్మదించిన మొదటి రూప పరివర్తనలు సారభూతంగా భిన్నమైనది. దీనికీ ఇంతకు ముందు మనం పరిశీలించిన పరస్పరం పెనవేసుకునే రూపపరివర్తనల పరంపరకీ తేడా ఉంది. చలామణీ మాధ్యమం చలనం వల్ల అమ్మేవాళ్ళకీ కోనేవాళ్ళకీ మధ్య సంబంధం వ్యక్తం కావడమే కాదు,ఈ సంబంధం చలామణీ లోనే ఏర్పడింది, చలామణీలో మాత్రమే మనుగడలో ఉంటుంది. అందుకు భిన్నంగా చెల్లింపు సాధనం యొక్క చలనం ఎంతోకాలం ముందు నించే ఉన్న సామాజిక సంబంధాన్ని తెలుపుతుంది.

## చెల్లించాల్సిన ఒకే శేషం

ఎన్నో అమ్మకాలు ఏకకాలంలో జరుగుతాయి. పక్కపక్కనే జరుగుతాయి. ఈ వాస్తవం చలనవేగం వల్ల నాణెం ఏ మేరకు తొలగించబడుతుందో ఆమేరని పరిమిత పరుస్తుంది. మరోకపక్క, ఈ వాస్తవం చెల్లింపు సాధనాన్ని తగ్గించే కొత్త లివర్ . ఒక చోట చెల్లింపులు కేంద్రీకరించబడే నిష్పత్తిలోనే, వాటి రద్దు(liquidation) కోసం ప్రత్యేక సంస్థలూ, విధానాలూ వృద్ధి చెందుతాయి. మధ్యయుగాల్లో లియోన్స్ లో ఉన్న వేర్ మెంట్స్* అలాంటివే.(ఒక అకౌంట్ నుంచి మరోక అకౌంట్ కిమార్చే సంస్థ)Bనుంచి A కి రావాల్సిన అప్పులు, B కి C నుంచి రావాల్సిన అప్పులు, C నుంచి Aకి రావాల్సిన అప్పులు ....ఇంకా అలాంటివి అవి ఎదో మేరకు రద్దవుతాయి- ధన రుణ పరిమాణాలలాగా. ఆవిధంగా చెల్లించాల్సిన ఒకే శేషం (single balance) మిగులివుంటుంది. రద్దుల వల్ల చెల్లింపు సాధనంగా అవసరమైన డబ్బుపరిమాణం పొదుపవుతుంది. తగ్గుతుంది. కేంద్రీకృతమైన చేల్లిమ్పులమొట్టం ఎంత ఎక్కువైతే ఆమొత్తానికి సాపేక్షంగా ఈ శేషం అంత తక్కువగా ఉంటుంది, చలామణీలో చెల్లింపు సాధనం అంతే తక్కువగా వుంటుంది.

## చెల్లింపు సాధనంగా డబ్బు చర్యలో వైరుధ్యం

చెల్లింపులు పరస్పరం రద్దవడం సామాజిక స్థాయిలో చెదిరితే, చెల్లించాసిన బాధ్యతలు సెటిల్ చెయ్యడానికి అందుబాటులోఉన్న డబ్బుకంటే ఎక్కువ కావాలి : సంక్షోభం.

చెల్లింపు సాధనంగా డబ్బు చర్యలో ఒక వైరుధ్యం ఉంది. చెల్లింపులు ఒకదానికొకటి బాలెన్స్ అయినమేరకు డబ్బు ఉహాత్మకంగా కాతా డబ్బుగా, విలువ కొలమానంగా పనిచేస్తుంది.వాస్తవంగా చెల్లించాల్సిన మేరకు డబ్బు చలామణీ మాధ్యమంగా ఉపకరించదు. సామాజిక శ్రమ యొక్క అవతారంగా, మారకం విలువ యొక్క స్వతంత్ర మనుగడ రూపంగా, సార్వత్రిక సరుకుగా* ఉపకరిస్తుంది. పారిశ్రామిక, వాణిజ్య సంక్షోభాలలో ఉండే ద్రవ్య సంక్షోభాలు అనబడే దశలలో ఈ వైరుధ్యం తీవ్రమౌతుంది/మొనదేలుతుంది.బద్దలవుతుంది.

ఇక్కడ చెప్పిన ద్రవ్య సంక్షోభమనేది ప్రతి సంక్షోభంలోనూ ఒక దశ. దానికదే స్వతంత్రంగా ఏర్పడే ద్రవ్య సంక్షోభం కూడా ఉంటుంది. అది పరిశ్రమ మీదా, వ్యాపారం మీదా పరోక్షంగా ప్రభావం చూపుతుంది. ఈరెంటినీ వేరువేరుగా గమనించాలి. వాటి భేదాల్ని స్పష్టంగా గ్రహించాలి. డబ్బు పెట్టుబడిలోనే వీటి ఇరుసు ఉంటుంది. కనుక వాటి ప్రత్యక్ష కార్యరంగం ఆ పెట్టుబడి రంగమే, అంటే, బాంకింగ్,స్టాక్ ఎక్స్చేంజ్, ద్రవ్య రంగాలే.

## అలాంటి సంక్షోభం ఎక్కడ ఏర్పడుతుంది?

చెల్లింపుల గొలుసు అంతులేకుండా పెరిగిపోయి, ఆ చెల్లింపుల్ని సెటిల్ చెయ్యడానికి కృత్రిమ వ్యవస్థ పూర్తిగా అభివృద్ధి చెందిన చోట మాత్రమే అలాంటి సంక్షోభం ఏర్పడుతుంది. ఏ కారణం చేతైనాగానీ, ఈ విధానం/ఏర్పాటు మరీ ఎక్కువగా అస్తవ్యస్తం అయినప్పుడు డబ్బు ఖాతా డబ్బు(money of account) అనే భావాత్మక ఆకారం నుండి అకస్మాత్తుగా, తక్షణమే నగదు (hard cash) లోకి మారుతుంది. మామూలు సరుకులేవీ ఇక దాని స్థానంలోకి రాలేవు. సరుకుల ఉపయోగపువిలువ విలువలేనిది (valueless) అవుతుంది. వాటి విలువ దాని సొంత స్వతంత్ర రూపం ముందు అదృశ్యం అవుతుంది. సంక్షోభం వచ్చే ముందు మత్తుగొలిపే భారీ సంపదవల్ల కలిగిన స్వయం సమృద్ధి భావనతో ఉన్న బూర్జువా డబ్బు అనేది నిష్ఫలమైన ఊహ మాత్రమే అంటాడు. సరుకులు మాత్రమే డబ్బు. అయితే ప్రస్తుతం ప్రతిచోటా ఒకటే కేక: డబ్బు మాత్రమే సరుకు!

అప్పు విధానం నుంచి ఆకస్మికంగా నగదు విధానానికి వెనుదిరగడం భయోత్పాతాన్నీ ఆపైన సిద్ధాంత పరమైన విపరీత భీతినీ కలిగిస్తుంది; చలామణీని నడిపే వ్యాపారులు తమ సొంత ఆర్థిక సంబంధాలను ఆవహించిన దుర్భేద్యమైన రహస్యం(mystery) ముందు గడగడ వణికిపోతారు (Karl Marx, l.c., p. 126.)

పేదలు పనిలేక కాళీగా ఉంటారు. కారణం పనివ్వడానికి ధనవంతులదగ్గర, యచ్చాలూ, బట్టలూ ఇవ్వడానికి గతంలోలాగే భూమీ, చేతులూ ఉన్నప్పటికీ, డబ్బు లేకపోవడం;...నిజమైన దేశ సంపద అదే, (యచ్చాలూ, బట్టలే) డబ్బుకాదు.-అని 1696 లో జాన్ బెల్లర్స్ రాసిన వాక్యాన్ని ఉటంకిస్తాడు.

లేడి తాజా నీటికోసం ఎలా పరితపించి పోతుందో, ఏకైక సంపద రూపం అయిన డబ్బు కోసం బూర్జువా ఆత్మ అలా పరితపిస్తుంది. ఆపరిస్తితుల్లో సంపద అంటే ఒక్క డబ్బే.

సంక్షోభంలో సరుకులకీ, వాటి విలువ రూపం అయిన డబ్బుకీ మధ్య ఉండే వ్యతిరేకత ఎదిగి పరమ వైరుధ్యంగా పరిణమిస్తుంది. కనుక అలాంటి సందర్భాల్లో డబ్బు కనబడే రూపం ముఖ్యం కాదు. చెల్లింపులు బంగారంలో జరిగినా, బాంక్ నోట్ల వంటి ఖాతా డబ్బులో జరిగినా డబ్బు కరువు మాత్రం కొనసాగుతుంది.

[3]అలాంటి పరిస్థితుల్ని వ్యాపారులు తమకనుకూలంగా వినియోగించుకుంటారు. 1839 లో ఒక సందర్భంలో స్వార్ధపరుడైన ఒక బాంకర్ అతను కూర్చున్న డెస్క్ తెరిచి నోట్ల కట్టలు ఒక మిత్రుడికి చూపాడు. అవి 6 లక్షల పౌండ్లు అని ఆనందపడుతూ చెప్పాడు. డబ్బు చలనంలో లేకుండా ఉంచడానికి వాటిని బిగబట్టినట్లూ, అదే రోజు 3 గంటలు కొట్టాక విడుదల చేయబోతున్నట్లూ చెప్పాడు. 1864 ఏప్రిల్ అబ్జర్వర్ లో ఇలాఉంది: బాంక్ నోట్ల కొరత సృష్టించడానికి అవలంబించే సాధనాల గురించి ఆసక్తికరమైన రూమర్లు చక్కర్లు కొడుతున్నాయి ... అలాంటి ట్రిక్కులు పన్నుతారని అనుకోవడం సందేహించదగినదే అనిపించినా, ఆ రిపోర్టు సర్వత్రా ఉన్నది కనక దాన్ని ప్రస్తావించడం నిజంగా సముచితం.

## ఒకనిర్ణీత కాలంలో చలనంలో ఉండే డబ్బుమొత్తం

చలనవేగమూ, చెల్లింపు సాధనాల చలన వేగమూ నిర్దిష్టంగా వున్నప్పుడు చలనంలో ఉండే డబ్బుమొత్తం = సిద్ధించాల్సిన ధరలమొత్తం + చెల్లించాల్సిన బాకీల మొత్తం – ఒకదాన్నొకటి రద్దుపరుచుకునే చెల్లింపులు –

ఒకసారి చలామణీ సాధనంగానూ, మరొకసారి చెల్లింపు సాధనంగానూ ఉపకరించే ఒకే నాణెం చేసే సర్క్యూట్ల సంఖ్య. దీని ప్రకారం చివరికి వచ్చేదే చలనంలో ఉండే డబ్బుమొత్తం.

ఉదాహరణకి ఒకరైతు గోదుమల్ని 2పౌండ్లకి అమ్మాడు. ఆడబ్బు చలామణీ మాధ్యమంగా ఉపకరిస్తుంది.తనకు బట్టనిచ్చిన నేతగానికి చెల్లించాల్సిన రోజొచ్చినప్పుడు ఆడబ్బుని ఉపయోగితాడు. అదే 2 పౌండ్లు ఇప్పుడు చెల్లింపు సాధనంగా ఉపకరించింది. ఆ నేతగాడు ఇప్పుడు డబ్బిచ్చి బైబిల్ కొంటాడు. ఇది మళ్ళీ చలామణీ మాధ్యమంగా పనిచేస్తుంది. అలా..అలా.....

అందువల్ల, ధరలూ, చలన వేగమూ, చెల్లింపుల విస్తృతీ తెలిసినప్పటికీ, ఒక నిర్ణీత కాలంలో ఉదాహరణకి ఒకరోజులో, చలనంలో ఉన్న డబ్బు పరిమాణమూ, చలామణీ లో ఉన్న సరుకుల మొత్తమూ రెండూ ఒకటిగా ఉండవు.

ఎప్పుడో చలామణీ నుంచి ఉపసంహరించబడిన సరుకులకు ప్రతినిధిగా ఉండే డబ్బు, చలనంలో కొనసాగుతుంది. సరుకులు చలామణీ అవుతుంటాయి. కాని, వాటి సమానకం అయిన డబ్బు రాబోయే కాలంలో ఏదో రోజున మాత్రమే కనబడుతుంది. అంతదాకా రంగంలో కనబడదు. అంతేగాదు, ప్రతిరోజూ ఒప్పందం అయ్యేయ్యే అప్పులూ, అదేరోజు చెయ్యాల్సిన చెల్లింపులూ రెండూ ఒకేరకంగా కొలవడానికి వీలుకాని రాసులు (incommensurable quantities).

ఒక రోజులో జరిగిన కొనుగోళ్ళ మొత్తం గానీ, ఒప్పందాల మొత్తంగానీ అదే రోజున చలనంలో ఉండే డబ్బు పరిమాణం మీద ప్రభావం చూపవు. కాని, అత్యధిక సందర్భాల్లో కొనుగోళ్ళ, ఒప్పందాల డబ్బు పరిమాణం తర్వాతి తేదీల్లో దగ్గరలోనో దూరంలోనో అమలయ్యే వివిధ డ్రాఫ్టుల లోకి వాటికవే రిజాల్వ్ అవుతాయి. .....ఇవ్వాళ మంజూరైన బిల్లులు, తెరిచిన అప్పులు రేపో ఎల్లుండో మంజూరయ్యే బిల్లుల, చేసే అప్పుల పరిమాణంలోగానీ, కాలవ్యవధిలో గానీ ఏ పోలికతోనూ ఉండవు. అంతేకాదు, ఇవ్వాల్టి చాలా బిల్లులూ, అప్పులూ చెల్లించవలసిననాడే ఎప్పుడెప్పుడో తీసుకున్న బిల్లులూ అప్పులూ చెల్లించాల్సి వస్తుంది. 12 నెలలక్రితమో, ఆర్నెల్ల క్రితమో, మూణ్ణెల్ల క్రితమో, నెలక్రితమో ఏర్పడ్డ బిల్లులు తరచు కలిసి ఒకే రోజు పెద్దమొత్తం చెల్లించాల్సి రావచ్చు.- The Currency Theory Reviewed: A Letter to Scotch People. By a Banker in England, Edinburgh, 1845, pp. 29, 30 passim).

ఖాతాడబ్బు చెల్లింపు సాధనంగా డబ్బు చేసే చర్య నుండి నేరుగా తలెత్తుతుంది. కొన్ని సరుకుల వల్ల ఏర్పడిన అప్పుల పత్రాలు ఆ అప్పుల్ని ఇతరులకు బదిలీ చేయడం కోసం చలామణీ అవుతాయి.మరొక పక్క, అప్పు వ్యవస్థ ఏ మేరకు వృద్ధవుతుందో, ఆ మేరకు చెల్లింపు సాధనంగా డబ్బు చర్య కూడా వృద్ధవుతుంది. ఆపాత్రలో అది తనకు ప్రత్యేకమైన వివిధ రూపాలు - మారకం బిల్లులు (bills of exchange), చెక్కులు, స్థానిక నోట్లు మొదలయిన రూపాలు – తీసుకుంటుంది. ఆయారూపాల్లో అది భారీ వాణిజ్య లావాదేవీల రంగంలో సౌకర్యవంతంగా మసులుకోగలుగుతుంది. మరొకపక్క, వెండి బంగారు నాణేలు ఎక్కువగా చిల్లర వర్తక రంగానికి పరిమితం చేయ బడతాయి

వాస్తవ వాణిజ్య లావాదేవీలకు రెడీగా ఎంత తక్కువ డబ్బు సరిపోతుందో చూపడానికి ఒక ఉదాహరణ ఇచ్చాడు. అది ఒక భారీ వ్యాపార సంస్థ 1856 సంవత్సర జమాఖర్చుల పట్టిక. ఎన్నో మిలియన్ల లావాదేవీల్ని ఒక మిలియన్ కి కుదించబడింది.

రాబడులు

| | |
|---|---|
| గడువు తర్వాత(బాంకర్లు, వర్తకులు) చెల్లించాల్సిన బిల్లులు | £ 533,596 |
| డిమాండ్ పై బాంకర్లు, ఇతరులూ చెల్లించాల్సిన చెక్కులు | £ 357,715 |
| కంట్రీ నోట్లు | £ 9,627 |
| ఇంగ్లండ్ బాంక్ నోట్లు | £ 68,554 |
| బంగారం | £ 28,089 |
| వెండి, రాగి | £ 1,486 |
| పోస్ట్ ఆఫీస్ ఆర్డర్లు | £ 933 |
| మొత్తం | £ 1 ,000,000 |

ఈమొత్తంలోడబ్బుఒక లక్షకి కొంచెం పెచ్చు.

చెల్లింపులు

| | |
|---|---|
| గడువు తేదీ తర్వాత చెల్లించాల్సిన బిల్లులు | £302,674 |
| లండన్ బాన్కర్ల చెక్కులు | £663,672 |
| ఇంగ్లండ్ బాంక్ నోట్లు | £22,743 |
| బంగారం | £9,427 |
| వెండి, రాగి | £1 ,484 |
| మొత్తం | £ 1 ,000,000 |

ఈమొత్తంలోడబ్బు 34,000 కి కొంచెం తక్కువ.

(Report/rom the Select Committee on the Bank Acts, July 1 858, p. lxxi)

## చెల్లింపు సాధనంగా డబ్బు చర్య విస్తరించడం

సరుకుల ఉత్పత్తి ఒక స్థాయికి విస్తరించినప్పుడు, సరుకుల చలామణీరంగాన్ని దాటి, చెల్లింపు సాధనంగా డబ్బు చర్య విస్తరించడం మొదలవుతుంది. అది అన్ని ఒప్పందాలకు సార్వత్రిక విషయం అయిన సరుకు అవుతుంది.

వర్తకం ఆదారి కి మళ్ళాక, అంటే వస్తువులకు వస్తువుల మారకం నుండి, ఇచ్చి పుచ్చుకోవడం నుండి, అమ్మడం చెల్లించడం అనే దానికి వచ్చాక, అన్ని బేరాలూ ..ఇప్పుడు ధర ప్రాతిపదిక మీద డబ్బులో చెప్పబడతాయి.(డేనియల్ డెఫో) An Essay upon Pub lick Credit, 3rd edn, London, 1710, p.

అద్దెలూ, పన్నులూ వంటి చెల్లింపులు వస్తుచెల్లింపుల నుండి డబ్బు చెల్లింపులలోకి మారతాయి. ఈ మార్పు సాధారణ ఉత్పత్తి పరిస్తితులమీద ఏ స్థాయిలో ఆధారపడుతుంది అనేదాన్ని సోదాహరణంగా వివరించాడు. రోమన్ సామ్రాజ్యం అన్ని వసూళ్ళనీ డబ్బులో విధించాలని ప్రయత్నించి రెండుమార్లు విఫలమయింది. (దీన్నిబట్టి ఉత్పత్తి పరిస్థితులు అక్కడ అప్పటికి పూర్తి డబ్బు చెల్లింపులకు అనుకూలంగా లేవు.)14వ లూయీ కాలంలో ఫ్రెంచ్ రైతులు చెప్పలేనంత కష్టం బాధ అనుభవించారు. బాయిస్ గుల్లెబెర్ట్, మార్షల్ వౌబన్ మరికొందరు వాళ్ళ కష్టాల్ని అనర్గళంగా ఖండించారు. ఈకష్టాలకు కారణం పన్నుల భారం ఒక్కటే కాదు, వస్తురూపంలో చెల్లించే పన్నుల్ని డబ్బు రూపంలో చెల్లించేవిగా మార్చడం కూడా. .55

డబ్బు అన్నిటినీ ఉరితీసే తలారి అయింది. ఫైనాన్స్ అనేది మరణాంకమైనసారాన్ని దింపడానికి సరుకుల్ని భయంకర పరిమాణంలో అవిరిచేసే సాధనం (alembic). డబ్బు మొత్తం మానవజాతి మీదే యుద్ధం ప్రకటిస్తుంది.- బాయిస్ గుల్లెబెర్ట్ 1843

అలాకాకుండా ఆసియాలో పన్నులలో ఎక్కువభాగం కౌళ్ళే. వాటిని వస్తురూపంలో చెల్లించవచ్చు. ఈవాస్తవం(కౌళ్ళవస్తురూపచెల్లింపు) ప్రకృతి పరిస్థితుల క్రమబద్ధతతో పునరుత్పత్తి అయ్యే ఉత్పత్తి పరిస్తితులమీద ఆధారపడుతుంది. ఈరకమైన చెల్లింపు ప్రాచీన ఉత్పత్తి రూపాన్ని నిర్వహించే పని చేస్తుంది.ఆటోమన్ సామ్రాజ్యం చెక్కుచెదరకుండా ఉండడానికి ఒక కారణం ఈ చెల్లింపు విధానం కూడా.

ఐరోపా వాళ్ళు జపాన్ వాళ్ళమీద బలవంతంగా రుద్దిన విదేశీవ్యాపారం చెల్లింపులు వస్తు రూపంలో కాకుండా, డబ్బులో అయివున్నట్లయితే శ్రేష్టమైన ఆదేశవ్యవసాయం నాశనం అయ్యేది. ఆవ్యవసాయం కొనసాగే ఆర్థికపరిస్తితులు తుడిచిపెట్టుకు పోయేవి.

## ప్రత్యేక చెల్లింపు దినాలు

ప్రతి దేశంలోనూ వివిధ చెల్లింపులూ కొద్దివీ పెద్దవీ సెటిల్ చేసుకునే రోజులు అలవాటుగా ఉంటాయి. ఆరోజులు పునరుత్పత్తి చక్రంలో జరిగే ఇతర భ్రమణాలను పక్కనబెడితే, ఋతువులతో ముడిబడిన పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి. సరుకుల చలామణీతో సేరుగా సంబంధంలేని పన్నులు,కౌళ్ళు వగయిరా చెల్లింపుల తేదీలను అవి నియంత్రిస్తాయి/క్రమబద్ధం చేస్తాయి.ఆరోజుల్లో దేశం అంతటా చెల్లించాల్సిన వాటికి అవసరపడే డబ్బుపరిమాణం చెల్లింపు మాధ్యమ ఎకానమీలో అప్పుడప్పుడు చిందరవందరలు కలిగిస్తుంది-కేవలం పైపైవే అయినప్పటికీ.

ఈస్టర్ తర్వాతవచ్చే 8 వ ఆదివారం Whitsunday. దాని తర్వాత వారం Whitsuntide. 1824 సంవత్సరం ఆ వారంలో ఎడింబరో బాంక్ కి నోట్ల కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడ్డది.ఎంతగా అంటే 11గంటలకల్లా కస్టడీలో

ఒక్క నోటన్నాలేదు. అప్పుకోసం అన్ని బాంకులకూ పంపారు. కాని దొరకలేదు. చాలా లావాదేవీలు కాగితం చీట్లమీద సర్దుబాటు చెయ్యబడ్డాయి. అయితే సాయంత్రం 3 గంటలయ్యేసరికి ప్రొద్దున ఇచ్చిన నోట్లన్నీ తిరిగి బాంకుల్లోపడ్డాయి. అది చేతినుండి చేతికి బదిలీ అవడమే.- స్కాట్ లాండ్ లో సగటు బాంక్ నోట్ల చలామణీ 3మిలియన్ల స్టెర్లింగ్ లకు లోపే ఉంటుంది. అయితే సంవత్సరంలో కొన్ని చెల్లింపు రోజుల్లో బాంకర్ల చేతిలో ఉన్న 7 మిలియన్లలో ప్రతినోటూ క్రియాశీలమవుతుంది. ఆసందర్భాలలో నోట్లకి ఒకే ఒక ప్రత్యేక చర్య ఉంటుంది. ఆపని అయ్యా అవగానే, అవి ఇచ్చిన బాంకులకే తిరిగి వస్తాయి- జాన్ ఫుల్లార్టన్ 1845

మార్క్స్ ఇక్కడ చిన్న వివరణ ఇచ్చాడు: ఫుల్లార్టన్ పుస్తకం రాసేనాటికి స్కాట్ లాండ్ లో డిపాజిట్లు తీసుకోవడానికి ఇంకా చెక్కులు రాలేదు. నోట్లే వాడేవారు.

చెల్లింపు సాధనం యొక్క చలన వేగం నియమాన్ని అనుసరించి, అన్నినిర్ణీత కాలాల చెల్లింపులకూ కావలసిన చెల్లింపు సాధనం పరిమాణం వాటి గడువుల పొడవుకి ~~విలోమంగా/~~అనులోమంగా* ఉంటుంది-

*కాపిటల్ మూడోకూర్పు (1887)వరకూ విలోమం అని ఉంది. కాని నాలుగో జర్మన్ కూర్పు (1890)లో అనులోమం గా మారింది. ఆమార్పు చేసింది ఎంగెల్స్ అని అక్కడే ఉంది.

<u>క్లుప్తంగా, కాలం ఎక్కవయితే , ఎక్కువడబ్బు కావాలి తక్కువయితే తక్కువ డబ్బు కావాలి.</u>

## వ్యాపారవసరాలకు ఏడాదికి 40 మిలియన్లు పెంచాల్సిన పరిస్థితి ఉంటే, 6మిలియన్లు (బంగారం) ఆభ్రమణాలకీ, చలామణీలకీ సరిపోతుందా?

అనే ప్రశ్నకి పెట్టీ <u>అవును</u> అన్నాడు. ఎలాగో లేక్కచేప్పాడు.మొత్తం ఖర్చు 4 కోట్లు కనుక భ్రమణాలు తక్కువ కాలంలో అంటే వారానికి,అంటే ప్రతి శనివారం పనివాళ్ళు కూలి తీసుకొని చెల్లించినట్లుగా జరిగితే అప్పుడు 40,000,000 నీ 52 భాగిస్తే వచ్చేమొత్తం సరిపోతుంది. అది ఒకమిలియన్ లోపే, అలాకాక కౌళ్ళు, పన్నుల విషయంలో మాదిరిగా మూన్నెల్లకో సారి భ్రమణం జరిగితే 40,000,000/4=10మిలియన్లు అవసరమవుతాయి. ఒకవేళ చెల్లింపులు వారానికీ, 13 వారాలకీ మధ్యలో అప్పుడప్పుడు జరిగితే అప్పుడు 10 మిలియన్లకీ 1 మిలియన్ కలిపి వచ్చే11 మిలియన్లలో సగం 5½ మిలియన్లు సరిపోతాయి. – విలియం పెట్టీ Political Anatomy of Ireland 1672

## అప్పులు తీర్చడానికి నిల్వ అవసరం

చలామణీ సాధనంగా డబ్బు అభివృద్ధి చెందడం వల్ల బాకీల మొత్తాల్ని గడువు తేదీలు వచ్చేటప్పటికి కూడ బెట్టాల్సిన అవసరం ఏర్పడింది. సంపద సముపార్జనకి డబ్బు కూడ బెట్టడం ఒక విస్పష్ట విధానం కాగా, సమాజం పురోగామించేకొద్దీ ఆపద్దతి కనపడకుండా పోతుంది. చెల్లింపు సాధనం నిల్వలు ( reserves) ఏర్పడడం సమాజ పురోగమనంతో పాటు పెరుగుతుంది. అంటే అంతకుముందు సంపదగా డబ్బుని కూడబెట్టడం ఏర్పడి ఉంది.ఖాతా డబ్బు వచ్చాక అప్పులు తీర్చడానికి నిల్వ చెయ్యాల్సిన అవసరం ఏర్పడింది.

ప్రపంచ డబ్బు గురించి వచ్చే పోస్ట్

## C. ప్రపంచ డబ్బు (Universal Money)

దేశ సరిహద్దుల లోపల డబ్బు ధరల ప్రమాణంగా, నాణెంగా, టోకెన్ లుగా, విలువ చిహ్నాలుగా స్థానిక దుస్తులు ధరిస్తుంది. అయితే దేశహద్దులు దాటగానే, ఆదుస్తుల్ని వదలివేస్తుంది. తన మొదటి రూపం అయిన బులియన్ కి తిరిగివస్తుంది. ప్రపంచ మార్కెట్ల మధ్య వర్తకంలో సరుకులవిలువ సార్వత్రికంగా గుర్తించబడినట్లు వ్యక్తం కావాలి. అందువల్ల వాటి స్వతంత్ర విలువ రూపం కూడా ఈసందర్భాల్లో వాటిని సార్వత్రిక డబ్బు రూపంలో ఎదుర్కోవాలి. ప్రపంచ మార్కెట్లలో మాత్రమే ఏసరుకు శరీర రూపం అనిర్దిష్ట మానవ శ్రమ యొక్క తక్షణ సామాజిక ఆకారమో, పూర్తిగా ఆ సరుకు స్వభావాన్ని సంతరించుకుంటుంది. ఈ రంగంలో దాని వాస్తవ మనుగడ దాని భావన (concept) కి కచ్చితంగా సరిపోయినట్లు ఉంటుంది.

### ప్రపంచ డబ్బుకీ, దేశాల డబ్బులకీ తేడా

ఒక దేశంలో చలామణీ రంగంలో ఒకే ఒక సరుకు మాత్రమే విలువకొలమానం గా ఉన్నందువల్ల, ఆ సరుకే డబ్బు అవుతుంది. కాని ప్రపంచమార్కెట్లలో రెండు విలువ కొలమానాలు –బంగారం, వెండి – ఉంటాయి. ఆ రెండు లోహాలూ డబ్బే.

అందువల్ల ఒక దేశ బాంకులు ఆదేశంలో చలామణీలో ఉన్న అమూల్య లోహం ఒక్కటే రిజర్వ్ లని ఏర్పచాలి అనే చట్టాలు అర్ధంలేనివి. ఈ సందర్భంలో బాంక్ ఆఫ్ ఇంగ్లండ్ తనకుతాను కలిగించుకున్న చిక్కులు తెలిసినవే. వెండి బంగారాల సాపేక్షవిలువల్లో మార్పుల చరిత్ర లోని గొప్ప యుగాల గురించి క్రిటిక్ లొ ఉంది. రాబర్ట్ పీల్ 1844 బాంక్ చట్టం తెచ్చాడు.వెండి బులియన్ స్థానంలో నోట్లు జారీ చేసేందుకు బాంక్ ఆఫ్ ఇంగ్లండ్ కి ఒక షరతు పెట్టి అనుమతించాడు. ఆ షరతు ఇదే: బంగారం నిల్వలో నాలుగోవంతుని మించి వెండి నిల్వ ఉండరాదు. అందుకోసం వెండి విలువ లండన్ మార్కెట్ ని బట్టి నిర్ణయమయింది.

నాలుగో జర్మన్ కూర్పు (1890)లో ఎంగెల్స్ ఈకింది వాక్యాలు కలిపాడు:

వెండి బంగారాల సాపేక్షవిలువ ఎంతగానో మారిన కాలంలో ఉన్నాం. 25 ఏళ్లనాడు బంగారం వెండి విలువల నిష్పత్తి 15½ : 1. ఇప్పుడు 22:1.ఇంకా బంగారంతో పోలిస్తే వెండి విలువ తగ్గుతూ వస్తున్నది. ఇది రెండు లోహాల ఉత్పత్తి పద్ధతుల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల ఫలితమే. ఇంతకుముందు బంగారం ఉన్న ఒండ్రు మట్టిని కడిగితే చాలు బంగారం వచ్చేది. ఇప్పుడది సరిపోవడం లేదు. ప్రాసెస్ చెయ్యాల్సి వస్తున్నది. అంతేకాదు ఉత్తర అమెరికాలో కొత్తగా భారీ వెండి గనులు బయటపడ్డాయి. ఇవీ,మెక్సికో వెండిగనులూ రైలు లైన్లు వెయ్యడానికి దారితీశాయి. ఈలైన్లు వెయ్యడం వల్ల ఆధునిక యంత్రాల్ని, ఇంధనాన్నీ రవాణాచెయ్యడం సాధ్యమయింది. దాంతో భారీ స్థాయిలో వెండి తవ్వకం చౌక పడింది.

ఏమయినా, ముడి ఖనిజాల్లో రెండు లోహాలూ శిలల్లో ఉండే తీరులో చాలా తేడా ఉంది. బంగారం ఎక్కువ భాగం అలాగే బంగారంలాగే ఒండ్రులో కలిసి ఉంటుంది. అయితే అది ఖనిజం అంతటా అతి కొద్ది పరిమాణాల్లో పరాయించుకొని ఉంటుంది. కనుక మొత్తం ఖనిజాన్ని పొడుం చెయ్యాలి. దాన్ని కడిగి బంగారం వేరుచేయ్యాలి. లేదా పాదరసం ద్వారా వేరుపరచాలి. తరచుగా 10లక్షల గ్రాముల క్వార్జ్ నుండి 1 గ్రాము నించి 3 గ్రాముల బంగారం మాత్రమే వచ్చేది.ఎప్పుడో అరుదుగా 30 నుంచి 60 గ్రాములు వచ్చేది.

వెండి విషయం వేరు. వెండి అలాగే వెండిలాగే అరుదుగా మాత్రమే దొరుకుతుంది. ఒకరమైన ఇసుక రాళ్ళలో ఉంటుంది. ముడి వెండిని వేరుపరచడం సాపేక్షంగా సులభం. ఆరాళ్ళలో 40-90 శాతం వెండి ఉంటుంది. లేదా రాగి, సీసం , తదితర ఖనిజాల్లో కొద్ది పరిమాణాల్లో ఉంటుంది. వీటినుండి కూడా వెండిని వేరుపచవచ్చు... బంగారం ఉత్పత్తికి పట్టే శ్రమ పెరుగుతున్నదనీ, వెండి ఉత్పత్తికి వ్యయించే శ్రమ కచ్చితంగా తగ్గిందనీ స్పష్టం చెయ్యడానికి ఇదొక్కటే చాలు. వెండివిలువ తగ్గడానికి కారణాన్ని ఇది సహజంగానే వివరిస్తుంది. ఈ విలువ తగ్గడం అనేది కృత్రిమ పద్ధతులద్వారా ఇవ్వాళ వెండి ధరని నిలబెట్టి అలాగే ఉంచక పోయి ఉన్నట్లయితే, వెండి విలువ మరింతగా తగ్గిన ధరలో వ్యక్తమయ్యేది.

అయితే అమెరికా సమృద్ధ వెండి నిక్షేపాలు కొద్దిగా మాత్రమే తీశారు. (ముందుముందు వాటిని తీసే అవకాశం ఉంది) అందువల్ల ఎంతో కాలం పాటు వెండి విలువ తగ్గే అవకాశాలున్నాయి. సాధారణ వాడకం వస్తువులకీ, విలాస వస్తువులకీ వెండివాటికి బదులు గిల్టు వస్తువులు రావడం వల్ల వెండి అవసరం తగ్గడానికి దోహదం చేసింది. అప్పటి పాత విలువ నిష్పత్తి 1:15½ కి వెండి పెరుగుతుంది అనుకునే ద్వంద్వలోహవాదుల ఆలోచన ఎంత ఊహాజనితమో ఎవరైనా అంచనా వెయ్యవచ్చు. ప్రపంచ మార్కెట్లలో డబ్బు చర్యని వెండి కోల్పోవడానికే అవకాశం అధికంగా ఉంటుంది.-ఎంగెల్స్

## ఆర్థికవేత్తల పొరపాటు

ప్రపంచ డబ్బు సార్వత్రిక చెల్లింపు సాధనంగా, సార్వత్రిక కొనుగోలు సాధనంగా ఉపకరిస్తుంది.సార్వత్రికంగా గుర్తించబడిన సంపద మొత్తానికీ ఆకారంగా ఉపకరిస్తుంది. అంతర్జాతీయ వ్యాపార శేషాల్ని (balances)సెటిల్ చేసే చెల్లింపు సాధనంగా పనిచెయ్యడమే దాని ప్రధాన విధి. అందువల్ల వాణిజ్య వాదుల (mercantalists) ఆలోచనని తెలిపే విషయం): వాణిజ్య శేషం(balance of trade)

వీళ్ళు వెండిబంగారాల్లో వాణిజ్య శేషాన్ని సెటిల్ చెయ్యడమే అంతర్జాతీయ వాణిజ్య లక్ష్యంగా పరిగణించారు. వారి వ్యతిరేకులు సైతం ప్రపంచ డబ్బుని గురించి పూర్తిగా పొరబడ్డారు., చలామణీ మాధ్యమం పరిమాణాన్ని నియంత్రించే నియమాలగురించినే వాళ్ళ పొరపాటు భావన, అమూల్యలోహాల యొక్క అంతర్జాతీయ చలనం గురించిన తప్పు భావనలో కూడా అంతగానే ప్రతిబింబించింది. రికార్డోని ఉదాహరణగా తీసుకొని ఆ భావన ఏవిధంగా తప్పో క్రిటిక్ లో చూపించాను. రికార్డో పిడివాదన ఇదే: కరెన్సీ మితిమీరి ఉంటే తప్ప ప్రతికూల వాణిజ్య శేషం ఏర్పడదు.....నాణెం ఎగుమతి కావడానికి కారణం అది చౌకగా ఉండడమే, అంతేకాని దాని ఫలితంకాదు. కాని ప్రతికూల శేషం యొక్క కారణం.- అనే అభిప్రాయం అంతకుముందే బార్బన్ కి ఉంది –

వాణిజ్య శేషం అంటూ ఉంటే, అది దేశం నించి డబ్బు బయటకు పోయేందుకు కారణం కాదు; కాని ప్రతి దేశంలోనూ బులియన్ విలువ వ్యత్యాసం నుండి అది ఏర్పడుతుంది. N. Barbon; l.c., pp. 59, 60.) అలా ముందుగా బార్బన్ చెప్పినందుకు మాకెల్లోక్ వహ్వా వహ్వా అన్నాడు. అయితే కరెన్సీ నియమం ఆధారపడిన ఈ అసంబద్ధ అనిశ్చిత నమ్మకం అభిప్రాయానికి (absurd supposition)ఎటువంటి బట్టలు తొడిగాడో మాత్రం తెలివిగా దాటవేసాడు. ఆయన కరెన్సీ నియమం ఈ ప్రతిపాదనమీదనే ఆధారపడింది.ఆయన 'కాటలాగ్' లో డబ్బు సిద్ధాంత చరిత్ర కు సంబంధిన విభాగంలో నిజమైన విమర్శ లేదు. కనీసం నిజాయితీ అయినా లేదు. ఈరెంటి లోపం పరాకాష్టకు చేరింది. ఆభాగంలో లార్డ్ ఓవర్ స్టన్ ని కీర్తిస్తాడు. 'డబ్బు వర్తకులకు గుర్తింపుపొందిన రాజు'(the recognized king of the money merchants) అని శ్లాఘిస్తాడు.

## నిల్వల అవసరం

భిన్న దేశాల మధ్య ఉత్పత్తుల పరస్పర మారకాల్లో ఉండే సమతుల్యత ఆకస్మికంగా భగ్నం అయిన కాలాల్లో, వెండి బంగారాలు ముఖ్యంగానూ, అవసరంగానూ అంతర్జాతీయ కొనుగోలు సాధనాలుగా పనిచేస్తాయి.

పరిస్థితి అమ్మడం లేక కొనడం కానప్పుడు, సంపదని ఒక దేశం నుండి మరొక దేశానికి బదిలీ చెయ్యడం అయినప్పుడు, అప్పటి మార్కెట్ల ప్రత్యేక పరిస్థితుల వల్లనో, ఆశించిన లక్ష్యం వల్లనో ఈ బదిలీ సరుకుల రూపంలో అసాధ్యం అయినప్పుడు, అది సామాజిక సంపద యొక్క సార్వత్రిక గుర్తింపు ఉన్న ఆకారంగా ఉపకరిస్తుంది. ఉదాహరణకు సబ్సిడీల విషయంలోనూ, యుద్ధాలు చెయ్యడానికో, బ్యాంకులు నగదు చెల్లించేందుకో- అలాంటి వాటికోసం చేసే అప్పుల విషయంలోనూ విలువ డబ్బురూపంలోనే ఉండాలి.

దేశంలో చలామణీ కి రిజర్వ్ అలా అవసరమో, అలాగే ఇంకొక రిజర్వ్ ప్రపంచ మార్కెట్లలో చలామణీ కీ అవసరం. అందువల్ల నిల్వల చర్యలు కొంత వరకూ దేశయ చలామణీ, దేశీయ చెల్లింపుల మాధ్యమంగా డబ్బు చర్య వల్లా, కొంతవరకూ ప్రపంచ డబ్బుగా దాని చర్యవల్లా ఏర్పడతాయి.

వెండి బంగారాల్లో (కాయన్లు గానీ, బులియన్ గానీ) చెల్లించే దేశాల్లో సాధారణ చలామణీ నుండి తగిన సహకారం లేకుండానే, ప్రతి అంతర్జాతీయ సర్దుబాటు సులువుగా చేసే నిల్వల సామర్థ్యానికి ఫ్రాన్స్ ని మించిన ఉదాహరణ లేదు.విధ్వంసకర విదేశీ దండయాత్ర నుండి అప్పుడప్పుడే కోలుకుంటున్న ఫ్రాన్స్ తనపై బలవంతంగా రుద్దిన ఇంచుమించు 2 కోట్లు allied powers కి 27నెలల్లో ఇచ్చింది. పైగా దేశీయ కరెన్సీ లో గమనించగలిగే తగ్గుదలగానీ, అస్తవ్యస్తత గానీ, మారకాల్లో ఆందోళన కలిగించే ఆటుపోట్లు గానీ ఏర్పడకుండానే, చెల్లించింది. –ఫుల్లర్ టన్.

నాలుగో జర్మన్ కూర్పుకు కలిపినది: ఇంకొక మంచిఉదాహరణ.1871-73 కాలంలో ఇదే ఫ్రాన్స్ 30నెలల్లో అంతకు పదింతలు అంతే సుకరంగా చెల్లించింది. అదికూడా బలవంతంగా తనపై రుద్దినదే. అందులో గణనీయమైన భాగం వెండి బంగారాల్లో చెల్లించింది.- ఎంగెల్స్

ప్రపంచ డబ్బుగా పనిచెయ్యడానికి  అసలు డబ్బుసరుకు- అంటే వాస్తవమైన వెండి, బంగారం -  అవసరం. అందువల్ల స్థానిక ప్రత్యామ్నాయాల నుండి వేరుచేయ్యడానికి  సర్ జేమ్స్ స్టువర్ట్ బంగారాన్నీ వెండినీ ప్రపంచ డబ్బు అన్నాడు,

ఒక దేశపు బంగారం రిజర్వ్ ల దేశీయ చర్యలు ఆరిజర్వ్ ల అంతర్జాతీయ చర్యల నుండి ఏవిధంగా భిన్నమైనవి?

ఇవిరెండూ ఒకదానితో ఒకటి ఘర్షణ పడతాయా? ఇక మార్క్స్ వెండి బంగారాల అంతర్జాతీయ చలనాల్ని చర్చిస్తాడు:—

బంగారం, వెండి –వీటి ప్రవాహ  చలనం ద్వంద్వచలనం. ఒకపక్క,అది ఉత్పత్తయిన చోట్ల నుండి  ప్రపంచ మార్కెంట్లన్నిటికీ వ్యాపిస్తుంది:

1.భిన్న జాతీయ చలామణీ రంగాల్లో వివిధ స్థాయిల్లో యిమడి ఉండడానికి

2.కరెన్సీని తీసుకెళ్ళేకాలువల్ని నింపడానికి

3. అరిగిపోయిన వెండి బంగారు నాణేలను సరి చెయ్యడానికి

4.విలాస వస్తువులకు పదార్థం సరఫరా చెయ్యడానికి

5. నిల్వలుగా ఏర్పడడానికి.

అయా దేశాలకు డబ్బు  అవసరాన్నిబట్టి దేశాల మధ్య డబ్బు పంపిణీ అవుతుంది... అది ఉత్పాదితాలచేత ఎల్లప్పుడూ ఆకర్షించ బడుతుతుంది కనుక.-లే ట్రోస్న్.

బంగారాన్నీ వెండినీ ఆపకుండా ఇచ్చే గనులు ప్రతి దేశానికీ అవసరమున్నంత శేషాన్ని ( balance) ని సరఫరా చెయ్యడానికి సరిపోయినంత ఇస్తాయి.-వాండర్ లింట్

## ఈ చలనం ఎక్కడ మొదలవుతుంది?

వెండి బంగారాలు ఉత్పత్తిచేసే దేశాల చేత. ఏ దేశాలు వెండిబంగారాల్నిఉత్పత్తిచేసే దేశాల  అమూల్య లోహాలకు తమ సరుకుల్ని  మారకం చేసుకుంటాయో ఆ దేశాలచేత ఈ చలనం మొదలవుతుంది. మరొకపక్క, భిన్న జాతీయ చలామణీ రంగాల మధ్య బంగారమూ, వెండీ అటుకీ ఇటుకీ నిరంతరాయంగా చలనంలో ఉంటుంది. ఈ చలనం మారక క్రమంలోఆగకుండా ఏర్పడే హెచ్చుతగ్గుల మీద ఆధారపడుతుంది

వారం వారం మారకాలు పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి.ఏడాదిలో ఏదోఒక ప్రత్యేక సమయంలో ఒకదేశంతో ఈ మారకాలు ఎక్కువగా ఉంటాయి. మరికొన్ని సమయాల్లో అందుకుభిన్నంగా అంటే తగ్గుతాయి..-బార్బన్

### డబ్బు పరిమాణాన్ని తగ్గించడం

బూర్జువా ఉత్పత్తి విధానం ఒకమేరకు అభివృద్ధి చెందిన దేశాలు నిల్వల ప్రత్యేక చర్యలని సక్రమంగా నిర్వహించడం కోసం బ్యాంకుల గదుల్లో (strong rooms) ఉన్న నిలవల్ని కనీస స్థాయికి పరిమితం చేస్తాయి.

## నిల్వ రెండు చర్యలూ ఘర్షణలో పడతాయి

దేశీయ చలామణీ, అంతర్జాతీయ చలామణీ- రెంటిలోనూ నిల్వ పనిచేస్తుంది.

బంగారమూ, వెండీ బాంక్ నోట్ల మార్పిడికి ఫండ్ గా పని చెయ్యాల్సివచ్చినప్పుడు, ఈ విభిన్న చర్యలు ఒకదానితో ఒకటి ప్రమాదకర ఘర్షణలో పడతాయి. 1884 పీల్ బాంక్ చట్టానికి వ్యతిరేకమైన వాదన ఈ ఫుట్ నోట్ లో ఉంది. ఆచట్టం బాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ప్రైవేట్ కేటాయింపుదారుల నోట్లను తన సొంత నోట్లలోకి మార్చడం ద్వారా స్వల్పకాలిక ఋణం ఇవ్వడానికి బంగారం రిజర్వ్ లమీద ఆధారపడేట్లు చేసింది. నిల్వ రెండు చర్యలూ – దేశీయ చలామణీ, అంతర్జాతీయ చలామణీ- ఇప్పుడు ఘర్షణ పడతాయి.

ఈ నిల్వలు సగటు స్థాయిని మరీ మించి ఉంటే, కొన్ని మినహాయింపులతో, అది సరుకుల చలామణీలో స్తబ్దతకి ఒక సంకేతం. సరుకుల రూప పరివర్తనల సమ ప్రవాహ అంతరాయానికి సంకేతం.

దేశీయ వర్తకానికి అవసరమైనంత కన్నా ఎక్కువగా ఉన్న డబ్బంతా మృతనిల్వే...అది ఉన్న దేశానికి లాభం చేకూర్చదు. కాని అది వర్తకంలో ఎగుమతైనా దిగుమతైనా లాభం తెస్తుంది.-జాన్ బెల్లర్స్

## ఎక్కువ కాయన్లు ఉంటే ఏమిటి?

బరువైన వాటిని కరిగించి ధగధగ మెరిసే వెండి బంగారు ప్లేట్లుగా, గిన్నెలుగా, పాత్రలుగా మార్చవచ్చు, లేక సరుకుగా దాని అవసరం,గిరాకీ ఉన్న చోటికి బయటకు పంపవచ్చు; లేదా ఎక్కువ వడ్డీ ఉన్నచోట అప్పుగా ఇవ్వవచ్చు.-విలియంపెట్టీ

డబ్బు సమాజంశరీరం కొవ్వు వంటిది. ఎక్కువగా ఉంటే, చురుకుదనానికి అడ్డం అవుతుంది. మరీ తక్కువ ఉంటే, అనారోగ్యం కలుగుతుంది. కండల చలనానికి కొవ్వు కందెనలా పనిచేస్తుంది. ఆహారం లేనప్పుడు అందిస్తుంది/పోషిస్తుంది. అసమంగా ఉన్న చోట్ల చేరి శరీరాన్ని అందంగా ఉంచుతుంది. అదే విధంగా రాజ్యంలో డబ్బు దాని చర్యని వేగిరపరుస్తుంది. దేశంలో కొరవ పడ్డప్పుడు సకాలంలో విదేశాల నుండి సరఫరా చేస్తుంది.... ఎక్కువ తక్కువలు లేకుండా సమపరుస్తుంది.... మొత్తాన్నీ అందంగా తీర్చి దిద్దుతుంది; మరీ ముఖ్యంగా డబ్బు పుష్కలంగా ఉన్న వాళ్ళని మరింత అందంగా మలిచినప్పటికీ.- విలియం పెట్టీ.

కాపిటల్ మొదటి సంపుటంలో ఒకటవ భాగం 'సరుకులూ-డబ్బూ' అయిపోయింది.